
అగ్నితోరణం
గోపాయని
రఘుపతిరావు



ఫిబ్రవరి 12, 2013న
అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 39వ వర్థంతి సందర్భంగా
ఘంటసాల కళాపరిషత్ ఆధ్వర్యంలో తెనాలిలో
రచయిత శ్రీ గోపాలుని రఘుపతిరావును
ప్రముఖ సినీనటుడు, దర్శకుడు శ్రీ ఎ.వి.ఎస్. ఘనంగా సత్కరించిన దృశ్యం.
వేదికపై ప్రముఖ రచయిత, బహు గ్రంథకర్త శ్రీ షేక్ అబ్దుల్ హకీం జానీ వున్నారు. *(కుడి నుంచి రెండవ వ్యక్తి)*

# ఆధ్యాత్మిక తోరణం

## గోపాలుని రఘుపతిరావు

ఆధ్యాత్మిక వ్యాసాలు

**ఆధ్యాత్మిక తోరణం**

**గోపాలుని రఘుపతిరావు**

© రచయిత

ప్రచురణ : ఆగస్టు 2015

ప్రతులు : 500

ముఖచిత్రం : సురేష్ కదలి
చిత్రకళ ఆర్ట్ ఎకాడమీ, హైదరాబాద్

ప్రతులకు :

**గోపాలుని రఘుపతిరావు**
శ్రీషిర్డి సాయి నిలయం
నెం. 14-5-45, వింజమూరివారి తోట
బాపట్ల - 522 101, గుంటూరు జిల్లా, ఎ.పి.
సెల్ : 99890 55837
email : raghupathiraogopaluni@gmail.com

మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపులలో

ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 520 002
సెల్ : 9490634849

వెల : రూ. 100/-

# అంకితం



శ్రీమతి **గోపాలుని సీతాదేవి**

గత నాలుగు దశాబ్దాలుగా నాతో జీవితం పంచుకొని తన విశిష్ట వ్యక్తిత్వంతో, ఆప్యాయతాను రాగాలతో కుటుంబంలోని వారందరినీ ప్రభావితం చేస్తూ, నాలో ఆధ్యాత్మిక తృష్ణ రగిలించి నా రచనా ప్రవృత్తికి సౌహార్ద్ర వాతావరణం కల్పించి తన ప్రత్యేకత చాటుకున్న వ్యక్తి శ్రీమతి సీతాదేవి. భవసాగరాన్ని తరించడానికి స్నేహ హస్తాన్ని సాచి కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్న స్నేహశీలి, నిగర్వి నా భార్య శ్రీమతి సీతాదేవికి ఈ వ్యాస సంపుటి 'ఆధ్యాత్మికతోరణం' ప్రేమతో అంకితం

**– గోపాలుని రఘుపతిరావు**

# నామాట

సృష్టి చరాచర ఉపాధుల సమాహారం. చరాలలో మానవుడు విశేష ప్రాధాన్యత సంతరించుకున్న అనల్పజీవి. 'జీవుడు' రూపంలో 'ఆత్మ'గా స్థితుడై వుండే పరమాత్మ ఎంతో ప్రేమతో ప్రాధాన్య క్రమంలో మానవ సృజన చేశాడు. మనిషి మేధాసంపన్నుడు. అసాధ్యాలను సుసాధ్యం చేయగల మనో శక్తి గలవాడు. మిగతా ప్రాణుల వలె కాకుండా తాను ఆత్మ స్వరూపుడనిన గుర్తించడమే కాక, ఆ ఆత్మ పరమాత్మ దివ్యాంశ అని గుర్తించి దైవాన్ని పొందడంలో విజయుడైన వాడు!

మనిషికే కాక కష్టాలు జంతువులకూ వస్తుంటాయి. చెట్టు – చేమలు, రాయి – రప్పలు, అందుకు మినహాయింపు కాదు. వంట చెరకుగా, కలపగా వృక్షసముదాయాలు విధ్వంసానికి గురికాగా – కొండరాళ్ళూ, బండలు కూలీల సుత్తి దెబ్బలకు గురై కంకరగా, పిండిగా మారుతాయి.

మనసున్న కారణంగా మనిషిని శారీరక బాధలే కాక, మానసిక సంవేదనలు కూడా పలకరిస్తాయి. అయితే మనిషికి ఓ ప్రత్యేకత ఉంది. శరీర బాధలు సరేసరి! మానసిక క్లేశాలను మనిషి జపధ్యానాది ప్రక్రియల ద్వారా నివారించుకొని సాంత్వన పొందుతాడు. ధ్యాన ప్రక్రియ పూర్తిగా దైవ సంబంధమైనది కాకపోయినా, జపతపాలు భగవదన్వేషణ కోసం చేసేవే! మనిషి దైవాన్ని పొందినా, లేకున్నా అతడి దైవం గురించిన ఆలోచనలు మొదట అతడికి ఆనందాన్ని ప్రసాదిస్తాయి. ఆత్మ ఆనందస్వరూపం! అందుకే భగవంతుడుతో మనిషి సంబంధాన్ని 'ఆధ్యాత్మికం' అన్నారు. మానవుడికి శక్తిని, నూతనోత్తేజాన్నీ ప్రసాదించి అతడి మానసిక, శారీరక స్థితిగతులను పవిత్రీకరించే మహత్తర సాధనం 'ఆధ్యాత్మికం!'

సృష్టిలో ఏ ప్రాణీ చేయని విధంగా మనిషి దేవుడు గురించి తెలుసుకోవాలని ఎంతో ఉబలాట పడతాడు. శ్రీకృష్ణుడి బాల్యలీలలు, శ్రీరామచంద్రుడి పితృవాక్య పరిపాలన, పరాక్రమ విశేషాలు భాగవత – రామాయణ కావ్యాల్లోను, మానవుడు నేర్వవలసిన సద్గుణ సంపత్తి, జీవిత పాఠాలు శ్రీ మన్మహాభారతంలోను చదివి, గ్రహించి, ఆచరించేందుకు పూర్వ రంగం సిద్ధం చేస్తుంది 'ఆధ్యాత్మికం!'

మనసు క్లేశభరితమైనపుడు భగవద్గీత పారాయణం సత్ఫలితాలనిస్తుందని

చెబుతారు. అలా పరమాత్మ గురించి, ఆయనతో మనిషికి గల సంబంధ బాంధవ్యాల గురించి వివరిస్తూ ఎన్నో కథలు, గాథలు గ్రంథాలుగా ఆవిర్భవించినా ఇంకా ఇంకా తెలుసుకోవాలనే మనిషి ఆధ్యాత్మిక తృష్ణ తీరకపోవడం విశేషం! అందుకే ఎందరో సాధనాప్రియులైన రచయితల కలాల నుండి ఆధ్యాత్మిక సాధనా విశేషాలు జాలువారాయి. జాలువారుతూనే వుంటాయి.

ఈ చిన్న పుస్తకంలో వివిధ అంశాలకు సంబంధించిన ఆధ్యాత్మిక వ్యాసాలు చోటు చేసుకోవడం జరిగింది. ఈ సంకలనంలోని వ్యాసాలు 'ఆంధ్రభూమి', 'ఆంధ్రప్రభ', సాక్షి ధ్యానమాలిక వంటి పత్రికలలో ప్రచురితమైనవి, కొన్ని అముద్రితాలు కూడ కలిపి ప్రచురించడం జరిగింది. నన్ను ఆదరించిన ఆయా పత్రికల సంపాదకులకు మనఃపూర్వక కృతజ్ఞతాభివాదాలు వినమ్రంగా తెలుపుకుంటున్నాను.

ఈ గ్రంథాన్ని సుందరంగా తీర్చిదిద్దిన శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు! పాఠకలోకానికి చేరువయిన ఈ చిన్ని పుస్తకాన్ని ఆదరించి విజయోన్ముఖం చేయాలని పాఠక మహాశయులను సవినయంగా కోరుకుంటున్నాను. విజ్ఞులు, పండితులైన పెద్దలు ఇందులోని తప్పులను సహృదయంతో క్షమించగలరని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకానికి టైటిల్ 'ఆధ్యాత్మిక తోరణం' సూచించడంలో సహకరించిన నా కుమారులు చి. మధుశ్రీనివాస్, చి. చంద్రశేఖర్, చి. సాయికుమార్ లకు ఆశీఃపూర్వక కృతజ్ఞతలు. ముఖచిత్రాలంకరణకు శ్రద్ధతో ప్రత్యేక సూచనలు చేసిన చి. మధుశ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**– గోపాలుని రఘుపతిరావు**

01.06.2015
హైదరాబాద్

ఆధ్యాత్మిక తోరణం ఇలా.....


| | |
|---|---|
| సందేహ'మది' | 9 |
| దయార్ద్ర హృదయం | 11 |
| యుక్తాహార సేవనం | 13 |
| త్రికరణ శు(సి)ద్ధి | 14 |
| విచిత్రం – మస్తిష్కం | 16 |
| సమాజ అభ్యున్నతి | 18 |
| శనైశ్చర మహిమ | 20 |
| శక్తి ఆరాధన | 22 |
| జ్ఞాన నిక్షేపాలు | 24 |
| నిరంతర ధ్యానం | 26 |
| ఆలయ సందర్శనం | 28 |
| రక్షాబంధనం | 30 |
| ఏకేశ్వరోపాసన | 32 |
| క్రోధాన్ని జయిద్దాం | 34 |
| సూర్యారాధన | 36 |
| కష్టాలు దరిచేరినప్పుడు... | 38 |
| చల్లని చూపు | 39 |
| స్నేహ మాధుర్యం | 41 |
| ఆనందం | 43 |
| నాద బ్రహ్మోపాసనకు ప్రతిరూపమే ఘంటానాదం | 45 |
| ఆలోచన పుట్టినిల్లు మనస్సు | 46 |
| వరదాయిని, విష్ణుమనోహరి శ్రీమహాలక్ష్మి | 47 |
| రూపం ఏదైనా ధ్యానం ఒక్కటే | 48 |
| మహిమాన్విత లింగోద్భవం | 50 |
| శివస్మరణం – భవహరణం | 52 |
| దేహం శివ శక్త్యాత్మకం | 54 |
| దేవుడు – మనిషి | 55 |

దేవుడిచ్చిన వరం 57
విచక్షణా జ్ఞానం 58
బద్ధకం వీడితేనే భగవదనుగ్రహం 60
సద్భావం 61
ద్వంద్వాలు 63
కాల మహిమ 65
బ్రహ్మముహూర్తంలోనే ఎందుకంటే ...? 67
మౌనవాణి విలువ 68
చిరంజీవి హనుమంతుడు 70
చింతన పరమార్థం 72
వేదమాత... వాక్ స్వరూపిణి సరస్వతి 74
ధీరగుణం 75
మనస్సు – ఆరోగ్యం 77
మానవాళికి మహోపకారం 79
శ్రద్ధ – ఓరిమి 81
దైవాన్వేషణ 83
సత్వగుణంతో సమాజశాంతి 85
భగవంతుని చేరడానికి దివ్య మార్గమే మతం 87
అనంత పద్మనాభుడు 88
సౌభాగ్య ప్రదాయిని 90
కాలం – విలువ 92
గతం – ఘనకీర్తి 94
నమ్మకమే దివ్యౌషధం 96
మృత్యువు 98
నమ్మకం – ఫలం 100
సంతోషం – ఆనందం 102
ప్రశాంత స్థితి 104
గతజన్మ వాసనలు 106
జీవితంలో ఆధ్యాత్మిక శక్తి 108
హయగ్రీవుడు – అభయంకరుడు 110

మనసు పెట్టి చేసే సాధన ఫలిస్తుంది 112
హృదయపు లోతులే ఆనందానికి చిరునామా! 113
మనిషి – ప్రపంచం 114
పరమార్థ సాధన కోరిక తప్పుకాదు 116
కరుణాంతరంగుడు 117
ఔలియా హజరత్ తాజుద్దీన్ బాబా
భగవదనుగ్రహం 119
శరీరానికీ మరణం ఉండదు...! 121
సత్య దీక్ష 123
మనసు మరీ చెడ్డదేమీ కాదు 125
హెచ్చు తగ్గులు 127
అరుంధతి 129
సత్ సాంగత్యం 131
వ్యసన పరు(వు)లు 133
అగ్నిదేవుని అనుగ్రహం 135
ఆధ్యాత్మిక ప్రగతికి శాకాహారం 138
'వర్తమానం' 141
వెలుగురేఖ 143
'శీలం – సమర్థత' 145
'భావాన్ని అనుసరించి ఫలితం' 147
'పరిశుద్ధాంత రంగం' 148
'నమ్మకాలు' 150
'దైవ ప్రేరణలు' 152
చీకటి ముచ్చట్లు 154
ప్రార్థనలు 157
శుభమస్తు 159
కర్మకు నమస్కారం ! 161
అంతా నాకే తెలుసు..... 163
మత విశ్వాసం 165
కష్టేఫలి 167

# సందేహ'మది'

**ఆదో** విశ్వ కల్యాణ వేదిక. వేంకటాచలవాసుని కల్యాణం కమనీయంగా జరుగుతోంది. నిత్య కల్యాణ శోభితుడైన వేంకటేశ్వరునితో భూదేవి, శ్రీదేవి అమ్మవార్ల కల్యాణ వేడుక కనులారా దర్శించుకొని భక్తులు తరించారు. కల్యాణ క్రతువు భక్తుల అజ్ఞాన తిమిరాన్ని పరిహారం చేసి దైవం పట్ల సాధకుడు కలిగి వుండవలసిన అవ్యాజ భక్తిని పెంపొందించింది. పౌరాణికుడు కలిలో వేంకటేశ్వరుని మించిన దైవం లేడన్నాడు. గోవిందనామాలతో మంటప ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది. ఆచారి మహదానందభరితుడయ్యాడు.

## అంతమహిమ ఉంటే....

ఎక్కడ ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా తప్పక ఆ వేడుకలో పాల్గొంటాడు ఆచారి. గురువారం నాడు సకుటుంబంగా సాయి మందిరానికి వెళ్ళాడు. మధ్యాహ్నహారతి కన్నుల పండువగా జరిగింది. ఆచారితో పాటు భక్తులు హారతి పాడుతూ జన్మ సార్థకం చేసుకున్నారు. సాయిబాబాను నేటి దైవంగా భక్తులు ప్రస్తుతి చేశారు. సుప్రభాత ప్రశాంత సమయం. ఆచారి ఓ దృశ్య శ్రవణ కార్యక్రమం చూస్తున్నాడు. పరమేశ్వరుడు కొలువై వున్న శ్రీ కాళహస్తీశ్వరాలయం పరిచయం చేస్తూ ఆ క్షేత్ర మహత్యం, స్వామి – అమ్మవార్ల మహిమతో పాటు ఆ క్షేత్రంలో కొలువైవున్న రాహు–కేతువుల ప్రత్యేక సర్పదోష నివారణ పూజలు, ఇత్యాది విశేషాంశాలతో కార్యక్రమం కొనసాగింది. ఓ పౌరాణికుడు ప్రవచనం చేస్తూ శ్రీ కాళహస్తీశ్వరుని మించిన దైవం ఇలలో లేడనీ, సూర్య–చంద్ర గ్రహణ సమయాల్లో కూడా ఈ ఆలయ తలుపులు తీసే వుంటాయనీ క్షేత్ర ఔన్నత్యాన్ని ప్రస్తుతించాడు. మరో ప్రవచనంలో ఇంద్ర కీలాద్రిపై వేంచేసి వున్న కనకదుర్గ అమ్మవారి కరుణ పొందిన భక్తుల సర్వ వాంఛలు సిద్ధిస్తాయనీ, ఇక్కడ కొలువైవున్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ అనీ, త్రిమూర్తులు కూడా అమ్మ కనుసన్నలలో మెలగుతారనీ, అమ్మ ఔన్నత్యాన్ని విన్నాడు ఆచారి. ఇవన్నీ విన్నాక ఆచారిలో మొదటగా ఒక సందేహం వెలుగుచూసింది.

## ఎవర్ని ఆరాధించాలి ?

భారతావని విశేషంగా హిందూదేశం, ఇక్కడ అసంఖ్యాకంగా పవిత్రమైన ఆలయాలు ఉన్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలతో పాటు పరమ

పవిత్రమైన దేవాలయాలు ఎన్నో ఉన్న పవిత్ర దేశమిది. అయితే ఏ స్వరూపాన్ని ఆరాధన చేయాలి? ఏ మంత్రాన్ని జపించాలి? ఏ తంత్రాన్ని సాధన చేస్తే పరమపదం ప్రాప్తిస్తుంది?

ఎన్నో మూల మంత్రాలు జపించేవారికి అందరు దేవతలు ప్రసన్నులు కావలసి ఉందా? ఏ ఒక్క దేవీ దేవతైనా పరమార్థ సిద్ధికి దోహదం చేసే శక్తి సంపన్నత కలిగి వుండే అవకాశం లేదా? కొన్ని మతాలలో ఆరాధించేది ఒకే దైవాన్ని కాదా? ఈ సందేహాలతో సతమతమైపోయాడు ఆచారి. పట్నానికి భూత భవిష్యద్వర్తమానాలు ఎరిగిన ఒక పరమాచార్యులు వచ్చారని విని ఆయన దర్శనం చేసుకున్నాడు. తన మనస్సులోని సందేహాన్ని వినిపించాడు.

## అందరిలో దైవం :

ఆయన ఇలా సందేశం ఇచ్చారు. 'నాయనా! ప్రతీ ఆలయం, అందులోని విగ్రహరూపం పవిత్రమైనదే, ప్రకృతిలోని అణువణువూ పరమాత్మ అంశగా చెప్పబడిన వేదసంపద మనది. అందుకే చెట్టు – పుట్టతో పాటు ఎన్నో శిలారూపాలు దైవంగా పూజలందుకుంటున్నాయి. దృశ్య జగత్తంతా పరమాత్మ దివ్య స్వరూపమే. విశిష్టమైన ఆ భావనతోనే తోటి మానవులతో పాటు సకల ప్రాణులు కూడా దైవాంశ సంభూతులుగానే పరిగణించాలి. ఆ భావనతో విశ్వమానవ సౌభ్రాతృత్వం ప్రవర్ధిల్లుతుంది. ఏ విగ్రహాన్ని కొలిచినా, ఏ రూపాన్ని ఆరాధించినా కూడా అన్ని నదులూ సముద్రాన్ని చేరే విధంగా ఆ ఆరాధన అఖండ పరమాత్మనే చేరుతుంది. భగవంతుడిని నిరాకారంగా కూడా అర్చించవచ్చు' అని చెప్పారు. హిందువులకు ఇందరు దేవతలా? అనే సందేహం ఆచారిని వీడింది. కనిపించే ప్రతి మానవునిలో, ప్రాణిలో దైవాన్ని దర్శించడం నేర్చుకున్న ఆచారికి పరమార్థాన్ని సాధించడం పెద్ద కష్టం కాలేదు.

*ఆంధ్రజ్యోతి, 26.2.11*

# దయార్ద్ర హృదయం

పవిత్రమైన కరుణారస పూరితమైన మనస్సున్నవాడే మనిషని మంచి మనస్సు కలవారు భావిస్తుంటారు. మనసుకు పుష్టి, సంతుష్టి చేకూరేది సేవాతత్పరత ఉజ్జీవింప చేసుకున్నప్పుడే! సేవకునికి ప్రాధాన్యత లభించేది సేవను స్వీకరించే యజమాని వున్నపుడే అయినా సరైన యజమాని లేనప్పుడు ఆ సేవకునికి తత్పరత చేకూరదు.

సేవవల్ల ఆ సేవ పొందిన వారి మనస్సు సంతృప్తి పొందితే సేవచేసిన వారి పాపాలు తొలగిపోతాయని మన ప్రాచీన ఋషులు చెప్తూవస్తున్నారు. ఈ రోజుల్లో కూడ సేవను పరమోత్కృష్టంగా భావిస్తూ ఆచరిస్తున్న మహానుభావులు ఎందరో వున్నారు. ఒక డాక్టరు, ఒక లాయరు, ఒక ఇంజనీరు, లేక ఏ వృత్తిలోనివారైనా తమ వృత్తి ధర్మాన్ని సత్యమార్గంలో ఆచరిస్తే వారు సమాజానికి చేయగల శ్రేయస్సు అంతా యింతా కాదు. సేవ ఆచరించడానికి డబ్బుతో నిమిత్తం లేదు. మంచి హృదయం వుంటే చాలు, సేవలోని సుగంధాన్ని పరిమళింపచేయవచ్చు. ఒక సాధారణ పౌరుడు కూడా దయాగుణం కలిగి వుంటే అతని కర్మలు అర్హులైన నిరుపేదలు, రోగులకు ఎంతో సాంత్వన కలిగిస్తాయి. ఒక యువకుడు దనరూపేణా దానధర్మాలు చేసే అలవాటులేదు. కానీ హృదయ నైర్మల్యం కలవాడు. ఫుట్‌పాత్ మీద నడిచి వెళ్తుంటాడు. వ్యాధిపీడితుడైన వృద్ధుడు రోడ్డు దాటలేక, దాటించేవారు కనబడక ఇబ్బంది పడుతుంటాడు. రోడ్డంతా అపరిమితమైన ట్రాఫిక్ పద్మవ్యూహంలో వుంది. చకచకా ఆ యువకుడు వృద్ధరోగి చెయ్యిపట్టుకొని ట్రాఫిక్ వ్యూహం నుంచి దాటించి రోడ్డు అవతలివేపుకు సురక్షితంగా చేరుస్తాడు. వృద్ధుడు చల్లగా నూరేళ్ళు వర్ధిల్లు నాయనా! అని దీవించి తన దారిన తను వెడతాడు. సేవ చేసేందుకు డబ్బు అవసరం వుంటుందనే బావన పూర్తిగా నిజం కాదు. దయ, సానుభూతి వుంటే చాలు పుష్కలంగా సేవ చేయగల అవకాశం కలుగుతుంది. ఆ వృద్ధునికి యువకునిపట్ల కలిగిన కృతజ్ఞతా భావమే ఆ యువకునికి శ్రీరామరక్ష! జపతపాలు చేస్తూ భగవత్ చింతనలో వుండి కూడా అర్హులైన వారికి ఇతోధికంగా సహాయపడలేకపోతే ఆ జీవితాలలో సంతృప్తి కలగడం జరగకపోవచ్చు! సేవకు త్యాగగుణం తోడైతే బంగారానికి సుగంధం అబ్బినట్లే అవుతుంది. తమవల్ల లబ్దిపొందిన, అర్హులైన బీదసాదలకు కలిగే సంతృప్తే, సాయమందించిన వారికి చేకూరగల జీవన సాఫల్యం!

ప్రతిఫలంగా నెలనెలా జీతం పొందుతున్న ఉద్యోగులు తమ విధి నిర్వహణ న్యాయబద్ధంగా చేస్తే వారు రెండు విధాల లబ్ధి పొందుతారు. ఒకటి జీతం, రెండవది

ఉద్యోగంలో సంతృప్తి. ఉద్యోగులు కానివారు, మరే ఇతర వ్యాపకంతో జీవించేవారు కూడా లౌకికపరమైన సంతృప్తినే కాకుండా భగవంతుని ఆశీర్వచనం కూడా పొందగలుగుతారు. ఎందుకంటే సేవ పొందుతున్న వారు మానవ రూపంలో వున్న దేవుళ్లే కనుక! సేవకు అంత ప్రాధాన్యత వుంది కనుకనే సేవను తపస్సుగా ఆదరించి భావితరాలకు మార్గనిర్దేశనం చేశారు మదర్‌థెరిసా!

సేవ చెయ్యడానికి ప్రత్యేక అవకాశాల కోసం వెదకులాడనవసరం లేదు. తమ పరిధిలో వీలైనంత ప్రజోపయోగ వ్యాపకం కల్పించుకునే వీలుండకపోదు. చేస్తున్న వ్యాపకాన్ని మనసుపెట్టి నిష్కల్మష బుద్ధితో స్వార్థత్యాగంతో చేయగలిగితే లక్ష్యం చేకూరినట్లే!

ఓ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికుడుంటాడు. అతని నిష్కళంక విధినిర్వహణ వల్ల ఆస్పత్రిని నిర్మలంగా వుంచవచ్చు. వైద్యుడు సేవాభావంతో రోగికి చికిత్స నందించడంతో పాటు మంచి మాటలతో భయాన్ని పోగొట్టి ఆత్మీయ సౌరభాన్ని అందించవచ్చు. రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాలకు కనుక స్వస్తి పలికితే అంతకన్న ప్రజలకు స్వచ్ఛమైన సేవ నందించగలిగే సుక్షేత్రం మరొకటి లేదు. గాంధీ, నెహ్రూ, బోస్, తిలక్, సర్వేపల్లి వంటి ఎందరో మహనీయులు కూడా రాజకీయులే అయినప్పటికీ నేటి విష సంస్కృతి అప్పుడు లేని కారణంగా వారు ఇప్పటికీ చిరస్మరణీయులుగానే వెలుగొందుతున్నారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ప్రముఖ విద్యావేత్త. సంఘ సంస్కర్త, నిరాడంబరుడు మాత్రమే కాక గొప్ప సేవాగుణం కలవాడు. ఆయన ఒక సారి తన ఉపన్యాసం ఇవ్వడానికి వెళుతూ రైల్లో ప్రయాణిస్తున్నాడు. ఒక తెల్లదొర కూడా ఆయన ఉపన్యాసం వినడానికి అదే బోగీలో ప్రయాణిస్తుంటాడు. తోటి ప్రయాణికుడైన ఈశ్వరచంద్రను తెల్లదొర ఎరగడు. గమ్యం చేరిన తర్వాత తన లగేజీ మోయడానికి పోర్టర్ దొరక్క ఆయన అవస్థ పడుతుంటే ఈశ్వరచంద్ర ఆయన సూట్‌కేసును స్టేషన్ బయటకు చేర్చి టాంగాలో వుంచి తన దారిన పోతుంటే దొర కూలిడబ్బులు ఇవ్వజూపినపుడు ఆయన సున్నితంగా తిరస్కరిస్తాడు. మహాసభలో వేదిక మీద ప్రసంగం చేస్తున్న ప్రతిభాశాలి, తన లగేజి మోసిన కూలీ ఒకరే కావడం, ఆయన్నే ఈశ్వరచంద్రుడిగా తెలుసుకున్న తెల్లదొర అవాక్కవుతాడు. నిరాడంబర సేవలోని మాధుర్యం, అందులో అంతర్లీనంగా వుండే దయాగుణం మనకు ఇక్కడే బోధపడుతుంది. ప్రపంచంలో ఏ మతం కూడా దయాగుణాన్ని బోధించడంలో విఫలం కాలేదు. దయగల హృదయమే దైవమందిరం అన్నది ఆర్యోక్తి. దయాగుణం నుంచే సేవ ఉద్భవిస్తుంది. ఆర్తుడైన ప్రతీ మనిషీ సేవ పొందడానికి అర్హుడే! ఆర్తితీర్చగల ప్రతి మహనీయుడూ తన హోదాతో నిమిత్తం లేకుండా సేవనందించడానికి అర్హుడే! మానవసేవను మాధ వసేవగా భావించినపుడు మనిషి లౌకికంగాను, పారమార్థికంగాను కూడ కృతార్థుడౌతాడు.

*ఆంధ్రభూమి డెయిలీ, 10.1.2009*

# యుక్తాహార సేవనం

పూర్వం ఋషులు కందమూలములు తిని చెట్టుకింద కూర్చుని తపస్సు చేసుకునే వారని మనం కథల్లో విని వుంటాం. నాగరికత పెరిగిందనీ, విద్యావకాశాలు విస్తరించాయనీ మనం భావిస్తున్న ఈ రోజుల్లో పిల్లల అనుభవాలు ఇందుకు పూర్తి భిన్నంగా వుండటం జరుగుతుంది. ఇలాంటి పిల్లలు పెద్దవారై అనేక శారీరక మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. ముఖ్య కారణం చూస్తే, స్వీకరించే ఆహారంలోనే మూలం కనబడుతుంది. రంగురంగుల తళుకులీనే ప్యాకింగుల్లో వచ్చే నిల్వ వుండే తినుబండారాలు రుచికి బాగుంటాయేమో గాని ఆరోగ్య పరిరక్షణ విషయంలో అవి ఆమడదూరంలో నిలుస్తాయి.

ఆహారంలో సాత్వికం, రాజసికం, తామసికం అనే మూడు లక్షణాలున్నాయి. సాత్వికాహారం అంటే పాలు, పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు, వండిన అన్నం కాగా, మసాలాలు దట్టించిన, అధికంగా ఉప్పు, పులుపు కారం కలిగిన భోజనం రాజసికం అనబడుతుంది. మాంసాహారం, అమిత పరిమాణంలో భోజనం తామసిక ఆహారమనబడు తుంది. ఆహారంలోని సూక్ష్మాతి సూక్ష్మ అంశం మనస్సుగా పరిణతి చెందుతుందన్నది. ఋషివచనం. మంచి ఆలోచన, మంచి మాట, మంచి ప్రవర్తన అన్నవి తిన్న ఆహారం బట్టి వుండగలవన్నది గ్రహించవలసిన సత్యం. రాజస, తామస ప్రకృతితో కూడిన ఆహార సేవనం వల్ల నేటి ప్రజానీకం అనేక శారీరక మానసిక రుగ్మతలకు గురవుతున్నారు.

'తిననేరిస్తే రోగం రాదు – మాట్లాడనేరిస్తే పోట్లాటరాదు' అన్న పల్లెసూక్తికి ఎంత ప్రాధాన్యత వుందో అర్థం చేసుకోవలి. కడుపులో సగ భాగం అన్నంతో, పావువంతు నీటితో, మిగిలిన పావుభాగం గాలి బాగా ఆడటం కోసం ఖాళీగా వుండాలి. తాను తినగలిగిన దాని కన్నా ఒక ముద్ద తక్కువ తినవలసినదిగా పెద్దలు చెప్పడం అనుభవైకవేద్యమే! అన్నంలో సూక్ష్మశేషభాగం మనసుగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో భగవదర్పితం చేయబడి భుజించిన సాత్వికాన్నం మనసును పవిత్రం చేస్తుంది.

భోజనం చేసే ముందు దేవుని ప్రార్థించి తినడం శిష్టాచారంగా పరిగణింప బడుతోంది. అన్నం తింటున్న ప్రాణుల శరీరంలో 'వైశ్వానర' అగ్ని రూపంలో శరీరాల్ని ఆశ్రయించుకొని వుండి చతుర్విధములైన భోజన పదార్థాలను పచనము చేస్తున్నానంటాడు భగవానుడు గీతలో. అన్నము పానీయము బ్రహ్మ, విష్ణువులుకాగా, స్వీకరించే మనిషి సాక్షాత్ మహేశ్వరుడంటుంది శాస్త్రం. భోజన సేవనం అంతటి పవిత్ర కార్యంగా భావించి ఆయురారోగ్యాదులతో ఆధునిక మానవుడు పూర్ణాయువు కలిగి జీవించాలని కోరుకుందాం!

*ఆంధ్రభూమి డెయిలీ*

# త్రికరణ శు(సి)ద్ధి

మనస్సు, వాక్కు, కర్మ ఈ మూడింటిని త్రికరణములు అంటారు. తలంపు, మాట్లాడే మాట, ఆచరణ ఈ మూడు ఒకటిగా వున్నప్పుడు దానిని త్రికరణశుద్ధి అనటం జరుగుతుంది. భగవంతుడు సత్యప్రియుడు, సత్యమయిన ఆలోచన చేసినవాడు సత్యాన్నే పలికి ఆచరించి చూపినపుడు జీవాత్మ రూపంలో వున్న భగవంతుడు సంతోషిస్తాడు. మనలో వున్న భగవంతుడు సంతుష్టుడయితే మనిషికి ఆనందం కరతలామలకమే!

సత్యము, జ్ఞానం, ధర్మం, శాంతం, క్షమ ఇవన్నీ భగవంతుని అనుభూతం పొందించుకున్న మనిషిలో శాశ్వతంగా కాపురముంటాయి. అసలు సత్యాన్ని పలకటమే సులభమైన విషయం! ఎందుకంటే యదార్థమైన విషయానికి కల్పన జోడించి మాట్లాడే అవసరం సత్యం మాట్లాడేచోట వుండదు. ఉన్నదున్నట్లుగా మాట్లాడేచోట నిముషానికొక మాట, కావలసిగానీ కాకతాళీయంగా గాని, మాట్లాడే సందర్భం వుండదు. మనసులో ఒకటి తలచి వేరొకటి మాట్లాడే హృదయంలో దైవం కాపురముండదు.

అసలు మనిషిలోని చలనమే 'ప్రాణం'. ఆ ప్రాణమే ఆత్మ. ఆత్మే దైవం! దైవం యొక్క ఉనికిని నమ్మకుండా రజోగుణ తమోగుణ ప్రాధాన్యత సంతరించుకొన్న మనిషి, వక్రభాష్యాన్ని తన గొప్పతనంగా చెప్పుకోవచ్చునేమో గాని మనసులో సాక్షీభూతుడుగా వుండే భగవంతుడు మాత్రం ఎన్నడూ మెచ్చడు.

పరుల మెప్పుకోసంగాని, తన లబ్ధికోసం గాని అసత్యాన్ని పీఠంపై కూర్చోబెట్టి తన వాక్పటిమతో ఒక వ్యక్తి బాహ్య ప్రపంచంలో నెగ్గిన నెగ్గవచ్చునుగాక! కాని అతను ఆధ్యాత్మిక పరిభాషలో 'జీరో'యే! భగడంతుడు మెచ్చిన వ్యక్తి బాహ్య ప్రపంచంలో ఉన్నత శ్రేణిలో నిలవలేకపోయినా అతను మాత్రం 'హీరో'నే!

వందలు, వేలకొట్ల ధనం సంపాదించినప్పటికీ ఒక మనిషికి కావలసింది జానెడు పొట్టకు పిడికెడన్నము, ఇంత వస్త్రమేగాని బంగారాన్ని తినబోడనేది జగద్విదితం. మనిషికి ఉన్నది తృప్తి. పశువుకు తిన్నది తృప్తి అని ఊరక చెప్పలేదు. ఉన్నది అనే తృప్తి పొందడం కోసం ఆకృత్యాలు చేసి అబద్ధాలాడి ధనం కూడబెట్టవలసిన అవసరం లేదు ఈ నిజాన్ని నమ్మటానికి కూడా దైవకృప కావాలి! ఆయన దయలేని వానికి ఈ మాటలు రుచించవు.

లోకంలో ఒక ప్రాణికి ఆయుర్దాయం ఎంత? అనేది ఎవరికీ తెలియదు. మాతృగర్భంలో ఆత్మ శైశవరూపంలో అంకురార్పణ చేసినప్పటి నుంచి ఆయుఃప్రమాణపు

కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందంటే చిత్రంగా వుంటుంది. జీవకోటి ప్రయాణం 'అసత్తు' వైపా అనిపించే సందేహం తలెత్తుతుంది.

తను తప్ప మరే సైంటిస్టూ ప్రయోగశాలో తయారు చేయలేని మాంసం, రక్తం, ఎముకలతో నిర్మితమైన ప్రాణం వున్న బొమ్మను తయారుచేయడంలో దిట్ట అయిన భగవంతుడు తన సరదాకోసం మనిషిని సృజించాడేమో గాని, గమనించవలసిన విషయం మాత్రం ఒకటి వుంది. రక్త మాంస అస్తికల చివరిరూపం బూడిద, లేక మట్టి అయినప్పటికీ కరుణార్ద్ర హృదయుడైన భగవంతుడు మనిషి హృదయంలోనే కనిపించని పీఠంపై ఆశీనుడై వున్నాడు.

మనిషికి మాత్రమే అనుగ్రహించబడిన వరం 'మనస్సు'. అందుకే సర్వోన్నతుడైన భగవానుని నివాసస్థానమైన హృదయం లేక మనస్సును నిర్మలం చేసుకొని, చేసే ఆలోచనలు, వాక్కు, కర్మలు పవిత్రమైనవిగా ఏకం చేసుకొని త్రికరణశుద్ధిగా జీవించడానికి మనిషి ప్రయత్నించాలి. మన హృదయంలో కొలువున్న భగవంతుని కోసం సత్యమార్గంలో జీవించే ప్రయత్నం చేయడం ప్రతి మనిషీ కర్తవ్యం.

భగవాన్, సత్యసాయిబాబా వారంటారు. 'అసలు అబద్దం చెప్పడమే కష్టం! చెప్పిన ఒక అబద్దాన్ని పోషించుకోవడానికి మరో పది అబద్ధాలాడటం అవసరం కావచ్చు. నిజం మాట్లాడటమే తేలిక!' అని.

సత్యం అంటే భగవంతునికి ప్రీతి. అసత్య భాషణవల్ల ఎందరో అమాయకులు బలికావచ్చు. ఎందరికో ధన, మాన, ప్రాణ నష్టం జరగవచ్చు. ధన, మాన ప్రాణ హాని జరిగే పరిస్థితుల్లో అసత్య భాషణకు మినహాయింపు వున్నప్పటికీ త్రికరణశుద్ధిగా జీవిస్తూ భగవంతునికి చేరువ కావాలని ప్రతి మనిషి అభిలషించడం మనం కోరదగిన ఏకైక 'సిద్ధి' లేక వరం!

*ఆంధ్రభూమి డెయిలీ, 27.1.09*

# విచిత్రం - మస్తిష్కం

ప్రకృతిలో ఏ ప్రయాణ సాధనం కూడా కలిగిలేని వేగం మనస్సుకు వుందంటే ఆశ్చర్యం కలుగుతుంది. యక్ష ప్రశ్నలలో పాండవులకు ఎదురైన ఎన్నో ప్రశ్నలలో మనస్సు యొక్క వేగం కూడా ప్రస్ఫుటమవుతుంది. మనస్సుకున్న బలం అలాంటిది.

జగమే మారినదీ... మధురముగా... ఈ వేళా.... అంటాడో సినిమా కవి. మరే రోజు కలిగిలేని మాధుర్యాన్ని ఆ ఫలానా రోజు సంతరించుకొని వున్నదంటే అది ఆ రోజు యొక్క గొప్పతనం కాకపోవచ్చు. ఎందుకంటే ఆ రోజు ప్రపంచానికంతటికీ మాధుర్యాన్ని పంచే అవకాశం లేకపోయినా ఆ ఫలానా వ్యక్తి మనస్సు ఆనందం పొంది వున్న కారణంగా అతడు మాధుర్యాన్ని అనుభవిస్తాడు. మనస్సు యొక్క మాయ అది.

ప్రపంచంలో మేధావులుగా గుర్తింపబడినవారు చాలామటుకు ఏకసంధాగ్రాహులే. అంటే ఒకసారి విన్నదాన్ని వారు మరచిపోకుండా అనేక విద్యలకు అధిపతులవుతారు. ఆ విద్యాధిపత్యానికి కారణం మనస్సే. ధారణ చేసే శక్తి అపూర్వంగా వున్న కారణంగా వారికి ఏకసంధాగ్రాహ్యత కలుగుతుంది.

ఈ రోజుల్లో చూస్తే కార్తీకమాస ప్రారంభం నుంచి ఆయ్యప్పస్వాములు దీక్షలు ప్రారంభిస్తుంటారు. ఎన్నో కఠిన నియమాలు వారివి. హేమంత ఋతువులో బ్రాహ్మీ ముహూర్తంలో చన్నీటి స్నానాలు, ఒంటిపూట భోజనం చేయడం, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లున్న వారు కూడా దీక్షా నియమాలు పాటించి వాటిని పూర్తిగా విసర్జించడం – ఇటువంటి నియమాలన్నీ పాటించాలంటే ఎంతో ఓర్పు, మనోబలం కావాలి. వారికివన్నీ ప్రసాదించేది మనస్సే అంటే ఆశ్చర్యం కలుగుతుంది. వారి మనోబలమే వారికి అపూర్వశక్తిని సిద్ధింపచేస్తుందన్నది వాస్తవం!

కొన్ని జాతరలు, ఉత్సవాలు, వేడుకల్లో భాగంగా అగ్ని గుండాలను ఏర్పాటు చేయగా భక్తులు నిప్పుల కణికలపై నడవడం చూస్తుంటాం! ఆ శక్తి ప్రత్యక్షంగా దైవశక్తి అయినా, కాకపోయినా వారి మనోనిశ్చయం వల్ల వారు నిప్పులపై నడవగలగటం వారికి మనసు ప్రసాదించిన బలమే.

మనస్సుంటే మార్గముంటుంది! అన్న మరో నానుడి మనం వింటూంటాం. ఎలాంటి సమస్యకయినా పరిష్కారం లభించగలదన్నది నిర్వివాదాంశం. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడ వెతికితే పోగొట్టుకున్న వస్తువు ఎలా లభించగలదో, అదే విధంగా పరిష్కారం లభించడం లేదని భావిస్తున్న సమస్యను కూలంకషంగా అధ్యయనం చేస్తే చిక్కుముడి విడిపోయి సమాధానం దొరకుతుంది. అధ్యయనానికి సహకరించేది మేధావుల

మనోశక్తే! వెర్రి వెయ్యి విధాలు అనే నానుడి మనకు తెలుసు. వెర్రి అంటే వ్యామోహమే! ఆ వ్యామోహం వెయ్యిమందికి వెయ్యి రకాలుగా వుండవచ్చు. తామునిగింది గంగ – తా వలచింది రంభ అన్నది కూడా ఈ వ్యామోహ పరంపర కిందకే వస్తుంది. ఒక రాజకీయ నాయకుడు పార్టీ మారుతాడు. ఆయన నిన్నటిదాకా ప్రవచించిన విధానాలు నేడు వచిస్తున్న విధానాలు పరస్పర విరుద్ధంగా వుండటంతో ఆయన సన్నిహితుడు ఇలా అడుగుతాడు. అయ్యా, మీరు ప్రవచిస్తున్న ఆదర్శాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మేం నిన్న మీ అనుచరులం నేడు కూడా మీ అనుచరులమే. మేం నిన్న నమ్మిన సిద్ధాంతాలను నేడు ఎలా త్రోసిరాజనగలం? మాకు పరిష్కారం సెలవివ్వండి!" అందుకు ఆ రాజకీయ నాయకుడు నా కళ్ళతో చూడు, నీకు సత్యం బోధపడుతుంది అంటాడు. చూచే దృష్టి అనేది నిన్న ఒకటి, నేడు ఒకటి కాదు కదా! మరి ఈ తేడా ఎందులో ఉంది అన్నపుడు అది మనస్సు చేసే మాయ అని అర్థమవుతుంది.

ఒక పెళ్ళికొడుకుకు అమ్మాయి నచ్చలేదట. మా అమ్మాయిలో వున్న లోపం ఏమిటి? అంటారు వధువు తరుపువారు. అమ్మాయిలో సౌకుమార్యం లేకపోగా ఆకర్షణ ఏ మాత్రం లేదు. అందుకే అమ్మాయి నాకు నచ్చలేదని కుండబద్దలు కొడతాడు వరుడు. తినగ తినగ వేము తియ్యనుండు నట్లు మా అమ్మాయి ముఖం చూడగా చూడగా మీకు నచ్చే అవకాశం వుంది. కాదనకండి అని ప్రాధేయపడటం కొసమెరుపు. ఆ నచ్చే, లేక నచ్చని చమత్కృతి మనసు యొక్క మాయాజాలమే!

ఒక పని ఏదైనా చేయగా చేయగా అలవాటుగా మారుతుంది. అది మంచి పని కానీ లేక వ్యసనం కానీ! మనస్సుకున్న వైచిత్రి ఏమంటే అది ఆ పనిని అలవాటు చేసుకొని మరి వదలదు. కాబట్టి వ్యసనాలకు సంబంధించిన వ్యాపకాలకు సంబంధించి ఆరంభించే ముందు బహుపరాక్‌గా వుండటం అవసరం! ఎందుకంటే పట్టుకుంటే వదలని మొండితనం మనసుకు పుర్రెతో వచ్చిన బుద్ధి. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం ఇవన్నీ మనస్సుకున్న కొద్ది పాటి తేడాలు కలిగిన పర్యాయపదాలే!

ఏదైనా కొత్త అన్నదానిని నిరసించడం మనస్సు యొక్క మరొక దుర్గుణం. ఒక కొత్త సిద్ధాంతాన్ని ఎవరైనా ప్రతిపాదిస్తే దాన్ని ఉన్నపళంగా అధిక్షేపించడం, తరువాత తరువాత ఆ కొత్త దనంలోని బెరుకుతీరాక గాని ఆ సిద్ధాంతాన్ని ఆమోదించకపోవడం మనం చూస్తున్న విషయమే. సాధనమున పనులు సమకూరు ధరలోన అని వేమనార్యుడు చెప్పిన పద్యం మన అందరికీ తెలుసు. శిక్షణ అన్నది ఈ సాధనే అనుకున్నపుడు నిరంతరాయంగా కృషిచేసినపుడు కృషి చేస్తున్న క్షేత్రంలో సాధకుడు మంచి ఫలితాలు పొందుతున్నాడు. ఛార్లెస్ డార్విన్, ఐన్‌స్టీన్ మొదలయిన శాస్త్రవేత్తలు తమ నిర్విరామకృషితో అనేక ఆవిష్కరణలకు కారణమవడం చూస్తే అది వారి మనోబలమే అని తెలుస్తుంది.

*ఆంధ్రభూమి దినపత్రిక, 18.02.09*

# సమాజ అభ్యున్నతి

**ఆత్మ** విశ్వాసం అంటే మనపై మనకు నమ్మకం వుండటం. అది లేనపుడు ఎదుటివారిని కూడా నమ్మలేకపోతాం. ఆత్మశక్తి అనల్పమయినది. పునర్జన్మ సిద్ధాంతం నమ్మే మన భారతీయులు అదృష్టవంతులు. తల్లి గర్భంలో శిశువుకు పూర్వజన్మ స్మృతి వుంటుందని, బొడ్డుకోశాక జనన మరణ చక్ర భ్రమణంలో మరో అంకం ప్రారంభమయి నందుకు చింతిస్తూ శిశువు రోదిస్తుందని పెద్దలు చెబుతారు.

మనిషికి గత జన్మల్లో తనకున్న అనుభవాలు, నైపుణ్యాలు తరువాతి జన్మలో తెలీకపోయినా, కొంత సాధన తరువాత ఆ నైపుణ్యాలను మరల పొందగలుగుతాడు. ఏ క్షేత్రంలో మనిషి పూర్వజన్మల్లో రాణించాడో తెలిసేదెలాగనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. ప్రతివారికి 'అభిరుచి' అనేది వుంటుంది. ఆ 'అభిరుచి'నే గతజన్మ వాసనగా చెప్పవచ్చు. అభిరుచి వున్న క్షేత్రంలో కృషిచేసినపుడు ప్రత్యేకంగా రాణించడం జరుగుతుంది. దృష్టాంతంగా సంగీతం, చిత్రలేఖనం వంటి కళల్లో గురు సహాయం లేకుండా కొందరు శారదా కటాక్షం పొందటం చూస్తుంటాం!

భగవంతుని సూక్ష్మ అంశా కిరణమే ప్రాణి! ఆ సూక్ష్మాంశ బలంగా వున్నప్పుడు ఎన్నో ఘన కార్యాలు చేయగలుగుతాడు మనిషి. ప్రాణ చికిత్స శాస్త్ర ఆవిష్కర్త మాస్టర్ చోవాకోక్ సుయ్ 'ఆధ్యాత్మిక తంతువు' గురించి చెబుతారు. గొప్పవారి ఆధ్యాత్మిక తంతువు మందంగా వుంటుందనీ, ఆ తంతువు సామాన్యులకు చాలా సూక్ష్మంగా వుంటుందనీ ఉటంకిస్తాడు. తంతువు సాంద్రత ఆత్మబలాన్ని సూచిస్తుంది.

ఆత్మవిశ్వాసంతో మనిషి కష్టమనుకున్న పనులు కూడా పరిపూర్ణంగా చేయగలుగుతాడు. అందుకు పునాది ఆత్మవిశ్వాసం! మంచి పుస్తకాల అధ్యయనం యువతకు మనోబలాన్ని ఇస్తుంది. విరుద్ధ ఆలోచనలు, విప్లవ ధోరణి పెంచే పుస్తకాలకు యువత దూరంగా వుండాలి. సద్గ్రంథ పఠనం వలన మహాత్ముల అనుభవాలు మనం తెలుసుకొనే అవకాశం వుంటుంది. ఒక విషయాన్ని ప్రత్యక్షంగా అనుభవించి అందులోని చేదు రుచి చూసి మన ధోరణి మార్చుకొనే బదులు అలాంటి వారి అనుభవాలు చదివి మార్గం సరిచేసుకొనడం తెలివైన పని.

ఋషులు చెప్పిన మార్గమే ఆధ్యాత్మికం. ఆధ్యాత్మిక భావాలు వృద్ధి చేసుకోవడం కోసం దేవాలయాలు సందర్శించవచ్చు. దైవ ప్రార్థన ద్వారా మనిషిలో ఉత్సాహం,

ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి. తను బలహీనుడైన క్షేత్రంలో దైవం అనుకూలించడం వలన బలం పుంజుకోగలనని విశ్వసించినపుడు మనిషి అదనపు శక్తి పొంది విద్య సాధించుకొనగలుగుతాడు. అందుకు కాలసింది దైవం పట్ల నమ్మకం, ఆపై ఆత్మవిశ్వాసం!

దైవచింతన పెంపొందించుకున్నపుడు మనస్సు నిశ్చలమై సృజనాత్మకమైన ఆలోచనలు కలిగేందుకు వీలు కలుగుతుంది. నిర్మల మనస్సుతో కృషిచేసినపుడు విద్యార్థులు పాఠ్యాంశాల్లోని గూఢతను ఆకళింపు చేసుకొని పరీక్షలలో బాగా చేయగలుగుతారు. మౌఖిక పరీక్షల్లో వారి ఆశావహ దృక్పథంతో కృషి వలన పరీక్షకుల సానుకూలతను ప్రోది చేసుకొనగలుగుతారు. ఆత్మ వేరు భగవంతుడు వేరు కాకపోవటం వలన భగవద్విశ్వాసం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. బాల్యం నుంచీ ఆత్మవిశ్వాసం అభివృద్ధి చేసుకొనే విద్యార్థులు పోటీ పరీక్షలలోని ఒత్తిడిని తట్టుకొని మానసికంగా బలం పుంజుకొని అభ్యున్నతిని సాధించగలుగుతారు.

ఒక విషయం పట్ల సానుకూల దృక్పథం ఉన్నందువల్ల యువత నిర్వీర్యం కావటం జరుగదు. ముందుగా కష్టాలను ఊహించుకోవటం జరగదు కాబట్టి తమ కృషి లోపం రాకుండా చూసుకొని విజయాలను వెన్నంటి తెచ్చుకోగల నేర్పును యువత సాధించాలి. నేటి విద్యార్థులే రేపటి నాయకులు. గనుక సమాజం భావ సంపన్నతను పొంది తద్వారా భాగ్య సంపన్నతను  సంతరించుకుంటుంది. ఇందుకు కావలసినది సమస్యల పరిష్కారం పట్ల యువతకు ఆత్మవిశ్వాసం, పూర్తి స్పష్టత, అవగాహన, సానుకూల దృక్పంథం మాత్రమే. ఈ సుగుణాలు స్వంతం చేసుకొని యువత అభివృద్ధి బాటలో పయనించి మొదట వ్యక్తి సంపన్నతను, తద్వారా సమాజ అభ్యున్నతిని పొందగలుగుతుందని ఆశిద్దాం !

*ఆంధ్రభూమి దినపత్రిక, 16.04.09*

# శనైశ్చర మహిమ

సంస్కృత శబ్దం 'శనైః' అనగా 'మెల్లగా' అని అర్థం. మందగమనం చేయు కారణంగా ఆ దేవునికి 'శని' అని పేరు వచ్చింది. ఈశ్వరాంశ సంతరించుకున్న కారణంగా ఆయనను శనీశ్వరుడనీ, మందగమనం చేయు కారణంగా ఆయనను శనైశ్చరుడనీ పిలుస్తారు.

సూర్యభగవానునికి ఇద్దరు భార్యలు. ఒకరు 'సంజ్ఞ' కాగా మరొకరు 'ఛాయ'. శని ఛాయామాత కుమారుడు. నదిగా పిలుచుకుంటున్న 'తపతి' స్వయానా శనిదేవుని సోదరి. యమున, యముడు సవతి తల్లి సంతానం. శని సూర్యభగవానుని కుమారుడు. ఓ కుటుంబ కలహంలో శనీశ్వరుని కాలు విరగగా ఆయన కుంటివాడయ్యాడు. అప్పట్నుంచీ ఆయన మందచరుడయ్యాడు. జ్యేష్ఠాదేవిని వివాహమాడిన శని సంసార జీవితంలో వైరాగ్యం పొందటం చేత భార్య శాపానికి కూడా గురవుతాడు. శని చూపు పడిన చోట, పాదం మోపిన చోట అష్టకష్టాలు పొందటం అప్పట్నుంచే ప్రారంభమయింది.

శనిని చూసి ప్రజలు భయపడినప్పటికీ ఆయన చలవవల్ల మనుష్యులు శనిపీడాకాలంలో పాపపరిహారం పొంది, కొలిమిలో కాలిన బంగారం కనువిందు చేసే నగగా రూపాంతరం చెందినట్లు జీవితంలో కష్టాల నుంచి గుణపాఠాలు నేర్చుకొని శక్తిమంతులవుతారు. సాక్షాత్తు శివుడంతటివానిని పట్టి పీడించిన ఘనత శనిదేవునిదే. చెట్టు తొర్రలో శివుడు తలదాచుకొనేలా చేయగలిగిన శని ప్రభావం ముందు సామాన్య మానవులయిన మనమెంత?

శనిగ్రహం భౌతికంగా కూడా మందగమనం కలదే. శని గ్రహం ఒక్కో రాశిలో రెండున్నర సంవత్సరాలు వుంటుంది. రాశి చక్రంలో శని పూర్తిగా గమించడానికి ముప్పయి సంవత్సరాల కాలం పడుతుంది. ఒక వ్యక్తి జన్మరాశి ముందు రాశిలో శని గ్రహం ప్రవేశించగానే ఏలినాటి శని ప్రారంభమవుతుంది. జన్మరాశి దాటి ద్వితీయంలో సంచారం ముగిశాక ఏలినాటి శని ప్రభావం పూర్తవుతుంది. ఏలినాటి శని కాక అష్టమ, అర్థాష్టమ శని కాలంలో కూడా జాతకుడు కష్టనష్టాల నెదుర్కొంటాడు.

ప్రతీ మనిషి జీవితకాలంలో ముప్ఫై సంవత్సరాల కొక పర్యాయం ఏలినాటి శని ప్రభావం చవి చూస్తాడు. ఏలినాటి శని కాలంలో మనిషి కొలిమిలో బంగారంలా రాటుదేలుతాడు. శనీశ్వరుడు కష్టాలను మాత్రం కలిగిస్తాడని భావించడం పొరపాటు. హరిశ్చంద్రుడు, నలుడు, కార్తవీర్యుడు, పురూరవుడు, పురుకుత్సుడు, సగరుని వంటి

చక్రవర్తులు శనిబారిన పడి కష్టాలననుభవించి తరించినవారే! తననుసేవించి పూజించిన వారిని అనుగ్రహించే మహత్వం కల స్వామి శని దేవుడు.

శనీశ్వరునితో యుద్ధం చేసిన దశరథ మహారాజు దేశరక్షణ కోసం ప్రాణాలర్పించ డానికి సిద్ధపడిన సందర్భంలో శనీశ్వరుడు ప్రసన్నుడై వరం కోరుకోమనగా ఆ సమయంలో దశరథుడు స్తుతించిన సోత్రపాఠాన్ని ఎవరు జపించినప్పటికి వారిపట్ల ప్రసన్నుడనవుతానని స్వామి వరం ప్రసాదించాడు.

“నమస్తే కోణ సంస్థాయ పింగళాయ నమోస్తుతే!” అంటూ సాగే ఆ స్తోత్ర రాజం శనిపీడితులైన వారు జపిస్తే శనీశ్వరుని అనుగ్రహం కలుగుతుంది.

ఏల్నాటి శనిలో మొదట వచ్చే శని మంగు శని అనీ, రెండవ సారి వచ్చే శని పొంగు శనీ అనీ, మూడవసారి వచ్చే శని మరణ శని అనీ చెబుతారు. మొదటి రెండు అవస్థలు విజయమందాక మూడవసారి వచ్చే ఏలినాటి శని కాలంలో మనిషి అంత్యాన్ని చేరే అవకాశం వుందని చెబుతారు.

ఏడున్నర సంవత్సరాల ఏల్నాటి శని వీడిపోయాక మనిషి ఉజ్వలమైన భవిష్యత్తును సొంతం చేసుకోగలగుతాడు. ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొందుతాడు. జీవితం ప్రభావవంతమై వెలుగొందుతుంది.

ఏలినాటి దోషసమయంలో శనివారం నాడు నల్లని బట్టలు ధరించి నవగ్రహాలయంలో శనికి తైలంతో పూజ చేసి నల్ల నువ్వులు, బెల్లం నైవేద్యం పెడుతూ, శనిత్రయోదశి పర్వదినాల్లో శన్యష్టోత్తరం, శనైశ్చర సహస్రనామావళి పఠించి పూజ చేస్తే స్వామి తప్పక ప్రసన్నుడౌతాడు.

శనీశ్వర ప్రీతికి శనివార నియమాల పాటింపు, శ్రీ వేంకటేశ్వర పూజ, సుందరకాండ పారాయణ, ఆంజనేయ స్తుతి, రుద్రాభిషేకాలు, మహామృత్యుంజయ మంత్రజపం సత్ఫలితాలనిస్తాయి. నల్లని వస్త్రం, నల్ల నువ్వులు సద్బ్రాహ్మణునికి దానమిచ్చి శని బాధను తగ్గించుకోవచ్చు.

ఏది ఏమైనా శనీశ్వరుడు కేవలం కష్టాలను కలిగించడానికే వున్నాడని భావించడం పొరపాటు. ఆ స్వామి దోషకాలంలో మనిషి జీవితలో ఒడిదుడుకులను సృష్టించి తద్వారా జీవిత పాఠం నేర్పి, పోతూ పోతూ అష్టైశ్వర్యాలు కలుగజేస్తాడని ప్రతీతి. ఆ దేవుని మహిమ తెలుసుకొని సచ్ఛీలం, సత్ప్రవర్తన కలిగి వుండి దోషరహిత జీవనం చేస్తూ జీవితాన్ని ఆనందమయం చేసుకొనే ప్రయత్నం చేద్దాం.

*ఆంధ్రభూమి, 11.05.09*

# శక్తి ఆరాధన

**భారతదేశం** వేదభూమి. వేదమనగా 'జ్ఞానం'. వేదములను శ్రుతులు అని కూడా పిలుస్తారు. బ్రహ్మదేవుని ఉచ్ఛ్వాస నిశ్వాసముల నుండి బహిర్గతమై ఆయనచే తొలుత వినబడినవి గాన వేదములను 'శ్రుతులు' అనటం జరిగింది.

ఆధునిక సైన్సు యొక్క పుట్టుకకు కూడా వేదములే కారణము అని చెబితే నేటి సైంటిస్టులు ఒప్పుకొనక పోవచ్చు గాని, అందులో ఎంతో శాస్త్రసమ్మతి దాగివుంది. వేదములు సగుణ, నిర్గుణ రూపుడయిన భగవంతుని గురించి సమగ్రంగా సమాచారం ఇస్తాయి. వేదవేత్తలయిన మహానుభావులు కొందరు కాలగతిన ఉదరపోషణ నిమిత్తం వేద మంత్రములను వ్యాపార దృక్పథముతో పేరు ప్రతిష్టల కొరకు దుర్వినియోగం చేసిన కారణంగా ప్రజలలో వేదమంత్రముల యందు విశ్వాసము తగ్గుట జరుగుతున్నదనేది వాస్తవం!

శ్రుతులు, స్మృతులు, ఉపనిషత్తులు, పురాణములు మొదలగు వాటికి వేదమంత్రములే ప్రమాణము, ఆధారము అంటే అతిశయోక్తి కాదు.

ఇవ్వాళ హిందూమతం, క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, ఇత్యాదిగా మతములు ప్రపంచ దేశములయందు ఆచరింపబడుతున్ననూ కొన్ని శతాబ్దముల క్రిందట హిందువులే 'శైవము', 'వైష్ణవము', 'గాణఃపత్యము', 'శాక్తేయము' అను విధములుగా భగవదారాధన చేయడం జరిగింది.

'హరిరేవ శారస్సాక్షాద్ధర ఏవ హరిః స్వయమ్
శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే!"

అనగా శివకేశవులకు భేదం లేదు అయినా పూర్వం శైవం, వైష్ణవం ఆచరించిన మతానుయాయులు పరస్పర విద్వేషంతో జీవించిన దాఖలాలు అనేకం. వారి వారి ఇష్టదైవం శివుడని, విష్ణువని, గణపతియని, శక్తి అని ప్రజలు నమ్ముతున్న సందర్భంలో భగవంతుడు స్త్రీయా, లేక పురుషుడా అని సందేహం కూడా తలెత్తడం సహజం!

భగవంతునికి రూపంలేదని కొందరు వాదిస్తే బారతదేశంలో పై చెప్పిన వివిధ మత సాంప్రదాయముల ప్రకారం ఆయన సగుణ రూపుడని విశ్వసించడం జరిగింది. మరికొందరు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శాసించే 'ఆదిశక్తి' ఒకటి ఉన్నదనియు ఆమెయే చరాచర జగత్తుకు 'నాయకి' అని చెప్పడం జరిగింది.

శివుడు కాని, విష్ణువు కాని, గణపతి కాని ఏ రూపమయిననూ వారిలో శక్తి సుసంపన్నంగా వుంటుంది. ఆ శక్తిసంపన్నతనే 'శక్తి' అని స్త్రీ రూపంగా ప్రజలు ఆరాధన చేయడం జరుగుతుంది. ఉదాహరణ చెప్పాలంటే 'చంద్రుడు' – 'వెన్నెల' ఎలా వేరు కాదో 'భగవంతుడు' – 'శక్తి' (ఆయన శక్తి విశేషత) అలాగే వేరు కాదు.

నేరుగా భగవంతుని అర్చించినను, లేక ఆయన శక్తిని పూజించినను ఒక్కటే! ఆ శక్తినే 'పరమేశ్వరి'గా కొలుస్తుండటం జరుగుతుంది.

గణపతిని ప్రార్థించినను, శివకేశవులను కొలిచినను, పరమేశ్వరుని జగన్మాతగా పూజించినను ఫలితం ఒక్కటే!

చంద్రునికంటే ఆయన చల్లని వెన్నెలను ప్రాణికోటి ఆస్వాదించి, ఆనందించి తరిస్తుంది. ఈ కారణంగా చల్లని తల్లిగా ఆ పరమేశ్వరిని (భగవంతుని శక్తి విశేషతను) ఆరాధించినచో సకల కోరికలను తల్లి తనయునకు వాత్సల్య పూరితంగా తీర్చే విధంగా భక్తులను అనుగ్రహిస్తుందని భావన చేయడం జరుగుతోంది.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యః మోక్షయి ష్యామి మాశుచః" (గీ. 18–18)

"అన్ని ధర్మములను విడనాడి నన్ను శరణాగతి వేడినచో సమస్త పాపముల నుండి నిన్ను విముక్తుణ్ణి చేస్తా"ననే భగవానుని ప్రతిజ్ఞ ఈ శ్లోకంలో కనిపిస్తుంది.

అది శైవం కాని, వైష్ణవం కాని, గాణఃపత్యంకాని, శాక్తేయం కాని కొలుస్తున్న రూపం, ఆచరిస్తున్న మతం ఏదైనప్పటికీ భగవంతుణ్ణి / భగవతిని త్రికరణశుద్ధగా శరణాగతి వేడిన భక్తులకు బాధల నుండి విముక్తి తప్పక లభిస్తుంది. అది భక్తునకు భగవంతుడిచ్చిన వాగ్దానం!

'అవని జల్లిన దెద్దియో అదియె పండు!" అన్న ఆర్యోక్తి అన్ని ప్రపంచ మతాలకూ వర్తిస్తుందనేది నిర్వివాదాంశం! ప్రధానమయినది భగవంతునిపట్ల నమ్మకం, తదుపరి శరణగతి మాత్రమే !

*ఆంధ్రభూమి 21.05.09,*

# జ్ఞాన నిక్షేపాలు

**మానవ** శరీరం ఓ అద్భుత యంత్రం. ఈ యంత్రంలో పడుగు-పేకల కలయికగా శరీరం, మనస్సు ఒకదానితో ఒకటి అనుసంధానమై వున్నప్పటికీ ఆధిపత్యం మాత్రం మనసుదే! ఆరోగ్యవంతమైన శరీరంలోనే మంచి మనస్సు వుండగల అవకాశం వుంది. అవసరానికి మించి చేసే ఏ పనయినా మనశ్శరీరాల్లోని శక్తిని హరించివేస్తుంది. ఆహార పానీయాలు ఎంత స్వీకరించాలో అంత సేవిస్తే శరీరానికి మేలు చేసినట్లుగానే వాటిని అతిగా స్వీకరిస్తే హాని చేస్తాయి. మనసు విషయానికి వస్తే అతి భాషణ మనశ్శాంతిని హరించివేస్తుంది. "అతిభాషణ మతిహాని మితభాషణ మతిహాయి" అన్నది ఆర్యోక్తి.

పరిధి మించి చూస్తే నయనేంద్రియాలు అలిసిపోతాయి. ఎక్కువ వినటం, స్థాయి మించిన శబ్దాలు శ్రవణేంద్రియాలకు హాని చేస్తాయి. కడుపు నిండితే గారెలు చేదు అన్నట్లు మధుర పదార్థాలు సైతం పరిధి దాటి తింటే జిహ్వేంద్రియం పనితీరు వికటిస్తుంది.

మౌనమే నీ భాష ఓ మూగ మనసా అంటాడో సినీ కవి! విరుద్ధ ఆలోచనలు మౌన స్రవంతిని కుంచింపచేస్తాయి. అధిక కాలం పాటు సాగే మౌనవ్రతం అమోఘ ఫలితాలనిస్తుందనటానికి దృష్టాంతంగా గాంధీ మహాత్ముడు చేసిన మౌన దీక్షలు చెప్పుకోవచ్చు. మౌనదీక్షలో వున్నపుడు శృంఖలంగా సాగే ఆలోచనా స్రవంతి, సూక్ష్మ శబ్ద తరంగాలు సైతం ప్రశాంత మనోసంద్రాన్ని భగ్నపరిచే అవకాశం ఉంటుంది.

ప్రశాంత చిత్తంతో ధ్యాన ప్రక్రియ నెరపిన మునీశ్వరులు అంతర్వాణి విని భవిష్యద్దర్శనం చేసిన గాథలున్నాయి. వానప్రస్థం పాటించిన మునులు ఆటంకరహిత మహాదారణ్యాలలో కుటీరాలు నిర్మించుకొని నిశ్శబ్ద వాతావరణంలో మౌనదీక్షలు చేబూని ధ్యాన స్థితిలో మహదానందాన్ని అనుభవిస్తూ భగవదన్వేషణ చేస్తూ కాలం గడిపేవారు. సమాధి స్థితి పొందిన ఋషులు భగవద్దర్శనంతో పాటు దైవవాణి శ్రవణం చేసి మోక్ష పథగాములుగా వినుతికెక్కారు. మనశ్శరీరాల్ని విరామస్థితిలో ఉంచటానికి చేసే ప్రయత్నంలో భాగంగా పిల్లి నడవడిని గమనించమని అనుభవజ్ఞులు చేసే సూచన గమనార్హంగా చెప్పవచ్చు. ఒళ్ళు ముడుచుకుని పిల్లి పడుకొనే తీరు, కళ్ళు మూసుకుని ఎవరు చూస్తున్నా పట్టించుకొనక క్షణాల్లో సుషుప్తిని ఆహ్వానించగల దాని సామర్థ్యం మౌనులకు కొత్త విషయాల్ని బోధపరుస్తుంది.

మనసు లోతును గహన కడలితో పోలుస్తారు. సముద్రపు లోతుల్లో ముత్యాలు,

పగడాల వంటి సంపద వున్నట్లే ప్రశాంత గంభీర చిత్తాంతరాళంలో ఎన్నో పారమార్థిక నిక్షేపాలు వుంటాయన్నది పరమ సత్యం. డబ్బును మితంగా ఖర్చుపెట్టడం ఎంత సుగుణమో, మాటలు మితంగా ఆడటం కూడా అంతే సౌమనస్యం! సైలెన్స్ ఈజ్ బ్లిస్' అన్న పాశ్చాత్యులు కూడా మన లాగే మౌనం విలువ ఎరిగినవారే అని స్పష్టమౌతుంది.

వదరుబోతులను సమాజం ఈసడించుకొంటుంది. వాగుడుకాయగా ముద్ర వేస్తుంది. కొందరికి ధ్యానస్థితిలో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. మౌనంగా రెండు మనస్సులు సంభాషిస్తే దాన్ని 'టెలీపతి' లేక ఆత్మభాషణంగా వ్యవహరిస్తారు.

మనిషి ఆలోచనల ప్రభావం ఎదుటి మనిషిపై పడటం కూడా జరుగుతుంది. మౌనం అర్థాంగీకారం అని భావించిన సందర్భాల్లో మౌనమే మాటకు ప్రత్యామ్నాయంగా భావించటం జరుగుతుంది. ఎక్కువ పనిచేసి అలసిపోతాం! ఎక్కువ మాట్లాడి అలసిపోతాం! ఎక్కువ ఆలోచించి కూడా అలసిపోతాం. అనవసర ఆలోచనలు చేయకుండా మౌనదీక్షకు రోజూ సమయం కేటాయిస్తూ మౌనకడలిలోని జ్ఞాన నిక్షేపాల్ని వెలికితీసి ఆనందించి తరిద్దాం!!

*ఆంధ్రభూమి డెయిలీ, 31.05.09*

# నిరంతర ధ్యానం

ధీ+ యానం = ధ్యానం. ఈ పదానికి అర్థం ధ్యేయ వస్తువుపై మనసును నిలపడం. బుద్ధిని, లక్ష్యంగా వున్న దిశపై నిల్పడాన్ని ధ్యానం అని చెప్పవచ్చు! ఇక్కడ 'దిశ' అన్నది ఆలోచనారహిత స్థితి మాత్రమే! మనస్సు నిరంతరాయంగా ఆలోచనా స్రవంతికి గురవుతూ ఏదో ఒక విషయం గురించి ఆలోచిస్తూ వుంటుంది. ఆలోచన మానవ సహజమైన ప్రక్రియ. పరంపరగా నిరంతరం ఆలోచిస్తున్నప్పుడు మెదడు చురుకుగా పనిచేస్తూ అలసి సొలసి నీరసించి పోతుంది. ఈ స్థితిలో మనిషి మనః సమతుల్యత కోల్పోతాడు. ఆలోచనా స్రవంతిని నిగ్రహించగల ఒకే ఒక వస్తువు 'ధ్యాన ప్రక్రియ' అంటే మనసును ఆలోచనా రహిత స్థితికి కొనిపోయి దాన్ని ఆ స్థితిలో ఒక నిర్ణీత వ్యవధిపాటు వుంచడం ధ్యాన ప్రక్రియలో ఒక భాగం.

శరీర వ్యాపారానికి ఆహార పదార్థాలు ఎలా ఆహారమవుతాయో మనస్సుకు ప్రకృతిలో వున్న ప్రాణశక్తి అలా ఆహారం అవుతుంది. మనిషి మనసు ఆలోచనా రహిత స్థితిలో వున్నపుడు మాడుపైభాగంలో వుండే సహస్రార చక్రం ద్వారా ప్రాణశక్తి శరీరంలోకి ప్రవహించి మనిషికి ఓజస్సును అందిస్తుంది. మనసు ప్రాణశక్తిని గ్రహించాలంటే తప్పనిసరిగా ఆలోచనారహిత స్థితి కావాలి. అందుకే అలసిసొలసిన శరీరం, మనస్సు నిద్రా సమయంలోని ఆలోచనారహిత స్థితి కారణంగా ప్రాణశక్తిని పీల్చుకొని నూతనోత్తేజాన్ని పుంజుకుంటాయి.

అందుకే నిదుర నుండి లేచాక ప్రాణులు నూతనోత్సాహంతో కనిపిస్తాయి. నిద్రలో కలలు వస్తుంటాయి. అది కూడా మెదడుకు పనే! కాబట్టి నిద్రా సమయంలో చేకూరగల ప్రాణశక్తికన్నా ధ్యాన సమయంలో మనిషి స్వీకరించే ప్రాణశక్తి అధికంగా వుంటుంది. ఎందుకంటే మనస్సు పూర్తి ఆలోచనారహిత స్థితిలో వుండేది ధ్యాన సమయంలోనే కాబట్టి.

ఈ ధ్యాన ప్రక్రియలు వందల సంఖ్యలో వున్నాయి. అయితే ప్రముఖంగా కొన్నే ప్రాచుర్యంలో వున్నాయి. బుద్ధ ప్రబోధిత 'అనాపానాసతి'ని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రక్రియలో మనిషి శ్వాస మీద ధ్యాస వుంచడం వలన ఆశించిన ఫలితం చేకూరుతుంది. సుఖాసనంలో కూర్చుని చేతివ్రేళ్ళను కలిపి వుంచి ధ్యాస శ్వాస మీద వుంచడమే ఈ ప్రక్రియలో జరుగుతుంది.

'ఓషో'గా పిలువబడే భగవాన్ రజనీష్ కూడా ధ్యాన ప్రక్రియకు సంబంధించి

చాలా కృషి చేసి మానవాళికి ధ్యానాన్ని సులభతరంగా ఆచరించే మార్గాన్ని ప్రబోధించాడు. కొందరు ఆయనతో మాదకద్రవ్యాల వల్ల కూడా ధ్యానంలో లాంటి ఆనందమయ స్థితి కలుగుతుంది కదా,  మరి ధ్యానంతో ప్రత్యేక ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించినపుడు ఆయన మాదక ద్రవ్యాలవలన ఉన్నపళంగా మనస్సు ఆనందమయ స్థితి పొందవచ్చును గాక! అది కేవలం తాత్కాలికం. అంతేకాక మాదకద్రవ్యాలు మనిషిని నిర్వీర్యం చేసి బానిసను చేస్తాయి. కానీ ధ్యానం అలా కాదు. అదో నిరంతర సాధన. ధ్యానం జీవితకాల ప్రణాళిక, ధ్యానం వల్ల శాశ్వత ప్రయోజనాలు చేకూరుతాయంటాడు రజనీష్ యోగి. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణభగవానుడు ధ్యాన ప్రక్రియ గురించి ఉటంకిస్తాడు. వెలుగుతున్న జ్యోతిని చూస్తూ ప్రక్రియ ప్రారంభించి మనోనేత్ర స్థానమైన ఆజ్ఞా చక్రంలో ఆ బింబాన్ని కేంద్రీకృతం చేయడం వల్ల మనస్సు ధ్యేయ వస్తువైన ఆలోచనా రహిత స్థితిని చేకూర్చుతుందన్నది సారాంశం.! కనీసం పదిహేను, ఇరవై నిమిషాల పాటు ఈప్రక్రియ నిర్వహిస్తే చాలని కొందరు చెప్పగా, వయస్సు ఎన్ని సంవత్సరాలో అన్ని నిముషాలపాటు చేయాలన్నది మరో సిద్ధాంతం!

కొందరు ధ్యాన సమయంలో మనస్సు చెదురుతూ మరల మరల ఆలోచనలు విజృంభిస్తున్నపుడు 'హ్రీం', 'ష్రింగ్' లాంటి బీజాక్షరాలను మనసులో ఉచ్ఛరించినపుడు ఆలోచనల వేగం తగ్గి ధ్యేయ వస్తువయిన నిరాలోచనా స్థితి చేకూరగలదని ప్రస్ఫుటించడం కద్దు. మనస్సు రకరకాల ఆలోచనలకు గురవుతూ మెదడు తరంగాలను ఉత్పత్తి చేస్తుంది. అధిక పౌనఃపున్యంలో వుండే 'బీటా' తరంగాలు మెలకువలో ఉత్పత్తికాగా, 'ఆల్ఫా' తరంగాలు మనస్సు ప్రశాంతత పొందుతున్న సమయంలో వెలువరించబడతాయి.

అటు నిద్రా కాక, ఇటు మెలకువ కాక వుండే ధ్యాన స్థితిలో 'తీటా' తరంగాలు వెలువడుతాయి. నిరంతరం ధ్యానించే వారికి ధ్యాన స్థితిలో జనించే 'తీటా' తరంగాలు మిగతా సమయంలో కూడా కొనసాగటం వల్ల మనసుకు పూర్తి ప్రశాంతత చేకూరుతుంది. ప్రతీ రోజూ కనీసంగా 15–20 నిమిషాల పాటు ఆచరించగలిగితే ధ్యాన ప్రక్రియ వల్ల మనోజనిత శారీరక రుగ్మతలు దూరమై మనిషి ఆనందంతో ప్రశాంతతను స్వంతం చేసుకోగలిగే అవకాశం వుంది. మనమూ ప్రయత్నిద్దాం!

*ఆంధ్రభూమి డెయిలీ, 01.07.09*

# ఆలయ సందర్శనం

దేహాన్ని భగవన్నిలయంగా అభివర్ణించారు. దేవాలయానికి ప్రతీకాత్మకమైనది దేహం. ఆలయ సందర్శనం వల్ల మనసుకు ప్రశాంతత కలుగుతుంది. పవిత్రమైన భావాలు కలుగుతాయి. ఆలయంలో కొలువై వున్న భగవానుడు / భగవతి వల్ల క్లేశములు నివారణ అవుతాయని భక్తుడు నమ్ముతాడు. భగవద్విశ్వాసానికి నమ్మకమే పునాది. ఒకానొక సమయంలో మహాభక్తుడైన గజేంద్రునికే సంశయం కల్గింది.

మనుష్యునికి వున్న ఒక మహత్తరమైన దుర్గుణం సశరీరంగా వున్న మహాత్ములలో దోషాన్ని ఎన్నడం! తను మనిషి కావడం వల్ల తనకున్న దోషాలు, దుర్గుణాలు కూడా కేవలం మనిషి రూపంలో వున్నాడు కనుక ఆ ఒకానొక మహాత్మునిలో కూడా అవన్నీ వున్నాయనుకోవడం! ఒక దుర్మార్గుడు ఎదుటివారి మంచి తనాన్ని అర్థం చేసుకోలేడు. ఎదుటివాడు కూడా దుర్మార్గుడని భావించడం జరుగుతుంది. ఒకవేళ అలా భావించడం జరగకపోయినా, మంచివాడికి దుర్మార్గుని వలన చేకూరగల లబ్ది పూజ్యం! పవిత్రమైన భావాలు కలిగిన మనిషికి ప్రపంచమంతా పవిత్రంగానే తోస్తుంది. అందుకే 'యద్భావం తద్భవతి' అన్నారు.

మహనీయుడైన షిర్డీ సాయిబాబా వారు కూడా కొందరిచే అభిప్రాయపరంగా విభేదించబడ్డారు. దీపారాధనకు నూనె యివ్వని వ్యాపారులు ఆయన పుక్కిటి నీళ్ళనే నూనెగా వినియోగించి దీపాలు వెలిగించేదాకా ఆయన గొప్పతనం తెలుసుకోలేక పోయారు. శరీరంతో వున్న ఏ మహనీయునికీ కూడా ఈ వ్యతిరేకత తప్పిన సాక్ష్యాధారం లేదు.

దేహానికి ప్రతీకగా భావించే దేవాలయంలో ప్రవేశించగానే మనిషి మనస్సు నియంత్రితమౌతుంది. చెడు ఆలోచనలకు అసలు ఆలోచనా పరంపరకే అడ్డుకట్ట పడుతుంది. ఆలయ ప్రవేశం చేసిన తోటి మనుషులను పవిత్రంగా చూస్తాడు. ఎక్కడెక్కడో గహనాంతర సీమల్లో విహరించే మనస్సు కొంత తడవు నియంత్రింపబడి, కొద్ది క్షణాలయినా దేవతామూర్తిపై నిలుస్తుంది. మనస్సు ఆ కాసేపూ నియంత్రణ కానివారు కూడా ఎందరో వుంటారు. భక్తుడు, ఎదుటి మనిషికి చెప్పుకోలేని కష్టాలు, రహస్య సమాచారం కూడా స్వామివారికి నివేదించుకుంటాడు. మనస్సులో నిలువ వుండి మనస్సుని క్లేశపరుస్తున్న కష్టాలనే జలం స్వామి వైపుకు ప్రార్థనా రూపంలో ప్రవహించగానే భారం తగ్గి భక్తుడు తేలిక పడతాడు. అందుకే పరిశోధకులు కూడా ఆలయ సందర్శనం వల్ల మేలు జరుగుతుం

దంటున్నారు. నిరంతర ఆలయ సందర్శం వల్ల ఒత్తిడి తగ్గి రక్తపోటులాంటి ఆరోగ్య సమస్యలను కూడా నివారించుకో వీలుంటుందంటున్నారు వైద్య శాస్త్రవేత్తలు.

ఒకే లక్ష్యంతో, అంటే, మనస్సును పవిత్రపరచుకోవాలనీ, భగవంతునికి ప్రీతిపాత్రులు కావాలనే ఆశయంతో దేవాలయానికి వచ్చే అనేకమంది భక్తుల సాహచర్యం లభించడం వల్ల భక్తునికి సత్సంగ ఫలితం కూడా దక్కుతుంది. శంకర భగవత్పాదులు సత్సంగ ప్రాశస్త్యాన్ని మహత్వీకరించడం మనకు తెలుసు. ఆరు నెలల్లో వారు వీరవుతారనేది ఒక నానుడి.

ఏక లక్ష్య మనస్కులయిన సజ్జనుల సాంగత్యం వల్ల మనిషిలో క్రోధావేశాలకు అడ్డుకట్ట పడుతుంది. సహనశక్తి చేకూరుతుంది. దీనివలన నేరప్రవర్తన దూరం కాగల అవకాశం వుంటుంది. అయితే మా దేవుడు, వారి దేవుడు అనే సంకుచిత మనస్తత్వం కలిగి వుండకుండా కులమతాలకు అతీతంగా ఏకరూప దర్శనం చేయగల ఔన్నత్యం, పెద్ద మనస్సు స్వంతం చేసుకోగలగాలి. మసీదు సందర్శించినా, చర్చి ప్రవేశం చేసినా, ఆలయ దర్శనం చేసినా అందులో ప్రకాశించే జగత్ప్రభువు సర్వనియంత, సర్వుల పెన్నిధి అని మనఃస్ఫూర్తిగా విశ్వసించినపుడు విశ్వశాంతి తప్పక చేకూరగలదు.

ఆలయంలో వున్న స్వామి, మన హృదయ కుహరంలో సుప్రతిష్ఠితుడై ప్రకాశిస్తున్న ఏకైక ఉజ్వల మూర్తి ఒక్కరే అన విశ్వసించినపుడు సర్వమానవ సౌభ్రాతృత్వం, సమాజ ప్రశాంతత చేకూరి, మనిషి సంఘంలో ఎదురవుతున్న సమస్త పీడలనుండి విముక్తి పొంది మనశ్శాంతితో సుఖజీవనం చేయగల అవకాశం కలుగుతుంది.

*ఆంధ్రభూమి డెయిలీ, 11.07.2009*

# రక్షాబంధనం

**పూర్ణిమ** నాడు సంపూర్ణ చంద్రదర్శనం లభిస్తుంది. మనస్సుకు చంద్రుడు అధిపతి కావడం వల్ల సంపూర్ణ చంద్రదర్శనం వల్ల మనస్సు ఉప్పొంగి ఆనంద సంద్రమవుతుంది. సముద్రుడు ఉవ్వెత్తున లేచే కెరటాలతో ఎగసెగసి పడుతాడు. ఎగసిపడే అలలతో, తన ఉత్తుంగ తరంగాలతో మానవాళికి ఆనందం కలిగిస్తాడు. పున్నమినాటి అనుభవం అంత ప్రభావవంతమైనది. శిష్యుని అజ్ఞానాంధకారాన్ని తొలగించే గురువు గౌరవార్థం చేసే గురుపూజ కూడా 'పౌర్ణమి'నాడే జరపటం మనకు తెలుసు. శ్రావణమాసంలో వచ్చే పూర్ణిమ నాడు తమ సోదరులకు రక్షాబంధనం చేసి తరిస్తారు సోదరీమణులు. 'రాఖీ పౌర్ణమి'గా పిలువబడే శ్రావణ పూర్ణిమనాడు జరుపుకొనే సోదరీ సోదరుల పండుగ 'రక్షాబంధనోత్సవం' భారతదేశంలో వైభవంగా జరుపుకొనే ఓ అమూల్యమైన వేడుక.

అక్కాచెల్లెళ్ళు రాఖీని తమ సోదరులకు కట్టిన సందర్భంగా వారికి బహుమతులు యివ్వడంతో పాటు, తమ సోదరీల రక్షణ బాధ్యతను తమ విధిగా భావించడం ఈ పండుగలోని అంతర్యం. ఒకరి సుఖాన్ని ఉజ్వల భవితవ్యాన్ని మరొకరు కాంక్షించి ఆనందాన్ని పంచుకుంటారు. పట్టుదారాలతో, నగిషీలతో తయారైన రాఖీలను సోదరీలు తమ తోబుట్టువులయిన అన్నదమ్ములకు కట్టి వారి క్షేమం కోసం భగవంతుని ప్రార్థిస్తారు.

భారతదేశంలో దివ్యక్షేత్రాలయిన కాశీ, రామేశ్వరం, శ్రీశైలం, తిరుపతి ఇంకా ఇతర తీర్థాల దర్శనం చేసినపుడు ఆ క్షేత్రాలలో లభించే పవిత్రదారాలను తమ ఆత్మీయులకు రక్షగా కట్టడం ఓ సాంప్రదాయం.

గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి వారి క్షేత్రంలో శ్రీ గురువయ్య స్వామివారు తమను దర్శించిన భక్తులకు పవిత్ర దారాన్ని స్వయంగా కట్టడం వంటి ఆచారాల నేపథ్యం కూడా ఈ రక్షా బంధన దారాలకు (రాఖీలకు) వుందని చెప్పవచ్చు. ఈ సాంప్రదాయాన్ని శాంతినికేతన్‌లో రవీంద్రనాథ్ ఠాగోర్ గారు కూడా పాటించి తోటివారి క్షేమాన్ని కాంక్షిస్తూ వారికి రక్షదారాలను కట్టినట్లు తెలుస్తుంది.

దేవ దానవ యుద్ధంలో ఇంద్రుడు ఓ దానవ చక్రవర్తితో యుద్ధానికి తలపడతాడు. అపజయం వెన్నాడిన ఆ తరుణంలో దేవ గురువు బృహస్పతి ఆదేశంతో ఆయన చేతిపై ఇంద్రుడు, ఆయన భార్య శచీదేవి రక్షాబంధనాన్ని ముడివేయగా దేవతల రక్షణ బాధ్యత బృహస్పతి వహించడంతో రాక్షసులపై విజయాన్ని సాధించిన ఉదంతం భవిష్య పురాణం

ద్వారా బోధపడుతుంది. మరో ఉదంతంలో దానవ శ్రేష్ఠుడైన బలి చక్రవర్తి, శ్రీ మహావిష్ణువు భక్తుడైన కారణంగా, స్వామి బలి సామ్రాజ్య రక్షణ బాధ్యత వహించి ఆయన నిజవాసంలో స్థితుడౌతాడు. పతిలేని వైకుంఠంలో వుండలేని శ్రీ మహాలక్ష్మి ఓ బ్రాహ్మణ స్త్రీ వేషంలో బలి దర్శనానికి వస్తుంది. శ్రావణ పూర్ణిమ మహాపర్వదిన నేపథ్యంలో ఆమె బలికి రక్షాబంధనాన్ని కట్టడం వలన రాజు ప్రీతికి కారణమై ఆమె కోరిక మేరకు శ్రీ మహావిష్ణువును దక్కించుకొని వైకుంఠానికి తరలి వెళుతుంది.

సూర్యభగవానుని పెద్ద భార్య సంజ్ఞాదేవి ఆమె కుమారుడు యముడు. కుమార్తె యమున, శ్రావణ పూర్ణిమ పర్వదిన సందర్భంగా యమున తన సోదరుడైన యమునికి రాఖీధారణ చేయిస్తుంది. సంతుష్టుడైన యమధర్మరాజు యమునకు అమృతత్వాన్ని ప్రసాదిస్తాడు. యమున నదీ రూపం పొంది శాశ్వతంగా నిలిచిపోతుంది. యమధర్మరాజు ఎంతో ఆనందంతో మానవాళికి మరో వరం ప్రసాదిస్తాడు. అదేమంటే శ్రావణ పూర్ణిమ పర్వదినం నాడు రక్షాబంధనాన్ని ఎవరైతే తమ సోదరిల నుండి గ్రహిస్తారో వారికి అపమృత్యువు ప్రాప్తించదని వరమిస్తాడు.

ఓ సందర్భంలో చేతి వ్రేలికి గాయమై రక్తం స్రవిస్తున్న శ్రీకృష్ణ భగవానునికి తన చీరను చింపి కట్టుకట్టిన ద్రౌపదికి, కురుసభలో దుశ్శాసనునిచే వలువలు విప్పబడుతూ పరాభవింపబడుతున్న సమయంలో భగవానుడు అక్షయంగా కట్టుచీరను అనుగ్రహించి మాన సంరక్షణ చేయటం మనకు తెలుసు.

మరో చరిత్ర ఉదంతాన్ని ఈ సందర్భంగా ఉటంకించవచ్చు. అలెగ్జాండరు చక్రవర్తి భారతదేశంపై దండయాత్ర చేసినపుడు పురుషోత్తముడనే రాజు ఆయనను బలంగా ప్రతిఘటిస్తాడు. ఆయన ఆధిపత్య ప్రాభవాన్ని విని భయపడిన అలెగ్జాండరు భార్య పురుషోత్తముని కలసి శ్రావణ పూర్ణిమనాడు రాఖీ కట్టి తన భర్త అయిన అలెగ్జాండరుకు రక్షణ కోరగ ఆయన తన మాటకు కట్టుబడి అలెగ్జాండరుకు హాని తలపెట్టకుండా లొంగిపోయి అలెగ్జాండరుకు విజయం ప్రాప్తింపజేయటం చరిత్ర పుటల వల్ల విశదమవుతుంది.

భారతదేశంలో ఈ పండుగ ముఖ్యంగా ఉత్తరాదివారి సాంప్రదాయ మయినప్పటికీ దక్షిణాదికి కూడా సంక్రమించడం వల్ల యావత్ భారతదేశంలో రాఖీ పండుగ (రక్షాబంధనం) జరుపుకొనబడుతుండటం విశేషం! గాయత్రీ ఉపాసకులయిన పురుషులు ఈ శ్రావణ పూర్ణిమ నాడు నూతన యజ్ఞోపవీతాన్ని ధరించడం కూడా ఆచారంగా వస్తోంది. ఆ కారణంగా శ్రావణ పూర్ణిమను 'జంధ్యాల పూర్ణిమ' అనటం కూడా కద్దు!

*ఆంధ్రభూమి, 05.08.2009*

# ఏకేశ్వరోపాసన

భగవ ద్విశ్వాసం మనస్సుకు సంబంధించిన విషయం. ఒక్కొక్కరికి ఒక్కో దేవతపైన నమ్మకం. గురి, విశ్వాసం వుంటుంది. ఏ ఒక్కరూ మరొకని తాను నమ్మిని దేవత పట్ల విశ్వాసం పెంచుకొనేలా చేయగల అవకాశం ఎంతమాత్రం లేదు. ఒకరికి ఆంజనేయస్వామి అంటే విశ్వాసం వుండగా మరొకరికి శ్రీ వేంకటేశ్వరుడు, వేరొకరికి సాయిబాబా, దత్తాత్రేయుడు, ఇలా మరో మతానికి చెందిన వారు ఆ మతదేవతారాధన పట్ల ఆర్తి కలిగి వుండటం చూస్తూ వుంటాం. ఎవరు ఏ దేవతను ఆరాధించినప్పటికీ ఆ దేవత తనను కొలిచిన వారి కోర్కెలు ఈడేర్చడం వలన ఆయా దేవతల కైంకర్యం కొనసాగుతూ వస్తోందన్నది వాస్తవమైన విషయం. గురు పరంపరగల భారతావనిలో గుర్వారాధనకు సముచిత స్థానం వుంది. ఎవరు ఏ దేవతను కొలిచినప్పటికీ సృష్టి ఆవిర్భావానికి కారణమయిన మహాశక్తి ఏదైతే వుందో ఆ మహాశక్తికి వారు వారు కొలిచిన పూజలు చేరుతూ వారి వారి కోరికలు తీరుతూ వస్తున్నాయన్నది తెలుస్తున్న నిజం.

ఏ విధంగా వర్షపు నీరు భూమిపైకి చేరి వివిధ పేర్లతో రూపాంతరం చెంది చివరకు సముద్రం చేరుకుంటుందో, సర్వదేవతలకు అర్పించిన ప్రణతులు కేశవునికి అనగా (క) బ్రహ్మ, (అ)విష్ణు, (ఈశ) మహాదేవ – త్రిమూర్తి స్వరూపుని చేరుతాయని చెప్తారు. పల్లె పల్లెలో ఏదో ఒక గ్రామ దేవత వుంటుంది. ఆ గ్రామవాసులు ఆ దేవతామూర్తిని కొలుస్తూ వారి వారి కోరికలు నెరవేర్చుకొంటూ వుంటారు. వారి కోరికలు తీరుతున్నాయంటే ఆ గ్రామ దేవత సర్వశక్తి సంపన్నయే అని తెలుస్తుంది. మరి ఇందరు దేవతలు (ముక్కోటి దేవతలు) వుండటంలోని ఆంతర్యం బోధపడే ముందు సాధకుడు కొంత గజిబిజి ఎదుర్కోక తప్పదు.

కొన్ని ప్రాంతాల్లో ఎలాంటి రూప విశేషత లేని సాధారణ శిలలను సైతం అమ్మవారిగానో, అయ్యవారిగానో భావన చేసి పూజలందించటం మన దృష్టికి వస్తుంటుంది. వారి కోరికలు తీరుతూ వుండడం కూడా ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. భక్తులు ఓ సాధారణ శిలను పూజించినప్పటికీ వేలాదిగా భక్తులు పూజలు సమర్పించినపుడు భక్తులలోని ఆత్మశక్తి వారు పూజిస్తున్న శిలకు సంక్రమించి ఆ శిల సర్వశక్తి సంపన్న అవుతూ భక్తుల కోర్కెలు తీర్చగల శక్తి పొందగలుగుతుందన్న అభిప్రాయం ఒకటి వుంది. ఇక్కడే సర్వజనులు (ప్రాణులు) ఆత్మ సంపన్నులనీ, సాక్షాత్తు దైవాంశ కలిగి వున్న ఆత్మ సంజాతులనీ బోధపడుతుంది.

అన్నం ఏ రూపంలోనైనా అంటే వడ్లు, జొన్నలు, రాగులు, సజ్జలు, అరికలు, కొఱ్ఱలు, వెదురు బియ్యం ఇత్యాది ఏ తృణధాన్యంతో పక్వం చేసినప్పటికీ ఏ విధంగా జీవుని భౌతికమయిన క్షుద్బాధను తీరుస్తుందో అదే విధంగా ఏ రూపంలో భగవంతుని ఆరాధన చేసినప్పటికీ భక్తుని ఆధ్యాత్మిక ఆర్తి తీర్చగలదనే విషయం మనకు ఇక్కడ బోధపడుతుంది. జిల్లెళ్ళమూడి అమ్మను సాక్షాత్ జగదీశ్వరిగా ఆరాధిస్తారు. ఇంకా ఎందరో అమ్మలు భారతావనిలో జగన్మాతృమూర్తిగా విశేష పూజలందుకున్నారు. షిర్డీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, ఇంకా ఎందరో గురు స్వరూపంలో దైవాన్ని ఆవిష్కరించి మానవాళికి వారి మహిమను అనుభవైకం చేసి చూపారు. వర్తమానంలో భగవాన్ సత్యసాయి బాబా లాంటి మహాగురువులు జగతికి ఆధ్యాత్మిక నిర్దేశనం చేయటంతో పాటు సేవ ప్రాధాన్యత మానవాళికి బోధిస్తూ భక్తులను తరింపజేస్తున్నారు.

కలియుగంలో దత్తాత్రేయుల వారి మొదటి అవతారమయిన శ్రీపాద శ్రీవల్లభులు తాను అనఘా లక్ష్మీ సమేతుడయిన అనఘుడననీ, "బ్రహ్మ విష్ణు రుద్రులను తాదాత్మ్యస్థితిలో ధరించి, ఈ మూడింటికినీ ఆధారంగాను, అతీతంగాను ఉన్న త్రిశక్తి స్వరూపిణి అయిన అనఘను వామభాగంలో ధరించి వున్న శాక్త, రూపముగా తనను ఎరగమని బోధిస్తాడు.

భిన్నత్వంగా కనిపించే దైవరూపాలలో ఇంతటి ఏకత్వం వుందన్నది తరచి చూస్తే మనకు బోధపడే విషయం. అందరు దేవతల మూలశక్తి ఒక్కటే అని గుర్తించి, మా మతం గొప్పదంటే మా మతం గొప్పదనే వాదనకు స్వస్తి చెప్పి సర్వ దేవతారాధన కూడా ఏకేశ్వరోపాసనయే అని గ్రహించి మానవాళి సోదర భావంతో కలిసి మెలసి వుండటం అనేక భాషలు, సాంప్రదాయాలు, మతాలు, జాతులు వున్న భారతావనికి ఎంతో శ్రేయస్కరం, వాంఛనీయం కూడా.

*ఆంధ్రభూమి, 01.09.2009*

# క్రోధాన్ని జయిద్దాం

**మానవుడు** సంఘజీవి. తన ప్రవర్తన ద్వారా అతను తోటి వారిని ఆనంద సమ్మోహితులనూ చేయగలడు, క్రోధానికీ గురి చేయగలడు. 'యద్భావం తద్భవతి' అన్నట్లుగా తన మనస్సును అనుసరించే ఎదుటివారు అర్థమౌతారు. "చేసుకున్న వారికి చేసుకున్నంత", "నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందన్న'ది ఆర్యోక్తి. పరుషంగా మాట్లాడి విరోధాన్ని కొనితెచ్చుకున్నట్లే మంచితనంతో ఎన్నయినా ఘనకార్యాలు సాధించవచ్చు. 'కాలుజారితే తీసుకోగలమేమో గానీ, నోరు జారితే తీసుకోలేమన్నది' నిజం! కోప వికారాన్ని అనుభవిస్తున్న మనిషి శ్వాస వేగం అధికమౌతుంది. రక్త ప్రసరణ వేగం హెచ్చుతుంది. మాట తడబడుతుంది. శారీరకంగా జరుగవలసిన నష్టం జరగడమే కాక మానసికంగా ఎంతో నష్టపోతాడు కోపధారి.

బయటి శత్రువు కంటికి కనబడతాడేమో గానీ లోపల తిష్టవేసి వుండే అంతశ్శత్రువు అయిన కోపాన్ని ఉసిగొల్పితే మనిషికి జరగవలసినంత చెడూ జరిగిపోతుంది. వామనుడు బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానమడుగుతాడు. బలి దానమిచ్చాక 'ఇంతింతై వటుడింతయై.... ప్రభారాశిపై నంతై" అన్నట్లుగా పెరిగిపోతాడు జగత్ ప్రభువు. కోపం విజృంభణ కూడా సరిగ్గా ఇలాగే వుంటుంది. మనసులో కొంత చోటు దొరికాక మనస్సును, బుద్ధినీ పూర్తిగా ఆక్రమించి మనోసామ్రాజ్యాన్ని కూలదోయగల మహా తుంటరి 'కోపం'. పూర్వం ఋషులు మోక్షగాములై తపమాచరిస్తూ అరణ్యాలలో ప్రశాంత జీవనం గడుపుతుండేవారు.

ఘోర తపస్సు చేసే ఋషులు సృష్టించే తపః తరంగాల తీవ్రతకు చలించిపోయిన ఇంద్రుడు తన పదవికి ఎవరు ఎసరుపెడతారో అనే శంకతో వారి తపోభంగ ప్రయత్నాలు చేయడం ఆయనకు అలవాటు. ఒకసారి జితేంద్రియుడైన గౌతమ మహర్షి మోక్షగామియై ఘోర తపస్సు చేస్తుండగా ఇంద్ర పదవి ఆశిస్తున్నాడేమో అనే భయంతో ఆయన తపస్సు భగ్నం చేసే ప్రయత్నం చేస్తాడు సురపతి. ఆయనకు కామవికారం కల్పిస్తాడు.

ఆ యుక్తి పారకపోవడంతో ఆయనకు కోపం పుట్టించి తపస్సు క్షీణింపచేయాలని తలుస్తాడు. గౌతముడు ఆశ్రమంలో లేని సమయంలో ఆయన రూపంలో అహల్యను సమీపించి సంగమకాంక్ష తెలుపుతాడు. కపట గౌతమ వేషధారియైన ఇంద్రుని అహల్య గుర్తిస్తుంది. సురపతి పర్ణశాల నుంచి వెళుతూ గౌతముని కంటపడతాడు. తన రూపం

ధరించిన ఇంద్రుని చూసి, కోపించి, యిద్దరికీ శాపమిస్తాడు మహర్షి. తీవ్ర కోపం వలన గౌతముని తపశ్శక్తి చాలా క్షీణిస్తుంది. అలా క్షీణించడమే ఇంద్రునికి కావలసినది! తపశ్శక్తి క్షీణత వలన ఆయన ఇంద్ర పదవి గనుక ఆశిస్తున్నప్పటికీ దానిని పొందలేడు గనుక, తను శాపానికి గురయినప్పటికీ బాధపడక, తన లక్ష్యం నెరవేరిందని ఇంద్రుడు సంతోషిస్తాడు. ఈ దృష్టాంతం ద్వారా కోపం వల్ల ఎంతటి నష్టం వాటిల్లగలదో అర్థమవుతుంది. దుర్వాస మహాముని అతి కోపం కూడా ప్రపంచ విదితమే. ఆయన తీవ్ర కోపం వలన తను శ్రీ మహాలక్ష్మి శాపానికి గురి అవ్వటమే కాకుండా తన జాతినంతటికి శాపఫలం అందిస్తాడు.

ఇంటిదొంగ, అరిషడ్వర్గాల్లో చాలా ప్రమాదకారి అయిన కోపాన్ని పెంచి పోషించే వ్యసనానికి గురికాకుండా మనిషి తన ప్రయత్నం చేత కోపాన్ని దూరంగా వుంచి కృతార్థుడు కావలసిన అవసరం చాలా వుంది.

కోపం మనసు నుంచి నిష్క్రమించాకే ధ్యానాది క్రియలు చేపట్టగలుగుతాడు మనిషి. అన్నిటికీ వున్నట్లే కోపానికి కూడా ఓ విరుగుడు వుంది. అదే 'శాంతం'. సాధన చేస్తున్న ఏ మహత్ కార్యాన్నయినా అవలీలగా ఒంట పట్టించుకోగల మనస్సుకు తర్ఫీదు యిచ్చి మనిషి శాంత స్వభావాన్ని అలవర్చుకోగలిగితే కోపం దరిచేరే అవకాశం వుండదు. ఆ ప్రయత్నంలో సఫలీకృతుడు అయ్యేందుకు పురుష ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నాన్ని త్రికరణ శుద్ధిగా చేసి లబ్ధిపొందే ప్రయత్నం చేద్దాం !

*ఆంధ్రభూమి, 09.09.2009*

# సూర్యారాధన

**సూర్యుడు** లేని జగత్తును మనం ఊహించలేం. ఇంటికి దీపం, కంటికి వెలుగు అని మనం ప్రియమైన వారి గురించి ప్రస్తావిస్తూంటాం. దృశ్య జగత్తుకు సూర్యుడు మూలాధారం. ఆదిత్యుడు 'దృష్టి' పదానికి అర్థాన్నిచ్చే ప్రభువు. సూర్య చంద్రులు, అగ్ని ముగ్గురూ తేజస్సంపన్నులు. పరమేశ్వరుని రెండు కళ్ళు సూర్యచంద్రులు కాగా అగ్ని మూడవ కన్నుగా చెప్పబడింది. కుడి ముక్కు రంధ్రం ద్వారా వచ్చే ఊపిరి 'ఇడ' అని చెప్పబడగా, ఎడమ ముక్కు రంధ్రం నుంచి వచ్చే శ్వాస 'పింగళ'గా చెబుతారు. 'ఇడ' సూర్యనాడీ.

పంచ భూతాత్మకమైన ప్రపంచం! సూర్యుడు లేని ప్రపంచంతో ఏ పదార్థానికి ఉనికి తెలియదు. సూర్యుడు ప్రాణప్రదాత శక్తిప్రదాత. సూర్యగ్రహం స్థిరమైనదయినప్పటికీ భూస్వ పరిభ్రమణం ద్వారా రాత్రింబవళ్ళు ఏర్పడుతుండగా సూర్య పరిభ్రమణం వలన రుతువులు ఏర్పడతాయి.

రాత్రి గడిచాక బ్రహ్మీముహూర్తం నుంచీ ప్రకృతి సూర్యాగమనానికి సన్నద్ధమవుతూ స్వామికి స్వాగతం పలుకుతోందా అన్నట్టు, ఆ ముహూర్తం నుంచి పక్షులు కిలకిలారావాలతో ప్రకృతిని శబ్ద శోభితం చేస్తాయి. మనిషికి అజ్ఞాన తిమిరం వదిలాక జ్ఞానోదయం కలుగుతున్నట్లు రాత్రి గడిచాక భానూదయంతో ప్రకృతి మాత సమస్త క్లేశాలు వీడి సాత్వికానందాన్ని ప్రకటిస్తుంది. ప్రాణులు ఉషోదయంతో తమస్సును వదిలించుకొని ఆహ్లాదంతో పులకించి పోతాయి. చంద్రుడు మనస్సుకు అధి దేవతకాగా సూర్యుడు బుద్ధి ప్రేరకుడు మనో నిగ్రహమునకు, బుద్ధి వికాసానికి సూర్య చంద్రులను ఆరాధించడం ద్వారా పరమేశ్వరుని అనుగ్రహం పొందటం ఎలాగూ భారతీయ తత్వదార్శనికులకు వెన్నతో పెట్టిన విద్యయే!

సూర్యుడు లేని జగత్తులో మనిషి సృజించుకున్న గడియారానికి అర్థం లేదు. సూర్యగమనం వల్ల కాలచక్రమం ఏర్పడింది. విఘడియలు, ఘడియలు, ముహూర్తాలు, దిన, పక్ష, మాస సంవత్సరాలు భూమి సూర్య ప్రదక్షిణం చేస్తుండగా ఏర్పడుతున్నవే! ఉషఃకాలం, మధ్యాహ్న కాలం, రాత్రి కాలం సత్వరజస్తమో గుణాలకు ప్రతీకలు.

సూర్యుడు గ్రహరాజు. నవగ్రహాలలో సూర్యుడు ప్రథమ గణ్యుడు. గాయత్రి మంత్రంలోని 24 అక్షరాలు ఒక్కొక్క దేవతకు చెందిన భీజాక్షరాలయినప్పటికీ, సూర్య భగవానుణ్ణి తల్లిగా భావించి ఆమెకు 'గాయత్రి' అని పేరిడి చేసే సాధన గాయత్రి ఉపాసనగా చెప్పబడుతోంది. రామరావణ యుద్ధ సమయంలో అగస్త్య మహర్షి చింతాక్రాంతుడై వున్న

శ్రీరామచంద్రునికి 'ఆదిత్య హృదయం' ఉపదేశిస్తాడు. శ్రీరాముడు ఆ మంత్రాన్ని జపించి యుద్ధానికి సన్నద్ధుడవుతాడు. విజయలక్ష్మిని కైవసం చేసుకున్న ఉదంతం సర్వజన విదితం. ఈ స్తోత్రాన్ని నిత్యం పారాయణ చేసే మానవులకు సమస్త శత్రు, ఈతి బాధలు నశించి, అక్షయంగా సత్వాలను ప్రసాదిస్తుందని అగస్త్య మహర్షి ఫలశృతిని నిర్దేశిస్తాడు. అదితి పుత్రుడైన కారణంగా 'ఆదిత్య'డనీ, జగత్ సృష్టికి కారకుడవుతున్న కారణంగా సవిత' అని, ప్రాణులు తమ పనులను సక్రమంగా నిర్వర్తించుకునేందుకు ప్రేరణ ఇస్తాడు కనుక 'సూర్యుడనీ స్వామికి పేర్లు. సముద్రంలోని నీటిని ఆవిరిద్వారా ఇంకించి మేఘాలు ఏర్పడేందుకు కారణభుతుడై, వర్షములు కురిసేందుకు ఆధారభూతుడవుతున్నాడు కనుక సూర్యునికి 'పూషా' అని కూడా పేరు సకల ప్రాణులలో 'అంతర్యామిగా' నున్న సూర్యుని సాక్షాత్తు నారాయణమూర్తిగా (సూర్యనారాయణుడు) వేదములు కీర్తించాయి. దినమంతా ఉష్ణతాపం చెందే ప్రకృతి ఉదయాస్తమయ సమయాలందు ఆహ్లాద భరితంగా తయారవుతుంది. ఆ సమయాల్లో దైవారాధనకు, ధ్యానాది అనుష్ఠానాలకు, సద్గ్రంథ పఠనానికి ఉపయుక్తంగా వుంటుంది.

చంద్రుడు అస్తమించాక, సూర్యుడు ఉదయించే ముందు ప్రాతఃసంధ్యా సమయంలోను, సూర్యాస్తమయం జరిగాక చంద్రోదయాత్పుర్వం సాయం సంధ్యా కాలంలోను, పూర్వాహ్ణ – అపరాహ్ణ సంధి కాలంలోని మధ్యాహ్నిక సంధ్యా సమయంలోను ద్విజులు సంధ్యావందనం చేయడం మన ప్రాచీన సాంప్రదాయం. బ్రాహ్మీకాలంలో సూర్యుడు మందేహాది రాక్షసుల వలన బాధింపబడుతాడనీ, ద్విజులు సంధ్యావందనం చేసే సమయంలో ఇచ్చే అర్ఘ్యాలవల్ల భానునికి రాక్షస బాధ తప్పుతుందనీ పురాణాలు చెబుతున్నాయి. జ్యోతిష శాస్త్రంలో సూర్యునికి విశేష స్థానం కల్పించబడింది. సూర్యుడు సింహరాశికి అధిపతి. రవ్యాంశలో జన్మించిన మానవులు ఆత్మ విశ్వాసం కలిగిన వారుగా, సమాజంలో రాణిస్తూ కీర్తి ప్రతిష్టలను గణిస్తారని చెప్పబడుతోంది.

భౌతికంగా చూస్తే సూర్యగ్రహం భూమి నుండి 149598500 కి.మీ. దూరంలో వుండగా సూర్యగ్రహ సగటు ఉపరితల ఉష్ణోగ్రత + 6000 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా తెలుస్తుంది. ఆరోగ్యభాగ్యాన్ని ప్రసాదించేవాడు కాబట్టి సూర్యభగవానుని 'భాస్కరు'డని చెప్పడం జరిగింది.

'సూర్యదేవ సహస్రాంశోతేజోరాశో జగత్పతే
అనుకంపయమాం భక్త్యా గృహణార్ఘ్యం దివాకరా!

ఓం సూర్యాయనమః ఆదిత్యాయ నమః భాస్కరాయ నమః" అంటూ ప్రొద్దున్నే సూర్య అర్ఘ్యాలు మూడుసార్లు విడవడం వలన విశేష పుణ్యఫలం ప్రాప్తిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

*ఆంధ్రభూమి, 21.10.2009*

# కష్టాలు దరిచేరినప్పుడు...

**మానవుడు** విజయపథంలో ఉన్నప్పుడు తనను మించినవాడు లేడనుకుంటాడు. అయితే తను చేసే కృషికి దైవకృపతోడైతేనే పురోగమనం. మంచి పనికి దైవబలం తప్పక తోడవుతుంది. ప్రయత్నలోపం పనికి రాదు. ఆరువంతుల మానవకృషికి ఏడోవంతుగా దైవ సహాయం అందగలదన్నది ఆర్యోక్తి. సమగ్ర ఐశ్వర్యం, నిర్మల జ్ఞానం, సత్కీర్తి, ఉత్తమ సంపద, పరిపూర్ణ ధర్మం, సంపూర్ణ వైరాగ్యం అనేవి భగవంతుని సద్గుణాలు.

త్రికరణ శుద్ధిగా భగవదారాధన చేసే వారికి స్వల్పంగానైనా అవి అబ్బుతాయి. అటువంటి భగవద్భక్తులకు విచారమనే బాధ దరికి చేరదు. శరీరం వ్యాధిగ్రస్థమైనప్పటికీ భగవాన్ రమణ మహర్షి, శ్రీ రామకృష్ణపరమహంస వంటి మహనీయులు ఆ బాధ శరీరానికే గాని ఆత్మకు కాదని భావించి నిర్వికల్పానందస్థితిలో ఓలలాడిన దృష్టాంతాలు జగద్విదితం.

కపిశ్రేష్ఠుడైన సుగ్రీవుడు, “ఎవ్వరూ మనస్సునందు విచారమునకు చోటీయరాదు. ఆగ్రహించిన సర్పం కాటువేస్తే ఏ విధంగా మనిషి వేగంగా కృశించి నశిస్తాడో ఆ విధంగా విషాదం మనిషిని ఆమూలాగ్రం దెబ్బతీస్తుంది” అంటాడు. అర్జున విషాద యోగంలో శ్రీకృష్ణుడు అర్జునుని విజ్ఞతను మేల్కొలుపుతూ హితబోధ చేస్తాడు.

రామయ్య ఓ చిన్నరైతు. దైవభక్తుడు. ధాన్యం నింపిన ఎడ్లబండిని తోలుకుంటూ బండ్ల బాటన ఇంటికి వస్తుంటాడు. గృహోన్ముఖమైన ఎడ్లు వడివడిగా బండిలాగుతుంటాయి. ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై తుంపరతో ప్రారంభమైన వాన గాలితో ఉధృతమై కుంభవృష్టి కురియగా దారి బురదమయమై ఒకచోట బండి మన్నులో కూరుకుపోతుంది.

ఎడ్లను ఎంత అదలించినప్పటికీ ప్రయోజనం లేకపోతుంది. నిర్జనారణ్యంలో సహాయమూ అందే అవకాశం లేక త్రికరణ శుద్ధిగా దైవాన్ని నమ్మి, హృదయపూర్వకంగా ప్రార్థిస్తాడు. కాళ్ళు చక్రం వెనక భూమికి దట్టించి, చక్రానికి భుజాన్ని ఆనించి చేతులతో బలంగా ముందుకు తోస్తాడు. ఇంతలో మెరుపులు, ఉరుములు ఫెళఫెళార్భాటాలు చేయగా భయభ్రాంతికి లోనయిన ఎద్దులు ఏదో తెలియని అజ్ఞాతశక్తి ప్రేరేపించినట్లుగా బలంగా ముందుకు దూకుతాయి. బండి బురద నుంచి బయటపడుతుంది. రామయ్య ఆనందానికి అవధులు లేకపోయింది.

కష్టాలు దరిచేరినప్పుడు విచారానికి చోటివ్వకుండా మానవ ప్రయత్నంగా కార్యసాధనకు ఉపక్రమించినపుడు భగవదనుగ్రహం తప్పక లభించగలదన్నది సారాంశం.

*సాక్షి డెయిలీ, 03.11.2009*

# చల్లని చూపు

"సర్వేంద్రియానాం నయనం ప్రధానం" అన్నది ఆర్యోక్తి. కన్నులనుంచి ప్రభవించే దృష్టి ఎంతో ప్రాధాన్యత సంతరించుకొని ఉంటుంది. ఒకరి కన్నుల్లో కరుణ కురుస్తుంది. మరొకరి కన్నుల్లో సానుభూతి వ్యక్తమౌతుంది. వేరొకరి కన్నుల్లో నిప్పులు కురుస్తాయి. ఇంద్రియపరంగాక్రియ ఒక్కటే అయినప్పటికీ, సౌమ్యత, వ్యవహారికతలో దాని స్వభావం మారుతుంది.

ఒకరు స్త్రీని మాతృమూర్తిగా దర్శిస్తే మరొకరి చూపు ఆమె సౌందర్యాన్ని అవలోకిస్తుంది. సర్వజనులు మాతృశ్రీగా దర్శించిన సీతామాతను రావణుడు సద్భావంతో చూడలేక, మూర్తీభవించిన కాముకతకు ప్రతిరూపంగా అందరి దృష్టికి ద్యోతకమై కట్ట కడపటికి, ఎంతో ప్రతిభాశాలి, శివభక్తుడు అయివుండీ కూడా మూర్ఖత్వాన్ని ఆశ్రయించి తన వినాశాన్ని తానే కొని తెచ్చుకున్న వాడౌతాడు.

'యద్భావం తద్భవతి' అన్నట్లు భావానుగుణ్యంగానే వస్తువు చూపుకందుతుంది. సామాన్యులు చీదరించుకొనే కుష్ఠురోగులను ఒడికిచేర్చుకొని, హృదయానికి హత్తుకున్న థెరీసా, అలాంటి నిర్భాగ్యులను బిడ్డలుగానే దర్శించి వాత్సల్యాన్ని పంచి, కురిపించి జగద్విదిత అయింది. ఏసుక్రీస్తు కన్నుల్లో ద్యోతకమయ్యే కరుణామృతరసం ఆయన్ను కరుణామయుడుగా, జగత్ప్రభువుగా గుర్తించి, లోకం కీర్తించి తరించేందుకు సమీకరణలు సిద్ధం చేసింది.

కుష్టురోగంతో బాధపడుతున్న భాగోజీ యొక్క భక్తి సంపద అతని రోగాన్ని దర్శనీయం చేయక షిర్డీ సాయిబాబా కృపకు పాత్రుడను చేసి భాగోజీ చేతనే శ్రీ సాయి రోజూ సేవ చేయించుకొనే మహద్భాగ్యాన్ని ఆయనకు లభింపజేసింది. శ్రీసాయి, భాగోజీ భక్తినే చూశాడు గానీ ఆయన రోగాన్ని అసహ్యించుకొనలేదు.

చూపు వైశిష్ట్యాన్ని వివరించే ఒక దృష్టాంతాన్ని చెప్పుకొందాం! శనీశ్వరుడి భార్య జ్యేష్ఠాదేవి. ఆమె శ్రీ మహాలక్ష్మి సోదరి. సూర్యభగవానుని పుత్రుడు, యమధర్మరాజు తమ్ముడు, గ్రహాలలో ప్రముఖుడు అయివుండీ కూడా జ్యేష్ఠాదేవితో తన వివాహం తరువాత సంసార సౌఖ్యాలలో పస, నిజమన ఆనందమూ లేవని గుర్తించిన శనీశ్వరుడు స్త్రీ సౌఖ్యంపట్ల నిర్వికారం ప్రదర్శించినపుడు భార్య శాపానికి గురవుతాడు. తనను తప్ప ఆయన మరెవరిని చూచినా వారు అష్టకష్టాలు పడతారని శపించింది.

అప్పటిదాకా శని శుభకారకుడుగా అందరి మన్ననలు పొందినప్పటికీ, భార్య

శాపానంతరం ఆయన 'చూపు' పడిందంటే వీక్షణ చేయబడ్డవారికి అష్టకష్టాలు ప్రాప్తించి వెతల పాలవడం ప్రారంభమయింది. చూపుకు అంతటి శక్తి వుంది.

చక్కగా అలంకరించుకొని, ముస్తాబై నలుగురి దృష్టి నాకర్షించినపుడు, నలుగురిలో ప్రతిభ చూపి 'ఓహో' అనిపించుకున్నపుడు, బిడ్డలను తల్లులు ఉప్పు, మిరపకాయలు, ఎర్రనీళ్ళతో దిష్టి తీసి కర్పూరం వెలిగించి నరదృష్టి ఉపద్రవాల నివారణ కోసం చేసే ప్రక్రియ మనమెరిగిందే! నరదృష్టి నివారణకు మంత్రించిన తాయెత్తులు ధరించడం పూర్వాచారంగా వస్తోంది.

ఆకలితో వున్నవారికి ఇంత అన్నం పెట్టి సాధారణంగా చూసే దృష్టిలో ప్రసన్నత వుంటుంది. అది గ్రహీతలకు తక్షణ పరిణామంగా ఆకలి తీర్చి దాతల తదనంతర సహాయానికి వాకిలి తెరచి ఏదో తెలియని భద్రతాభావాన్ని ఆర్తులలో నింపుతుంది. ఆర్తుల ఆకలి తీరినపుడు వారి కళ్ళలో ద్యోతకమయ్యే కృతజ్ఞతాభావానికి సహాయమందించినవారు ముగ్ధులై ఆనందం పొందుతారు. పెద్దల పట్ల గౌరవసూచకంగా పిన్నలు నమస్కరించినపుడు ఆ పెద్దల కళ్ళలో వాత్సల్యం వెల్లివిరుస్తుంది. ఆ చల్లని చూపు పిన్నలకు శ్రీరామరక్ష.

దేవతలు స్తోత్రప్రియులు. భక్తులు వారిని స్తోత్రం చేసి పూజలు సలిపినపుడు వారు ప్రసన్నులవుతారు. వారి చల్లని దయావీక్షణం మానవులకు సకల సంపదలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కల్గిస్తుందని భక్తుల విశ్వాసం! కొన్ని ప్రశ్నలకు జవాబులుండవు. కొన్నింటికి మౌనమే సమాధానమౌతుంది. కొన్ని ప్రశ్నలకు జవాబులు కళ్ళతో, చూపుతో చెప్పబడతాయి.

ప్రసన్నత, కరుణ, ఆనందం, అసూయ, ఈర్ష్యాద్వేషాలు, ఇలా ఎన్నో భావాలు కళ్ళలో ద్యోతకమవుతాయి. ప్రసన్నంగా వున్నప్పుడు కళ్ళు ప్రసన్నత వర్షిస్తాయి. కరుణ కురిపిస్తాయి. దయ ప్రవహింపజేస్తాయి. భక్తిభావం వల్ల అలసి సొలసిన మనస్సుకు సాంత్వన చేకూరుతుంది. ఆనందం పొంగువారుతుంది.

ఆనంద కందళిత హృదయంతో సదా మనస్సులో ప్రసన్నత నింపుకొని చల్లని చూపును లోకంపై ప్రసరిద్దాం! ఆ చూపు ఆర్తులకు, భీతావహులకు ఊరటనిస్తుంది. సన్నిహితుల నుంచి స్నేహభావాన్ని ఆర్జించి పెడుతుంది. పెద్దల నుంచి ఆశీర్వచనాలు పొందేలా చేస్తుంది. చల్లని చూపు సకల జనావళికి శ్రీరామరక్ష!

*ఆంధ్రభూమి, 04.11.2009*

# స్నేహ మాధుర్యం

చిన్న నాడు తూనీగలతోఆడుకున్న మదుర జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనంద అంతర్ వీక్షణం చేసి, ఆ స్నేహ మధురిమలో ఓలలాడే భావుకులయిన స్నేహితులు ఎందరో వున్నారు. స్నేహమనేది మనుష్యులకే కాదు, పశుపక్ష్యాదులకు కూడా తెలుసు. సృష్టిలో తీయనిది స్నేహమంటారు. రెండు మనసులు ఏకమైనపుడు స్నేహం అంకురిస్తుంది. సూర్యకిరణ ప్రభలు అనంతంలోకి చొచ్చుకుపోయినట్లు చెలిమి కలిమి ఇరువురి మనోఫలకాలపై చెరగని ముద్రగా రూపుదిద్దుకుంటుంది. నమ్మిన స్నేహితునికి చెరుపు చేసేవాడు అతి హీనమయిన వాడుగా చెప్పబడతాడు.

స్నేహానికి ప్రతిరూపుగా సుయోధన – కర్ణుల మైత్రిని ఉదహరిస్తారు. అర్జునునికి ధీటుగా ధనుర్విద్యలో మేటియైన కర్ణునికి కేవలం కులం కారణంగా తన ప్రతిభ చూపే గౌరవం లభించని సందర్భంలో సుయోధనుడు కర్ణుని అంగరాజ్యాభిషిక్తుని చేసి సభలో గౌరవ మర్యాదలు కల్పించిన మహోపకారానికి కర్ణుడు తన తుది శ్వాస విడిచేదాకా సుయోధనునికి కృతజ్ఞుడుగా వుండి స్నేహ పరిమళాన్ని వెలయించాడు.

గలగలపారే సెలయేరు చురుకుదనాన్ని, స్వచ్ఛతను మైత్రీ బంధానికి ఆపాదించవచ్చు. శరత్ చంద్ర ఛటోపాధ్యాయ రచించిన దేవదాసు ఇతివృత్తాన్ని గనుక పరిశీలిస్తే దేవదాసు, పార్వతిల స్నేహబంధం కామవాంఛకు అతీతమైన పవిత్ర సౌరభం. దేవదాసు ప్రేమ కేవలం కామ ప్రపూరితమే అయితే తనకు చేరువగా వచ్చిన చంద్రముఖికి దగ్గర కాగలిగేవాడు, లేక సంపన్నుడైన అతనికి మరో మార్గం లేకపోయే అవకాశం ఉండేది కాదు. చెలిమికోసం వారు జీవితాలను త్యాగం చేసి సాహితీవినీలాకాశంలో ధృవతారలుగా మిగిలిపోయారు.

పవిత్ర రక్షాబంధన కార్యక్రమం కూడా సోదరీసోదరుల మైత్రీ బంధాన్ని ప్రస్ఫుటించే వేడుకయే! పూర్వం రాజులు పరస్పర విద్వేషాలతో శత్రువులుగా పోరు సల్పే సందర్భాల్లో ఇరుదేశాల క్షేమాన్ని కాంక్షిస్తూ సంధి కుదుర్చుకని, స్నేహ హస్తాన్ని సాచి ఉద్వేగ వాతావరణాన్ని శాంతిపూరితం చేసుకొని లబ్ది పొందేవారు. శాంతి సౌఖ్యాల సాధనకు స్నేహం ఆ విధంగా ఉపకరించేది. ఆంగ్లేయ, ఫ్రెంచి వలస పాలకులు హైదరాబాదు

సంస్థానాన్ని లక్ష్యంగా చేసుకున్నపుడు నిజాం ప్రభువులు వారితో స్నేహాన్ని ఏర్పరచుకొని తమ అధికారాన్ని పదిలం చేసుకున్నట్లు చరిత్ర వల్ల తెలుస్తుంది.

తనేమో ఓ బడుగు బాపడు. ఆయనేమో ద్వారకా నగరానికి ప్రభువు. ఆయన్ను దర్శించాలంటే కాపలా బంట్రోతులు లోనికి పోనిస్తారా? ఒకవేళ అది జరిగినా తను పిడికెడు అటుకులు ముడివేసిన చినుగు వస్త్రం నుంచి ఎలా మిత్రునికి కానుక సమర్పించగలడు? ఇన్ని ప్రశ్నలున్న కుచేలుని మనస్సు, నల్లనయ్య వాకిలిదాకా ఎదురొచ్చి తనను సాదరంగా తోడుకొని పోయి మహారాణి అయిన రుక్మిణీ దేవికి తను చిన్ననాటి కూరిమి చెలికానిగా పరిచయం చేసేదాకా ఊరట చెందలేదు.

భగవంతుని తర్వాత మనిషి మనసు విప్పి గుట్టు చెప్పుకోగలిగే కమనీయ మాదుర్య సీమ చెలి / చెలికాని సన్నిధి. భార్యాభర్తల నడుమ తొలినాళ్ళల్లో కామం కొలువు చేసినా, మనుగడలో ప్రస్ఫుటమయ్యే 'నీకు నేనూ – నాకు నువ్వూ!' అనే కమనీయ భావం కూరిమి చెలిమి పర్యవసానమే! కొడుకులు నీ అంత అయ్యాక వారిని కొడుకుల్లా కాదు, మిత్రుల్లా చూడాలన్నది ఏనాటినుంచో వినిపించే మహత్తర సందేశం!

ముత్యపుచిప్పతో స్నేహం చేసిన స్వాతిచినుకు సాక్షాత్తు స్వాతిముత్యంగా రూపాంతరం చెందినట్లు మంచివారితో స్నేహం సత్‌కార్య సాఫల్యతకు దారి చూపుతుంది. నీ స్నేహితుడెవరో చెబితే నీవెవరో,ఏమిటో చెబుతానంటాడో ఆంగ్ల కవి. ఆరు నెలల్లో వారు వీరవుతారనే నానుడి మనకు తెలియనిది కాదు. అందుకే మంచివారితో స్నేహం చెయ్యాలి. మల్లె పరిమళం దారానికబ్బినట్లు మంచివారి సుగుణాలు వారి దరి చేరిన సామాన్యులకు అందుతాయి. మంచి అనే మాటకు పర్యాయపదమైన స్నేహంతో చేయలేని సత్కార్యమంటూ ఈ ప్రపంచంలో లేదు.

అపార్థాలకు చోటివ్వకుండా, అనుమానాలకు తావివ్వకుండా స్నేహాన్ని పదికాలాల పాటు కాపాడుకోగల్గితే స్నేహబంధం మండు వేసవిలో చిరుజల్లులా ఆహ్లాదాన్ని పంచుతుంది. మనోజ్ఞమయిన మానస సరోవరంలో రాజహంసలు ఆనంద వ్యాహ్యాళి చేసినట్లు పదికాలాల పాటు పలుచబడకుండా పదిలంగా ఉంటుంది. ఆ స్నేహ మాధుర్యమే నేస్తాలకు శ్రీరామరక్ష.

*ఆంధ్రభూమి, 19.11.2009*

# ఆనందం

భగవంతుడు, భక్తి అనే కమనీయ భావాలు చిన్ననాడు అమ్మపాడే జోలపాటలతో ప్రారంభమౌతాయి. "జో అచ్యుతానంద జో...జో... ముకుందా" అన్నా, "జో... పాపా లాలీ..." అన్నా ఆ పాటలలోని తియ్యందనాలు, కమ్మదనం బిడ్డడి మస్తిష్కంలోకి చిన్ననాడే ప్రవేశిస్తాయి. అభిమన్యుడు పిండదశలో వున్నప్పుడే పద్మవ్యూహ ప్రవేశం గురించి విన్నట్లుగా జోలపాటల ద్వారా బాలకృష్ణుని, బాలరాముని మురిపాల మాధుర్యాలు శిశువుల మనస్సుల్లో మార్దవం నింపుతాయి.ప్రకృతిలో ఓ లయ వుంది. ఓ నిబద్ధత వుంది. గడియారంలో సెకండ్ల ముల్లు కదిలే తీరు, వేగంలోని నిలకడ ప్రకృతినిబద్ధ స్వరూపానికి మన కళ్ళముందు కదలాడే ఓ నిదర్శనం!

కోకిలమ్మ పాటల్లో, పక్షుల కుహూరవాల్లో, ఆ మాటకు వస్తే కాకుల కర్ణకఠోర స్వరాల్లో కూడా ఏదో తెలియని మాధుర్యం, తేటదనం వుంది.. సూర్యభగవానుని సమయపాలన మానవులకు ఆదర్శప్రాయం.'నాకు ఇది లేదు' అనే ఆలోచన తెలియని పశుపక్ష్యాదులు సంతృప్త జీవనం చేస్తున్నాయి. అదే తరహా తృప్తితో కూడిన బ్రతుకు మనిషికి కూడా ఎంతో ఆనందాన్నిస్తుంది. "వారికి వుంది, నాకు లేదు!", "కావాలనుకుంటే మాత్రం వస్తుందా?" వంటి అపసవ్య ధోరణులు కాకుండా, స్వల్ప విషయాలలో కూడా ఆనంద రసాస్వాదన చేయడం ద్వారా మనిషి నిండు నూరేళ్ళు సంతోషంగా బ్రతకగలుగుతాడు.

మనిషి భగవత్ స్వరూపమే అనే నిజాన్ని ప్రక్కనపెడితే, ఆనందం భగవత్స్వరూపం కావడం వల్ల ఆనందంతో జీవించే మనిషి, భగవంతుని తనలోనికి ఆహ్వానించగల నేపథ్యం ఎంతో వుంటుంది. మహనీయులు రోగగ్రస్తులయిన సందర్భంలో కూడా ఆనందంగా జీవించగలిగారంటే అది వారి మనోనిబ్బరం, మనశ్శక్తి అని చెప్పాలి. అలాంటి సంయమనం సామాన్యులకు సాధ్యంకాదు కాబట్టి ఆరోగ్య సూత్రాలను పాటించి దేహం ఆరోగ్యంగా వున్నప్పుడు, 'ఆరోగ్య ప్రదమైన శరీరంలో ఆరోగ్యకరమైన మనస్సు' అనే నానుడి ఆధారంగా మనిషికి మంచి మనస్సు ప్రాప్తిస్తుంది. అప్పుడు పవిత్రమైన ఆ మనోక్షేత్రంలో ఆధ్యాత్మిక బీజం నాటవచ్చు.

త్యాగరాజు, అన్నమయ్య వంటి వాగ్గేయకారులు సంగీతంతో భగవదారాధన చేశారు. సామాన్యులకు అది సాధ్యం కాకపోయినా, వారి కమనీయ గీతాలు శ్రవణం చేస్తూ దైవారాధన చేయవచ్చు. 'శ్రవణం' నవవిధ భక్తి మార్గాల్లో ఒకటి కదా!

"గుంపులో గోవిందా" అనే వాక్యం అపసవ్యార్థంలో చెప్పినప్పటికీ, బృందం (గుంపు)గా ఏర్పడి భక్తిభావాలను పరస్పరం పంచుకోవడం ద్వారా సత్సంగ ఫలాలు సమకూరుతాయి. భగవంతుని గూర్చిన ఆలోచనల్లో సాధకునికి స్పష్టత వుండాలి. మంచి జరిగినప్పుడు భగవంతుని కీర్తించడం ద్వారా నమ్మకం ప్రదర్శించి, చెడు జరిగినపుడు విధిని తూలనాడటం భగవద్దూషణే కాగలదు. ఆశావాదానికి, భక్తికి చాలాసామ్యత, సామీప్యత వుంది. రాబోయే రోజుల్లో ఏదో మంచి జరుగగలదన్న ఘనకార్యాలు సాధించగలమన్న నమ్మకం ఆశావాదమైతే, మిథ్యగా భావించబడుతున్న ఈ ప్రపంచం మిథ్య కాదనీ, దాన్ని భగవంతుడు ఏలుతున్నాడనీ, 'మంచివారికి మంచి జరుగుతుం'దన్న ఆలోచన ఆధారంగా సత్ప్రవర్తన కలిగి వున్న తనకు తప్పక భగవంతుడు మేలు చేస్తాడనీ మనిషి నమ్మినపుడు ఆ విశ్వాస బలంతో 'లేని' శక్తిని కూడగట్టుకొని మనిషి కృషి చేస్తాడు. ఆ కృషి వలన మనిషి తప్పక విజయం సాధిస్తాడు.

ఆ విజయానికి కారణం, ప్రేరణ ఆశావాదమే మరి! నిరాశావాదం, నాస్తికత్వం ఒకే వరుసలో పయనిస్తాయి. కనుక సాధకుడు నాస్తికత్వం దరిచేరకుండా, నిరాశ వైపు మొగ్గకుండా జాగ్రత్త పడాలి. ప్రకృతికి పగలు రేయి, సంధ్యా సమయాలు, తిధి వార పక్ష మాసాదిగా ఋతువులు.. యిలా కాలగమనం సజావుగా సాగిపోగల వ్యవస్థ వుంది. ప్రకృతిలో మనిషి భాగమే గనుక ఆ ఒరవడిలో నిబద్ధతతో కూడి పయనించినపుడు ఆవలితీరం సుపథంగా, సులభంగా చేరగులుగుతాడు. భగవస్సాన్నిధ్యం, ఆనందం లక్ష్యసిద్ధి అయినపుడు ఆ లక్ష్యాన్ని చేర్చగల నావ ప్రకృతే! ప్రకృతితో సహజీవనం వలన ఆయురారోగ్యాలు చేకూరుతాయనీ, ఆరోగ్యప్రదమైన, పవిత్రమైన మనస్సే భగవానుడు ఆసీనుడయ్యే పీఠమనీ నమ్మి ప్రకృతి ఒడిలో, వొరవడిలో, లయలో సాగిపోదాం! దైవాన్ని పొందుదాం.

*ఆంధ్రభూమి, 02.12.2009*

# నాద బ్రహ్మోపాసనకు ప్రతిరూపమే ఘంటానాదం

దేవాలయంలో ప్రవేశించగానే భక్తులు చేసే మొదటిపని గంట మోగించడం! మనం గుళ్ళో గంట ఎందుకు మోగిస్తామో కొంచెం వివరంగా తెలుసుకుందామా?

ఘంటారావంలో ఓంకారనాదం ఇమిడి ఉంది. ఆలయంలో ప్రవేశించిన భక్తుల గుసగుసలు, మాటలు తోటివారికి అంతరాయం కలిగించకుండా ఘంటానాదం ఉపయోగపడుతుంది. ఆలయ ప్రాంగణంలో ప్రతిధ్వనించిన ఘంటారావం ఓ పవిత్రత చేకూర్చి పెడుతుంది. గుళ్ళో ప్రవేశించే సమయంలోనే – కాక నిష్క్రమణ సమయంలో కూడా భక్తులు గుడిగంటలు మోగిస్తారు.

భగవంతునికి హారతి ఇచ్చే సమయంలో గంట మోగించటం, శంఖం ఊదడంతో పాటు కొన్ని ప్రసిద్ధ ఆలయాల్లో యంత్రీకరణ చేయబడిన వాద్య పరికరాలు – మృదంగం. డప్పు వంటివి మోగించి ఓ పవిత్ర ఘోష వెలయించడం జరుగుతుంది. ఈ శబ్దాలు భక్తులలో పవిత్ర భావాలు ఉదయింపజేస్తాయి. గుడికి వచ్చి కన్నులు మూసుకుని భగవంతుని ప్రార్థిస్తున్నప్పటికీ చంచలమైన మనస్సు ఎక్కడెక్కడో తిరుగాడుతూ ఉంటుంది కాబట్టి ఏకాగ్రత చిక్కని భక్తుల మనస్సులలోని తమస్సును తరిమికొట్టి ఆ పవిత్ర శబ్ద ఘోష వారికి ఏకాగ్రత పాదుకొల్పుతుంది. ఘంటారావం శబ్దకాలుష్యాన్ని దూరం చేసే ప్రక్రియలో భాగంగా తమ వంతు సహాయాన్ని అందిస్తుంది. హృదయంలో భగవానుని కాస్సేపయినా సుస్థిరంగా నిలుపుకునే ప్రయత్నం చేసే వారికి అది సుసాధ్యం కాగల అవకాశాన్ని ఈ పవిత్రనాదాలు కలిగిస్తాయి. శబ్దతరంగానికి ఓ ప్రత్యేకత ఉంది. శబ్దాన్ని శబ్ద 'బ్రహ్మ'గా అభిభాషించారు. అలా శబ్ద బ్రహ్మగా వ్యక్తీకరించబడిన భావమే 'ఓంకారం' లేక 'ప్రణవం'. సర్వ మంత్రాలకూ మూలమైన శబ్ద పరబ్రహ్మం ఓంకారం కాగా ఆ నాద పరబ్రహ్మమే ఆలయ గంటలలో ప్రతిధ్వనిస్తూ వుంటుంది. పవిత్ర సుస్వనాలు ఘంటానాద రూపంలో ప్రతిధ్వనిస్తూ భక్తులను నాదసమ్మోహితులను చేసి భగవత్తేజాన్ని భక్తుల హృదయసీమలలో పాదుకొల్పుతూ ఏకాగ్రతను సుస్థిరం చేస్తాయి.

అందుకే ఆలయాలు దర్శించి గంటలు మ్రోయిస్తూ అవి సృజించే పవిత్ర శబ్దంతో ఓంకారార్చన చేస్తూ ఆలయాల్లో ప్రతిష్ఠింపబడి ఉండే పరమాత్మ మూర్తులతో పాటు ఆయన ప్రతి రూపమైన నాదబ్రహ్మోపాసన కూడా చేసి తరిద్దాం!

సాక్షి, *11.12.2009*

# ఆలోచన పుట్టినిల్లు మనస్సు

**నోరు** మంచిదైతే ఊరు మంచిదవుతుంది. నోటిద్వారా వెలువడే మాటను నియంత్రించే శక్తి కేంద్రం మనస్సు. మనస్సు మనిషిని రాజునూ చేయగలదు. బికారిగానూ మార్చగలదు. ప్రాధాన్యతంతా ఆలోచనను ఆచరణలో పెట్టడంలోనే ఉంది. ఆలోచన మంచిదైనపుడు సత్కార్యాలు చేయగలుగుతాం. దుష్కర్మలకు ఆలంబన దురాలోచన. గీతలో భగవానుడు పత్రం, పుష్పం, ఫలం, తోయం, ఇలా పవిత్రమైన మనస్సుతో అర్పించే ఏ నివేదనయినప్పటికీ తనకు ప్రీతి పాత్రమని చెప్పాడు.

దానానికి ఉన్నట్లే సత్కార్యాచరణకు కూడా 'పాత్రత' అనే అంశం ప్రాధాన్యత వహిస్తుంది. ఏ విధంగా చిలుం పట్టిన ఇత్తడి పాత్రలో ఉడికించిన పదార్థం విషపూరిత మౌతుందో, పవిత్రం కాని మనస్సుతో చేసే ప్రార్థన కూడా భగవంతుని చేరదు. ఆయనకు ప్రీతిపాత్రం కాబోదు. ఆలోచించేది, చెప్పేది, చేసేది ఒక్కటయినపుడు త్రికరణశుద్ధి అంటాం. త్రికరణ శుద్ధిగా ఆచరించే తపము, పూజలే భగవంతుడు ఇష్టపడతాడు. త్రికరణ శౌచానికి మనసు ప్రధాన పాత్రధారి కనుక దానిని అదుపులో ఉంచుకొని సాధన ప్రారంభించడం అవసరం. చూసిందల్లా కావాలనుకోవడం మనస్సు నైజం. ఆ కోరిక సమంజస మైనదయితే ఫరవాలేదు. పవిత్రమైనది కానపుడు సీతామాతను కోరుకున్న రావణాసురునిలా పతనం కాక తప్పదు.

మాటలు కోటలు దాటుతాయంటారు. అంటే వాక్కు విస్తరణ వేగం అంత ప్రభావవంతమైనదన్న మాట. అలాంటి వాక్కు సుమనస్కత ద్వారా వెలువడిన దయినపుడు దానికి రాజపూజ్యత లభిస్తుంది. వాక్కుధిక్కారపూరితమయినపుడు అవమానానికి గురికాక తప్పదు. వాక్కుకు జన్మస్థానమైన మనస్సు అంతటి శక్తివంతమైనదిగా తెలుసుకోవడం అవసరం. అణగిమణగి వున్నవాడే అందరి లోకి ఘనుడని చెప్పినా, ఫల సమృద్ధమైన వృక్షం వంగి నిలిచి ఆతిధ్యమిచ్చినా అక్కడ వినయం ప్రస్ఫుటమవుతుందని గ్రహించాలి. వినయానికి ప్రేరణ మంచి మనస్సు! పవిత్రమైన ఆలోచన! మనస్సులో అంకురించే ఆలోచన ప్రమాదాన్ని, ప్రళయాన్నీ సృష్టించగలదు. భగవంతుని మంచి ఆలోచన యొక్క పర్యవసానమే ఈ సువిశాల ప్రేమాస్పదమైన సృష్టి. ఆయన విలయాలోచన, ప్రళయం! ఈ రహస్యం ఎరిగిన సాధకులు మనస్సును సృజనాత్మకంగా, పవిత్రంగా ఉంచుకొనగలిగిన నాడు సాధనలో పట్టుదొరుకుతుంది. మనస్సు దైవోన్ముఖమవుతుంది. దైవసంబంధమైన ఆలోచనయే మోక్షమార్గానికి మొదటి మెట్టు కాగలదు.

సాక్షి, *21.01.2010*

# వరదాయిని, విష్ణుమనోహరి శ్రీమహాలక్ష్మి

**లక్ష్మి** అంటే కేవలం 'డబ్బు' అనుకోవడం సరికాదు. అష్టలక్ష్ములుగా విలసిల్లే శ్రీ మహాలక్ష్మి అష్టవిధ సంపన్నతను భక్తులకు అనుగ్రహిస్తుంది. ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధైర్యలక్ష్ములుగా విలసిల్లే శ్రీ మహాలక్ష్మి దేవదానవులు అమృతం కోసం సముద్ర మధనం చేసినప్పుడు అందులో నుంచి పుట్టుకొచ్చిన అమ్మలగన్న అమ్మ; సకల సంపదల కల్పవల్లి! చంద్రుడు కూడా క్షీరసాగర మధనంలో ఉద్భవించాడు గనుక లక్ష్మీదేవి చంద్రసహోదరి అయ్యింది.

సంపన్నతకు గుర్తు 'ఏనుగు' గనుక గజలక్ష్మిగా అమ్మ భక్తులకు 'గజ' – ప్రమాణంలో ఐశ్వర్యం అనుగ్రహిస్తుందని భావిస్తారు. అమ్మవారిని విష్ణుమనోహరిగా వ్యవహరిస్తారు. విష్ణువు సర్వవ్యాపకుడు, బ్రహ్మాండమంతటా విస్తరించి ఉన్న దేవుడు గనుక ఆయన మన్నన పొందిన లక్ష్మీదేవి విశ్వవ్యాప్తంగా విష్ణు భక్తులకు అనుగ్రహ రాశులు కురిపిస్తుంది. శంకర భగవత్పాదులు సన్యాసాశ్రమ ధర్మంగా భిక్షాటన చేస్తున్నపుడు ఒక ఇంటి ముందు నిలిచి భిక్షయాచిస్తాడు. ఆ ఇంటి గృహిణి ఆయనకు భిక్ష సమర్పించే వస్తువేదీ ఇంట్లో లేకపోవడంతో దృష్టికి వచ్చిన ఓ ఉసిరికాయను ఆయన జోలెలో సమర్పిస్తుంది. దివ్యదృష్టితో విషయం గ్రహించిన శంకరాచార్యుల వారు కనక ధారా స్తోత్రంతో అమ్మవారిని స్తుతించి ఆ ఇంటివారిని అనుగ్రహించవలసినదిగా ప్రార్థించినప్పుడు అమ్మవారు ఆ ఇంట బంగారు ఊసిరికాయల వాన కురిపించిందట! రాజుకైనా, పేదకైనా లక్ష్మి అనుగ్రహం లేకపోతే ఒకపూట అన్న కబళమైనా దొరకదని వేరుగా చెప్పనక్కరలేదు. బెంగాలు రాష్ట్రంలో హేమంత, శిశిర ఋతువుల్లోని వెలుగులోనే పౌర్ణమి రాత్రులందు లక్ష్మీపూజ చేస్తే అమ్మ ప్రసన్నమై భక్తుల లోగిళ్ళలో సువర్ణ రాశులు కురిపిస్తుందని నమ్ముతారు.

అమ్మవారి వాహనం : లక్ష్మీదేవి వాహనం 'ఉలూకం'! అంటే గుడ్లగూబ. గుడ్లగూబ విజ్ఞత, మేధస్సులకు సంకేతం. ఇది రాత్రించరి! అశుభానికి, అవిద్యకు తపస్సుకు ప్రతిరూపమైన ఉలూకం గొప్ప సత్యమే మానవాళికి బోధచేస్తుంది.

సంపద వల్ల మనిషికి గర్వము, మదము, మాత్సర్యము తదితర దుర్గుణాలు అలవడే ప్రమాదముంది. చేకూరిన ధనాన్ని ఉదరపోషణతో పాటు సత్కార్యాలకు, దానధర్మాలకు, పవిత్రమైన జీవికకు మాత్రమే ఖర్చుచేయాలనీ, అలా చేయని పక్షంలో సంపద నిలవదనీ, దరిద్రం దాపురిస్తుందనీ బోధ పరచి సుపథ నిర్దేశనం చేయగల ప్రాణి ఉలూకమని సజ్జనులు భావిస్తారు.

*ఆంధ్రభూమి, 29.01.2010*

# రూపం ఏదైనా ధ్యానం ఒక్కటే

'నమే భక్తః ప్రణశ్యతి' నా భక్తుడు ఎన్నడూ చెడడు. దుర్గతిని పొందదు. ఈ గంభీర సత్యాన్ని శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చాడు. ఆ అష్టాక్షరీ మంత్రాన్ని ముముక్షువులు ఎల్లప్పుడు స్మృతిపథము నందుంచుకోవాలనీ, ఎప్పుడైనా సంశయము, అవిశ్వాసము, భయము కలిగినపుడు ఈ మంత్రాన్ని ఆశ్రయించి మేలు పొందవచ్చుననీ భగవద్వచనం! నమ్మి చెడినవారు లేరు. నమ్మకపోతే ఆ అపనమ్మకానికి నిష్కృతి లేదన్నది ఆర్యవచనం.

ఎవరయినా అవిశ్వాసులు భగవంతుని నిందించినపుడు సాధకుడు మనస్తాపం చెందవలసిన అవసరం లేదు. నాస్తికుల నిందలను విశ్వసింపవలసిన పనిలేదు. అందుకు భిన్నంగా భగవద్భక్తిని అభివృద్ధి పరచుకొని వారికి బుద్ధి చెప్పవలసిన అవసరం వుందన్నది ఆర్యవచనం. చిత్తశుద్ధి కలిగి పుణ్యకీర్తనుడైన భగవంతుని ఎల్లప్పుడు ఆశ్రయించాలి. వృక్షమూలంలో ఎరువు, నీరు సమృద్ధిగా పోసి పోషించినప్పుడు సమస్తమైన ఆకులు,కొమ్మలు పరిపుష్టి పొందినట్లుగా, పరమాత్మ దివ్యరూప వైభవాన్ని ఆశ్రయిస్తే ముక్కోటి దేవతలను, సమస్త తీర్థములను సేవించిన, సందర్శన చేసిన పుణ్యఫలం సాధకునికి దక్కుతుంది. కంటికి కనిపించనంత మాత్రాన గాలి లేదని చెప్పే సాహసం చేయగలిగినవారు ఎవరూ లేరు. ముట్టుకుంటే కాల్చే అగ్నిదేవుని శక్తి సామర్థ్యాలను ఎవరూ శంకించరు. కంటికి కనిపించే సూర్యచంద్రులు ప్రత్యక్షదేవతలు! మంచి కర్మకు మంచి ఫలితం, చెడు కర్మకు చెడు ఫలితం వుంటుంది. వెంటనే ఫలితం కనిపించే కర్మలు కొన్ని కాగా ఫలం ఆలస్యంగా లభించే కర్మలు మరికొన్ని కత్తి గాటు పెట్టినపుడు వెంటనే రక్తం చిందుతుంది. నేలలో నాటిన విత్తనం ఫలసాయం అందివ్వాలంటే కొన్ని నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు. భగవంతుడు సృజించిన ప్రాణులపట్ల కరుణ కలగివుండాలి. ఎందుకంటే ఆయన కరుణాసముద్రుడు. కరుణ ఆయన స్వరూపం. దయ ఆయన సొత్తు కరుణకు మనస్సులో అగ్రస్థానమిచ్చినపుడు భగవంతునికి మనం తప్పక ప్రీతిపాత్రులం కాగలం. భక్తి సాహిత్యాన్ని రోజూ కనీసం ఇరవై నిమిషాలైనా చదవాలని భగవాన్ సత్యసాయిబాబా ఉద్బోదిస్తారు. ఒక సంఘటన, మంచికానీ, చెడుకానీ, జరిగినపుడు మనిషి మనసులో ఆ సంఘటన తాలూకు జ్ఞాపకాలు 24 గంటలు రాజ్యమేలుతాయి. మంచి జ్ఞాపకాలైతే హాయి గొలుపుతాయి. జ్ఞాపకాలు బాధించేవయితే రోజంతా మనస్తాపం కలుగుతుంది. దైవసాహిత్యం కనీస సమయంపాటు ప్రతిరోజు చదివితే సాహిత్యంలో ప్రస్తావించిన మానవతా విలువలు రోజంతా మనిషి మనసుపై

ప్రభావం చూపి అతను మంచి పనులు చేసేలా ప్రోత్సహిస్తాయి. ఆనంద తరంగితమవుతుంది మనస్సు! రాముని పూజిస్తే కృష్ణునికి కోపం రాదు, కృష్ణుని పూజిస్తే మరో దేవుడు కోపించడు. భక్తి భావన ముఖ్యంగానీ, పూజిస్తున్న రూపం ఏదయినా ఒక్కటే అన్నది సారాంశం! భక్తి వుండవలసిందే కానీ అతి భక్తి కూడదని ఆధునిక మనో శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. భగవంతునికి కోపం వస్తుందేమోనని ద్విచక్రవాహనంపై వెడుతున్న వ్యక్తి ట్రాఫిక్‌ను గమనించకుండా గుళ్లో దేవుని విగ్రహంవైపు మనసు లగ్నం చేసి ప్రమాదం కొని తెచ్చుకున్న సందర్భంలో అది భగవత్ భయమేకాని భక్తి అనిపించుకోదన్నది సారాంశం. భక్తి ఉండవలసిందే గానీ, ఈ ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో పూర్ణభక్తికి ఆస్కారం తక్కువే వున్నప్పటికీ భక్తి భావాలను పోషించుకోవలసిన బాధ్యత, అవసరం మానవాళికి వున్న దృష్ట్యా తగిన సమయాన్ని నిర్దేశించుకొని సాధన చేయాలి. మనిషి ఆధునికుడన్నది వాస్తవమే అయినా ఇది సూపర్ కంప్యూటర్ యుగమైనప్పటికీ జననమరణ చక్రంలో జీవుడు తిరుగుతూనే వున్నాడనీ, మనిషికి సాధ్యాసాధ్యాలంటూ కొన్ని వున్నాయనీ, జనన మరణాలు భగవంతుని అధీనంలోనే వున్నాయనీ కర్మసిద్ధాంతాలు భగవానుని ప్రేరణలోనే వున్నాయనీ, కొన్ని వ్యాధులకు మనిషి మందులు కొనుగొనలేక ఇప్పటికీ నిస్సహాయుడుగానే వున్నాడనీ, ఆధునికత, నవనాగరికతకు భక్తి అడ్డుకాదనీ యువతరం గ్రహించాలి. భగవానుని సంపూర్ణమైన కరుణ కలిగిన జగన్నియంతగా గుర్తించి ఆయనంటే భయంలేని భక్తి పెంపొందించుకొని యువత చిన్న వయసునుంచి భక్తి భావాల్ని పుణికి పుచ్చుకొని సమస్త విజయాలు సాధించాలనీ సర్వశ్రేయస్సు పొందాలనీ మనసారా ఆకాంక్షిద్దాం !

*ఆంధ్రభూమి, 01.02.2010*

# మహిమాన్విత లింగోద్భవం

**మహా** శివరాత్రి తెలుగువారి పండుగే కాదు. యావత్ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల, ప్రాంతాలలోని హిందువులు జరుపుకొనే మహత్తరమైన పర్వదినం. శివరాత్రి పండుగ మహాశివుని హాలాహల భక్షణానికి సంబంధించిన ఇతివృత్తం, నేపథ్యంగా గల వేడుకగా చెప్పుకున్నప్పటికీ, ఈ పర్వదినాన్ని శివ, శక్తులు ఏకత పొందే రోజుగా పురాణాలు పేర్కొంటున్నాయి. శివుని ధర్మపత్ని సతీదేవి. మహాశివుని జగత్ ప్రభువుగా గుర్తించలేని ఆయన మామ దక్షుడు ఓ యజ్ఞాన్ని సంకల్పించి కూడా అల్లుడయిన భోళాశంకరుని ఆహ్వానించలేదు. సతీదేవి, తండ్రి నిర్వహిస్తున్న ఆ యజ్ఞాన్ని దర్శించాలని ఉవ్విళ్ళూరుతుంది. పిలవని పేరంటంలా, తమను ఆహ్వానించని దక్ష ప్రజాపతి నిర్వహిస్తున్న యాగానికి తన సతీమణి సతీదేవి వెళ్ళడం శివునికి నచ్చలేదు. ఆ మాటే ఆమెతో అంటాడు. తమను ఆహ్వానించక పోయినప్పటికీ తన జనకుడు నిర్వహిస్తున్న యజ్ఞం కాబట్టి భర్త అనుమతి లేకున్నా, ఆమె వేంచేస్తుంది. పిలవకున్నా వచ్చిన కుమార్తెను దక్షుడు నిర్లక్ష్యం చేస్తాడు. శివదూషణ చేస్తాడు. భర్తకు లభించిన తిరస్కారానికి బాధితురాలై యోగాగ్ని రగిలించుకొని అగ్నికి ఆహుతవుతుందామె! భార్యకు జరిగిన పరాభవాన్ని, ఆమె మరణాన్ని సహించలేని పరమేశ్వరుడు వీరభద్రుని సృజిస్తాడు. యజ్ఞాన్ని వీరభద్రుడు, ఆయన అనుచరగణం ధ్వంసం చేస్తారు. దక్షుడు తల నరికివేయబడ్డాడు. సతీదేవి మరుజన్మలో పర్వతరాజు కుమార్తె పార్వతిగా జన్మిస్తుంది. ఆనక ఏళ్ళ నిరీక్షణ, తపస్సు చేత ఆమె పరమేష్ఠిని మరల పొందుతుంది. శివపార్వతుల కళ్యాణదినాన్ని మహాశివరాత్రిగా, శివ, శక్తుల ఐక్యతాదినంగా కొన్ని ప్రాంతాల్లో జరుపుకుంటారు. మరో కథనంలో శివరాత్రి ప్రాశస్త్యాన్ని ఇలా వివరిస్తారు. దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాల సముద్రాన్ని మథింపబూనుతారు. మంధర పర్వతాన్ని కవ్వంగాను, వాసుకి అనే సర్పరాజును కవ్వపు త్రాడుగాను చేసుకొని శ్రీహరి కూర్మరూపుడై పర్వతాన్ని తన వీపుపై మోస్తూ వుండగా దేవదానవులు క్షీరసాగరాన్ని మథిస్తారు. ఫలితంగా మొదట భయంకరమైన కాలకూట విషం ఉద్భవిస్తుంది. ముల్లోకాలకూ దాని వలన ముప్పు పొంచి వున్న కారణంగా, త్రిమూర్తులలోని బ్రహ్మ, విష్ణువులు దానిని స్వీకరింప అశక్తులయినప్పుడు, పరమ శివుడు లోకహితం కోరి కంఠంలో నిల్పుకొని నీలకంఠుడుగా మారుతాడు.

శివుడు గరళకంఠుడై హాలాహలాన్ని స్వీకరించిన నాటి రాత్రిని మహాశివరాత్రిగా

హైందవులు జరుపుకుంటారు. మాఘ బహుళ చతుర్దశినాడీ పండుగ భారతదేశమంతటా జరుపుకొనబడుతోంది. భక్తులు ఈ రోజు ఎలాంటి ఆహారమూ స్వీకరింపకుండా ఉపవాసదీక్షా పరులై రాత్రి జాగరణ చేయడం పరిపాటి. శివాలయాల్లో విశేషంగా లింగార్చనలు జరుగుతాయి. 'ఓం నమశ్శివాయ' అనే షడక్షరి మంత్రంతో భక్తుల కంఠసీమలు ప్రతిరవిస్తాయి. పరమ శివునికి ఇష్టమయిన బిల్వ, మారేడు దళాలతో పూజలు చేసి అభిషేకాలు నిర్వహిస్తారు. దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలు శివనామంతో పునీతమవుతాయి. మాఘమాసంలో బహుళ చతుర్దశినాడు వచ్చే మాస శివరాత్రితో పాటు, మహాశివరాత్రి వేడుకలు భక్తి ప్రపత్తులతో జరుగుతాయి.

శివుడు శక్త్యాత్మకుడు. అర్ధనారీశ్వరుడు. మహాశివరాత్రి పగటి భాగాన్ని శివ స్వరూపంగాను, రాత్రి భాగాన్ని శక్తి స్వరూపంగాను పెద్దలు వ్యవహరిస్తారు. జ్యోతిర్లింగ క్షేత్రాలు, అష్టాదశ శక్తిపీఠాల్లోను ఒకటయిన శ్రీశైల దివ్యక్షేత్రంలో ఈ అంశానికి సంబంధించి ఎంతో ప్రాధాన్యత వుంది. లక్షలాది భక్తులు దర్శించే ఈ క్షేత్రంలో వేడుకలు ఘనంగా జరుగుతాయి. భక్తులు నిరాహారులై ఉపవాస దీక్ష పాటిస్తూ జాగరణ చేస్తారు.

కొందరు గృహస్థులు యిండ్లలో ఏకాదశ రుద్రాభిషేకాలు చేసి స్వామివారి కృపకు పాత్రులవుతారు. శివుడు అర్ధనారీశ్వరుడు కనుక శివార్చనతో అమ్మవారు కూడా ప్రసన్న అవుతుందని, సువాసినులకు మంగళాశీస్సులు అందిస్తుందని మహిళలు విశ్వసిస్తారు. పెండ్లికాని యువతులు ఈ పండుగనాడు దీక్ష వహిస్తే మంచి భర్త లభిస్తాడని విశ్వసిస్తారు.

*ఆంధ్రభూమి, 08.02.2010*

# శివస్మరణం - భవహరణం

**మాఘ** మాసంలో బహుళ చతుర్దశినాడు విశ్వవ్యాప్తంగా హైందవులు జరుపుకొనే మహోన్నతమైన పండుగ మహాశివరాత్రి. అన్ని పండుగలనాడు మృష్టాన్నాలు భుజించే హిందువులు. ఈ పండుగనాడు ఉపవాసదీక్ష చేస్తూ పగలంతా నిరాహారులై, కొందరైతే మంచినీళ్ళు కూడా ముట్టకుండా గడిపి రాత్రంతా శివనామ స్మరణతో జాగరణ చేస్తారు.

ఒకసారి పార్వతీదేవి పరమేశ్వరుని "స్వామీ! మీకు అన్నింటికంటే ప్రీతిపాత్రమైన పర్వదినం ఏది?" అని అడిగినప్పుడు పరమశివుడు "దేవీ! నాకు మహాశివరాత్రి అంటే అత్యంత ఇష్టం" అని తెలిపాడట.

దేవతలు, రాక్షసులు అమృతం కోసం క్షీరసాగర మథనం చేస్తున్న సందర్భంలో అందులోనుంచి ఎన్నో మహత్తరమైన వస్తువులు ఉద్భవించాయి. వాటన్నింటికంటే ముందుగా కాలకూట విషం పుట్టింది. ఆ విషాగ్ని జ్వాలలకు ముల్లోకాలు తల్లడిల్లిపోయాయి. దాంతో దేవతలు, దానవులు ఉరుకులు, పరుగులతో బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళారు. ఆ విషాన్ని అరికట్టడం తనవల్ల కాదన్నాడు విధాత. అనంతరం మహావిష్ణువును ప్రార్థించగా ఆయనా సాధ్యం కాదంటాడు.

దాంతో వారంతా ఆందోళనగా లయకారుడైన పరమశివుని సన్నిధికి చేరుకుని ఈ సంకటం నుంచి కాపాడమని వేడుకుంటారు. వారి బాధను చూడలేక పరమ పావని, కరుణాస్వభావిని సర్వమంగళ అయిన పార్వతీదేవి తన పతిదేవుణ్ని ఆ గరళాన్ని సేవించి లోకాలను కాపాడమని అర్థిస్తుంది. వెంటనే పరమశివుడు అమృతాన్ని ఆస్వాదించినంత తేలికగా ఆ గరళాన్ని లోనికి స్వీకరిస్తాడు. అయితే తన బొజ్జలోని సమస్త లోకాలకు ఏ విధమైన హాని కలగకుండా గరళాన్ని లోనికి పోనీకుండా కంఠసీమలోనే ఆపేస్తాడు. ఆ రోజు నుంచి పరమేశ్వరుడు నీలకంఠునిగా ప్రసిద్ధుడవుతాడు. తమ స్వామి, గరళసేవనం చేసినందుకు ప్రతిగా, పరమేశ్వరుణ్ణి శాంతింపచేసేందుకు, ఆయన అనుగ్రహాన్ని పొందేందుకు ముల్లోకాల్లోని ఆయన భక్తులంతా ఆ రోజు నిరాహారంగా ఉండి. ఆ రాత్రి పూర్తిగా జాగరణ చేస్తారు. ఆనాటి ఆ ఆచారమే ఇప్పటికీ కొనసాగుతూ శివరాత్రి పర్వదినం నాడు ప్రతివారూ తప్పనిసరిగా ఉపవాసం ఉండి శివనామ స్మరణతో రాత్రి జాగరణ చేస్తారు.

మహాశివరాత్రి పర్వదినం రోజు శివభక్తులు బ్రహ్మీ ముహూర్తంలో లేచి,

కాలకృత్యాలు తీర్చుకొని, అభ్యంగన స్నానాదులాచరించి మంచి నీరైనా ముట్టకుండా ఉపవాసముండి శివనామస్మరణతో రాత్రంతా జాగరణ చేస్తారు. శివరాత్రి మరునాడు అమావాస్యపూట కూడా ఉదయాన్నే దైనందికాలు పూర్తిచేసి స్వామికి అభిషేకాదులను, అర్చనలను పూర్తిచేసి అన్న నివేదన చేసి, ఆ ప్రసాదాన్ని బ్రహ్మణులతోనూ, బంధుమిత్రులతోనూ భుజించి ఉపవాసదీక్షను విరమిస్తారు. ఉపవాసం ఉండలేని వారు పండ్లు, కాయలు మాత్రం భుజించి స్వామిపట్ల భక్తి ప్రపత్తులు చాటుకుంటారు.

ముఖ్యంగా ఈనాటి పూజలో శివుణ్ని ఆయనకిష్టమైన బిల్వ పత్రాలు, మారేడు దళాలతో అర్చిస్తారు. పాలు – తేనె – నారికేళ సలిలంతో అభిషేకిస్తారు.

రాష్ట్రంలోనే కాక, దేశంలోనే సమస్త శైవక్షేత్రాలు 'ఓం నమః శ్శివాయ' దివ్య పంచాక్షరీ మంత్రంతో ప్రతిధ్వనిస్తాయి. శివనామం చింతనాశనం కాబట్టి నోరారా శివుని కీర్తిస్తారు. మహాశివరాత్రి నాడు శివుడు కైలాస పర్వతంపై శివతాండవం చేశాడనీ, ఈ పర్వదినాన లయకారకుడైన స్వామి చెడును నిర్మూలిస్తాడనీ, సాధు జనులను కాపాడుతాడనీ భక్తుల నమ్మకం. దాదాపు అన్ని శైవక్షేత్రాల్లోనూ పార్వతీపరమేశ్వరుల కళ్యాణం అతి వైభవంగా జరుగుతుంది.

## లింగోద్భవవేళ అర్చన

మహా మహిమాన్వితుడయిన పరమేశ్వరుడు లింగరూపంలో అవతరించిన సమయంలో చేసే అభిషేకం, అర్చన ఎంతో ఫలితాన్నిస్తాయి. పెద్ద ఎత్తులో పూజలూ, వ్రతాలూ చేయలేని వారు కేవలం ఆయన నామాన్ని భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటూ ఉంటే చాలు. వారందరినీ తరింపచేసే పరమ దయాళువు శంకరుడు. కాబట్టి ఆయన్ను భక్తితో స్మరించి తరిద్దాం.

*ఆంధ్రప్రభ, 12.02.2010*

# దేహం శివ శక్త్యాత్మకం

మానవ దేహంలో షట్ చక్రాలున్నాయని యోగశాస్త్రం వివరిస్తోంది. అజ్ఞా, విశుద్ధ, అనాహత, మణిపూరక, స్వాధిష్ఠాన, మూలాధార అనునవి ఆ చక్రాలు. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అను కర్మేంద్రియాలు కంటికి కనబడుతూ వుండగా, వీటి క్రియాస్వరూపాలుగా 'రూప' విశేషం మినహా చర్మచక్షువులకు కనబడని జ్ఞానేంద్రియాలయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు శరీర వ్యాపకాలను నిర్వహిస్తూ వున్నాయి. ఇవి వైద్య శాస్త్ర పరిధికి అందుతూ వుండగా షట్చక్రాలు చర్మ చక్షువులకు గోచరించక వైద్య పరిధికి ఆవల వుంటూ దేహ వ్యవస్థను నిర్వహిస్తున్నాయి.

ఆజ్ఞా చక్రం రెండు కనుబొమల నడుమ వుండి వినాళగ్రంథులను పరిపోషిస్తూ వుండగా, గొంతు మధ్యభాగంలో స్వరపేటిక దగ్గర ఉండే విశుద్ధ చక్రం పరిసర అవయవ విధులను నిర్వహిస్తూ వుంటుంది. 'అనాహత'గా పిలువబడునది 'హృదయ' చక్రం కాగా నాభిస్థానంలో వుండే 'మణిపూరక' చక్రం చిన్న, పెద్ద ప్రేవుల వ్యవస్థను నియంత్రిస్తూ వుంటుంది. 'స్వాధిష్ఠానం' జననేంద్రియ, మూత్ర వ్యవస్థను నియంత్రణ చేయగా 'మూలాధారం' సార్థక నామధేయంతో శరీరమంతటికీ మూల వ్యవస్థగా విధులు నిర్వహిస్తుంది. అయితే నిరుపాధికంగా వుంటూ, వైద్యులు శస్త్ర పరిచ్ఛేదన చేసినప్పటికీ కంటికి కనబడని ఈ చక్రాలు మానవ శరీరంలో గుప్తంగా కార్యనిర్వహణకు కీలక మవుతున్నాయి.

ప్రకృతి పురుష ఐక్యత వల్ల దేహం శివశక్త్యాత్మకం కాగా, దేహంలోని పంచభూతాలకు ప్రతీకలుగా శివాంశ లింగరూపంలో ఆచ్ఛాదింపబడింది.శరీరం లోని మూలాధార తత్వానికి ప్రతీకగా 'పృథ్వీలింగం', మూత్ర వీర్య వ్యవస్థను నియంత్రించే స్వాధిష్టాన చక్రంలో జలతత్వమున్న కారణంగా 'జలలింగం' జఠరాగ్నిని ప్రేరేపించి, నియంత్రించే మణిపూరక చక్రానికి ప్రతీకగా 'జ్వాలాలింగం', స్వరపేటికను ఆధారం చేసుకొని శ్వాసనాళ వ్యవస్థను నియంత్రించే విశుద్ధతకు ప్రతీకగా 'వాయులింగం' అర్చించబడు తున్నాయి. ఈ వాయులింగం శ్రీకాళహస్తిలో వుంది. గాలిచొరని గర్భగుడిలో విచిత్రంగా జ్యోతులు రెపరెపలాడటం భక్తులు గమనించగలుగుతారు. భూతాకాశ ప్రతీకమయిన చక్ర విశేషంగా ఆకాశలింగం పూజలందుకోవడం విశేషం! చిదంబర క్షేత్రంలోని లింగాన్ని ఆకాశ లింగంగా చెబుతారు. సాధారణ సమయాల్లో తెరమాటున గర్భాలయంలో నిరాకార స్వరూపంలో లింగము ఉందు కారణంగా అది ఆకాశలింగంగా చెప్పబడుతుంది. దీనినే చిదంబర రహస్యం అంటారు. ఈ లింగదర్శనం భాగ్యప్రదంగా చెప్పబడుతోంది.

*ఆంధ్రభూమి, 15.02.2010*

# దేవుడు - మనిషి

**భాష** చేత వెల్లడి చేయవీలుకాని భగవంతుని గురించిన జ్ఞానం ప్రాణాపాయ సమయం దాకా మనిషికి అగోచరమే. తాబేలు వంటి ప్రాణి మూడు వందల సంవత్సరాలు జీవిస్తే మేథ పరిణతి చెందిన మానవుడు మూడు పదులు దాటగానే రోగాల బారిన పడుతున్నాడు. వయః ప్రమాణం పెంచిపోషించుకొనేందుకు ఋషులు యోగమార్గంలో ఎన్నో దిశలు నిర్దేశనం చేశారు.

బ్రహ్మదేవుడు ప్రతీ జీవికి యిన్ని సంవత్సరాల ఆయుః ప్రమాణం అనికాక ఇన్ని వేల లక్షల శ్వాసలు అని నిర్దేశిస్తాడని దార్శనికులు సెలవిచ్చారు. శ్వాసలు ఆయుఃప్రమాణాన్ని నిర్ధారిస్తున్నపుడు ఆందోళనారహిత జీవన సరళి ఆరోగ్య భాగ్యాన్ని అందిస్తూ మనిషి జీవన పరిమాణానికి కారణభూతమవుతోంది. క్రోధం, ఆవేశం లాంటి బలహీనతలున్నపుడు ఆయా ప్రభావిత సమయాల్లో శ్వాస వేగంగా తీసుకొనడం వల్ల జీవ పరిణామ ప్రక్రియల ప్రభావం వల్ల ఆరోగ్యం క్షీణించి ఆయుర్దాయం సన్నగిల్లుతుంది.

అశ్వద్ధ వృక్షపు ఆకులు వాయుగమనం స్తబ్ధంగా వున్న సమయాల్లో కూడా అల్లల్లాడి నట్లు శక్తికి మారు రూపం, మరియు ప్రమాణమయిన అశ్వం ఏ శరీర భాగం కూడా కదలకుండా ఒక్క క్షణమైనా వుండలేనట్లు అధిక చంచల మనోవృత్తులు కలిగిన మనుష్యులు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు పెచ్చరిల్లడం వల్ల ఆయుర్ధాయాన్ని నష్టపోవడం జరుగుతుంటారు. పాపులుగా పిలవబడువారు జీవితాంతం సంపద ప్రోగుచేసుకుంటూ సుఖాలుగా పిలువబడు శరీర వ్యాపకాలతో జీవించడం చూచినవారికి భగవంతుడుంటే ఇలా జరుగుతుందా? అనే సంధిగ్ధత ఏర్పడుతుంది. గ్రహించవలసినదేమంటే వర్తమానంలోని కాలప్రమాణము, దైవకాల ప్రమాణము, ఒకటికాదనీ, ఏ జన్మలో చేసిన పాపాలకు ఆ జన్మలోనే శిక్ష అనుభవించాలనే నియమం సరికాకపోవచ్చుననీ, పాపాలకు వేరొక జన్మలోనయినా తప్పక శిక్ష ద్వారా పరిహారం జరగవచ్చుననీ నమ్మిన ఆస్తికవాదులు అయోమయానికి గురికాకుండా దైవచింతన చేయగలుగుతున్నారు.

విత్తు ముందా? చెట్టుముందా? అనే వాదం పురాతనమయిన దయినప్పటికీ విత్తునకు గానీ, చెట్టునకు గానీ ఆదిమూలమైన మహాపురుషుడు భగవంతుడనీ, విత్తునుండి చెట్టును గానీ, చెట్టు నుండి విత్తును గానీ ప్రాదుర్భవింపచేయగల ఘటనాఘటన సమర్థుడు. కార్యకారణ సిద్ధాంతాలకతీతుడైన వాడు భగవంతుడే అని తెలుసుకున్ననాడు మనిషికి,

దేవునికి గల మధ్య దూరం కొంచెమయ్యే ఆస్కారం వుంటుంది. నిర్మలమైన మనస్సుతో కూడిన జీవుడు సాక్షాత్తు దేవుడు గాను, మనిషిలో ఉన్న దేవుడు ఆయా ఉపాధులలోని లోపాలు, పాపాలు, మాలిన్యాల వల్ల కేవలం జీవుడుగానే మిగిలిపోతున్నాడని అంటారు.

ఎవరిపట్ల ఎలా దయ చూపాలో, లేక ఎవరిని ఎలా నిగ్రహించాలో సర్వం విదితమయిన సర్వస్వతంత్రుడు, సర్వలక్షణ సమన్వితుడు, సంపన్నుడు భగవంతుడు. తానే సర్వసృష్టిగా మారి, సూర్యుడు సమస్త జనులలో ఒక్కొక్కరికి ఒక్కొక్కడై తోచుటనట్లుగా, భగవంతుడు సకల జీవరాశులలో ఆత్మ రూపంలో ప్రకాశిస్తున్నాడు. పరిపూర్ణ మేథస్సును భగవదనుగ్రహంగా భావించాలి. మనస్సు రూపంలో ఆ మేథస్సును పొందిన మనిషికి మాత్రమే ఆ దేవదేవుడు అతి చేరువగా వుంటాడు. ప్రతీ ప్రాణికన్నా ఎక్కువగా తనకున్న ఆ అవకాశాన్ని ఉపయోగించుకొనే శక్తి గలవాడు మానవుడు. అటువంటి మానవుడు భగవరాధనతో ప్రశాంత జీవనాన్ని కైవసం చేసుకోవాలి. ఆనందాన్వేషణతో ఆరోగ్య భాగ్యాన్ని ప్రాప్తించుకొనాలి. అంతే కాక, ఆరోగ్యప్రదమైన, నిర్మలమైన మనస్సుతో దివ్యత్వాన్ని పొంది ఇహపర లాభాల్ని మనిషి పొందగలడని ఆశిద్దాం!

*ఆంధ్రభూమి, 17.02.2010*

# దేవుడిచ్చిన వరం

**మనిషి** కి కష్టమొచ్చినపుడు, తను అనుకున్నది అనుకున్నట్లుగా జరగనప్పుడు విధిని తూలనాడుతాడు. ఏమిటా విధి? తనకు కనిపించకుండా తనను శాసిస్తున్న దైవశాసనం విధి. ఎంతటివారైనా విధికి తలవంచాల్సిందే! హరిశ్చంద్రుడంతటి మహారాజు విధికి దాసుడై రాజ్యాన్ని, భార్యాపుత్రులను ఎడబాసి, కాటికాపరిగా జీవితాన్ని గడిపిన పురాణం మనకు తెలుసు. పాండవాగ్రజుడు, ఆడినమాట తప్పటం తెలియనివాడైన ధర్మజుడు విధికి బానిసై జూదానికి దిగి భార్యద్రౌపదిని తమ్ములను, సమస్త రాజ్యభోగాలను కౌరవులకు ఓడి విధివంచితుడవటం మనకు తెలుసు. కర్ణుని విషయానికి వస్తే సాక్షాత్తు కుంతీ కుమారుడై వుండి కూడా సూతుని యింట పెరిగి, మానావమానాలకు గుర్రై దానగుణమనే ప్రేరణతో సహజ కవచ కుండలాలను సైతం ఒలిచి, దానం చేసి విధి ప్రేరణలో భాగంగా కురుక్షేత్ర సంగ్రామంలో అసువులు బాయటం మనకు తెలుసు. నల దమయంతుల చరిత్ర గనక చూస్తే, నలుడు చక్రవర్తి అయి వుండి కూడా విధిప్రేరణకు లోబడి, రాజ్యభోగాలకు దూరమై సతిని వీడవలసి వచ్చి అష్టకష్టాలు పడిన ఉదంతం మనకు తెలుసు.

ఈ నేపథ్యంలో 'విధి' అనేది కేవలం మనిషిని బాధించే ఓ దైవ శాసనమా? ఎందుకు మనిషి విధికి దాసుడౌతాడు? ఇత్యాదిగా ఆధునిక మానవుడు కూడా ఆలోచించడం జరుగుతోంది. అప్పటికి, ఇప్పటికి, విధి మనిషిని శాసిస్తూనే వుంది. శాసిస్తూనే వుంటుంది కూడా! అయితే కష్టం సంప్రాప్తించినపుడు ఏదో అనర్థం జరిగిందనే భావనకు తావివ్వకుండా, అంతా భగవంతుని నిర్దేశం ప్రకారమే జరుగుతోంది. భగవంతుడు మనిషికే కాదు సమస్త జీవరాశికి తండ్రి. తండ్రి తన బిడ్డలను ఎన్నడూ బాధించడు అని గ్రహించవలసి వుంది.

ఆయన ఏం చేసినా బిడ్డల బాగుకోసమే చేస్తాడు అనే నమ్మకం మనకు ఎంతో ధైర్యాన్నీ ఆలంబననూ యిస్తుంది. ఈ జీవితం దేవుడిచ్చినదే! మనం కోరి పొందినది కాదు! భార్య / భర్త, సంతానం, సంపద, విద్య సమస్తమూ ఆయన చలువే! అసలీ శరీరము, జీవితము అంతా భగవానుని భిక్షే! ఆయన పరప్రసాదమే! అనే సిద్ధాంతాన్ని మనసారా నమ్మి ఆశావహ దృక్పథంతో ముందుకు సాగవలసిన అవసరం ఎంతైనా వుంది.

మానవులం కాబట్టే కష్టాలు వస్తాయనే దృక్పథంతో జీవించడం చాలా అవసరం. ధర్మరాజు, నలచక్రవర్తి వంటివారు కూడా కష్టాలనధిగమించి భౌతికమయిన సర్వసుఖాలు పొందటం జరిగింది. భవిష్యత్తు పట్ల ఆశ పెంచుకొని జీవితాన్ని భగవత్ప్రసాదంగా భావించిన నాడు నిరాశకు చోటుండదు. శాంతి ఆనందాలు తప్పక వెల్లివిరుస్తాయి.

*ఆంధ్రభూమి, 10.03.2010*

# విచక్షణా జ్ఞానం

ప్రకృతి లో అన్ని ప్రాణులకన్నా మనిషి ఉన్నత స్థానంలో వున్నాడు. ఏ ప్రాణికీ లేని మనస్సు, వాక్కు, బాషాజ్ఞానం మనిషికి వున్నాయి. సంఘజీవి అయిన మనిషి తనకున్న విచక్షణాజ్ఞానంతో కొన్ని కట్టుబాట్లను సంప్రదాయాలను ఏర్పరచుకున్నాడు. అలా ఏర్పరచుకున్న నైతిక ప్రమాణాలను పాటించకుండా దిగజారే తత్వం కూడా మనిషికే వుంది. జంతువులు, పక్షులకు ప్రత్యేకమైన నిర్మిత ప్రమాణాలేవీ లేవు. ప్రకృతి ఒరవడే వాటికి ప్రత్యక్ష ప్రమాణం! ప్రకృతి ఆదేశాల మేరకే వాటి ప్రవర్తన నియంత్రితమవుతుంది. ఆహార, నిద్రా, మైథునాలు ప్రతి జీవికి సహజం. ప్రకృతి నియమాన్ని అనుసరించి వాటి పాటింపులో ధర్మబద్ధత పశుపక్ష్యాదులకు వుంది. కానీ వేద ప్రమాణితాలయిన ధర్మసూత్రాలు వల్లెవేసి లోకులకు చెప్పేందుకే కానీ తాను పాటించేందుకు కాదన్నట్లు వ్యవహరించే మనిషి ప్రవర్తన గర్హనీయం.

పశువులు, పక్షులకు, గురువులు వుండరు. తల్లిప్రాణి కొంతకాలం పాటు బిడ్డను కనిపెట్టుకొని వుండి, రక్షణ బాధ్యత చేపడుతుంది. ప్రవర్తనా నియంత్రణ చేస్తుంది. అవి ఎదిగి వాటికి ఉచితమైన ఊహాశక్తి అందాక స్వయంగా ఆహారం సముపార్జించుకొనడం, జీవిక సాగించడం చేస్తాయి. కానీ ఎంతో ఉన్నతుడనని విఱ్ఱవీగే మనిషి మాత్రం ఈ విషయంలో ఘోరంగా విఫలమవుతున్నాడు. పశుపక్ష్యాదులు తమ జీవయాత్రలో భాగంగా ఆహారాన్ని సముపార్జించుకొంటున్నాయి. తాము కట్టుకున్న గూళ్ళలో కాపురముంటున్నాయి. వ్యక్తిగా చూచినపుడు మనిషి సర్వోన్నతుడుగా మారి ఎందరికో గురుస్థానం వహించగలుగు తున్నాడు. తత్వబోధ చేస్తున్నాడు. జ్ఞానభిక్ష పెట్టి అజ్ఞాన తిమిరాన్ని వదిలిస్తున్నాడు. అంతవరకు బాగానే వుంది. కానీ కొండొకచో గురువులుగా వుంటూ బోధలందిస్తున్న వారు కూడా అర్ధకామాలకు లొంగిపోయి భ్రష్టులవుతూ సర్వోన్నతస్థాయిని నిలబెట్టుకోలేక పోవడం శోచనీయం! అంతవరకు వారిని గురువులుగా విశ్వసించిన భక్త సమూహం నిర్విణ్ణులై మానసిక వ్యధకు లోనవుతున్నారు. అపభ్రంశత్వానికి చేరువవుతున్నారు.

త్రికరణశుద్ధిగా మంచిని ఆచరించి చూపగల మహనీయులయిన ఆచార్యులు కొరవడటం కారణాన జ్ఞానాభిలాషులకు నిర్వేదమే మిగులుతోంది. సద్గ్రంధాలు వున్నాయి. ఇంకా కలి(కలహ) యుగ ప్రభావానికి వశులు కాని కొందరు మహనీయులైన ఆచార్యులు కూడా నేటికీ వున్నారు. కనుక మోక్షాభిలాషులు ఆ సద్గ్రంధాలనుంచి, సమర్థులయిన జ్ఞానుల

నుంచి జ్ఞానభిక్ష స్వీకరించి జీవికను భగవద్దిశలో నడిపించే ప్రయత్నం చేయవలసి వుంది. కోట్లాది మోక్షాభిలాషులలో ఒకరో, ఇద్దరో మాత్రమే సంకల్పశుద్ధి కలిగినవారు వున్నట్లు శ్రీకృష్ణపరమాత్మ సెలవిచ్చిన విధంగా, వందలాదిగా గురువులుగా చెలామణి అవుతున్న వారిలో కూడా పరిమితంగానైనా శుద్ధ గురువులు వుంటారు గనుక సత్ గుర్వన్వేషణలో కృతకృత్యత సాధించి జ్ఞానపిపాశులు ఆధ్యాత్మిక లబ్ధిపొందవలసిన ప్రయత్నం చేయడం ఎంతయినా అవసరం.

*ఆంధ్రభూమి, 23.03.2010*

# బద్ధకం వీడితేనే భగవదనుగ్రహం

**మనిషికి** ఉండే సహజ దుర్గుణాలలో సోమరితనం ఒకటి. దీనినే మనం బద్ధకం అంటాం. ఆధ్యాత్మిక జీవనానికి బద్ధకం గొడ్డలిపెట్టు వంటిది. ఆలస్యం అమృతం విషం అన్న నేపథ్యంగా సోమరితనం వల్ల ఆధ్యాత్మిక జీవనంలో చేయవలసిన భక్తి ప్రక్రియ వాయిదా వేయడం వల్ల బుద్ధి వికాసం కుంటుపడుతుంది. నియమబద్ధ ప్రకృతిలో అన్ని మార్పులు కచ్చితమైన సమయపాలనతో జరుగుతాయి. ప్రకృతిని అనుసరించడం ఓ సుగుణం. ఈ నేపథ్యంలో సోమరితనం ఆధ్యాత్మిక పురోగమనానికి హాని కలిగిస్తుంది. అవిద్యను, అజ్ఞానాన్ని పోగొట్టుకోవడానికి సద్గ్రంథ పఠనం మంచి ఫలితాలనిస్తుంది. బద్ధకం వల్ల మంచి పుస్తకాలను చదివే అవకాశం పూజ్యమవుతుంది.

రాఘవయ్య ఓ చిన్న రైతు. మహా బద్ధకస్తుడు. చిన్న కమతగాడు. రెండు మూడెకరాల పొలం కౌలుకు చేస్తుంటాడు. ఆషాఢమాసారంభంలో తొలకరి ప్రారంభమయ్యాక రైతులు నాగళ్ళు సరిచేసి దుక్కులు దున్ని ఏరువాక సాగుతారు.

రాఘవయ్యకు పగటి నిద్ర, పేకాట అనే రెండు దురలవాట్లు ఉన్నాయి. రైతులు తొలకరి సమయంలో దుక్కులు దున్నుకొని సకాలంలో విత్తనం వేయగలుగుతారు. సహజ బద్ధకస్తుడైన రాఘవయ్య పేకాట జోరులో, పగటి కునుకు అలవాటుతో, సకాలంలో ఏరువాక సాగక నిర్లక్ష్యం చేస్తాడు. తోటి రైతులు విత్తనాలు విత్తి నారుపోస్తారు. నేల పదునైన సమయంలో రాఘవయ్య చూపిన నిర్లక్ష్యానికి అతడు సకాలంలో నారుమళ్ళు వేయక పోవడం వల్ల సహజంగానే వ్యవసాయంలో ప్రతి ప్రక్రియ మిగతా రైతుల కన్నా ఆలస్యమవుతుంది. ఫలసాయం అందుకునే రోజున అత్యంత తక్కువ దిగుబడి పొందేది రాఘవయ్యేనని వేరే చెప్పనక్కరలేదు. తోటివారి గాదెలు, పాతర్లు ధాన్యంతో నిండగా రాఘవయ్యకు చాలా తక్కువ దిగుబడి రావడంతో అతని కళ్ళు తెరుచుకున్నాయి. జూదం ప్రమాదకరం, పగటి నిద్ర పనికి చేటు అన్న సత్యాన్ని ఆలస్యంగానైనా గుర్తించిన రాఘవయ్య తనకున్న రెండు దుర్గుణాలకు తక్షణం స్వస్తి పలుకుతూ జీవితంలో అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు.

ఆధ్యాత్మిక జీవనంలో కూడా బద్ధకం పనికి రాదు. ఎప్పుడో వృత్తి విరమణ చేశాక భక్తి కార్యక్రమాలను ప్రారంభించవచ్చులే అనుకునేవారికి నిరాశే మిగులుతుంది. ఆయుష్షు ఎన్నాళ్ళో, ఆరోగ్యం ఎంతకాలమో ఎవరికీ తెలియదు. కనుక బద్ధకం వీడి యుక్తవయస్సు నుంచే భక్తిభావాలను అందిపుచ్చుకుని ఆనందమయ జీవితాన్వేషణకు శ్రీకారం చుట్టాలి. ఆధ్యాత్మిక జీవితాచరణలో జీవన సంతృప్తి ఉంటుంది. భగవంతుడు ఆనంద స్వరూపం కాబట్టి బద్ధకం వీడి భగవదన్వేషణ చేసిన నాడు ఆ పరమాత్ముని అనుగ్రహం చేకూరి సంతృప్త జీవనం అలవడుతుంది.

*సాక్షి, మార్చి, 2010*

# సద్భావం

"భావ ములోనా బాహ్యమునందును,

గోవింద గోవింద అని కొలువవో మనసా!"

అంటాడు అన్నమయ్య. ఈ కృతి పరమాత్మ గురించి బాహ్య చింతనతో పాటు అంతశ్చింతన కూడా వుండవలసిన ప్రాధాన్యతను తెలియజేస్తుంది. బాహ్యమలినాలు ఎలా సకల రోగ కారకాలవుతాయో అంతర్మలినాలు కూడా ఆధ్యాత్మిక ఆరోగ్యానికి భంగం కలిగిస్తాయి. అరిషడ్వర్గాలయిన కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాల ఉనికి వల్ల మానసికంగా సాధకునికి ప్రగతి సాధ్యపడదు. శివభక్తుడయిన నందుడి మనస్సంతా శివ నామంతో, రూపంతో నిండి వున్నప్పటికీ భావపరంగా ఆయన సర్వోన్నత స్థితి కలిగి వున్నప్పటికీ, స్వామిని భౌతిక దర్శనం చేయాలనుకున్నప్పుడు ఆయన మనోరథం ఈడేరక పోయేసరికి ప్రాణత్యాగం చేసి భగవత్సన్నిధికి చేరుకుంటాడు. భావానికి అనుగుణంగా బాహ్యాన్ని కూడా పురోగతిలో వుంచుకోవడం అవసరం.

గాలిలో మేడలు కట్టడం కేవలం సగటు మనిషి భావుకత్వం వాస్తవంలో వుండే విరుద్ధపుటాలోచనలు, నిర్మాణాత్మకమయిన ఆధ్యాత్మిక దినచర్య నిర్దేశించుకొనడంలో అవరోధం కాకుండా సాధకుడు చూచుకోవాలి. ఇప్పుడు ఇక్కడ వున్న మనస్సుకు మరుక్షణంలో పవిత్ర మానస సరోవరంలో సంచారం చేయగల సామర్థ్యం వుంది. అంతటి మేధోపాధి కలిగి వుండే మనస్సును ఆశావాద దృక్పథంతో నడిపించి ఆధ్యాత్మికోన్నతిని తప్పక సాధించుకోగలననే ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసుకోవాలి. ఎప్పుడయితే మనస్సుకు కళ్ళెం వేసి నడిపిస్తామో, విరుద్ధ ఆలోచనలు తగ్గుముఖం పట్టి మనస్సు ఆనంద ప్రపూర్ణమవుతుంది. మనసు తాత్కాలికంగా మలినరహితంగా వున్నంత మాత్రాన అరిషడ్వర్గాలపై విజయం సాధ్యం కాకపోవచ్చును. సులభంగా ఆత్మజ్ఞానం లభిస్తుంది. అంతే సులభంగా భగవత్ ప్రాప్తి సాధ్యమవుతుందనుకోవడం వల్ల ఆశించిన ప్రయోజనం కలగకపోవచ్చు. ఆ భావన రూపుదాల్చేందుకు యధోచితంగా కృషి చేయవలసి వుంటుంది. మానవ సేవను నారాయణ సేవగా భావించడం ముదావహమే. యధాశక్తి వితరణ, ఆధ్యాత్మిక కార్యక్రమ నిర్వహణ, సంఘసేవ వంటివి చేయగలిగినపుడు మనసుకు కలిగే సంతృప్తి మరోవిధంగా పొందడం సాధ్యం కాకపోవచ్చు.

ఏకేశ్వరుడైన దైవాన్ని వివిధ రూపాల్లో రామకృష్ణులుగా, క్రీస్తుగా, అల్లాగా భావన చేయగలిగినపుడు విశ్వమానవ సౌభ్రాతృత్వం తప్పక వెల్లివిరుస్తుంది. ఆధ్యాత్మికోన్నతిని సాధించే ప్రయత్నంలో సాధకుడు ఒక్కొక్కప్పుడు ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకోలేక పోతాడు. అలాంటి సందర్భం వచ్చినపుడు గీతాచార్యుని ప్రవచనాన్ని ప్రమాణంగా తీసుకొని కర్మ ఆచరించవలసి వుంటుంది. మహనీయుల ఆచరణలు సాధకులకు శిరోధార్యమే కాక మార్గదర్శకాలవుతాయి.

*ఆంధ్రభూమి, 06.04.2010*

# ద్వంద్వాలు

మానవ జీవితం ద్వంద్వాల సమాహారం. కష్టసుఖాలు, కలిమిలేములు, ఆశనిరాశలు, రాగద్వేషాలు, వెలుగునీడలు, చెప్పుకుంటూ పోతే ద్వంద్వాలు ఎన్నెన్నో! వీటిలో నిరాశ, తమోగుణానికి చెందినవి ఒక వర్గమయితే ఆశ, వెలుగుజాతికి చెందినవి మరొక వర్గం. ఇవి చూడటానికి పరస్పరం విరుద్ధమయినవిగా కనబడుతున్నా సాగిపోవడం వీటి ప్రత్యేకత. అయితే ఈ ద్వంద్వాలలో ఏ ఒక్కటీ నిలకడగా నిలిచేది లేదు. ఒకదాన్ని మరొకటి తప్పక అనుసరించి తీరుతుంది. విరుద్ధ స్పర్శ వున్న ఉపాధి మనిషికి చక్కని జీవిత పాఠం నేర్పుతుంది. ఆశావహ స్పర్శ వున్న ఉపాధికి దారిచూపుతుంది. కష్టసుఖాలలో మొదట కష్టాన్ని చెప్పుకుంటాం. ఎందుకంటే కష్టం లేకుండా సుఖానికి ఉనికి లేదు. అగ్ని నుండి నీరు ఉద్భవించినట్లు కష్టం నుండి సుఖం ఆవిర్భవిస్తుంది. కష్టం అనుభవం చెందకుండా సుఖంలోని తీపికి అర్థం తెలుసుకొనే అవకాశం వుండదు. భగవాన్ సత్యసాయి బాబా వారు కష్టసుఖాలను కదిలిపోయే మేఘాలతో పోలుస్తారు. మేఘం శాశ్వత ఉనికి కలిగి వుండదు.

వేసవి ఎండ తీవ్రంగా వుంది. ప్రాణికోటి చల్లదనం కోసం పరితపిస్తూ వుంటుంది. ఇంతలో ఓ చిరుమేఘం సూర్యుణ్ణి చాటుచేస్తుది. ఓ చక్కని వృక్షం బాటసారికి చల్లని నీడనిస్తుంది. ఈ రెండు సందర్భాల్లోను బాటసారికి అదో సుఖ స్పర్శ. అంతదాకా పడిన ఎండవలన కలిగిన పరితాపాన్ని మరిచిపోవడం జరుగుతుంది. అప్పటిదాకా వీస్తున్నదే అయినా గాలి చిరుమేఘం ఎండను చాటుచేసినపుడు వీస్తే హాయి కలుగుతుంది. వృక్షం శీతల ఛాయను అందించినపుడు గాలి వీస్తే శరీరం చల్లబడి హాయి అనుభవిస్తుంది. శరీరంపైని చెమట ఆరిపోతూ చల్లని సుఖస్పర్శ అందించి మనసుకు వింత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ప్రగాఢ నిశీథి లేనిదే వెలుగు విలువ మనిషికి తెలిసే అవకాశం లేదు. కన్ను పొడుచుకున్నా కానరాని కాళరాత్రి వుండబట్టే ఉషోదయపు చిరువెలుగులు మనిషికి ఆనందాన్ని అందివ్వగలుగుతాయి. దారిద్ర్యం కూడా శాశ్వతంకాదు. కలిమిలేములు కావడి కుండల వంటివని చెప్పారు. కలిమి కలిగిన వారికి కూడా ఏదో లేని కొరత వెన్నాడే అవకాశం వుంటుంది. లేమిలో కూడా ఏదో ప్రత్యేకత కలిగి వున్న కారణంగా కలిమి భాగ్యం అనుభవించే అవకాశం వుంటుంది. సంతాన ప్రాప్తికి నోచుకొనని భాగ్యవంతులు ఆ సంపద కలిగిన పేదల అదృష్టానికి ఈర్ష్యచెందే అనుభవాలు చూస్తుంటాం. రాగద్వేషాలు,

ఆశ నిరాశలు మానవ జీవితంలో అతి సహజం. ఈ ద్వందాలు ప్రకృతి – పురుషుల ఏకత్వమంత సహజం. ఈ జమిలిలో నిరాశ, దైన్యం కలిగించేది కాగా ఆశ ఆనంద స్వరూపం. ద్వంద్వంలోని బాధాతప్త ఉపాధిని అధిగమించే ప్రయత్నం చేస్తూ ఆశావహ దృక్పథంతో మనిషి పరిశ్రమించాలి. 'కష్టేఫలే' అన్న సిద్ధాంతానికి అనుగుణంగా మనిషికి తప్పక విజయం చేకూరుతుంది. ఈ రెండింటిలో ఎప్పుడూ విరుద్ధమైన ఉపాధిదే పైచేయి అయినపుడు అది దుఃఖ కారకం కాగా మనిషి తీవ్రంగా కృంగిపోతాడు. సుఖస్వరూప ఉపాధి అయితే మనిషి పొంగిపోతాడు. ఈ రెండు సందర్భాల్లో కూడా కృంగుబాటు, పొంగుబాటు – రెండూ కూడా అభిలషణీయం కాదు గాబట్టి ఓ సమతుల స్థితికోసం మనిషి సాధన చేయాలి. కృషి ఉన్నపుడు దుర్భిక్షం దరిచేరదు గనుక మనిషికి పొందవలసిన లబ్ధి, ఆనందం తప్పక సమకూరుతుంది. ద్వంద్వాలు సహజమయినప్పటికీ మానవ జీవన సరళిలో 'ద్వంద్వ ప్రమాణాలు' మాత్రం ఎన్నడూ అభిలషణీయం కాదు. మనిషికి వాటివలన ఎన్నడూ ఉన్నతి ప్రాప్తించదు. ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ ద్వంద్వాలలోని ఆశావహ, ఆనందకర, సంపత్కర ఉపాధివలన లబ్ధి కోసం మనిషి సాధన చేసి జీవన సాఫల్యం సంతృప్తి కైవసం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి.

*ఆంధ్రభూమి, 18.04.2010*

# కాల మహిమ

**కలి** సొచ్చే కాలం వస్తే నడిచివచ్చే కొడుకు పుడతాడని సామెత. కాలం అందరికీ ఒకే రీతిన ఉండదు. ఒకే కాలం కొందరికి అదృష్టాన్ని పంచితే మరికొందరికి దురదృష్టాన్ని అందిస్తుంది. కాలం సకల స్వరూపం. సుఖస్వరూపం, దుఃఖ స్వరూపంగా వుంటూ నిర్దేశిత ఫలాన్ని అందిస్తుంది. నెలగడిస్తే వేతనం అందించే కాలం ధనస్వరూపం. కాలం కలిసివచ్చినపుడు బండ్లు ఓడలవుతాయి. కాలం అనుకూలం కానపుడు ఓడలు బండ్లవుతాయన్నది పెద్దల మాట. మానవుడు సంఘజీవి. ఆలోచన పరిధి మేరకుఎవరి అభిప్రాయాలు వారికుంటాయి. అందరి అభిప్రాయాలు ఒకే లాగున వుండవు. తేడాలొచ్చినపుడు అభిప్రాయ భేదాలొస్తాయి. తగవులూ వస్తాయి. తగవులకు కారణమైన వారి వారి సమస్యలకు కాలమే పరిష్కారం చూపుతుంది తప్ప ఎవరి మేధస్సు కూడాఉ న్నపళంగా పరిష్కారం చూపగల అవకాశం వుండకపోవచ్చు. విత్తిన విత్తు మొక్కై, మానై పుష్పించి ఫలించాలంటే కాల చక్రభ్రమణం అనివార్యం. ఫలాలు అందివచ్చేదాకా వేచి చూడవలసిందే తప్ప అన్యమార్గం లేదు. రోగాల బారిన పడి దుఃఖం అనుభవిస్తున్న అభాగ్యులకు రోగ నిదానం జరగాలంటే ఔషధ సేవనం జరగాల్సిందే! కాలగతిన తప్పక మంచి ఫలితం చేకూరగల అవకాశం కోసం కాలగమనాన్ని నిరీక్షిస్తూ వేచి చూడవలసిందే! కాలం ఆనంద దుఃఖ సమ్మేళన స్వరూపం. గడ్డుకాలం ప్రాప్తించినపుడు పాండవులకు, వన, అజ్ఞాతవాసాలు తప్ప లేదు. వారి పట్టపురాణి ద్రౌపదీదేవికి వారి అజ్ఞాత వాస కాలంలో విరాటరాజు ధర్మపత్ని చెంత కొలువు చేయవలసిన దుర్గతి తప్పలేదు. సకల సద్గుణ సంపన్నుడు, మర్యాదా పురుషోత్తముడు, సాక్షాత్ శ్రీమన్నారాయణ స్వరూపుడయిన శ్రీరామచంద్రమూర్తికి అరణ్యవాసం తప్పలేదు. సకల సద్గుణ శోభితురాలు, పరమ పతివ్రత, శ్రీరాముని ఇష్టసఖి అయిన పరమ పావని సీతామాతకు దుష్ట, రాక్షసుల చెంత కాలహరణ చేయవలసిన దుర్గతి తప్పలేదు, అంటే కాలం ఎంతటి బలీయమైనదో అర్థమవుతుంది.

ఒకచో కాలం దుఃఖ స్వరూపంగా భాసిల్లినా తగు సమయంలో సకల సుఖాలూ అందిస్తుంది. మానవునికి మురిసి మెరిసిపోయే సద్గతి కాల ప్రభావంతోనే సమకూరుతుంది. నిన్నటిదాకా కష్టాలనుభవిస్తున్న వారు అమాంతంగా ముక్కున వేలేసుకొనేలా చేయగల దిట్ట కాలం! కాలం దైవాధీనం. మనిషి చేతిలో లేనిది. కాలచక్ర భ్రమణాన్ని ఆపగల సమర్థులెవరూ లేరు. రాజులు పోయారు, రాజ్యాలు మారుతున్నాయి. స్వర్ణయుగాలు

గడిచాయి. సునామీలు, భూకంపాలు వచ్చి వెళ్ళాయి. లోకం పోకడలు ఎన్ని మారినా సూర్యచంద్రాదులు మాత్రం కాల గమనానికి సాక్షీభూతంగా, అతీతంగా వుండటం విశేషం!

కాలం భగవత్ స్వరూపం. అందుకే 'కాలాయనమః', 'కాలకాలయనమః' అని భగవానుని కీర్తిస్తాం. రాబోయే కాలాన్ని అంచనా వేసేదే జ్యోతిష శాస్త్రం. 'భూత భవ్య భవత్ప్రభుః' అని భూత భవిష్యత్ వర్తమాన కాలాదులందు వ్యాపించి వున్న భగవానుని కీర్తిస్తాం.

ఏదిఏమైనా కాలం చేతికందనిది. కాలాన్ని సద్వినియోగం చేయటం అవసరం. కాలం ధనం. కాలం సంపద, కాలం సుఖం, కాలం ఆనందం. కాలం ఆయుష్షు, కాలం సమగ్రం, కాలం సమస్తం.

కాబట్టి సకల సంపదలు, సౌభాగ్యం అందివ్వగల కాలాన్ని ఆయా లక్ష్యాలు సాధించేందుకు, సోమరితనాన్ని విడనాడి కృషితో పట్టుబిగించి లక్ష్యాలను కైవసం చేసుకొని కాల చక్రపు ఆనంద పార్శ్వాన్ని అందిపుచ్చుకోవాలి. ఇంత విలువైన కాలాన్ని యువత తమ భవిష్యత్ కార్యాచరణ మలుచుకొని విజయం సాధించేందుకు, ముముక్షువులు జ్ఞాన సముపార్జన కోసం, సద్వినియోగం చేసుకొని సమయ సాఫల్యత సిద్ధించేలా ప్రయత్నశీలురు కావాలి.

*ఆంధ్రభూమి, 24.04.2010*

# బ్రహ్మముహూర్తంలోనే ఎందుకంటే ...?

సూర్యా గమన శుభసంకేతంగా తూర్పు దిక్కున ఉషస్సు పొటమరిస్తుంది. దీంతో ప్రకృతి తమస్సు చెర వీడుతుంది. పక్షులు రెక్కలను టపటపలాడిస్తూ గూళ్ళు వదిలి మానవాళికి మేలుకొలుపు పాడతాయి. అన్నాన్వేషణ చేస్తూ జీవయాత్రను ప్రారంభిస్తాయి. గోశాలల్లో లేగదేడలు పాలుత్రాగుతూ క్షీరామృతాన్ని అనుభవించే పవిత్ర శుభవేళ అది. బ్రాహ్మీ ముహూర్తపు తరుణాన సరస్సులు, నదుల వంటి జలాశయాల్లో జలప్రాణులు ప్రకృతికి జాగృతి గీతాలు పాడుతూ ఈదులాటలు ఆరంభిస్తాయి. ప్రశాంతత పరవళ్ళు తొక్కే సమయమది.

సూర్యోదయంతో ఆశలు చూపులకు అంది రూపుదాల్చే శుభవేళకు నాందీవాచకం పలుకుతుంది. ప్రకృతి ఒడిలో సేదదీరిన పూల మొక్కలు తమ శాఖలకు అంకురించిన కుసుమాలు వికసించడంతో నవ చైతన్యశోభను సంతరించుకుంటాయి. మనసు ఆహ్లాదభరిత మవుతుంది. అందుకే మన పూర్వీకులు బ్రాహ్మీసమయాన్ని దైవారాధనకు అనుకూలమైన ముహూర్తంగా అభిభాషించారు. తమస్సు నిండిన అసురభావనలు నశించి దైవం వైపు మనసు మళ్ళించేందుకు ఆదిత్యుని సాక్షిగా అనువైన సమయం ప్రత్యూషం. సుప్రభాత వేళ ధారణసంపత్తిని ఉదాత్తంగా సంపర్కించుకున్న మనసు ఆహ్లాద వాతావరణంలో యత్న మాత్రంగా ఆత్మను పరమాత్మ వైపు మళ్ళించే ప్రయత్నం చేస్తుంది. ప్రత్యూషపు నీరెండలో మనసు ఆనంద సుప్రశాంత శుభలహరి అవుతుంది. రంగవల్లికలు రమణులతో ముచ్చట్లు చేసే ఈ శుభసమయంలో ఆధ్యాత్మికానికి అనుకూల భావాలు భక్తుల మనోవీధుల్లో విహంగ గమనం చేస్తాయి. ఈ వాతావరణంలో దైవస్తోత్రాలు వేదమంత్రాల రూపంలో ఉచ్ఛరించడం వల్ల దైవభావం పరిఢవిల్లుతుంది. రోజంతా ఉత్సాహంగా జీవించగలిగిన అనుకూలత దినచర్యకు తొలిపలుకవుతుంది. రుషులు, మునులు, యోగుల మనసుల్లో ఆత్మభావన ఆనంద తాండవం చేసే బ్రాహ్మీ కాల సుశాంత సుమనోహర వాతావరణంలో భగవన్నామం జపించడం, తపించడం, మననం చేయడంతో భగవదనుభూతుల ఊసుల రాశులు ప్రోదికాగా సంపన్న దైవ భావంలో ఉషోదయాన్ని ఓలలాడి తరించగల అవకాశం మన సొంతమవుతుంది.

సాక్షి, *20.05.2010*

# మౌనవాణి విలువ

మౌనానికి ఎంతో మహత్వం వుంది. వాగ్రూపంలో సమాధానం ఇవ్వవలసిన సందర్భంలో పాటించిన మౌనం సంకటభరితంగా పరిణమిస్తుంది. పంచభూతాలలో భూమి తొలి స్థానంలో, నీరు ద్వితీయంలో, అగ్ని తృతీయంలో, వాయువు నాల్గవ స్థానంలో ఉండగా భూతాకాశం పంచమ స్థానంలో వుంది. ఆకాశం నుంచి ఉద్భవించిన శబ్దానికి నిశ్శబ్దప్రతీక 'మౌనం!' భూతాకాశ ప్రతీకమయిన శబ్దం ఎంతో ప్రాభవం కలిగివున్న రీత్యా 'మౌనం' ఉన్నత స్థాయి ప్రామాణికత కలిగి వుంది. పూర్వం ఋషులు మౌనాన్ని ఆశ్రయించి తపస్సుకు ఉపక్రమించేవారు. మౌనం వల్ల మెదడు పనితీరు వికసిస్తుంది. విస్తరిస్తుంది. కాగా తత్భిన్నంగా వాగుడుతనం వల్ల వాక్ ప్రామాణికత దెబ్బతింటుంది. మాట మాటకు మధ్య పొందిక తగ్గిపోతుంది. భూషణమయిన మౌనాన్ని ఆశ్రయించినపుడు మానసిక ప్రశాంతతకు ఊతం లభిస్తుంది. కొన్ని శారీరక రుగ్మతలకు మనస్సు కారణంగా వైద్యులు చెప్పటం మనకు తెలుసు. 'సైకోసోమాటిక్' వ్యాధులుగా వ్యవహరింపబడే ఈ రుగ్మతలు శారీరక చిత్తవృత్తుల అసమతౌల్యం వల్ల సంక్రమిస్తూ వుంటాయి. మౌనం మనస్సు నుంచి ఆవిర్భవిస్తుంది. కావున ప్రశాంత చిత్త లభ్యత కోసం సాధన చేసిన వారికి మౌనం కరతలామలకం అవుతుంది. ఒక సాధకుడు ధ్యానం చేస్తూ వుంటాడు. అతని మానసిక స్థితి తురీయావస్థ చేరుకుంది. అంటే చరమస్థితి అన్నమాట! అంతలో అతని ఆసనానికి చేరువలో వున్న చెక్కబల్లపై వున్న గుండ్రని గాజు పేపర్ వెయిట్ గాలికి జారి క్రిందపడిపోతుంది. తురీయ ధ్యానావస్థలో వున్న ఆ సాధకుని మస్తిష్కంలో ఓ భయంకరమైన బాంబు విస్ఫోటనం చెందినపుడు వెలువడే కర్ణకఠోర శబ్దస్థాయికి సరిపోలిన శబ్దం వినిపించగా అతని ధ్యానం చెదిరిపోయి ఉద్వేగంతో ఏదో ప్రమాదం జరిగి వుంటుందనే భ్రమతో కన్నులు తెరుస్తాడు. తీరా చూస్తే గాజు పేపర్ వెయిట్ గాలికి క్రిందపడింది. అతనికి వినిపించిన శబ్దం అదే! మొదట కలత చెందిన అతను తేలికగా ఊపిరి పీల్చుకుంటాడు. ఇక్కడ అతను భయభ్రాంతికి గురయ్యాడని చెప్పడం ఉద్దేశ్యం కాదు. కానీ ప్రశాంత చిత్తవృత్తిలో వున్న మనస్సు అతి చిన్న శబ్దానికి సైతం ఏ రీతిలో స్పందించిందో విశదమవుతుంది. జగత్తులోని ఏ వస్తువయినా పంచభూతాత్మకమయినదే. మనిషి కూడా ఆందుకు భిన్నంకాదు. పంచభూత ప్రకృతి తత్వం వున్న ఏ ఇతర ప్రాణికి కూడా లేని మనస్సును మనిషి కలిగివున్న కారణంగా పంచభూత, పంచేంద్రియ పరిజ్ఞానం అతనికి నిర్దుష్టంగా వుండగల అవకాశం వుంది.

జ్ఞానేంద్రియాలయిన శబ్ద స్పర్శ రూప రస గంధాల్లో పదక్రమంలో శబ్దం మొదటిదిగా చెప్పబడింది. అంత విలువైన శబ్దం యొక్క శూన్య పరాకాష్ట మౌనం! శబ్దం ఎంత తక్కువ సాంద్రతలో వుంటుందో, మౌనాన్ని ఆశ్రయించిన మనస్సుపై దాని గాఢత, ప్రభావం అంత అధికంగా వుంటుంది. పూర్వం అడవుల్లోని ఆశ్రమాల్లో నివసించిన మౌనులు నిశ్శబ్ద వాతావరణంలో ప్రకృతి హేలను తనివిదీరా ఆస్వాదించి తరించారు. వారి మనస్సులలో ప్రభవించిన ఓంకార నాదాలు భక్తిరసస్ఫోరకాలై వారి తనువెల్లెడలా ప్రసరించిన, ప్రవహించిన కారణంగా వారి మాటలే మంత్రాలై భాసిల్లాయి. అనంత గంభీర నిశ్శబ్దతలో పరిఢవిల్లి పరిమళించిన వారి తపఃకుసుమాలు అనంత ఖ్యాతి గడించి ఈనాటికీ వారి రచనలు కావ్యాలై మనకు అంది వచ్చి అలరిస్తున్నాయి. త్యాగయ్య, అన్నమయ్య, గోపయ్యల భక్తిరస భావగీతికలు మనకు ఈనాటికీ శ్రవణానందాన్ని కలిగిస్తున్నాయి. మౌనంగా సంభాషించగల నేర్పు, ఓర్పు కలిగిన మహనీయులు 'మనోభాషణాన్ని (టెలీపతీ) ఆవిష్కరించారు. తపమాచరిస్తున్న వేళలో భావ మాలిన్యం లేని వారి మనసులు జరగబోవు ఘటనలను 'అంతర్వాణి' ద్వారా వినగలిగారు. అంతర్వాణి ప్రబోధసారమయిన భవిష్యవాణి'ని కాలజ్ఞాన రూపంలో గ్రంథస్థం చేసిన మహనీయులు బ్రహ్మశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు. మాట విలువ తెలుసుకొని సంభాషించినపుడు, మౌనం విలువ గుర్తించి మాట్లాడినపుడు ప్రతీ మాట ఒక మంత్రం కాగలదు. ప్రయత్నించి ప్రయోజనం పొందే చింతన చేద్దాం !

*ఆంధ్రభూమి, 19.05.2010*

# చిరంజీవి హనుమంతుడు

**ఉదయ**భానుని మధుర ఫలంగా భావించాడు. ఆ ఫలాన్ని అందుకోజూచాడంటే అందులోని అమాయకత్వానికి తోడు ఆయన శక్తి సామర్థ్యాలేపాటివో అర్థమవుతుంది. రామనామాన్ని సకల నిగమ మంత్రంగా భావించిన మహానుభావుడాయన. ఆయనే ఆంజనేయుడు. పరమేశ్వర అవతారంగా, దేహదారుఢ్యానికి, పట్టుదలకు, భక్తికి ప్రతీకగా, పరాకాష్టగా స్వామిని చెబుతారు. ఆంజనేయుడు శివతత్వాన్ని సంతరించుకొని అవతరించిన మహనీయుడు. శివుడు లయకారకుడు. పరమప్రజ్ఞకు, ఓజస్సుకు ప్రతీకగా లింగాకార స్వరూపుడయిన శివుని అంశగా అవతరించిన హనుమంతుడు అసురీ ఉపాధులను, భావాలను నిర్దుష్టంగా లయం చేయగల సమర్థుడు.

రామభక్తి తత్పరుడయిన ఆంజనేయుడు ముముక్షువులకు ఆదర్శప్రాయుడయిన మహాగురువు. ఆయన ప్రభువుగా ఎంచుకున్న రాముని గూర్చి వివేకానందుడిలా అంటాడు. "సత్యానికి, నీతి నియమాలకు ఆయన మారురూపం. ఆదర్శప్రాయుడయిన కుమారునిగా, భర్తగా, ప్రభువుగా ఆయనకాయనే సాటి!" రామాయణంలో ఆంజనేయుని పాత్ర కేంద్ర బిందువుగా కథ కొనసాగుతుంది. కేసరి, అంజనిల ముద్దుల తనయుడయిన హనుమాన్ సరస్వతీ మాత జన్మించిన 'మూల' నక్షత్ర జాతకుడు.

బాలాంజనేయుడు బాల్యంలో ఉదయభానుని చూచి అదో మధుర ఫలమని భావిస్తాడు. ఆ ఫలాన్ని అందుకోవటానికి ఆకాశంలోకి ఎగిరి సూర్యుని సమీపిస్తాడు. అదే సమయంలో నవగ్రహాల్లో ఒకరైన రాహువు కూడా గ్రహణ నేపథ్యంగా సూర్యుని కబళించే ప్రయత్నం చేస్తూ వుంటాడు. ఆంజనేయుడు బాలసూర్యుని ఆక్రమిస్తున్న తరుణంలో ప్రకృతి చర్యకు విఘాతం కలిగిస్తున్నాడన్న రాహువు అభియోగంపై ఇంద్రుడు బాలాంజనేయునిపై వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. భూమిపై పడ్డ ఆంజనేయుని 'హనువు' (ఎడమ దవడ) దెబ్బతింటుంది. కుమారుని దుస్థితికి కోపించిన వాయుదేవుడు వాయు స్తంభన చేస్తాడు. సకల ప్రాణులు ప్రాణవాయువు అందక విలవిలలాడగా దిగివచ్చిన ఇంద్రుడు వజ్రాయుధ ప్రహార ఫలితాన్ని ఉపసంహరించి బాలాంజనేయునికి ఊరట కల్గించి అనేక వరాలిస్తాడు.

సూర్యభగవానుని తనకు గురుత్వం వహించమని ఆంజనేయుడు అర్థిస్తాడు. తాను నిరంతరం ముల్లోకాల్లో పరిభ్రమిస్తూ వుండే కారణంగా తనతో పాటు అతడు సంచరించలేడనీ అందువల్ల తనను శిష్యునిగా స్వీకరించలేననీ చెబుతాడు. సూర్యభగవానుని

సందేహం తీర్చేందుకు ఆంజనేయుడు తన శరీరాన్ని దిగ్దిగంతాలకు పెంచి, ఒక పాదాన్ని తూర్పు అంచున, మరో పాదాన్ని పశ్చిమ దిక్కు అంచున నిలిపి తన ముఖాన్ని సూర్యాభిముఖంగా స్థిరపరుస్తాడు. ఆదిత్యుడు సంతసించి సకల జ్ఞానసారాన్ని ఆంజనేయునికి బోధిస్తాడు. జ్ఞానిగా మారిన హనుమంతుడు ఆదిత్యుని గురుదక్షిణ కోరమంటాడు. అకుంఠితమయిన పట్టుదలతో విద్యనభ్యసించిన హనుమంతుని వంటి శిష్యుని శ్రద్ధే తనకు గురుదక్షిణ అని చెబుతాడు సూర్యుడు. కాని ఆంజనేయుడు పదే పదే అర్థించడంతో, తన అంశతో జన్మించిన సుగ్రీవునికి చేదోడుగా వుండి సహాయమందించవలసిందిగా కోరతాడు.

శ్రీరాముడు ఎన్నో ఏండ్ల సుపరిపాలన తరువాత వైకుంఠానికి పయనమవుతాడు. ఆయన అనుయాయులందరూ ఆయన్ను అనుసరిస్తారు. అయితే హనుమంతుడు ఎప్పటికీ భూలోకంలోనే వుండేందుకు ఇష్టపడతాడు. అందుకు కారణం ఎన్ని యుగాలు మారినా రామభక్తులు వుంటారు. వారి రామ నామ జపాదులు శ్రవణం చేస్తూ జీవించాలనేది ఆంజనేయుని మనోరథం. స్వామి అభీష్టానుసారం శ్రీరాముడు హనుమంతులవారిని 'చిరంజీవి'గా అనుగ్రహిస్తాడు. ఆంజనేయుడు చిరంజీవి. ఈ సృష్టి వున్నంతవరకు ఆయన భక్తులు చేసే రామనామాన్ని శ్రవణం చేస్తూ ఆనంద పారవశ్యంలో వుంటాడు. భవిష్య బ్రహ్మగా సృష్టి బాధ్యతలు చేపట్టేదాకా చిరంజీవిగా స్వామి, భక్తుల హృదయాల్లో కొలువై వుంటాడు. ఇప్పటికీ, ఎప్పటికీ!!

*ఆంధ్రభూమి, 07.06.2010*

# చింతన పరమార్థం

**చింతన** అన్నది ఆలోచన. మహాసముద్రంలాంటి మనస్సులో ఆలోచనా తరంగాలు అనంతం. వచ్చే అన్ని ఆలోచనలు కార్యరూపం దాల్చవు. ఆగాధ పారావారం లోని తరంగాలు ఒడ్డుకు తాకి, లోనికి అంతర్హితమవుతూ వుండేటట్లు అనంతమైన ఆలోచనా తరంగాలు మనసు అంచును తాకుతూ వుంటాయి. ఆలోచన కార్యరూపం దాల్చినపుడే దానికి ఓ అర్థం పరమార్థం వుంటుంది.

సన్మార్గవర్తనులు సదాలోచనలు చింతన చేస్తారు. ఆ సచ్చింతన రూపుదాల్చే ప్రయత్నం చేస్తారు కూడా! సచ్చింతన ఓ రూపు సంతరించుకున్నా, లేకపోయినా ఆ దిశగా చేయవలసిన సత్ప్రయత్నం మాత్రం అవసరం! దుష్టులు కూడా దురాలోచనలు కార్యరూపం దాల్చేయత్నం చేస్తారు. వారి దౌష్ట్యం పరాకాష్టనందుకొన్నప్పుడు వారి దుశ్చింతన రూపు సంతరించుకుంటుంది. హింస బహిర్గతమౌతుంది. హింస పర్యవసానం అది బాధితులను పరిమార్చడమే కాక కారకులయిన వారిని కూడా కాలగతిన కాల్చివేస్తుందనే సత్యం కర్తలకు ఆవశ్యం తెలియవలసి వుంది. దుశ్చింతనాపరులకు తాత్కాలికంగా విజయం లభించినట్లు కన్పించినా అది ఎన్నడూ విజయం కాబోదు. నేరస్థులు ఏప్రవృత్తిలో హింస చేస్తారో ఆ ప్రవృత్తికే బలి కావడమనేది ప్రకృతి నియమం. హత్యచేసినవాడు నేర నిర్ధారణ జరిగి పరిపాలకులచే శిక్షించబడక పూర్వమే కొన్ని సందర్భాల్లో బాధితుల అనుయాయుల చేతుల్లో నిహతులు కావడం జగమెరిగిన సత్యమే. అంతిమ విజయం ధర్మానికే అన్నది యుగయుగాలుగా నిర్ధారణ అవుతున్న సత్యం. అయితే హింసవల్ల ఒనగూడే ప్రయోజనం శూన్యమన్న నిజాన్ని గుర్తెరిగి హింసావర్తనులు ఆ బాట వీడి సత్యపథానికి తరలాలి. ఎదుటివారు ఏ విధంగా ప్రవర్తిస్తే తాను ఆనందిస్తాడో ఆ విధంగా ఎందుటివారి పట్ల తన ప్రవర్తన వుండాలన్న ఏసుక్రీస్తు వాక్యం సంస్మరణీయం, ఆచరణీయం ! అందుకే మనస్సులో ఉద్భవించే చెడ్డ ఆలోచనలకు ఉద్వాసన చెప్పాలి. ప్రతివారిలోను మంచి, చెడు ఆలోచనలు కలిగే అవకాశం వుంది. అయితే సద్వర్తనులు సదాలోచనలు మాత్రం ఆచరణలో పెడుతూ దురాలోచనలను అణచివేస్తారు. మానసిక బలహీనులు దురాలోచనలకు ఆచరణ యోగ్యత కల్పిస్తూ జీవిత నాటక రంగంలో ఓడిపోతూ వుంటారు. మనస్సులో ఉద్భవించే సదాలోచనలు

కేవలం ఉనికివల్ల శ్రేష్ఠతను సంతరించుకోవు. వాటికి ఆచరణ కల్పించినపుడే తనకు, ఎదుటివారికి ప్రయోజనం సమకూరుతుంది.

శ్రేష్ఠులను సామాన్యులు అనుకరిస్తారని భగవద్గీత చెబుతుంది. అందుకే సత్పరాయణులయిన ఉదాత్తులు పురాణాలనుంచి, వర్తమానం నుంచి మహనీయుల ఆచరణలను స్ఫూర్తిగా తీసుకొని విద్యాలయాలు, వైద్యాలయాలు వంటివి నెలకొల్పి సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం కల్పిస్తున్నారు. ఎదుటివారికి మేలు కల్గించాలన్న సంకల్పం వున్నప్పటికీ అందరూ గొప్ప గొప్ప పనులు చేయలేరు. తనకున్నంతలో దేహి! అన్నవారికి ఒక్క రూపాయి వితరణ చేసినా ఆ చర్య ఆ వ్యక్తి ఆధ్యాత్మిక ఉన్నతికి సోపానం వేయగలదు.

సృష్టిలో అందరూ గొప్పవారు కాలేరు. మౌలిక ప్రకృతిలో సమతుల్యత వుండినప్పటికీ వేర్వేరు ఉపాధుల మధ్య సమాన స్థాయిలో పోలిక వుండే అవకాశం లేదు గనుక ఏ స్థాయిలో ఉన్నవారు ఆ స్థాయిలో తమను తాము ఉద్ధరించుకుంటూ, సమాజానికి ఉపయోగపడే చిన్న పని అయినా చేసేందుకు చింతన చేయాలి. ఫలానా వ్యక్తి కోటీశ్వరుడు కాబట్టి ఆయన ఆ ఘనకార్యాలు చేయగలిగాడు. ఆ స్థాయిలో మనకు సంపద లేదు గనుక మనమేం చెయ్యగలం? అనికాక ఉడతాభక్తి అన్నట్లు చిన్న చిన్న సామాజిక ప్రయోజనాలకు ప్రేరకులమయినా మన జీవితాలు ధన్యమయినట్లే. చిన్న చిన్న నీటి బిందువులు చేరితేనే కదా, అపార పారావారం రూపుదాల్చేది?! ఏ మంచి పనికయినా మంచి ఆలోచన ప్రథమం గనుక సత్‌చింతనతో పరమార్థాన్ని ఎంచుకొని మనల్ని మనం ఉద్ధరించుకొందాం!

*ఆంధ్రభూమి, 15.06.2010*

# వేదమాత... వాక్ స్వరూపిణి సరస్వతి

సరస్వతీ మాత బ్రహ్మదేవుని అర్ధాంగి ఈ మాతను దుర్గ కుమార్తెగా చెప్పాయి పౌరాణిక గ్రంథాలు. శ్రీలక్ష్మీదేవి సరస్వతీ అమ్మవారికి సహోదరిగానూ, గణేశుడు, కార్తికేయుడు సోదరులుగానూ చెప్తున్నాయి. ఈ మాత బ్రహ్మదేవుని మన స్విజ, శతరూప. బ్రహ్మకు విశ్వసృష్టికి మూలమైన పరమజ్ఞానాన్ని ప్రసాదించింది. ఆమె అపారవేదరాశికి మాతృమూర్తి అని పురాణాలు నివేదిస్తున్నాయి.

పిల్లలకు అక్షరాభ్యాస వయసు రాగానే బడిలో చేరుస్తారు. వారి చేత మొదటగా 'ఓం నమఃశివాయః' అనే మంత్రాక్షరాలను దిద్దించడం ఆచారం.

సరస్వతీ మాత కరుణాకటాక్ష వీక్షణాల కోసం విద్యార్థులు అమ్మ చరణాలను ఆశ్రయిస్తారు. అమ్మ నక్షత్రం 'మూల'. సరస్వతీ మాతను పూజించడానికి బీజ మంత్రం "ఓం ఐం సరస్వత్యైనమః'

మనం చూసే సరస్వతీమాత... చిత్రాల్లో తెల్లని పట్టుచీర ధరించి, తెల్లని కమలంలో ఆసీనమై, తెల్లని రాజహంసతో ఉంటుంది. మాత నాలుగు చేతులలో తెల్లని పద్మం, తాళపత్రగ్రంథం, ఒక చేయి వీణ మీటలపై, ఒక చేయి వీణతంత్రులపై ఉంటాయి. కిరీట ధారియై హృద్యంగా కనిపించే ఈ రూపం చదువుల తల్లిది. పవిత్రమైన ధవళకాంతుల ఆహార్యంతో అలరారే అమ్మను చూసిన వారు అమ్మకు తెలుపు వర్ణం ప్రీతి అనుకునే అవకాశం వుంది. కాని అమ్మకు ఇష్టమైన వర్ణం పసుపు. అమ్మవాక్ స్వరూపిణి. సరస్వతీమాత జన్మదినమైన వసంతపంచమి రోజున ఆమెకు విశేష పూజలు జరుగుతాయి. స్కాంద పురాణంలో సరస్వతిని 'హంసవాహిని'గా పేర్కొన్నారు. రాజహంస అమ్మవారి వాహనం. గాయత్రి మాతకున్న మూడు పేర్లలో ఒకటి గాయత్రి, రెండవది సావిత్రి, మూడవది సరస్వతి. కళాపరిజ్ఞానం, సంగీతజ్ఞత అమ్మ చలవ వల్లనే అబ్బుతాయి. అపార జ్ఞానాన్ని ప్రసాదించమని అమ్మను కోరుతూ చేసే పూజలు సెప్టెంబరు – అక్టోబరు నెలలు ముఖ్యమైనవి. కేరళీయులు 'కణ్ణి మాసం'లో సరస్వతి మాతను ప్రత్యేక పూజలతో కొలుస్తారు. దుర్గాపూజ రోజున 'వెప్పు' ఉత్సవాన్ని జరుపుకుంటారు. మహర్నవమి రోజున పుస్తకాలను, గ్రంథాలను తమ అభిరుచి మేరకు అలంకరించి పూజిస్తారు. పిల్లలు అక్షరాలు దిద్ది అమ్మకు అక్షర నీరాజనాలర్పిస్తారు. అక్షరసేద్యం చేసి అమ్మవారి కృపకు పాత్రులమై చదువుల పంట పండించుకుందాం.

సాక్షి, *17.06.2010*

# ధీరగుణం

**విధి** మానవుని కర్తవ్య పరిధికి అతీతమైనది. క్షణం కూడా చెప్పిరాదు. గడచిన క్షణాలే మనవికానీ జరగబోయేవి మనవి ఎంత మాత్రం కాదు. అయితే ధీరుడు జరగబోయే దానికి వెరవక ధైర్యంతో ముందుకు సాగుతాడు. మానవ జీవితం ఆనంద విషాదాల కదంబం! అన్నీ మన మంచికే అనే సిద్ధాంతానికి అత్యంత మౌలిక ప్రాధాన్యత వుంది. జరుగుతున్న ఆనంద క్షణాలు శాశ్వతం కావని నమ్మినపుడు జరగబోయే విచారకర క్షణాలు కూడా శాశ్వతం కాబోవని నమ్ముతాం! విషాదం తరువాత ఆనందం తప్పక మనిషి దరి చేరుతుంది. అయితే దీరుడు విషాద సమయంలో కూడా సంయమనం కోల్పోవటం జరగదు. జరుగుతున్న కలవరపరిచే ఘటన తనకు సంబంధించింది కాదన్నంత ధైర్యంగా వ్యవహరిస్తాడు. ఆ ఘటన తాలూకు దుష్ప్రభావాన్ని మనసుకు పట్టించుకోడు. ఆ కారణం వల్ల ఆ ఘటన అతని మనస్సుపై గానీ, తత్ ప్రభావంగా అతని ఆరోగ్యంపై గానీ ఎలాంటి చెడు ప్రభావాన్ని చూపదు. అందుకే భగవానుడు గీతలో ఈ ధీర గుణాన్ని స్థితప్రజ్ఞత పేరుతో ప్రవచించడం జరిగింది. ఆధునిక మనస్తత్వ శాస్త్ర నిపుణులు కూడా ఈ సూత్రాన్నే ఆధారం చేసుకుని కష్ట సమయాల్లో ధైర్యంగా వుండటం సాధన చేయమని సూచించడం మనకు తెలుసు.

ధైర్యం ఓ సుగుణం ! ఓ సద్గుణం ! ఆ సుగుణాన్ని, సద్గుణాన్ని మహామహులందరు అలంకారంగా ధరించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి ఉదాత్తమైన పురాణ పురుషులు మనకు బాగా సుపరిచితం కనుక వారి జీవితాల్లో ధైర్యం ఆవహించి, తేజరిల్లిన గొప్ప క్షణాలను గుర్తుతెచ్చుకొని, ఆ సందర్భాల నుంచి స్ఫూర్తి పొంది మన జీవితాలను సుగమం చేసుకోవచ్చు. భగవద్భక్తి నెరపగల, భగవానుని చేరుకోగల మార్గాన్వేషణ చేస్తున్న సందర్భాల్లో పొడచూపే కంటకాలను తృణప్రాయంగా తీసివేసి, సాధకుడు ధైర్యంగా ముందుకు సాగవలసి ఉంటుంది. 'ధైర్యే సాహసే లక్ష్మిః' అన్న ఆర్యోక్తి మనకు తెలుసు. పూర్వం సుహృదులైన రాజులు ఒక క్లేశంతో కూడిన సందర్భాన్ని ఎదుర్కొనవలసి వచ్చినపుడు తమ మంత్రులతో మంతనం చేసి పరిష్కార మార్గాన్ని కనుగొని ధైర్యంతో ఆ స్థితిని అధిగమించే ప్రయత్నం చేసేవారు. చాలా సందర్భాల్లో మనిషి ఓ పరిస్థితిలో ధైర్యంగా వ్యవహరించినపుడు ఫలితం కూడా చక్కగా వుంటుంది.

ఓ పల్లెటూరి ఆసామి నగరంలో రహదారి దాటవలసిన సందర్భాన్ని గనుక

తీసుకున్నట్లయితే, అతను అనేక వాహనాలతో రద్దీగా వున్న రహదారిని దాటలేక మొదట జంకుతాడు. అతడిలో రహదారి దాటగల సామర్థ్యం వుంది. అయితే కొత్తవల్ల ఆ ప్రయత్నం చేయటానికి భయపడతాడు. నగర రద్దీతో అలవాటువున్న ఓ పిల్లవాడు ఆ వ్యక్తిని సునాయాసంగా రహదారి దాటించగలుగుతాడు. ఇక్కడ ఆ పల్లెటూరి ఆసామికి సామర్థ్యం లేదని కాదు. రహదారిని దాటగలనో లేదో అన్నది అతని సంశయం మాత్రమే. నీటి ప్రవాహంలో చిక్కుకున్న చీమ ఓ చిన్న పుల్లను ఆధారం చేసుకొని ఒడ్డుకు చేరినట్లు చిన్న పిల్లవాడు చేయి పట్టుకున్నపుడు ఆ వ్యక్తి సునాయాసంగా రహదారి దాటగలుగుతాడు.

ఇదో చిన్న సందర్భం మాత్రమే. జీవితంలో అనేక ఆటుపోట్లు వుంటాయి. సాధకుడు సద్గ్రంథాల నుంచి, సద్గురువుల ప్రవచనాల ద్వారాను, తోటి సాదకుల అనుభవాలను వినటం ద్వారాను మనస్సును దిట్టపరచుకొని సాధన యజ్ఞాన్ని కొనసాగించవలసి వుంటుంది. శ్రీకృష్ణ పరమాత్మ ప్రవచించిన స్థితప్రజ్ఞతలో లేశమాత్రం అబ్బినా ఆధునిక సాధకునకు కంటక పరిస్థితులను ఎదుర్కొని దాటగల ధీరగుణం సంప్రాప్తిస్తుంది. ధైర్యం ప్రదర్శించవలసిన పరిస్థితిలో ఆ సుగుణాన్ని ప్రయోగించక పోవటం వల్ల సాధకుడు సాధనలో చాలా కోల్పోతాడు. కాలం గాయాలను మటుమాయం చేసి సాధకునకు పూర్వ వైభవాన్ని తెచ్చే మహత్తర దివ్యశక్తి. కావలసింది నిబ్బరంగా ఉండగలగటమే. ఈ నిబ్బరమే ధీరగుణం. దీన్ని సాధనతో కైవశం చేసుకోవచ్చు! మనిషికి అన్ని సుగుణాలు పుట్టుకతో రాకపోయినా సాధనతో సకల సద్గుణాలు అబ్బుతాయి. సాధనతో వైఫల్యాలను అధిగమించి ధీరగుణం ప్రదర్శించి ముముక్షువులుగా విజయం సాధిద్దాం!

*ఆంధ్రభూమి, 24.06.2010*

# మనస్సు - ఆరోగ్యం

**ప్రతీ** మనిషికి ఓ మనస్సు వుంది. అది ఎంత ఆరోగ్యంగా వున్నదనేది మీమాంస. ఎందుకంటే శరీరానికి ఆరోగ్యం అవసరమైనట్లు మనస్సుకూ ఆరోగ్యం అవసరమే! ఒక విధంగా చెప్పాలంటే శారీరక ఆరోగ్యం కంటే మానసిక ఆరోగ్యమే మరీ అవసరం. అందుక్కారణం వస్తుతః దేహానికి ఆరోగ్యం వున్నప్పటికి మనోజాడ్యం వుంటే దానిమూలంగా శరీరానికి సంక్రమించే వ్యాధులంటూ కొన్ని వున్నాయి గనుక.

ఏదైనా రోగం బారిన పడినపుడు వైద్యుడు శరీరానికి వైద్యం చేస్తాడు. మానసిక అనారోగ్యం వస్తే వైద్యం చేయటానికి వైద్యులు వున్నప్పటికీ సామాజిక దృక్పథంలో మాత్రం తేడా వుంది. అదేమంటే, మానసిక రోగిగా ముద్ర పడినప్పుడు వ్యక్తికి సమాజంలో గౌరవం వుండదు. మానసిక జాడ్యానికి కారణం సమతుల్యం కాని ఆహారం. కానీ, లోపభూయిష్టమైన ఆహారం కానీ కాదు. ఆధ్యాత్మిక పరిభాషలో చెప్పాలంటే మానసిక రోగాలకు కారణం కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యాలనే అరిషడ్వర్గాలు. ఇంకా చెప్పవలసి వస్తే ప్రతీదానిని అనుమానించడమనే జాడ్యం కూడా. ఈ అరిషడ్వర్గాలు, అనుమానపు జాడ్యాలను వదిలించుకోవటానికి మానసిక వైద్యుల ప్రమేయం బహుశా అనవసరం!

నిర్మలమైన మనస్సు కోసం సాధన చేయడంవల్ల మానసిక రోగాలు దరికి రావు. స్వచ్ఛమైన మనస్సు ఎలా సిద్ధిస్తుంది? నిరంతర సాధనవల్ల మనో నైర్మల్యం సాధించవచ్చు. ప్రకృతితో సహజీవనం చేస్తూ మంచి అలవాట్లను అభ్యసించడం చేయాలి. ధూమపానం, మద్యపానం, గుట్కా వంటివే కాక అబద్ధాలాడటం, జూదం, ఇంకా సమాజంలో వేటినైతే నేరాలుగా చట్టం ప్రకటించివుందో వాటన్నింటిని మొదట వర్జించాలి. ఎవరైనా చూస్తారని భయపడి, చేసే దురాగతాలు చేస్తూనే ఎవరి కంటా పడకుండా కొందరు జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ భగవంతుడనేవాడు అన్ని చోట్ల ఉంటాడు. కనుక వారు ఎవరి కన్ను గప్పుతారు? శిక్షవేసేవాడు తోటి మానవుడు కాదనేసత్యం అందరికీ తెలిసిందే కదా. అలానే భగవంతుని శిక్ష తప్పించుకోలేనిది అన్న సంగతి తెలిసిందే. కనుక ఎవరికీ తెలియకుండా చేస్తున్నామనుకుని అధర్మాన్ని అన్యాయాన్ని చేస్తూ పోతే ఒకనాడు తప్పక వారికి శిక్ష తప్పదు. కనుక ధర్మం తప్పడం చేస్తే శిక్షార్హుడే అవుతాడు. ఇందులో ఎలాంటి సందేహాలు లేవు. అందుకని అన్యాయాన్ని, అధర్మాన్ని పెంచి పోషించే పనులకు స్వస్తి చెప్పడమే మంచిదౌతుంది. అప్పుడే అటు తోటివారి దగ్గర, భగవంతుని దగ్గర మంచివారనే మాటతో పాటు వార్కికై

వారికి మనశ్శాంతి దొరుకుతుంది. ఎవరూ ఎక్కడా కొనుక్కోలేని మానసిక తృప్తి వారిదౌతుందనడంలో సంశయం ఉండదు.

అందుకే సత్యం పలకడం, తోటి మానవులకు చేతనైనంత సహాయపడటం, ఆర్థికంగా ఒకరిమీద ఆధారపడి వుండవలసిన అవసరం లేని వ్యాపకం చేపట్టడం, తనకున్న దానిలో తనవారిని పోషించుకుంటూ మిగిలిన సంపాదనలో కొంత దానధర్మాలు చేయడం వంటి ధార్మిక క్రియలు ఆధ్యాత్మిక సుగంధాన్ని ఆపాదిస్తాయి. మనస్సుకు ఆనందాన్ని పంచి ప్రశాంతతను చేకూర్చే దేవాలయాల సందర్శన, మంచి పుస్తకాలు చదవటం, సత్సంగం వంటి వ్యాపకాలు సాధనలో భాగంగా మనసుకు అలవాటు చేయాలి. ఈ వ్యాపకాలు తొట్టతొలుత కష్టమనిపించినప్పటికీ సాధన వల్ల మనసు కాలగతిన ఈ కార్యక్రమాలను ఇష్టపడుతుంది. ఆచరించడానికి మొగ్గు చూపుతుంది కూడా! "తీయగా తీయగా రాగం, మూల్గగా మూల్గగా రోగ"మన్నట్లు మంచి అలవాట్లను ఒంటబట్టించుకున్న మనస్సు సత్కార్యాచరణకు క్రియాశీలత ప్రదర్శిస్తుంది. క్రమశిక్షణ క్రమేణా మనస్తత్వంగా మారుతుంది. ఈ దిశగా సాధన చేసి మనస్తత్వసి(శు)ద్ధి పొంది ఆధ్యాత్మిక ప్రయోజనాలను కైవసం చేసుకుందాం!

*ఆంధ్రభూమి, 13.07.2010*

# మానవాళికి మహోపకారం

ఆయుర్వేదం వేదాలలో అంతర్భాగం. ప్రాచీన కాలం నుండి మానవుని జీవన సరళిని, జీవిత పరిమాణాన్ని ప్రమాణాలను నిర్దేశిస్తున్న మహాశాస్త్రం ఆయుర్వేదం. దేవదానవులు పాల సముద్రాన్ని మథించినపుడు ఉద్భవించిన మహాపురుషుడు ధన్వంతరి సాక్షాత్ శ్రీమన్నారాయణుడే! అమృత పానం వల్ల అమృతత్వం సిద్ధిస్తుంది కానీ ఆయుర్వేదం ఆకలిని, దప్పికను, రోగాలను ఎలా నియంత్రించుకోవాలో, మరణాన్ని ఎలా వాయిదా వేసుకోవాలో తెలియజెప్పే ఆరోగ్య శాస్త్రం. ధన్వంతరి అధిష్టాన దేవత కాగా చరకుడు, శుశ్రుతుడు వంటి మహనీయులు ఆయుర్వేదాన్ని అభివృద్ధి పరచి ప్రాచీన భారతీయ వైద్యానికి ఆది గురువులయ్యారు. దివ్యమైన సోమలత (సంజీవనీ మూలిక) ఎలా బాహ్య పరిచర్య ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలో నిర్దేశించేది కాగా అంతర్ముఖంగా సహస్రారంలో వుండే సహస్ర దళ పద్మాన్ని సంకేతపరుస్తుంది.

ప్రాచీన ఆయుర్వేద వైద్యం నుంచి కాయకల్ప చికిత్స, రసాయన చికిత్స, తంత్ర చికిత్స, యోగ, ధ్యానం వంటి ప్రక్రియలు ఉద్భవించాయి. ఆయుర్వేదానికి అధిష్టాన దేవత ధన్వంతరే అయినా దక్షిణామూర్తి, అశ్వనీదేవతలు ఈ వేద శాస్త్రాన్ని అనుగ్రహ వీక్షణం ద్వారా పరిరక్షణ చేస్తున్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో శ్రీ ధన్వంతరి దేవాలయం వుంది. ధన్వంతరి శ్రీమన్నారాయణుడి అవతారం. ఓ మహర్షి శాపఫలితంగా దేవతలు అమృతత్వాన్ని కోల్పోయి జరామరణాలు, ఈతిబాధలు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొనడం ప్రారంభమైందట! వారు వెళ్ళి దేవగురువు బృహస్పతితో మొరపెట్టుకున్నారు. తమకు పూర్వవైభవం రప్పించాలనీ, జరామరణాల నుండి కాపాడాలని వేడుకున్నారు. బృహస్పతి, వారు పాలసముద్రాన్ని మథించాలని, అలా మథిస్తే అమృతం ఉద్భవిస్తుందని, దానిని సేవించి దేవతలు పూర్వవైభవం ప్రాప్తించుకోవచ్చునని సలహా ఇస్తాడు. అయితే సముద్ర మథనం చేయడానికి వారికి రాక్షసుల సహాయం అనివార్యమైంది. మంథర అనే పర్వతాన్ని కూర్మరూపుడై శ్రీ మహావిష్ణువు తన వీపుపై మోయగా కవ్వంగా చేసుకుని, వాసుకి అనే మహాసర్పాన్ని కవ్వపు చిలుకు తాడుగా చేసుకుని పాలకడలిని చిలకడం ప్రారంభించారు. ఎన్నో విలువైన వస్తువులు, ఉపాధులు సాగరం నుండి ఉద్భవించాయి. అలా ఉద్భవించిన ఉపాధులలో చతుర్భుజాలతో అవతరించిన ధన్వంతరి ఒకరు. ఒక చేతిలో అమృత భాండాన్ని, రెండవ చేతిలో శ్రీచక్రాన్ని, మూడవ చేతిలో శంఖాన్ని, నాలుగవ చేతిలో జూలుకాన్ని

(అపరిశుద్ధ రక్తపానం చేసే జలగ) కలిగి ఉండి ప్రత్యక్షమయ్యాడు. దేవతలకు అమృతాన్ని ప్రసాదించిన ధన్వంతరి ఆయుర్వేదాన్ని మానవాళికి అందించాడు. కొన్ని దేవాలయాలలో శ్రీ మహావిష్ణువు మరో రూపమయిన మోహినిని ధన్వంతరి స్త్రీరూపంగా ఆరాధిస్తారు. ఆయురారోగ్యాల కోసం ధన్వంతరిని ఆరాధన చేయాలి.

*ఆంధ్రభూమి, 12.07.2010*

# శ్రద్ధ - ఓరిమి

“శ్రద్ధా వాన్ లభతే జ్ఞానం” అన్నది గీతావచనం. జ్ఞానమే కాదు, శ్రద్ధగల వారికి ఏ కార్యమైనా సిద్ధిస్తుంది. మనిషి సత్కార్యం చేయాలనుకున్నప్పుడు మొదట ఆ పని యొక్క ప్రయోజనాన్ని తాను నమ్మవలసి వుంటుంది. నమ్మినప్పుడే ఆ కార్యం పట్ల అభిలాష పెంచుకోవడం, అన్ని కోణాలనుంచి ఆ కార్యసిద్ధికి అవసరమయిన ప్రతీ చర్య సంప్రీతితో చేయడం జరుగుతుంది. శ్రద్ధతో చేసే పని తప్పక నెరవేరుతుందని పెద్దలు చెబుతారు.

‘విద్యాతురాణాం న సుఖం న నిద్రా’ ప్రవచనం కూడా ఈ కోణంలోనే ప్రాధాన్యత సంతరించుకొని వుంది. ఇటీవలి కాలంలో ఉద్భవించిన మహా గురువు శ్రీ షిర్డీ సాయిబాబా కూడా ఆధ్యాత్మిక ప్రగతికోసం ముముక్షువు శ్రద్ధ, సబూరి అను సద్గుణాలు కలిగి వుండవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించడం జరిగింది.

శ్రద్ధ వలన మోక్షప్రాప్తికి అవసరమయిన జ్ఞానం లభించడమే కాక ఐహిక సంపదకవసరమైన లక్ష్యశుద్ధి కూడా సంప్రాప్తమవుతుంది. అటు మోక్షప్రాప్తికి గానీ, ఇటు లౌకిక వ్యవహార సిద్ధికి గానీ శ్రద్ధతో పాటు ఓరిమి కూడా అవసరమని ఆయన ఉద్బోధిస్తారు.

శ్రద్ధగలవారు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక బలం కూడా కలిగి వున్నప్పుడు లక్ష్యప్రాప్తి కోసం చేసే ప్రయత్నంలో ఉత్పన్నమయ్యే కష్టనష్టాల పట్ల సహనం కలిగి ప్రవర్తించే సామర్థ్యం వెల్లడవుతుంది.

సమస్యలు మనిషికి రాక మానులకు వస్తాయా అన్న నానుడిలో నిజం ఎంత వున్నా తనదాకా వస్తేగాని తెలిసిరాదన్నట్లు సమస్యలు వచ్చినప్పుడు మనిషి మానసికంగా క్రుంగిపోయే అవకాశం వుంది. ఈ కృంగిపోవటమన్నది మానసిక స్థైర్య స్థాయిని బట్టి మనిషి మనిషికీ మారుతుందే తప్ప కష్టనష్టాల సమయంలో అస్సలు ప్రభావితం కాని మనిషంటూ ఉండడు. నూటికో కోటికో ఏ స్థిత ప్రజ్ఞుడో తప్ప!

‘ఇష్టమయితే కష్టం కాదంటారు’ జిల్లెళ్ళమూడి అమ్మ. కష్టాలు అనుభవించడం, ఆ సమయంలో ఓర్మి ప్రదర్శించడం తాను అమితంగా ఇష్టపడే వారి కోసం అయినప్పుడు మనిషి ప్రవర్తనలో ఎంతో వైచిత్రి కనబడుతుంది. తన బిడ్డ కోసం తల్లి పడే ఆరాటం, యావ ఆ కోవలోదే! అది తల్లికే స్వంతమయిన సద్గుణం !

సత్పురుషులతో పాటు దైవం మెచ్చే పనులు చేయాలని భావించే ముముక్షువులు జీవనయానంలో కాలగతిన సంప్రాప్తించే ఒడిదుడుకులను భగవత్ ప్రసాదంగా భావిస్తారే

తప్ప ఆ దుఃఖాలను దుఃఖాలుగా భావించరు. ఈ రకంగా ఇష్టకార్యసిద్ధి పట్ల సాధకుడు శ్రద్ధ కలిగి వుండటం చాలా సహజమైన విషయం.

శ్రద్ధ, ఓర్మిలతో సాధన బాటలో వున్న ముముక్షువులు భగవంతునికి ప్రీతిపాత్ర మవుతారని సాయి సచ్చరిత్ర వివరిస్తుంది. శ్రీ సాయిబాబా తన మనసును దోచిన శ్రద్ధాళు వులయిన భక్తులను 'బావూ' (సోదరా) అని పిలిచేవారట! కాగా శ్రీ రమణ మహర్షి అలాంటివారితో పాటు ప్రతీ జీవిని 'వారు' అని సంబోధించడం చేసేవారట.

భగవంతునికి ప్రీతిపాత్రమైన వ్యక్తిని సమాజంలో ఆప్తునిగా పరిగణించగల అవకాశం వుంది. లౌకిక భావనకు, ఆధ్యాత్మిక భావనకు మధ్య వున్న వ్యత్యాసం వల్ల సత్పురుషులు లోకులచే ఒక్కొక్కప్పుడు అపార్థం చేసుకోబడినప్పటికీ యదార్థం గ్రహించడానికి పట్టే కొంత సమయం తర్వాత వారి సౌహార్ద్రత తెలుసుకోబడి పారమార్థికోన్నతి గుర్తింపబడటమే కాక ఐహికంగా కూడా వారు రాజపూజ్యత పొందగలుగుతారు.

తనను ఆశ్రయించిన భక్తులను శ్రీ సాయిబాబా మంత్రోపదేశాల కోసం తాపత్రయ పడవద్దనీ, సద్గురువు దొరికాక ఎవరినీ కూడా మంత్రం ఉపదేశించవలసినదిగా అర్థించవద్దనీ, శ్రద్ధ, ఓర్మితో సద్గురువును సేవించి తరించవలసి మాత్రమే వుంటుందని ఉద్బోధిస్తారు. సమాధి చెందిన సద్గురువును సేవించటమంటే నిష్ఠ, ఓరిమిలతో ఆయన ప్రవచించిన ఉపదేశాలను మనసా, వాచా, కర్మణా ఆచరించి తాను తరించాలనీ, ఇంకా మోక్షగాములకు మార్గనిర్దేశనం చేయగలిగే మహద్భాగ్యం పొందాలనీ అర్థమవుతుంది.

*ఆంధ్రభూమి, 17.07.2010*

# దైవాన్వేషణ

సృష్టి జరిగినప్పటి నుంచి మనిషి దైవాన్ని అన్వేషిస్తూనే వున్నాడు. అన్వేషణ ఫలించినవారు కొందరు మహాభక్తులుగా కీర్తిగడించారు. కొందరి అన్వేషణ స్ఫూర్తివంతం కాగా, మరికొందరు దైవ నామాన్ని జపించడమే ధ్యేయం కానీ, ఫలితం గురించి కాదన్న విధంగా సాధన చేశారు. గంగావతరణం కోసం భగీరథుడు విశ్వప్రయత్నం చేసి సఫలీకృతుడయ్యాడు. సక్కుబాయి ప్రపంచ దృష్టిలో భర్త ఎవరయినప్పటికీ, భగవంతునే భర్తగా ఆరాధించి తరించింది.

భక్తిభావం సృష్ట్యాదినుంచి అనూచానంగా సంక్రమిస్తూనే వున్న సద్గుణం, సదాచారం. నిజభక్తులు అనాదినుంచీ వున్నారు. ఈనాడూ ఉన్నారు. పూర్వయుగాల్లో భగవంతుడు కావాలనిపించి, ఆయనను వాంఛించి, పొందే ప్రయత్నం చేసి సఫలీకృతులయిన వారు ఎందరో వుంటే, నేడు భగవంతుడు వున్నాడా లేదా అనే సందిగ్ధంతో విలవిలలాడే వారే అనేకులు! భగవంతుడు వున్నా, లేకున్నా ఆయనను ప్రార్థిస్తే, ఒకవేళ వుంటే గనుక కరుణించకపోతాడా? లబ్ధి చేకూరకపోతుందా? అనుకునేవారు మరికొందరు. అది వారి తప్పని చెప్పేందుకు బలమైన ఆధారాలు కూడా లేని సంకటభరిత స్థితి నేటి కాలానిది! మనిషిని అనాదినుంచీ నాస్తికవాద భూతం తరిమి వెన్నాడుతూనే వుంది. ఎన్నో భౌతిక వస్తు ఆవిష్కరణలు, ప్రాపంచిక సాంకేతిక సౌలభ్యాలు అందివచ్చి మనిషికి దైవం ఉనికిని, సత్యాన్ని తెలియకుండా అడ్డుకుంటున్నాయన్నది నిజం! ఎదురుగా మనిషి లేకుండా దూరవాణి వినగలుగుతున్నాడు. సుదూర దర్శనం చేయగలుగుతున్నాడు. ఆకాశంలో ఎగరగలుగుతున్నాడు. చంద్రాది సౌమ్య గ్రహాలపై కాలూనగలిగాడు. చందమామమీద రాయి, రప్ప తప్ప మరేమీ లేవు. సూర్యకాంతి పరావర్తనం వల్ల ఆకాశంలో జాబిల్లి రాత్రివేళ దర్శనమిస్తోంది కానీ చంద్రుడు దేవత కాదన్న శాస్త్రజ్ఞుల అభిజ్ఞత దైవం వున్నాడో లేడో నిర్ధారణ చేసుకోగలిగే విషయంలో సందిగ్ధత వున్నవారి మనస్సుల్లో నాస్తిక బీజాలు నాటుతోంది.

పున్నమినాడు, అమావాస్యనాడు, సాగరుడు చందమామ ప్రభావంతో పరవశించి ఉరకలేస్తాడు, పరుగులీనుతాడు అని ఆస్థిక కోణంలో పండితులు చెబితే, అది అయస్కాంత శక్తివల్ల జరుగుతున్న పరిణామమే కానీ అందులో దైవకార్యం ఎంతమాత్రమూ లేదంటారు ఆధునిక శాస్త్రవేత్తలు! సగటు మనిషి జ్యోతిష పండితులు చెప్పినదీ వింటున్నాడు,

భౌతికశాస్త్రవేత్తలు చెప్పినదీ వింటున్నాడు తప్ప అతని తర్కానికి అందుతున్న సత్యం మాత్రం సందిగ్ధపూర్ణమే! ఏది ఏమైనప్పటికీ ఆశాపూర్ణమయిన వస్తువు 'ఉన్నది' అన్న దానిలో వున్న పరిపూర్ణత 'లేదు' అన్న దానిలో వుండదుకదా! భగవంతుని ఉనికి చూచిన వారెవ్వరూ మనకు తెలియదు కొండొకచో వున్నప్పటికీ మనం ఆ నిజాన్ని నమ్మం! దైవం ఉనికిని నమ్మినపుడు ఆశావాద దృక్పథపు లాభాలన్నీ మనిషికి అందుతాయి. నిరాశావాదం తత్‌భిన్నంగా చెడుశక్తిని మనిషిలో నింపుతుంది. కాబట్టి దైవం ఉన్నాడనే సిద్ధాంతాన్ని బలపర్చడం ఆ లాభాలన్నిటినీ మనిషికి సమీకృతం చేస్తుంది.

దైవాన్ని నమ్మిన మనిషి దేవాలయాలకు వెళ్ళి భగవద్ధర్శనం చేసుకొనేవేళ మరో తప్పిదం చేస్తున్నాడు. మచ్చుకు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి తిరుపతి వెంకన్న దర్శనం కోసం వెళ్ళే భక్తులు గంటల తరబడి వరుసల్లో నిరీక్షించి, నిరీక్షించి లఘు – మహాలఘు ధర్శనాల వేళ తమ వంతుగా లభించే రెండో మూడో క్షణాల సమయంలో కళ్ళు మూసుకు ప్రార్థిస్తూ అందినంతలో శ్రీవారి దర్శన సంపూర్ణ భాగ్యాన్ని కోల్పోతున్నారు. వేయికళ్ళు చేసుకొని ఆ రెండు మూడు సెకన్ల వ్యవధిలో సృష్టి – స్థితి – లయ కారకుడైన పరంధాముని వీక్షించి సార్ధకత పొందే ప్రయత్నం చేయాలి. జగతిలో అణువణువూ భగవంతుడే గనుక దేనికివ్వవలసిన ప్రాధాన్యత దానికిస్తూ, ఎవరికందించవలసిన ప్రాముఖ్యత వారికందిస్తూ, అస్తికులకు జీవితమంతా భగవంతుని అన్వేషణలోనే గడుస్తుందనీ, ఎప్పుడు దైవం లభిస్తుందో అది ఎవరికీ తెలియని మర్మమని గ్రహించి ఆశావాద దృక్పథంతో ఆధ్యాత్మిక బాటలో ముందుకు సాగవలసిన అవసరం ఎంతో వుంది.

*ఆంధ్రభూమి, 03.08.2010*

# సత్వగుణంతో సమాజశాంతి

నేరం చేసేవాడు తనను ఎవరూ చూడటంలేదని, గమనించడం లేదనీ భావిస్తాడు. ఓ నేరస్థుడు నేర సమయంలో ఎవరూ లేరు గనుక, తననెవరూ చూడనందువలన తనపై నేర నిరూపణ కాజాలదనీ, తను తప్పించుకు తిరుగవచ్చుననీ భావిస్తాడు. మానవుల్లో ఈ ధోరణి అంతర్లీనంగా ఉండకపోతే అసలు నేరం చేసే పరిస్థితే ఉత్పన్నం కాదు. ఒకవేళ నేర నిరూపణ జరిగితే తను శిక్షను స్వీకరించేందుకు మానసికంగా సిద్ధపడిన సందర్భంలో కూడా ఒక వ్యక్తి నేరానికి పాల్పడతాడు. అయితే తెలుసుకోవలసిన నిజమేమిటంటే సృష్ట్యాదినుంచీ నేరానికి శిక్షపడుతూనే వుంది. అది ఆ దేశాన్నీ, లేక ప్రాంతాన్నీ పరిపాలించే ప్రభువుల చేత విధింపబడగల శిక్ష అయితే దానిని తప్పించుకునే అవకాశం వుంటుందేమో గానీ, భగవంతునిచే ప్రకృతి ధర్మంగా జరిగే చర్యవల్ల విధింపబడే శిక్షను తప్పించుకోవటం ఎవరికీ సాధ్యంకాదు. యుగ యుగాలుగా ఇదే జరుగుతూ వస్తోంది. మాయోపాయం చేత శకుని, దుర్యోధనాదులకు ద్యూతక్రీడలో విజయం సాధించిపెట్టినప్పటికీ శకునిగానీ, దుర్యోధనుడు తన తొంభయి తొమ్మిది మంది సోదరులతో సహా కానీ, ధర్మపక్షపాతులయిన పాండవుల చేత నిహతులు కాబడటం మహా భారత కథ నివేదిస్తుంది. కామపిశాచి ఆవహించిన కారణంగా పరదారను కాంక్షించిన బ్రహ్మ అంతటి రావణాసురుడు శ్రీరాముని చేత శిక్షింపబడిన ఉదంతం లోక విదితం!

చెడు అనేది తమోగుణ స్వరూపం. తమస్సనగా చీకటి, చీకటి నేరాలు చేసేవారు తమోగుణం ఆవహించిన కారణంగా మంచి చెడుల మధ్య వ్యత్యాసం తెలుసుకోలేక నేరాలకు పాల్పడుతూ వుంటారు. దైవమంటే వెరపు లేని రాజు రాజ్యపాలన చేస్తున్నప్పుడు మంచివాడు దైవాన్ని, బహిరంగంగా ఆశ్రయించడానికి భయపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

వేదకాలంలో రాక్షసులు, దేవతలు అనే రెండు పరస్పర విరుద్ధ శక్తుల ఉనికి ఉండేది. దేవతలు సత్వగుణ స్వరూపులుకాగా, రాక్షసుల చేత వారి మంచితనం అసమర్థతగా భావింపబడిన సందర్భంలో రాక్షసులు, సురులను బాధించినప్పటికీ అంతిమ విజయం మాత్రం దేవతలను వరిస్తూనే వుండేది. నేటి కాలంలో రాక్షసులు, దేవతలు అనేవారు విడివిడిగా లేకపోయినప్పటికీ, మానవులలో వారిద్దరి స్వభావాలు మిళితమై వుండటం చూస్తాం. అసుర స్వభావం పెచ్చుమీరినపుడు దుష్టులుగా, సత్వగుణం శోభిల్లినపుడు మంచివారి గాను మనుష్యులు పరిగణింపబడుతున్నారు.

మృదు స్వభావి, సత్వగుణశీలి, హరిభక్తుడు అయిన ప్రహ్లాదునికి దేహరీతిగా తండ్రి అయిన హిరణ్యకశిపుడు దుష్ట రాక్షస అకృత్యాలకు మారు రూపమైన శిక్షలు వేసినప్పటికీ భగవత్ కృపకు పాత్రుడైన కారణంగా చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

ప్రకృతిలో ఎన్నడూ దౌష్ట్యంపై మంచితనానికి, చీకటిపై వెలుతురుకు, దుఃఖంపై ఆనందానికి, జగడాలు, ఆగడాలపై సౌజన్యానికి పైచేయి వుండటం చరిత్ర, యితిహాసాలు గమనిస్తే తెలుస్తుంది. ధరిత్రిలో ఉత్పాతాలు జరిగిన తరువాత పరిస్థితి చక్కబడి ప్రశాంతి నెలకొనడం ఓ ప్రకృతి నియమం. యుద్ధం తరువాత శాంతి ఆవిష్కృతం కావడం తప్పనిసరి. ప్రాణికోటిని వణికించే పెనుతుఫాను ఎప్పటికైనా వీగిపోక తప్పదు. చండ ప్రచండ గ్రీష్మం తరువాత ఋతుపవనాలు రావటమూ, విశ్వంభర చల్లబడటమూ ప్రకృతి ధర్మం. క్రూరంగా రాజ్యాలేలిన ఎందరో నియంతలు నిష్క్రమణం పొంది జనావళికి ప్రశాంతి సిద్ధించి ఆనందపూర్ణత పొందటం చరిత్రోదంతాలు మనకు నివేదిస్తాయి.

చెడు. ఏ రూపంలో ఉన్నప్పటికీ ఏనాటికైనా మంచికి, సదాచారానికి అడ్డుతొలగక తప్పదు. కాగా మంచి నశించిన దాఖలా ఏ పురాణాల్లోనూ కనబడదు. చెడు అస్థిత్వం కేవలం తాత్కాలికం. నేటి యుగంలో మనిషి హృదయం మంచిదైనప్పటికీ అంతర్లీనంగా ఎంతో కొంత చెడు వుండనే వుంటుంది. ఆ కాస్త చెడును కూడా తొలగించుకొని మంచితనం ఆవిష్కరింపబడాలి. అప్పుడే ప్రశాంత జీవనం లభ్యమై మనిషి ఆనంద జీవనం చేయగలిగే అవకాశం వుంటుంది.

*ఆంధ్రభూమి, 06.09.2010*

# భగవంతుని చేరడానికి దివ్య మార్గమే మతం

దైవ సంకల్పం ప్రకారం నిర్ణయమైన ఈ ప్రపంచం చాలా గొప్పది. ఆధ్యాత్మికపరంగా మనిషికి పథం చూపేందుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి. అవే మతాలు! స్వామి వివేకానంద చెప్పినట్లుగా భగవంతుని చేరడానికి అనేక మార్గాలుండడం వల్ల ముముక్షువుకు జ్ఞానార్జన సుగమమైంది. తనకు నచ్చిన తాను ఎన్నుకున్న మార్గాన్ని అనుసరించడానికి అవకాశం ఏర్పడింది.

సకల మతాల సారం ఒక్కటే. కొన్ని తేడాలతో భగవంతుని గురించిన మూల సిద్ధాంతంలో ఎలాంటి మార్పు లేకుండా అన్ని మతాలు ఒకే సారాన్ని బోధించాయి. భగవంతుని చేరడానికి సాధకునికి సులువైన దివ్యమార్గం చూపే దిక్సూచులే మతాలు. అయితే మతం మనిషిని బానిస చేసుకున్న సందర్భాల్లో దుష్టమార్గాన్ని అనుసరించి విలయం సృష్టించాడు మానవుడు. యుద్ధాలు చేశాడు, తలలు నరికాడు, విచక్షణా రహితమైన ప్రవర్తనతో తను అనుష్ఠించే మత ఆదర్శాలనే దెబ్బతీశానిన తెలుసుకోలేని అజ్ఞాని అయ్యాడు. తలలు నరకమని ఏ మతమూ చెప్పలేదు. ఇతరుల నుంచి నీకెలాంటి ప్రవర్తన నచ్చుతుందో అలా నీవు ప్రవర్తించాలని జీసస్ చెప్పడం మనకు తెలుసు. మతం కోసం ప్రాకులాడిన వ్యక్తి మతం కోసం అకృత్యాలకు పాల్పడిన మనిషి తన మతం నిర్దేశించిన అహింస, సత్యనిష్ఠ వంటి మూల సూత్రాలను వమ్ముచేసి తనను తానే కించపరుచుకుంటున్నాడని గ్రహించలేక పోయాడు. భగవంతుడు ఒక్కడే.. ఆయనను చేరే రాచబాటలే మతాలు. 'నారాయణ నారాయణ, అల్లా అల్లా!...' అనే గీతంలో దేవులపల్లి మతసహనం గురించి చెబుతూ 'మతం వలన మనిషికి హితం కలగని పక్షంలో మతం వద్దు, మాయామర్మం వద్దు' అంటారు. రామకృష్ణ పరమహంస వంటి మహాపురుషులు చేసిన మార్గదర్శకాలు మానవాళికి ముక్తి పథాన్ని చూపించగలుగుతున్నాయి. తన మతం పట్ల విధేయత, అన్యమతాల పట్ల ఆదరణతో ప్రవర్తించినప్పుడు ముముక్షుత్వం సాధించడానికి అవసరమైన కల్లోల రహిత ప్రశాంత వాతవరణం ఏర్పడి సాధన క్రమం సుగమం కాగలదన్న సత్యాన్ని విమర్శించకూడదు.

*ఆంధ్రభూమి, 15.09.2010*

# అనంత పద్మనాభుడు

వర్ష ఋతువు ద్వితీయార్ధమైన భాద్రపద శుక్ల చతుర్దశి రోజును అనంత చతుర్దశి పర్వదినంగా పిలుస్తారు. ఈ పర్వదినం నాడు పాలకడలిపై పవ్వళించి నాభికమలంలో బ్రహ్మస్థితుడై వుండగా యోగనిద్ర నటిస్తున్న శ్రీ మహావిష్ణువును భక్తులు పూజించి, కీర్తించి తరిస్తారు. అలా అనంతశయనుడైన శ్రీ మహావిష్ణువును అనంత చతుర్దశినాడు భక్తులు చేసే కొలువు, వ్రతమూ అనంత పద్మనాభ స్వామి వ్రతంగా చెప్పబడుతోంది. వరుసగా పదునాలుగు సంవత్సరాలపాటు ఈ చతుర్దశి రోజున వ్రతం ఆచరించిన భక్తులను శ్రీ మహావిష్ణువు ఆజన్మాంతం కాచి రక్షిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

మాయాద్యూతంలో తన సర్వస్వాన్ని దుర్యోధనునికి పణంగా పెట్టి సమస్తం కోల్పోయిన, రాజ్యభ్రష్టులైన పాండవాగ్రజుడు ధర్మరాజుకు శ్రీకృష్ణ పరమాత్మ, వారు కోల్పోయిన సిరిసంపదలను పునఃప్రాప్తింపజేసుకొనేందుకు అనంత పద్మనాభ వ్రతం ఆచరింపమని చెప్పినట్లు తెలుస్తుంది. అనంత శయన మూర్తిని లక్ష్యం చేసుకొని వ్రతమాచరించు భక్తులు 14 పోగులు లేక 14 ముడులు కలిగిన అనంత దారాలను చేతికి ధరించి పూజ నిర్వహిస్తారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారు పాదాలు వత్తుతుండగా, శేషునిపై పవ్వళించిన స్వామి అనంతుడై అనంతమైన కష్టాలు అనుభవించే భక్తుల మనోరధాలు ఈడేర్చి దుఃఖ నివృత్తి చేస్తాడు. ఈ పండుగలో పదునాలుగు (చతుర్దశి) సంఖ్యకు చాలా ప్రాధాన్యత వుంది. తోరాలుగా ధరించే దారాలు 14, ముడులు 14, పదునాలుగు రకాల ఫలాలు, 14 రకాల పిండివంటలతో నైవేద్యం, 14 సంవత్సరాల పాటు ఈ వ్రతాన్ని ఆచరించవలసి వుండటం ప్రాధాన్యతను సంతరించుకొని వుంది. ఈ వ్రతకల్పంలో భాగంగా, చక్కగా ఆవుపేడతో ఇంటి ఈశాన్య భాగంలో శుభ్రంగా అలికి, వరిపిండితో ముగ్గులు పెట్టి శుచి శుభ్రత కలగివున్న పీఠాన్ని ఏర్పరుస్తారు. పసుపు కుంకుమలతో పీఠాన్ని అలంకరించి రంగువల్లులద్ది రెండు కలశాలు స్థాపన చేస్తారు. ఒకటి స్వామిని ఆవాహన చేసేందుకు, రెండవ కలశం శ్రీ మహాలక్ష్మిని ఉద్దేశించి ఏర్పరచబడుతుంది. కలశాలలో నదీజలం నింపి వాటితో ఎండు ద్రాక్షలు, బంగారు రూపులు ఉంచుతారు. పసుపు కుంకుమలు, 14 నాగవల్లీ దళాలతో అలంకృతమైన కలశాలపై నారికేళాలు ప్రతిష్ఠించి స్వామివారిని అమ్మవారిని ఆవాహన చేయడం జరుగుతుంది. కుడిచేతికి పురుషులు, ఎడమచేతికి స్త్రీలు ఎర్రదారాలు ధరించి అనంత పద్మానాభుని అర్చిస్తారు. ఈ దారాలను నాగదారాలుగా

కూడా పిలవడం కద్దు. ధర్మజునికి స్వామి వ్రతకథను ఈ విధంగా వివరిస్తాడు. కృతయుగటంలో శ్రోత్రియుడైన సుమంతుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. భృగు మహర్షి పుత్రిక దీక్షాదేవిని అతడు వివాహమాడాడు. వారికి ఓ పుత్రిక కలుగగా 'శీల' అనే పేరు పెట్టారు. శీల దైవభక్తి కలిగి సౌశీల్యంతో ప్రవర్ధమానమగుచూ వివాహ యోగ్యత పొందుతుంది. కొంతకాలానికి కౌండిన్యుడనే మునితో ఆమె వివాహం జరిగింది. కౌండిన్యుడు సదాచార సంపన్నురాలగు శీలను తన ఆశ్రమమున్న ప్రదేశానికి కొనిపోవుచు ఓ నదీ తీరంలో సంధ్యావందనాదికాలు ఆచరించుటకై విశ్రమించగా అక్కడ అనేకమంది స్త్రీలు ఎర్రని దీక్షవస్త్రాలుధరించి ఓ వ్రతపూజ చేయుచుండగా శీల ఆకర్షితయై వారిని వివరములడిగినపుడు ఆ వనితామణులు తామాచరించుచున్నది అనంత పద్మనాభస్వామి వ్రతమనియు భాద్రపద శుద్ధ చతుర్దశినాడు ఆ వ్రతం ఆచరిస్తే అనంతమైన సత్ఫలితాలు అందుతాయని చెబుతారు. ఆ వ్రత ఆచరణలో భాగంగా శంఖ చక్రధారి, ఆదిశేషునితో కూడినవాడునునైన శ్రీ మహావిష్ణువును షోడశోపచార సహితంగా అర్చించి గోధుమపిండితో 28 అతి రసములను నివేదన చేసి, 14 అతిరసములను యోగ్యుడైన బ్రాహ్మణునకు దానము చేసి మిగిలిన వానిని తాను భుజింపవలసినదిగా చెబుతారు. శీల తక్షణమే స్నానమాడి వ్రత ఆచరణకు ఉద్యుక్తురాలవుతుంది. తదుపరి భర్తతో కూడి తమ ఆశ్రమానికి వెళ్ళి చూడగా ఆశ్రమం అంతా స్వర్ణమయంగాను, లోగిళ్ళు అష్టైశ్వర్య సంపన్నంగాను కనిపిస్తాయి. శీల, కౌండిన్య దంపతులు సంతోషభరితంగా సుఖ జీవనం చేయసాగారు. ఒకనాడు కౌండిన్యుడు దురాలోచనాపీడితుడై వివేకం నశించగా ఆమె ధరించి వున్న ఎర్రదారంఎందుకు ధరించింది? అని అడుగగా ఆమె దానిని అనంత పద్మనాభస్వామి దీక్షాదారంగాను, ఆ స్వామి అనుగ్రహంతోనే తాము ధన ధాన్య సంపన్నత పొందామని చెబుతుంది. కౌండిన్యుడు ఆమెను, అనంత పద్మనాభుని దూషించి తోరమును తెంచి అగ్నిలో పడవేస్తాడు. ఫలితంగా వారి ఐశ్వర్యం దొంగలపాలవుతుంది. దరిద్రము ఆవహించి దుఃఖం పొందుతారు. మతి చలించినవాడై ఆరణ్యంలో చెట్టును పుట్టను పక్షిని అనంతుని జాడ చెప్పమని విలవిలలాడుతాడు. స్వామికి అతని దీన స్థితి చూసి కృప కలిగి వృద్ధ బ్రాహ్మణ వేషధారియై వచ్చి తన నిజస్వరూపం చూపిస్తాడు. గరుడారూఢుడు, శంఖ చక్రధారియునైన అనంతుని చూచి కౌండిన్యుడు మనసు కరిగి అమిత సంతోషంతో స్వామిని కీర్తిస్తాడు. తదుపరి 14 సంవత్సరాలు స్వామి వ్రతమాచరించి కౌండిన్యుడు నక్షత్ర మండలంలో స్థిర నివాసం పొందాడని వ్రతకథగా తెలుస్తుంది.

*ఆంధ్రభూమి, 22.09.2010*

# సౌభాగ్య ప్రదాయిని

**శ్రావణ** మాసానికి ఓ ప్రత్యేకత వుంది. అదేమంటే ఈ మాసంతో వర్షఋతువు ప్రారంభమవుతుంది. ప్రజలు వర్షాలు పడగానే సస్య సమృద్ధితో పాడి పంటలు కలిగి విలసిల్లాలని భగవంతుని ప్రార్థించే నేపథ్యంలో వివాహిత స్త్రీలు తమకు అష్టైశ్వర్యాలు కలగాలని వరప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మిని 'వరలక్ష్మి'గా అర్చిస్తారు. వ్రతం నిర్వహిస్తారు. ఈ వ్రతానికి ఓ పౌరాణిక నేపథ్యం వుంది. కైలాసంలో పరమేశ్వరుడు ఒకసారి అమ్మ పార్వతితో వున్న సందర్భంలో అమ్మ స్వామితో స్త్రీలు సౌభాగ్యంతో సుమంగళు లుగా నూరేళ్ళు వర్ధిల్లేందుకు వారు భూలోకంలో ఆచరించదగ్గ వ్రతం ఏమైనా వున్నదా? అని లోక హితార్థం ప్రశ్నించినపుడు కైలాసపతి శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు శ్రీ మహాలక్ష్మిని అర్చిస్తే వారు కోరిన సకల కోర్కెలు ఈడేరి స్త్రీలకు ఆయురారోగ్య సౌభాగ్యాలు కలుగుతాయని సెలవిస్తాడు. శ్రీ మహాలక్ష్మిని పూజించి సౌభాగ్యవతిగా విలసిల్లిన చారుమతి అనే పతివ్రత కథను స్వామి పార్వతీమాతకు వివరిస్తాడు.

పూర్వం చారుమతి అనే పతివ్రత, భక్తురాలు అయిన మహిళకు ఒక నాడు స్వప్నంలో మహాలక్ష్మి అమ్మవారు కనిపించి ఆమె సకల కోర్కెలు తీరుటకు వరలక్ష్మివ్రతం ఆచరించవలసినదిగా చెబుతుంది. అమ్మవారి ఆదేశానుసారంగా చారుమతి, భర్త సహకారంతో ఇరుగు పొరుగు వివాహిత సుమంగళులయిన స్త్రీలతో కలిసి వ్రతం చేసుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తుంది. ఆవుపేడతో ఇల్లు అలికి, బియ్యపు పిండితో చక్కని రంగవల్లులు తీర్చిదిద్దుతుంది. అందమైన కొత్త బట్టలు ధరిస్తుంది. పూజా మంటపాన్ని స్థాపించి పూలమాలలతో అలంకరిస్తుంది. పంచపల్లవాలతో కూడిన కలశానికి పసుపు కుంకుమలతో సొబగులద్దుతుంది. కలశంలో నీరు, బియ్యం కలిపి, కలశ ముఖంపై మామిడి ఆకులు, నాగవల్లి దళాలు పేర్చి, మంగళప్రదంగా పసుపు కుంకుమలతో నారికేళాన్ని అంకరించి కలశంపై స్థాపన చేస్తుంది. కుడి చేతికి తొమ్మిది పోగులతో గల తోరాలు తాను ధరించి మిగతా స్త్రీలతో ధరింపజేస్తుంది. పురోహితులు కలశంలోకి వరలక్ష్మీ మాతను ఆవాహన చేసి సంకల్పయుతంగా పూజ నిర్వహిస్తారు. లక్ష్మి అష్టోత్తర శతనామాలు పారాయణ చేస్తారు. అమ్మవారిని స్తుతిస్తూ నవవిధములయిన పిండి వంటకాలు నివేదన చేస్తారు. అమ్మవారికి శోడశోపచార పూజలో భాగంగా ధూపదీప నైవేద్యాలు సమర్పించి తాంబూల సమర్పణ చేస్తారు.

అనంతరం ముత్తైదువలు అందరూ ముమ్మారు వరలక్ష్మి అమ్మవారికి ప్రదక్షిణలు చేస్తారు. గజ్జెలందియల సుస్వనం వారికి వినిపిస్తుంది. వారి పాదాలకు గజ్జెలు అందియలు అలంకృతమై కనిపిస్తాయి. వారి హస్తాలకు నవరత్నాలతో కూడిన ఆభరణాలు అమరుతాయి. వారి లోగిళ్ళన్నీ సిరిసంపదలతో, దనధాన్య సంపదతో శోభిల్లుతాయి. చారుమతి అమితానందభరితురాలై వ్రతంలో పాల్గొన్న స్త్రీలకు, ఇరుగుపొరుగు కుటుంబాలలోని మహిళలకు దక్షిణ, తాంబూలాలు శక్తిమేరకు సమర్పిస్తుంది. ఇంటికి వచ్చిన ప్రతీ సువాసినీ సాక్షాత్తు వరలక్ష్మి అమ్మవారిగా భావించడం విశేషం! ఈ వ్రతంలో పాల్గొన్నస్త్రీలందరూ వారి కుటుంబాలతో కూడి సుఖ సంతోషాలతో జీవించినట్లు పరమేశ్వరుని వల్ల పార్వతీమాత తెలుసుకొని ముగ్దురాలవుతుంది.

తదాదిగా స్త్రీలు ఈ వ్రతాన్ని భారతదేశంలో ప్రతీ శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు యధాశక్తి జరుపుకుంటూ అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులౌతున్నారు.

ఈ పండుగను ప్రతీ హిందూ వివాహిత మహిళ ఆచరిస్తున్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాలయిన ఆంధ్ర, తమిళనాడు, కేరళ, కర్నాటకలతో పాటు ఒరిస్సా, మహారాష్ట్రల్లో ముఖ్యంగా జరుపుకుంటున్నారు.

ఈ వ్రత ఆచరణలో స్త్రీలు లోకహితం కోరి పూజాదికాలు నిర్వహిస్తారు. లోకహితంలోనే తమ హితం కూడా దాగి వున్నందున సువాసినులు ఈ వ్రత నిర్వహణ యందు ఎంతో మక్కువ చూపడం జరుగుతుంది. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు కొత్తగా వివాహమైన స్త్రీలు విధిగా జరుపుకుంటున్నప్పటికీ, ఇతరులు ఆ మాసంలో వచ్చే ఏ శుక్రవారం నాడయినా వరలక్ష్మి వ్రతం జరుపుకోవచ్చునని పెద్దల అభిప్రాయం! సువాసినులు పవిత్రమైన ఈ పూజా ఉత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొని వరలక్ష్మీమాత అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరుకుందాం.

*ఆంధ్రభూమి, 30.07.2010*

# కాలం - విలువ

ఓ లౌకికుడు మసీదు ముందర కూర్చుని మధువు గ్రోలుతున్నాడు. ఓ పారమార్థికుడు అటుగా పోతూ లౌకికుని చూశాడు. పవిత్రమైన మసీదు ముందు కూర్చుని అలా త్రాగడం తప్పని వారించాడు. లౌకికుడు "ఎందుకు త్రాగకూడదు? తప్పేమి"టని అమాయకంగా అడిగాడు. "నాయనా! అల్లాహ్ కొలువుండే మసీదు ముందు కూర్చుని మధువు త్రాగుతున్నావు. అది మహాపాపం కాదా?" అని ప్రశ్నించిన పారమార్థికునితో "భాయీ సాబ్! అలా అయితే నేను చేస్తున్నది తప్పే! కానీ అల్లాహ్ లేని చోటు చెబితే అక్కడకు పోయి హాయిగా త్రాగుతాను" అన్నాడు త్రాగుబోతు. పారమార్థికునికి నోట మాటరాలేదు. ఉమర్ ఖయ్యాం రచించిన రుబాయత్‌ల లోని ఓ సన్నివేశం ఈ ఘట్టం.

పవిత్రమైన పనులు, పవిత్రమైన చోట చెయ్యటం ఆధ్యాత్మిక బాటలో రివాజు. అయితే మనస్సును పవిత్రీకరించుకోవలసిన అవసరం ప్రత్యేకమయినది, ప్రతి మనిషికీ అవసరమూనూ. ఎందుకంటే తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేయగల సమర్థమయినది అదుపులేని మనస్సు. భగవంతుడు కేవలం ఒక ఆలయానికో, మందిరానికో, మసీదుకో పరిమితమై లేడన్నది వాస్తవం. మనిషి హ్రస్వదృష్టితో ఆయనను పరిమితం చేసుకుంటున్నాడంతే!

పవిత్రతకు, పాత్రతకు సంబంధించి కాలానిది కూడా ఓ ప్రత్యేక అంశమే. కొన్ని పనులు ఓ ప్రత్యేకమైన సమయంలోనే చేయాలి. పెద్దలు అన్నారు – 'కాలము', 'దేశమూ' అని! ఇక్కడ దేశమన్న పదం చోటును సంకేతపరుస్తుంది. ఆహారం స్వీకరించే సమయంలోనే ఆహారాన్ని సేవించాలి. విహరించవలసిన సమయంలోనే విహారం చేయాలి. నిద్రించవలసిన సమయంలోనే నిద్రకుపక్రమించాలి. వేళగాని వేళలో చేసే పనికి విధి నిషేధాలుంటాయి. చోటుకు కూడా అంతే ప్రాధాన్యత వుంది. అనువుగాని చోటంటూ ఒక ప్రదేశాన్ని గుర్తించాక అక్కడ తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించేందుకు సాధకునికి ఆస్కారం వుండదు. పైన చెప్పిన లౌకికుడు అనువుగాని చోట నిషిద్ధ ప్రక్రియ అయిన మధుసేవనానికి ఉపక్రమించి పారమార్థికుని చేత ప్రశ్నింపబడ్డాడు.

సాధకులు, కాలము, చోటు అన్న సూత్రాన్ని అనుసరించి ఆధ్యాత్మిక బాటన ప్రయాణం చేయాల్సి వుంటుంది. వర్షరుతువులో సకాలంలో విత్తిన విత్తనాలు సత్ఫలాలు ఇచ్చినట్లు, ఆధ్యాత్మిక ప్రయాణంలో కూడా సకాలంలో చేసిన ప్రార్థనవల్ల ముముక్షువు

దైవాన్ని పొందగలుగుతున్నాడు. దైవాన్ని పొందడమంటే ముక్తినొందుతాడనే అర్థంలో కాకపోయినప్పటికీ దైవం నివసించే పతి మానవుని హృదయంలో తన సుకృత్యాలకు ఫలితంగా చోటు సంపాదించుకుంటాడు, ప్రేమింపబడతాడు. ఆ ప్రేమను స్వీకరించే ముముక్షువు ప్రతిగా తోటివారిని ప్రేమించగలిగినపుడు అది దైవాన్ని ప్రేమించినట్లే అవుతుంది. దైవం పట్ల ప్రేమే భక్తి.

వేళనతిక్రమించి చేసిన సేద్యం నిర్వీర్యమైనట్లు, వార్థక్యం పైబడి అవయవాలు పనిచేయని తరుణంలో ప్రారంభించిన దైవకార్యం దౌర్బల్యమై మనస్సు, కేంద్రీకరించటం సాధ్యం కాని కారణంగా ముముక్షువు ఆశించిన ఫలాన్ని పొందలేడు. పసిపిల్లలు, మధువుగ్రోలినవారే బహుళ నిజాలు నిర్భయంగా మాట్లాడుతారు. నిష్ఠురంగా భావింపబడినప్పటికీ నిజంలోని పరిపూర్ణత ఓ నిర్దుష్టమైన భగవదంశమే!

నిద్రలో కూడా పసిబిడ్డలు అబద్దాలు ఆడరు. త్రాగుబోతు మాటల్లో తాత్కాలికంగా నిజం ధ్వనించినప్పటికీ అతడు ఒక దుర్వసనానికి బానిస అన్న అంశం అతణ్ణి దైవదృష్టికి రాకుండా నిలబెడుతుంది. 'తెలివిగలవారు', 'జ్ఞానుల'కు మధ్య వున్న వ్యత్యాసమే ఇక్కడ బోధకు వస్తుంది. తను 'నిజం' అనే విత్తనాన్ని నాటాననీ, స్వహస్తాలతో దాన్ని రక్షించి పరిపోషించాననీ, తను పొందిన ఫలం విశదమనీ, నీరు ప్రవేశించినట్లు ఈ లోకంలో ప్రవేశించాననీ, ఈ దృశ్య జగత్తునుంచి గాలిలా సూక్ష్మంగా నిష్క్రమిస్తాననీ ఉమర్ ఖయ్యాం అంటాడు.

నీరు కల్మషాన్ని గ్రహిస్తుంది. తనలో ఇముడ్చుకుంటుంది. మనిషి గూడా వ్యర్థ కలాపాలతో హృదయంలో మాలిన్యాలను చేర్చుకున్నప్పటికీ, వాయువులాగా సులభంగా భక్తి సుగంధ సాధన చేయడం అతని ముక్తిపద సోపాన ఆరోహణకు అత్యంత అవసరము, ఆవశ్యకం కూడా. ఉమర్ ఖయ్యాం ఇలా అంటాడు. 'మద్యాన్ని, మగువను మనసారా అనుభవించు. భయంలేదు. ఎందుకంటే భగవంతుడు దయాపరిపూర్ణుడు. క్షమాశీలి!" అన్నవి ఉమర్‌ఖయ్యాం మాటలే. అయితే ఆయన దుర్వ్యసనాలను ప్రోత్సహించాడని అపవాదు వేయలేం! ఆయన నాస్తికవాదాన్నీ బలపరచలేము. దుర్వ్యసనాలతో పతనమైనవారు బాగుపడేందుకు ఆయన మాటలు అమృతవాక్కుల్లా భాసించి పతితులకు అశాకిరణాలవుతాయి! కుదేలైన వారి జవ జీవాలకు ఊపిరిపోస్తాయి! అంతే !

*ఆంధ్రభూమి, 18.09.2010*

# గతం - ఘనకీర్తి

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి కలవోడా!' అన్నాడో కవి. తెలుగువారి శక్తి సామర్థ్యాలను ఆయన ఆ పాటలో కీర్తించాడు. వర్తమానం 'గతమైనప్పుడు, ఆ గతానికి  చెందిన ముద్దు మురిపాలు, ముచ్చట్లు జ్ఞప్తికి తెచ్చుకొని మక్కువ పడతాం! ఒకరకంగా చెప్పాలంటే వర్తమానంలోని మధురిమను మనిషి పూర్తి స్థాయిలో ఆస్వాదించడం లేదు. కొన్ని భౌతికానందాలు అనుభూతిస్తాడేమో గాని గతానికి చెందిన జ్ఞాపకాల వల్లరి అంతా ఇంతా కాదు.

గతంలో కష్టపడి వుంటాం. అలాంటి కష్టాలు పగవాడికి కూడా వద్దని కోరుకొని వుంటాం. సంక్లిష్టమైన జీవితం గడిచిన కాలాన్ని అధిగమించి వుంటాం. అయితే వర్తమానం విషయానికి వచ్చేసరికి చిన్న చిన్న ఇబ్బందులకు సైతం క్లేశపడే మనిషి గతంలోని పెద్ద కష్టాలను సైతం గుర్తుకు తెచ్చుకొని, నెమరువేసుకొని 'అంత కష్టపడ్డాం!' అంటూ గొప్పగా చెప్పుకోవడం విచిత్రమనిపిస్తుంది. తత్భిన్నంగా గతించిన జీవితంలో మాధుర్యం లేకపోయినా, చిన్న చిన్న ఆనందాలను సైతం పెద్దవి చేసుకొని ఆ అనుభవాలను గొప్పగా ఇతరులతో పంచుకుంటాం! గతానికి అంత దివ్యమైన ప్రాధాన్యత వుంది కాబట్టే ఎవరైనా 'గతిస్తే' 'పోయినోళ్ళందరూ మంచోళ్ళు' అనే రీతిలో, వారు యీసడింపదగిన వారయినప్పటికీ, వారి మంచితనాన్ని గుర్తించి శ్లాఘిస్తాం.

ఈ నేపథ్యంలోనే జన్మదినాలు, పెళ్ళిరోజులు వంటివి ఎంతో ప్రాధాన్యత సంతరించుకొని వున్నాయి. ఆ దినాల్లో గొప్పగా వేడుకలు చేసుకొని మురిసిపోతూ ఆనందిస్తాం.

భవిష్యత్తు ఎప్పుడూ మనిషికి ఆగమ్యగోచరమే! వర్తమానంలోని ఉరుకులు, పరుగులు ఆందోళన కలిగించినప్పటికీ, ఆ ఆందోళన చెందిన ఉరుకుల పరుగుల జీవితపు గతించిన క్షణాలు మనసు పొరల్లోంచి వెలువరించుకొని అవేవో గొప్ప విషయాలైనట్లు ఈ తరం వారికి చెబుతాం.

'గతం' ఎప్పుడూ ప్రత్యేకమయినదే! 'గతం గతః' అన్నట్లు గతించిన క్షణం తిరిగిరాదు. గడిచిపోయిన కాలం గురించి మనిషికి ఆందోళన వుండదు. అదేదో గొప్ప స్వయంకృతంగా ఒక లాభాన్ని చేజేతులా కోల్పోయి వుంటే తప్ప! గతం ఎప్పుడూ మనిషికి అరచేతిలో ఉసిరిక ఫలమే! నేరచరిత్రులకు తప్పించి గతం గురించి ఎవరికీ భయం,

ఆందోళన వుండే అవకాశం లేదు. అయితే 'ఆ పని అలా చేసి వుండవలసినది, అలా చేసి వుండవలసింది కాదు' అనే తార్కిక మీమాంసను మాత్రం మనిషి చేస్తూనే వుంటాడు. గతం వర్తమానానికి, భవిష్యత్తుకూ మార్గదర్శకం కావాలి. గతం నుంచి మనిషి ఎంతో నేర్చుకోవలసి వుంటుంది. చేసిన తప్పులు మరలా దొర్లించకూడదు. పోగొట్టుకున్న అవకాశాలు పునఃప్రాప్తిస్తే వాటిని చేజార్చుకోకుండా కైవసం చేసుకోవాలి.

మనం మన గత అనుభవాలనుంచే, కాదు, ఇతరుల అనుభవాల నుంచి, జీవితాల నుంచి కూడా పాఠాలు నేర్వవలసి వుంటుంది. ఒకానొక పని చేయడం వల్ల మన బంధువులు, మిత్రులు గనుక నష్టపోయి వుంటే, అలాంటి సందర్భం మనకు ఎదురైతే, వారు చేసిన తప్పులు మనం చేయకుండా జాగ్రత్తపడాలి. గత తరం నాయకులు, మహాపురుషుల జీవిత కథల నుంచి పాఠాలు తీసుకొని మన జీవితాలకు అన్వయించుకొని లబ్ధిపొందే ప్రయత్నం చేయాలి.

గతం నుంచి నేర్చుకొని మనం మాత్రమే ప్రయోజనం పొందే ప్రయత్నం చేయకుండా మన బంధువులు, మిత్రులు, ఎరిగినవారు కూడా లాభపడేలా ఆ అనుభవాలను పరిచయం చేయాలి.

"మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండి!" అన్నట్లు కాక పూర్వుల వైభవాన్ని మన అప్రయోజక జీవితాలకు అన్వయింపకుండా పూర్వుల సుకృత్యాలు మనమూ చేస్తూ మనతో పాటు సమాజానికీ సత్ఫలాలు సంక్రమింపజేయాలి. అప్పుడే గత కాలపు ఘనకీర్తిని చాటుకొని ఆనందపడేందుకు మనం అర్హులమవుతాం.

*ఆంధ్రభూమి, 06.10.2010*

# నమ్మకమే దివ్యౌషధం

మనం పైకి ఎన్నో మాట్లాడుతాం! మన వాక్కులో ప్రసన్నత వుంటే, విన్నవారు ముగ్ధులౌతారు. అయితే మనస్సు చదవగల మహనీయులు ఎవరైనా వుంటే వారు త్రికరణశుద్ధిగా మనం ఆడిన మాటకు విలువనిస్తారు గాని పైపై సొబగులకు కాదు. సరిగ్గా అట్టి మహనీయుడే ఈ చరాచర జగత్తుకు కర్మ, భర్త, సంహర్త అయిన పరమాత్మ ! బాహ్యంగా చేసే వారి సంకీర్తన అంతర్యంగా కూడా చేసినపుడు సాధనకు సార్థక్యత చేకూరుతుంది. ప్రాచీన ఋషులు నిర్దేశించిన పథంలో సాధకుడు జీవయాత్ర సాగిస్తూ సత్కర్మలు చేస్తున్నపుడు అవి భగవంతునికి తప్పక ప్రీతిపాత్రమౌతాయి. దృష్టి దేవుని ప్రతిమ మీద, మనసు పాదరక్షల మీద వుండటం సాధన పర్వంలోని లొసుగేనని చెప్పవలసి వుంటుంది. దేవుడున్నాడు, తనకు రక్షకుడుగా ఆయన ఎల్లప్పుడూ వుంటాడనే పరమ సత్యాన్ని మనసారా నమ్మిన మోక్షాభిలాషికి జీవితంలో అపజయం ఎన్నడూ కలగదు. ఎంతమాత్రంగా ఎవరు తలిస్తే అంతమాత్రం గానే ద్యోతకమయ్యే పురుషోత్తముడు, జగత్ప్రిత భగవంతుడు, ఆర్తిగా వేడుకున్న ప్రహ్లాదునికి జడమయిన స్తంభం నుండి ఉగ్రనరసింహావతారంలో ఆవిర్భవించి భక్తరక్షణ చేశాడు. "దేవత, మంత్రము, వైద్యుడు, పుణ్యతీర్థము, గురువు" అనే ఐదు అంశలు తమను నమ్మిన వారి నమ్మకపు స్థాయిని బట్టి ఫలితమిస్తాయని శ్రీగురుడు వచిస్తాడు. తమకుగల వ్యక్తిగత నమ్మకంతో నిమిత్తం లేకుండా గురువు ఆజ్ఞగా భావించి తు.చ. తప్పకుండా భక్తిపథంలో జీవితాలను నడిపించుకున్న భక్తులు ఐహికాముష్మిక లాభాలను పొందారు. మాయ పొర మానవుల కళ్ళను కప్పివేసేది కాగా ఆ మాయ కూడా భగవదంశగానే చెప్పబడింది. నమ్మకం గల మనిషికి చెట్టు – పుట్ట కూడా కోరిన అభీష్టాలను తీర్చగల వంటారు దత్తపరంపరలో రెండవ అవతారమయిన శ్రీ నృసింహ సరస్వతి స్వామి! భక్తజనుల జీవన వైఫల్య సాఫల్యాలు భగవత్ ప్రమేయంతో, అనుగ్రహంతో కలిగినవిగా భావించినప్పటికీ మానవ మస్తిష్కం చేసే గారడిగా 'నమ్మకం' అనే అస్త్రాన్ని ప్రయోగించినపుడు ముముక్షువు గడ్డు పరిస్థితుల నుంచి సులభంగా బయటపడి జీవితమనే పాఠ్యాంశంలో భగవంతుడు పెట్టే పరీక్షలో ఉత్తీర్ణుడయ్యే అవకాశం వుంది.

కిష్టయ్య యువకుడు. ఆట్టే చదువుకున్న వాడు కాకపోయినా హేతువాదం పట్ల అభిరుచి గలవాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవించే అతణ్ణి పంటినొప్పి బాధింపసాగింది. పొలానికి వెడుతన్న కిష్టయ్యకు పూజారి శివశర్మ కనిపించాడు. ఆయన ఆ గ్రామ శివాలయ

పూజారే కాక ప్రవృత్తిగా వైద్యం చేస్తుండేవాడు. శివశర్మతో కిష్టయ్య "స్వామీ! నన్ను రెండు రోజులుగా పంటినొప్పి బాధిస్తోంది. ఏదైనా చిట్కా చెప్పండి" అనడిగాడు. శివశర్మ కొంచెం విభూతి మంత్రించి యిచ్చి రోజూ దానిని నొసట ధరించమని, ఉప్పుతో దంతాలు, చిగుళ్ళు శుభ్రం చేసుకోమనీ సలహా ఇచ్చాడు. శివశర్మ పట్ల అపారమయిన నమ్మకం గల కిష్టయ్య ఆ రెండు సలహాలు తు.చ. తప్పక పాటించాక రెండు మూడు రోజుల్లో అతనికి పూర్తి స్వస్థత చేకూరింది. ఒక రోజు శివశర్మకు కిష్టయ్య తారసపడినప్పుడు 'పంటినొప్పి తగ్గిందా?" అనడిగాడు. తగ్గిందని జవాబిచ్చాడు కిష్టయ్య. "చూశావా శివ విభూతి మహిమ?" అన్న శివశర్మతో కిష్టయ్య ఏకీభవించలేదు. "స్వామీ! ఉప్పుతో దంతధావనం చేయడం వల్ల ప్రయోజనం కలిగి వుండవచ్చునేమో గానీ విభూతిధారణ వల్ల ఎలా జరగగలదు?" అన్న నాస్తిక వాదభాషణకు విరుగుడుగా "విభూతిధారణ, లవణ వైద్యం రెండూ కూడా నేను భగవత్సంకల్పంగానే చెప్పాను. నాకు భగవంతునిపై నమ్మకం వుండగా, నీకు నా మీద నమ్మకం వుండి నా సలహా పాటించడంతో ఆరోగ్యం చేకూరింది. కాదంటావా?" అన్నాడు శివశర్మ. కిష్టయ్యకు కనువిప్పు కలిగింది. నిజానికి శివశర్మ పట్ల తనకున్న 'గురు'భావాన్ని జ్ఞప్తి చేసుకున్నాడు కిష్టయ్య. ఆయన మాటల్లోని సత్యం కిష్టయ్యకు అవగతమైంది.

భగవంతుని పట్ల నమ్మకమనే దివ్యౌషధ సేవనం వలన సాధకునకు తప్పక ఐహికాముష్మిక ప్రయోజనాలు చేకూరుతాయి. 'రామజోగీమందూ గొనారే... ఓ జనూలారా..." వంటి భావగర్భితమయిన గీతాల్లో రామనామ తారక మంత్రాన్ని రామయోగి అనే అవధూత సుమారు రెండు శతాబ్దాల పూర్వం కీర్తించి అలనాటి భక్తులను మంత్రముగ్ధులను చేయడమే కాక ఆధ్యాత్మిక పథంలో వారిని నడిపారు. ఆ మహనీయుని ఈపాటలోని 'మందు' రామనామమే! తాను అనుష్ఠానం చేస్తున్న నామం, రూపం ఏదైనా భగవంతునిపై సాధకునకు గల 'నమ్మక'మనే దివ్యౌషధం, అతని ఇహపర అనారోగ్యాలను బాపి తన జీవన గమనాన్ని సరళతరం చేయగలదన్న భావన ముముక్షువుకు ఆధ్యాత్మిక ప్రగతికి సంబంధించిన ఎనలేని తోడ్పాటునిస్తుందనటంలో సందేహం లేదు.

*ఆంధ్రభూమి, 21.10.2010*

# మృత్యువు

పుట్టిన ప్రతీప్రాణి గిట్టక తప్పదు. తల్లి గర్భక్షేత్రంలో బీజం పడిన మరుక్షణం నుంచే ఎదుగుదల ప్రారంభమయినట్లుగా, ఆ ప్రాణం అంత్యమయ్యేందుకు కాలహరణ గణన కూడా వెంటనే ప్రారంభమవుతుందంటే చిత్రంగా ఉంటుంది. పుట్టబోయే శిశువు అనంత తేజోమయ భగవదంశతో 'పెరుగదల' తీసుకొంటోందా లేక ఏదో ఒక రోజున ప్రతీప్రాణి చేరవలసిన రుద్రభూమివైపు 'పరుగు' పెడుతోందా అన్నది జవాబులేని ప్రశ్న.

మృత్యుభయం ప్రతీ ప్రాణిని వెన్నాడుతూనే వుంటుంది. అనంతకాల గమనంలో ఎన్నో చావులు చూస్తూ కూడా మనిషి తాను మాత్రం శాశ్వతమనే భ్రమతో బ్రతకడం విచిత్రం. ఈ సత్యాన్ని మన పురాణాలు నివేదిస్తూనే ఉన్నాయి. ఏడడుగుల బంధంతో ఏకమయిన భార్యాభర్తల్లో ఏ ఒకరు మృత్యువాత పడినా, మిగిలిన వారు వెంటవచ్చేది ఒలుకుల గడ్డదాకానే అన్న సత్యం జగద్విదితం! తదుపరి జీవునిది ఒంటరి ప్రయాణమే!

మార్కండేయ పురాణం ప్రకారం శివపాదాల్ని ఆశ్రయించిన పుణ్యానికి అల్పాయుష్కుడు, పరమ భాగవతోత్తముడైన మార్కండేయుడు అకాల మృత్యువును జయించి మృత్యుంజయుడౌతాడు. అందుకు శివనామస్మరణే ఆయనకు ఆయుధంగా, మృత్యువు నుండి కవచంగా నిలిచి ప్రాణ రక్షణ గావిస్తుంది.

దాహార్తిని తీర్చుకొనేందుకు మడుగులోనికి దిగిన గజేంద్రుడు మొసలిబారిన పడినప్పుడు తనను తాను రక్షించుకొనేందుకు సకల ప్రయత్నాలూ చేస్తాడు. 'నీవే తప్ప ఇతః పరంబెరుగ" అన్న మరుక్షణంలో హరి కరుణించి ప్రాణాల్ని రక్షిస్తాడు. మొసలి కరాళ పట్టు నుండి బయటపడతాడు గజేంద్రుడు.

సంసార జలధిలో జీవుడు అనేక ప్రాపంచికమయిన కష్టనష్టాల్లో కూరుకుని పోయి ఒడ్డుకు చేరలేక, అటు చావలేక, ఇటు బ్రతకలేక విలవిల్లాడుతున్న సమయంలో భగవన్నామస్మరణ వలన ప్రాపంచిక బాధల నధిగమించి ఒడ్డుకు చేరగల అవకాశం ఏర్పడుతుంది.

'అన్నీ మనమంచికే' అన్న ఆర్యోక్తి మనకు తెలుసు. మనకేది మంచో మనకన్నా ఆ స్థితిని కల్పించిన భగవానునికే మనకన్నా బాగా తెలుసునన్న సత్యాన్ని గనుక నమ్మగలిగి నట్లయితే తాత్కాలికంగా కష్టాలు పడుతున్న సమయంలో వివేచన ఉండక పోయినప్పటికీ, ఆ నికృష్టదశ నుండి బయటపడ్డాక, ఆ కష్టాల వల్ల నేర్చుకొని, పొందిన ఏదో కొంత మంచిని, లబ్ధిని మనిషి తప్పక గుర్తించగలుగుతాడు.

భజగోవింద శ్లోకాలతో శంకాచార్య స్వామి సాధకుని సముచితంగా హెచ్చరిక చేస్తాడు. వ్యాకరణ సూత్రాలతో కుస్తీపడుతున్న ఓ సాధకుని ఆ విద్య ముంచుకొచ్చే మృత్యువు నుండి నిన్ను రక్షించలేదు. గోవిందనామ స్మరణ చేయవయ్యా! అని హెచ్చరిస్తాడు. ఈ భూమిపై ఎవరూ శాశ్వతంగా మనుగడ సాగించిన దాఖలా యిప్పటిదాకా లేదు. ఉండబోదు. కొందరు చిరంజీవులయిన మహానుభావులకు మినహాయింపు ఉన్నప్పటికీ వారు స్థితులై ఉండగలిగినది సూక్ష్మదేహంలోనే గాని పంచభూతాత్మకమైన శరీరంలో మాత్రం కాదని గ్రహించాలి.

మంచివారి పుణ్యాచరణ, దుర్మార్గుల పాపాచరణ ద్వారా వారు ఎప్పటికీ ప్రసిద్ధులే అయినా అందరికీ శిరోధార్యమయిన పుణ్యమార్గం శ్రేయోదాయకమని సాధకునికి తెలుస్తుంది. దౌర్జన్యంతో, దుర్మార్గంతో సంపాదించిన ధనం వల్ల మనిషి సాధించిన ప్రగతి, పొందిన సుఖం పూజ్యమని పురాణేతిహాసాలలోని దుష్ట పాత్రల ద్వారా మనకు బోధపడుతుంది.

బ్రతికేందుకు ఆహారం కావాలి. కొన్ని సౌకర్యాలు కావాలి. ఆ రెంటి కోసం కొంత ధనం కావాలి. అయితే అపార ఐశ్వర్యం అవసరం లేదు. మితిమీరిన సంపద అనర్థహేతువు. చీమలు పెట్టిన పుట్టలు పాములకు అవాసమగునట్లు దుర్మార్గంతో లోభంతో కూడి సంపాదించిన ధనం ఎప్పటికైనా చోరులు, బలవంతులకే దక్కుతుందన్న సత్యాన్ని గ్రహిద్దాం!

ఎప్పుడూ వెన్నంటి ముంచుకొచ్చే మృత్యువును ఓకంట గమనిస్తూ ఆడంబరాలకు, అపసవ్య జీవన మార్గాలకు పోక, దురాలోచనకు, దుర్వర్తనకు దూరంగా వుండి, ఈ వేగ యుగంలో కూడా హరినామ స్మరణకు తగినంత సమయం కేటాయిస్తే భగవానుని కృపకు పాత్రులమయ్యే అవకాశం తప్పక వుంటుంది. భగవత్ కృపతో సచ్ఛీలత పెంపొందించుకొని ఆనందప్రాప్తి పొంది సుఖజీవనం చేద్దాం!

*ఆంధ్రభూమి, 22.11.2010*

# నమ్మకం - ఫలం

**అద్దంలో** చూచినపుడు యింటిలోపలి తలుపులు విరుద్ధ దిక్కులో ప్రతిబింబిస్తే ఆ దిశలో ఉన్న గతి కల్పిత దృశ్యాన్ని మనస్సు కొత్తదనంతో వీక్షించినట్లు, నిక్కమయిన పరమాత్మ పట్ల కాక మాయాకల్పితమైన దృశ్యజగత్తుపట్ల మనస్సు ఆకర్షింపబడటం విచిత్రమయిన అనుభవం! మాయదైవకల్పితమే గనుక సర్వాంతర్యామి ధ్యేయంగా భక్తియోగం కుదిరినప్పుడు సూర్యాగమనంతో మంచుతెరలు విడిపోయి భాస్కర దర్శనమైనట్లు మాయపొరలు తొలగిపోయి దైవ సందర్శనానుభూతి కలుగుతుంది.

ఒక్క వ్యాపారి తను అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు విద్యావంతుడై ఉద్యోగం కోసం విదేశాలకెళతాడు. కుమారుడు సురక్షితంగా విమానం దిగిన వార్త అతనికి సంతోషం కలిగించింది. తన కుమారుడు ఉద్యోగపరమైన ఏవో సమస్యల వలయంలో చిక్కుకున్నాడన్న వార్త వ్యాపారిని కలచివేసింది. విలవిలలాడిపోయాడు. సంపన్న కుటుంబంలో పుట్టిన తన పుత్రుడు స్వదేశంలో సంతృప్త జీవనం చేయగల అవకాశం ఉన్నప్పటికీ ఉద్యోగార్థియై విదేశాలకు వెళ్ళినందుకు బాధపడతాడు. వ్యాపారికి అన్నం సహించలేదు. నీరు రుచించలేదు. కొన్నాళ్ళు గడిచాక విదేశంలో అబ్బాయి పరిస్థితి చక్కబడిందనీ, సర్వభద్రత చేకూరిందని వినగానే దావానంలా దహించివేస్తున్న అతని వ్యాకులిత మనసు చల్లబడింది. ఆకలిదప్పులు సహజరీతిలో కలుగసాగాయి. నిజానికి కొడుక్కి కలిగిన కష్టాలు వ్యాపారి ప్రత్యక్షంగా చూడలేదు. అతని స్థితిగతులను స్వయంగా పరిశీలన చేయలేదు. తెలిసివచ్చిన సమాచారం ఆయనను వ్యాకుల పరిచింది. క్షేమ సమాచారం విన్న అతనిలో ఆనందం వెల్లివిరిసింది. నిజానికి అతనివి మనోకల్పిత క్లేశాలు మాత్రమే!

ఈ దృశ్య జగత్తులో దేహ బాధలకు మహాపురుషులు ప్రాధాన్యత ఇవ్వలేదు. దేహాన్ని కలచివేసే వ్యాధులు బాధిస్తున్నప్పటికీ ఆ బాధ దేహానిదే కాని ఆత్మది కాదని రామకృష్ణపరమహంస, భగవాన్ రమణమహర్షి వంటిదివ్య పురుషులు భావించి, ఆత్మప్రాశస్త్యాన్ని చెప్పకనే చెప్పారు. మనసును దైవదత్తం చేసి మహోన్నతమైన ధ్యాననిష్ఠలో ఓలలాడి తరించిన పరమగురువులు వారు! అపారకరుణా సముద్రులయిన ఆ పావన మూర్తులు ఎదుటివారి దేహబాధలు తమవిగా భావించడం విశేషం! ఆధ్యాత్మిక జీవన బాటలో సాధకులకు కష్టాలు ఎదురుకావడం సర్వసాధారణం. కష్టాలను మరల అనుభవిస్తున్న సాధకుడు వాటికి అలవాటు పడతాడు. పునరావృత్తి కారణంగా దుఃఖ తీవ్రత బాధించదు.

కాయకష్టం చేసే శ్రామికుని చేతులు కాయలు కాయడం వలన కష్టం కష్టంగా భావింపబడని విధంగా ఒడిదుడుకులకు అలవాటుపడిన సాధకుడు దుర్దశను శోషించుకోగలుగుతాడు. క్షీరసాగర మథనంలో అమృతం ఆవిర్భవించే ముందు హాలాహలం జనించినట్లు సాధన క్రమ ప్రారంభంలో మనసు కలతల సంద్రమై ఘర్షించే అవకాశం వున్నప్పటికీ విశ్వాసబలం వల్ల శాంతి, ప్రేమ, సహనం, ఇత్యాది గుణసంపత్తి ఆవిర్భవించి ఆత్మానందం చేకూరుతుంది.

ఒక రైతు వ్యవసాయం కోసం బావి త్రవ్వే ప్రయత్నం చేస్తున్నాడు. కొన్ని అడుగుల లోతు త్రవ్వాక నీరు లభించే అవకాశం లేదేమోనని భావించి మరోచోట త్రవ్వటం ప్రారంభించాడు. అక్కడా అదే పరిస్థితి ఎదురయింది. నాలుగుచోట్ల నాలుగు గుంటలు త్రవ్వినా నీరు పడకపోవడంతో నిరాశ చెంది ఆ పని విరమించాడు. విషయం తెలుసుకున్న ఓ జ్ఞాని కొద్దికొద్ది అడుగుల చొప్పున నాలుగు చోట్ల కాక ఒకేచోట అంతలోతున త్రవ్వమన్నాడు. అలా చేసినప్పుడు పుష్కలంగా నీరు పడి రైతు మనోరథం సిద్ధించింది. కష్టాలు దరిచేరినా ఓర్పు వహించి దైవంపట్ల విశ్వాసం సన్నగిల్లక సాధన కొనసాగించే దైవాభిలాషికి తప్పక సత్ఫలం అందుతుందని పెద్దలు చెబుతారు. నమ్మిన రూపాన్ని ధ్యేయం చేసుకొని అచంచల ఆత్మ విశ్వాసంతో సాత్విక సాధన చేసిన ఏ మోక్షాభిలాషి కూడా వట్టి చేతులతో నిష్క్రమణం చేసిన దాఖలాలు ఏ పురాణంలోనూ కనిపించదు.

"నీవే తప్పనితః పరంబెరుగ... కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!" అంటూ ఆర్తితో శ్రీహరిని వేడుకొని ఆత్మసమర్పణ చేసుకున్న గజేంద్రుడు ఆ పరమాత్మ పరమకృపకు పాత్రుడై మోక్షమందిన దివ్యగాథ ఎందరికో మార్గదర్శకం కాగలదన్న మాటలో అతిశయోక్తి లేదు.

*ఆంధ్రభూమి, 05.12.2010*

# సంతోషం - ఆనందం

భగవంతుడు మనిషి ప్రారబ్ధ కర్మల శోషింప జేసే నిమిత్తం అతడికి వర్తమానంలోని జన్మ అనుగ్రహిస్తాడు. ప్రారబ్ధం తీరేంతవరకు సుఖదుఃఖాలు తప్పవు. ఏ పరమోత్కృష్ట కార్యం నిమిత్తం తను ఈ జన్మ పొందివున్నాడో అతనికి తెలిసే అవకాశం లేదు. ప్రతిప్రాణి విషయమూ అంతే! ఒక మహాముని సమాజాన్ని ఉద్ధరించడం కోసం జన్మిస్తే ఒక సాధారణ వ్యక్తి తన కుటుంబాన్ని పోషించి, ఉద్ధరించడం కోసం జన్మిస్తాడు. జీవిస్తాడు. ఒక ప్రాణి తన దేహం మరో ప్రాణికి ఆహారం కావడమనే గొప్ప కార్యం నిమిత్తం జన్మించవచ్చు. ఒక జింక ఒక పులికి ఆహారమై దాని ఆకలి తీర్చేదిగా, పులి ఆ జింక పూర్వ పాపాన్ని పరిహారం చేసి అది మరో సరయిన జన్మ ఎత్తే నిమిత్తం దానికి మరణం ప్రసాదించి లయకార్యానికి దోహదపడుతుంది.

సగటు మనిషి సుఖాలకు పొంగిపోతాడు. కష్టాలు సంప్రాప్తిస్తే కృంగిపోతాడు. ఇది మనకు తెలిసిన సత్యం. అతను ఋజువర్తనుడిగా వున్నంత కాలం ఏ కష్టం కూడా తనను బాధించదనే అకుంఠిత ఆత్మవిశ్వాసం కలిగి వున్నప్పుడు ఆ ఆత్మవిశ్వాసమే భగవద్విశ్వాసంగా భాసిల్లుతుంది.

నిస్వార్థంగా జీవిస్తున్న మనిషికి భగవంతుని అండదండలు తప్పక లభిస్తాయని సర్వశాస్త్రాలు నివేదిస్తున్నాయి. లౌకిక విషయ సంయోగం వలన జనించే సంతృప్త భావన 'సంతోషం' కాగా, అలౌకిక విషయ సంయోగం వలన ఉద్భవించే పరమ సంతృప్త భావన 'ఆనందం'! ఎదుటివారు ప్రశంసిస్తే సంతోషం కలుగుతుంది. అభిశంసిస్తే ఆవేదన కలుగుతుంది.

ఆ ఆవేదన లోంచి నిజమయిన ఆనందాన్ని ఒడిసి పట్టుకునేందుకు విజ్ఞుడు తపిస్తాడు. వేదన కలిగినప్పుడు దానికి కారణభూతమయిన పాపాన్ని అధఃకరించి పోరాడటం వల్ల చెకుముకి రాయి నుంచి అగ్గిరవ్వలా ఆనందక్షణాలు ఆవిర్భవిస్తాయి. క్షణకాలం పాటు మెరిసే ఆ ఆనందాన్ని 'సంతోషం'గానే చెప్పవలసి వుంటుంది. అనేకానేక సంతోష సందర్భాల వెల్లువకూడ నిజమయిన ఆనందానికి సాటిరాదు.

సంతోషం లౌకికమయినది కాగా, ఆనందం ఆధ్యాత్మిక అంశం! భగవదనుగ్రహంగా సంతోషం కలిగితే అది ఆత్మానందంగా పరిణతించగలందులకు ఆధ్యాత్మిక జీవనాన్ని మార్గంగా చేసుకున్నప్పుడు ఆనందాన్వేషణ పరిపూర్ణమవుతుంది.

అర్థార్థి అయిన వ్యక్తికి ధనం దానం చేసి సంతోషం కలిగించవచ్చు. విద్యార్థికి విద్యాదానం చేసి సంతోషం కలిగించవచ్చు. రోగికి వైద్యుడు ఆరోగ్య ప్రదానం చేసి సంతోషం చేకూర్చుతాడు. యిలా పరులకు సంతోషాన్ని కలిగించిన వితరణశీలికి ప్రతిగా ఆనందం లభ్యమవుతుంది. కొందరికి ఏవితరణా చేయకుండానే వాక్కుతో సంతోషం కలిగించవచ్చు. మనసు క్షుభితమై ఉన్న వ్యక్తికి సాంత్వన పలుకులు అమృతవాక్కులుగా భాసిల్లుతాయి. ఎదుటివారి సంతోషానికి కారణభూతులయిన పుణ్యశీలురకు ఇబ్బడిముబ్బడిగా భగవంతుడు ఆనందపు వెల్లువను అనుగ్రహిస్తాడు.

ఇనుము కొలిమిలో కాల్చబడి సమ్మెట దెబ్బలు తినకుండా ఉపయుక్త వస్తువుగా రూపొందని విధంగా పసిడి అగ్నిలో కరుగకుండా ధగధగలాడే నగ రూపొందని విధంగా, మనిషికి కష్టాల పరంపర లేకుండా సత్యం బోధపడే అవకాశం లేదు. ఒకవేళ తీరని మనోవేదన అనుభవిస్తున్న వ్యక్తి సంపన్నుడయితే కూడా తన ధనం వల్ల అతనికి ఏ మాత్రం ఆనందం కలిగే అవకాశం వుండదు. తన బాధను వినే ఓర్పు, తీర్చగల నేర్పుగల వ్యక్తి తారసపడినప్పుడు అతని సాంత్వన వాక్యాలు బాధితునిలో ప్రజ్ఞ కలిగించి వైరాగ్య భావాలు అంకురింపజేస్తాయి.

బాధితుడు లౌకిక విషయాలపట్ల విరక్తుడు కాగలుగుతాడు. దగ్గరి మార్గాల్లో ధనం సంపాదించాలనుకోవడం, భోగాసక్తితో సుఖాల కోసం వెంపర్లాడటం, ఇత్యాది విషయాల పట్ల ఆసక్తి సన్నగిల్లి త్రికరణ శుద్ధితో కూడిన కర్తవ్యకర్మలు చేయగలుగుతాడు. శరీర సుఖాల వల్ల సంప్రాప్తించే అల్ప సంతోషం కోసం కాక తను కలిగివున్న దానిలో కొంత ఆర్తుల కోసం వితరణ చేయడం వల్ల స్వీకర్తల సంతోషం కొన్ని రెట్లుగా పెరిగి, ఇబ్బడి ముబ్బడిగా దాతకు ఆనందాన్ని కైవశం చేస్తుంది.

తన వంటి సత్యమార్గగాముల కోసం సాధకుడు అన్వేషిస్తే, అలాంటి వారితో స్నేహమే సత్సంగమవుతుంది. వ్యష్టిగా చేయలేని సత్కర్మలు సమిష్టిగా చేయగలుగుతాడు. ఒక భగవత్కార్యాన్ని నిర్వర్తించిన ఆనందం ఆ సమూహంలోని అందరికీ ప్రాప్తించడం వల్ల అది బృహత్ విశేషమే అవుతుంది.

*ఆంధ్రభూమి, 23.12.2010*

# ప్రశాంత స్థితి

భగవంతుడు అనే పదం ఎంతో ఉత్కృష్టమైనదే కాక సంక్లిష్టమైనది కూడా! ప్రతి ఒక్కరికీ దైవం గురించిన తనదైన భావన, స్తోత్ర, ఉపాసనా శైలి వుండడం విశేషం! 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్" అంటూ మన సంస్కృతి వివరించగా పాశ్చాత్యులు కూడా ప్రత్యామ్నాయ మార్గంలో అందరూ దైవం ప్రతిరూపాలే అనుభావనతో "నీ తోటి వాడిని ప్రేమించు!" అని చెప్పడం జరిగింది.

దైవంపట్ల ప్రేమకు ఉత్కృష్ట భావనగా 'భక్తి' అలరారుతుంది. ఆంధ్రులు ముక్కోటి దేవతలను ఉపాస్య దేవతలుగా ఆరాధన చేయడం కలదు. "ముక్కోటి తెలుగు వారు" – "ముక్కోటి దేవతలు" అనే భావనతో ప్రతీ వ్యక్తీ దైవాంశ సంభూతుడే అను వివరణ అందజేయడం జరిగింది. మనిషి భగవంతుని ఎంతగా ఆరాధన చేసినప్పటికీ తమదైన శైలిలో కష్టాలు మనిషి దరి చేరతాయి. జన్మతః అందరి మనసులు దృఢంగా ఉండకపోయినప్పటికీ సాధనతో అవిపరిపుష్టి చెందుతాయి. సౌఖ్యం భౌతిక సుఖాల లాలసగా కాక దుఃఖ లేమిగా చెప్పడంలో స్థిత ప్రజ్ఞత ఉంటుంది.

మనసు గట్టితనం సంతరించుకొనే ప్రక్రియలో భాగంగా వైరాగ్యం సాధకునికి ఎంతో సహాయపడుతుంది. శరీరానికి అందుతున్న సుఖాన్ని పరిపూర్ణంగా కాక తటస్థంగా స్వీకరించినప్పుడు దుఃఖానుభవం కూడా అదే రీతిలో స్వీకరింపబడి క్లేశాలు సంభవించినప్పుడు మనిషి కలవరపడే అగత్యం తగ్గుతుంది. భగవంతుని నమ్మినా కూడా కష్టాలు ఎందుకువస్తాయని జనబాహుళ్యం ఆందోళన పడటం కద్దు. మన వేదాలు, పురాణేతిహాసాలు అనుగ్రహించిన స్తోత్రాలు భక్తితో పఠించినప్పటికి ఫలశృతిలో చెప్పబడిన అనుగ్రహవరాలు ఎందుకు నిజం కావడం లేదన్న మీమాంసలో సాధకుడు నలిగిపోతాడు. ఎప్పుడూ అబద్ధాలుచెప్పే వ్యక్తి కొండొకచో సత్యభాషణ చేసినప్పుడు శ్రోతలు అతడు చెప్పిన సత్యాన్ని నమ్మగల అవకాశం లేని విధంగా జీవన ప్రవంతిలో ఎన్నో అసత్యాలను పలికే మనిషి త్రికరణ శుద్ధి లోపించడం వల్ల స్తోత్ర జపాదులు ఫలశృతుల్లో నివేదింపబడినా ఐహిక, ఆముష్మిక లాభాలు అందించకపోవటం జరుగుతుంది.

మిత భాషణం – సత్య వచనం – మనసు – వాక్కు – కర్మల ఐక్యత వల్ల సాధకుడు పలికే చిన్నమాటకు కూడా జనవాహినిలో అత్యంత విశ్వసీయత ప్రవర్ధిల్లుతుంది. అలాంటి సాధకుడు చేసే జపధ్యానాది ప్రక్రియలు కూడా ఫలవంతమౌతాయి.

స్ఫురద్రూపి, ఆజానుబాహుడు అయిన వ్యక్తి ఎదుటివారిని ఉన్నపళంగా ప్రభావితం చేయగలిగే అవకాశం ఉన్నప్పటికీ అనంతర కాలంలో అతని ప్రవర్తన, హృదయ నైర్మల్యం – ఇత్యాది వ్యక్తిత్వ అంశాలు అతనిపట్ల జనాదరణకు కారణమౌతాయి. భౌతిక ఉపాధులకు అతీతంగా కర్మనిష్ఠ కలిగిన వ్యక్తులు లోకాదరణ పొందుతారు. అయితే సాధనలో పరిపూర్ణత సాధించే దిశగా నడుస్తున్న వారికి లోక పూజ్యత పొందాలనే ఆలోచన, ఆశ సకృత్తుగానైనా వుండక పోవడం విశేషం.

ఆధునిక మానవునికి అన్నీ అమరినా దొరకని అరుదయిన వస్తువు 'శాంతి'. శాంతిగల చిత్తం సాధన ప్రక్రియలో అసమాన్య సౌరభం గల పుష్పరాజము. కోరికలు లేకపోవటం, వున్నా వాటిని అదుపులో వుంచుకొనటం సాధన క్రమంలో భాగంగా వుండవలసి వుంది. 'శాంతి సాధన' కూడా ఓ కోరికే అయినప్పటికీ కామ్యంగా కాక అది 'లక్ష్యం'గానే చెప్పబడవలసి ఉంటుంది.

శాంతి యొక్క పరిధులు దాటాక లభించే అసామాన్య సంతృప్త భావనే 'ప్రశాంతి'. అదే స్వర్గ ధామం. అదే దైవం. తపోసాధనలో పరిణతి చెందిన తపస్వులు తమ శరీరాలకు నీరు, ఆహారము అందకపోయినప్పటికీ, చెదపురుగులు శరీరాన్ని తినివేసి పుట్టలు కట్టినప్పటికీ, వాయు భక్షణం చేస్తూ, ఉపాధికి సంక్రమిస్తున్న సంక్లిష్టమార్పులకు లొంగకుండా గాఢ సమాధి స్థితిలో లీనమయ్యేవారు. ఆ స్థితినే దైవప్రాప్తిగా మన మహర్షులు నివేదించడం విశేషం! ఆధునిక మానవుడు అంతటి తపస్సాధన చేయగల స్థితిగతులు నేడు లేకపోయినప్పటికీ, మానసికంగా ఆ స్థితిని ఆవాహన చేసుకొని ప్రశాంత చిత్తంతో జీవన గమనం చేయడం వల్ల ఐహికాముష్మిక లాభాలు తప్పక చేరువవుతాయి.

*ఆంధ్రభూమి, 20.01.2011*

# గతజన్మ వాసనలు

సాధిం చిన దానిపట్ల మనిషికి సంతృప్తి ఉండదు. తను కోరుకొని వుండి సఫలం కాని కోరిక మనస్సులో సదా మెదులుతూ కలవర పెడుతూ ఉంటుంది. అది బహుశః మానవ సహజమైన విషయం. ఆధ్యాత్మిక క్షేత్రంలో వాంఛలు కొన్ని తీరేవి, కొన్ని తీరనివి వుండవు. నిత్యపూజలు, సత్సంగాలు, దానధర్మాలు, యిత్యాది వ్యాపకాలు సాధకునికి అందివచ్చినప్పటికీ సుదూరాలలో వుండే తీర్థదర్శన వాంఛ తీరక పోవచ్చు.

లౌకిక విజయాలు అతని దృష్టిలో విజయాలు కాకపోవచ్చు. అయితే కొందరు తీవ్ర సాధనతో కూడా చేజిక్కించుకోలేని కొన్ని కళలు కొందరికి నృత్య, సంగీత, సాహిత్యాది కళాక్షేత్రాల్లో దక్కి రాణించి వినుతికెక్కుతారు. పారలౌకిక విషయంలో కూడా కొందరు సాధకులు గతజన్మలో దేహపతన సమయంలో సాధన ఆగినచోట నుంచి మరు జన్మలో కొనసాగించ గలుగుతారని పెద్దలు వచిస్తున్నారు. కాంచీపురాన్ని పరిపాలించిన విశ్వచైతన్యుడనే మహారాజు శివభక్తుడు. బ్రహ్మీ ముహూర్తంలో నిదురలేచి స్నానాదులు పూర్తి చేసుకొని, శుచియై శివపూజకు ఉపక్రమించేవాడు. శివునికి యిష్టమైన మారేడు, తుమ్మి పూలతో అలంకరించేడు. అర్చనకు ఉపయోగించే పత్ర, పుష్పాదులను ఉద్యానవనంలో స్వయంగా పెంచి పోషించేవాడు. భస్మధారణ చేసి పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామికి మహానివేదన చేసేదాకా పచ్చి గంగయినా స్వీకరించేవాడు కాదు. ఇన్ని సుగుణాలు ఉన్న విశ్వచైతన్యునకు పరస్త్రీ గమనం పట్ల ఆసక్తి మెండుగా ఉండేది.

ఈ క్రమంలో అతను వెలయాంద్ర కడకు పోతూ వుండేవాడు. పూజా సమయం సమీపించినప్పుడు వారి లోగిళ్ళలోనే శివపూజ చేసేవాడు. ఆనాడు ప్రాప్తించిన గుణవతి అనే విలువకత్తె మహారాజుతో "ప్రభూ! భక్తశ్రేష్ఠులు, మహా శివభక్తులు అయిన తమకు ఎందరో రాణులు వుండగా వేశ్యాగమనం ఎందుకు ప్రీతిపాత్రమవుతోంది?" అని ప్రశ్నించినప్పుడు చైతన్యుడు "సఖీ! నాకు భగవదనుగ్రహం వల్ల జన్మాంతర పరిజ్ఞానం వుంది. ఒకానొక జన్మలో నేను కోడెదూడగా పుట్టాను. నా యజమాని నా శరీర సౌష్టవం చూసి ముగ్ధుడై నన్ను ముద్దుగా పెంచుకున్నాడు. ఆ కారణం చేత సోమరితనం అలవడిన నేనుసేద్యానికి ఉపయోగపడకపోవడంతో ఆవులను దాటిస్తూ నా వలన డబ్బు గడించడం ప్రారంభించాడు. నా జన్మంతా ఆ వ్యాపకంతోనే గడిచిపోయింది. నా యజమాని శివభక్తుడు. ఆయన చేసే పూజలు కష్టంలో గడ్డినెమరువేస్తూ గమనిస్తుండేవాడిని. ఆవులపై 'దాటు'

మినహా వేరు వ్యాపకం తెలియని నాకు విరామ సమయంలో యజమానుని భగవదర్చన నిత్యం గోచరమవుతూ వుండేది. ఎన్నో విశిష్టమయిన మేలుజాతి కోడెలు, పెయ్యల జన్మలకు కారకుడనయిన నేను కాలం తీరాక మరణించినా శివపూజాదర్శన పుణ్య విశేషం వల్ల ఓ రాకుమారుడిగా ఈ జన్మ లభించింది. పూర్వజన్మ వృత్తి వ్యాపకం ఈ మానవ జన్మలో వ్యసనంగా మారినప్పటికీ, కులస్త్రీల వంక కన్నెత్తి చూడకుండా, తప్పని తెలిసినా వేశ్యాగమనం చేయడం అధిగమించలేక పోతున్నాను. శివభక్తి కూడా గత జన్మ వాసనగానే నాకు లభించింది" అన్నాడు.

ఓ భక్తునిగా ఆధ్యాత్మిక పథంలో ప్రవేశించడం పూర్వజన్మ సుకృతమే. అయితే పూర్వ జన్మ వాసనలు సమసిపోక సాధకునికి తమ ఉనికి ప్రకటిస్తూ ఉంటాయి. భక్తునిగా ఎదుగుతున్నప్పటికీ కామ, క్రోధ, లోభాది అరిషడ్వర్గాలు, జన్మతో సంక్రమించినవి మేమున్నామని తమ అస్తిత్వం చాటుకుంటూ వుంటాయి. సాధకుడు నేరుగా వాటిని అధిగమించే దారి వెతకాలి. అదే సాధన ప్రక్రియ. మోక్షాభిలాషి తనకున్న దుర్గుణాలను గమనిస్తూ కూడా అధిగమించలేక పోవటం పట్ల అప్రమత్తంగా ఉండాలి. భగవత్కృప లభించినట్లయితే వాసనలు సమసిపోవటం అంతకష్టం కాబోదు. ధనం సంపాదించిన వానిపై దానిని సంరక్షించుకోవలసిన బాధ్యత కూడా ఉంటుంది. మానవ ప్రయత్నం వల్ల వీడని దుర్వ్యసనాలు దైవకృపతో సాధకుడు జయించగలుగుతాడు. సాధకుడు నిష్కపటిగా జీవిస్తూ భోగలాలస పట్ల నిరాసక్తుడై తన లోపల వుండే దుర్గుణాలను నిర్వీర్యం చేసుకోవలసిన ప్రక్రియపట్ల ప్రమత్తత విడనాడి, లోనవుండే సుగుణాలను ప్రజ్వలన చేసి, అంతర్నేత్రుడై తనను తాను తెలుసుకొన్నప్పుడు తనలో వుండే క్షేత్రజ్ఞుడు మరెవరో కాదు, సాక్షాత్తు భగవంతుడే అని గుర్తించి మనన శీలుడు కాగలుగుతాడు.

*ఆంధ్రభూమి, 31.01.2011*

# జీవితంలో ఆధ్యాత్మిక శక్తి

**జీవితం** ఎంతో విలువయినది. ప్రతి మనిషికి ఓ జీవితం వుంది. ఎవరి జీవితం వారిది. వారి వారి యిష్టాయిష్టాలతోను, అప్రమేయంగా కూడా అది కొనసాగుతుంది. మరొకరి ప్రభావంతో అది ఉప్పొంగుతుంది. ప్రేరణ పొందుతుంది. క్రుంగుతుంది. మసకబారుతుంది. దుస్సాంగత్యంతో కునారిల్లుతుంది. ఒకరి జీవితంలోకి అవాంఛితంగా తొంగిచూసే హక్కు మరెవరికీ లేదు. ఆ హక్కు, అదృష్టం ప్రేమించే వారికే ఉంటుంది. ప్రేమతో ప్రేమించేవారి, ప్రేమింపబడేవారి జీవితాలు వెలకట్టబడతాయి కానీ ధనంతో కాదు. ఈ సత్యం గ్రహించడం వల్ల మేలే జరుగుతుంది. ఎవరి జీవితానుభవాలు వారికి గుణపాఠాలు కావాలి! తనకు వేదన కలిగించిన సంఘటనలు పునరావృత్తమైనప్పుడు వాటిపట్ల మనిషి జాగరూకుడై వ్యవహరించాలి. అందుకే అంటారు "ఈ క్షణం అపురూపమయినది. దానిని పండించుకోవాలి గానీ చేజార్చుకోకూడదు" అని.

ప్రతి రోజును భగవంతుని అపురూపమయిన బహుమానంగా మనిషి తెలుసుకోవాలి. ఈక్షణం ప్రాణంతో ఉండగలిగినందుకు భగవంతునికి కృతజ్ఞత చూపాలి. దురదృష్టాన్ని నిందించే అవసరం లేదు. భగవత్ప్రమేయం లేకుండా ఆకయినా కదలదన్నది విజ్ఞుల మాట! ఒక గండుచీమ ప్రవాహ వాలులో కొట్టుకుపోతూ వుంది. ఓ సాధకుడు దాన్ని ఓ ఆకుతో జాగ్రత్తగా బయటకు తీసి భద్రమైన చోటున దానిని వదులుతాడు. ఆ చీమ జీవితం రక్షింపబడింది. ఆత్మ ఆ ఉపాధిలో మరికొంత కాలం కొనసాగించబడింది. చీమ, భగవంతుడు నిర్దేశించిన ఆయుఃప్రమాణంలో భాగంగా సాధకుని చేత రక్షింపబడినప్పటికీ అతడు భగవత్ప్రమేయంతో చీమను కాపాడి తన ఖాతాలో పుణ్యం జమ చేసుకోగలుగుతాడు. అందుకు సాధకుడు దైవానికి కృతజ్ఞుడై వుండవలసి ఉంది.

ప్రేమచేత మనిషి బ్రతుకుతాడు. బ్రతికించబడతాడు. అభం శుభం తెలియని శిశువుకు అమ్మ ప్రేమ అయాచితంగా లభిస్తుంది. శిశువు మలమూత్రాదులు అమ్మ ప్రేమచేత నిర్మాల్యం గావింపబడతాయి. శిశువు జీవితం అమ్మచేత పండించబడుతుంది. బిడ్డను పొంది దాని ఆలన పాలన చేసే బ్రతుకే బ్రతుకని అమ్మ గర్విస్తుంది. గొడ్రాలు కానందుకు దైవానికి ఆమె అంతరాత్మ కృతజ్ఞతలు తెలుపుకుంటుంది. ఈ జగతిలో జీవికి ప్రాణాధారం గాలి, నీరు, ఆహారం మాత్రమే కాదు. మూల పదార్థం ప్రేమే ఈ సత్యాన్ని వేదాలు జగద్విదితం

చేశాయి. పురాణేతిహాసాలు ప్రకటించాయి. నీతి కథలు బోధ చేశాయి. మహాపురుషులు వక్కాణించారు.

తను చేసే ప్రతీ ఆలోచన, సంకల్పించే ప్రతీ పని ఆయన అంతర్వాసి కావటం వల్ల భగవంతునికి తెలుస్తుందనే భయమో – భక్తో మనిషి కలిగి ఉన్నప్పుడు తనకు, సమాజానికి కూడా మేలు జరిగే పనులే చేస్తాడు. బాల్యంలో క్రీడాసక్తుడై, యవ్వనంలో వనితాసక్తుడై, వృద్ధాప్యంలో చింతలతో సతమతమయ్యే మనిషి పరమార్థ సాధనకు భగవదాసక్తుడు కావలసి వుంటుందని ఆదిశంకరాచార్య అభిభాషిస్తారు. ఆయుః ప్రమాణం తీరాక ఎవరూ ఒక్క క్షణం కూడా ఆత్మను నిలిపి వుంచలేరనీ, అతిలోక సౌందర్యవంతులు, రాజాధిరాజులు, అవతార పురుషులు కూడా కాలం చేయవలసే ఉంటుందని సాధకుడు గ్రహిస్తాడు. యవ్వనంలో నిగనిగలాడే పట్టు వస్త్రంలా వెలిగిపోయే శరీరం ముదిమిమీద పడేసరికి ఆ నిగారింపు, పట్టు కోల్పోగా మనిషి కృంగిపోతాడు. విజ్ఞులు దేహానికి దాపురించే క్రుంగుబాటుకు వెరవక నూతనోత్సాహంతో ప్రతీ ఉషోదయాన్నీ స్వాగతిస్తారు. మనిషికి భగవంతుడు అనుగ్రహించిన వరం (శాపం కూడా) మనస్సే! శరీర పటుత్వం, జవసత్వాలు మసకబారుతున్నప్పటికీ మనస్సు నిత్యనూతన పరిపుష్టితో, వెలుగులీనగల శక్తి యుక్తులు గలది. దైవం వైపు నిల్పి ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగించడం వల్ల ఆధ్యాత్మిక వికాసం, సుగతి కల్గుతాయి.

*ఆంధ్రభూమి, 12.02.2011*

# హయగ్రీవుడు - అభయంకరుడు

తెల్లని అశ్వశిరస్సుతో మానవాకారం కలిగి ఉన్న శ్రీ మహావిష్ణువు దివ్యస్వరూపమే హయగ్రీవ భగవానుడు. ఈ దేవుడు జ్ఞానామృతాన్ని ప్రబోధిస్తూ భక్తులను అనుగ్రహించేందుకు తెల్లని పద్మంలో ఆసీనుడై వుండి ధవళ వస్త్రాలు ధరించి జ్ఞాన సముపార్జన చేయనెంచిన సాధకులకు వైష్ణవ సంప్రదాయంలో ప్రధాన దైవంగా భాసిల్లుతున్నాడు. శ్రావణ పూర్ణిమనాడు శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదవ దినమైన మహర్నవమి పర్వదినం నాడు ఈ దేవునికి భక్తులు విశేష పూజలర్పిస్తారు.

హయగ్రీవ భగవానుడు పద్మదళముల వంటి నాలుగు సున్నితమైన హస్తాలు కలిగి ఉండి ఒక చేతిని జ్ఞాన ప్రబోధాత్మకంగాను, రెండవ హస్తంలో జ్ఞానాంతర్గతమైన గ్రంథాలను ధరించి వుండి, మూడు, నాలుగు చేతులలో శంఖ, చక్రాలు ధారణ చేస్తూ అనుగ్రహ ముద్రలో వుంటాడు. హయగ్రీవుడు సూర్యభగవానుణ్ణి అంతరిక్షంవైపు ప్రచోదన చేస్తూ లోకాలను తమస్సు నుండి రక్షించేందుకు తోడ్పడతాడని తెలుస్తోంది.

శ్రీ మహావిష్ణువు రాక్షస సంహారం చేసి యుద్ధభూమి నుంచి వైకుంఠానికి తిరిగి వచ్చినప్పటి బృహత్ స్వరూపంగా మహాభారతం హయగ్రీవుని స్తుతిస్తుంది. జ్ఞానముద్రలోని రూపాన్ని యోగ హయగ్రీవుడుగా విజ్ఞులు సంభావిస్తారు. లక్ష్మీ అమ్మవారితో కూడి ఉన్నప్పుడు లక్ష్మీహయగ్రీవుడుగా స్వామి పిలువబడుతున్నాడు. శాక్తేయ సంప్రదాయంలో హయగ్రీవుని గురించిన ఓ విశేష కథ వ్యాప్తిలో ఉంది. గుర్రపుతల కలిగి వున్న హయగ్రీవుడు రాక్షసుడు కశ్యప ప్రజాపతి కుమారుడు. తనకు చావులేకుండా, ఒకవేళ చావంటూ వస్తే మరో హయగ్రీవుని చేతిలోనే అది జరగాలని దుర్గామాత నుంచి వరం పొందుతాడు. దివ్యవర గర్వితులయిన అందరు రాక్షసుల వలెనే హయగ్రీవ రాక్షసుడు కూడా దేవతలను బాధింపజొచ్చాడు. విసిగి వేసారిన దేవతలు వైకుంఠానికేగి తమను రక్షింపవలసిందిగా విష్ణుదేవునితో మొరపెట్టుకుంటారు. దుర్గామాత వరప్రసాది అయిన ఆ రాక్షసుని శ్రీ మహావిష్ణువు కడా నిర్జించలేని పరిస్థితి. ఆయన తన ఓజస్సును పెంపొందించుకొనే ప్రయత్నంలో ధ్యానమగ్నుడవుతాడు. అల్లెత్రాడు దృఢంగా బిగించి వున్న ఒక వింటిని ఆసరా చేసుకుని ధ్యానముద్రలో ఉన్న శ్రీ మహావిష్ణువుకు తమగోడు వినిపించే ప్రయత్నంలో భాగంగా ఆయన్ను మేల్కొలిపేందుకు ఒక కీటకాల గుంపును దేవతలు ప్రేరేపించగా వాటి ప్రమేయంతో చటుక్కున తెగిన వింటి త్రాటి శక్తికి విష్ణుదేవుని తల త్రెగి పడిందట! ఈ

హతాత్పరిణామానికి ఖంగుతిన్న దేవతలు దుర్గామాతను ఆశ్రయించగా ఆమె భయంలేదనీ, ఒకానొక శ్వేత అశ్వపు శిరస్సును తెచ్చి స్వామి కంఠానికి అతికించమనీ, హయాననుడు విష్ణుమూర్తి చేతిలో హయగ్రీవ రాక్షసుడు నిర్జించబడతాడనీ చెప్పగా బ్రహ్మ, శ్రీ మహావిష్ణువు కంఠానికి అశ్వశిరస్సును అతికిస్తాడు. హయాననుడుగా మారిన మహావిష్ణువు చేతిలో హయగ్రీవ రాక్షసుడు నిర్జింపబడిన గాథ ఇది.

గాయత్రి మహామంత్రంలోని 24 అక్షరాలు ఇరవై నలుగురు దేవతల బీజాక్షరాలు కాగా "ధియో యోనః ప్రచోదయాత్" లో 'ద' అక్షరం హయగ్రీవస్వామి బీజాక్షరం! ఉత్సాహం, శక్తి సామర్థ్యాలు, శత్రువులపై అంతిమ విజయానికి హయగ్రీవ భగవానుడు అనుగ్రహ ప్రేరణ యిస్తాడు. బాహ్య శత్రువులతో పాటు అంతఃశత్రువులయిన అరిషడ్వర్గాలను శమింపచేసే దివ్యానుగ్రహశక్తి హయగ్రీవ భగవానుని నుండి భక్తులకు లభిస్తుంది. హయగ్రీవుని ధవళకాంతుల శిరస్సు, సూర్యభగవానుని ఏకచక్ర రథాన్ని లాగేప్పుడు ధవళాశ్వాలకు శక్తి ప్రదానం చేస్తుందట! అశ్వజాతిలో ధవళాశ్వాలు అరుదుగా ఉంటాయి.

అరుదైన శ్వేతాశ్వ శిరస్సుతో విష్ణువు హయగ్రీవుడుగా భక్తులకు నూతనశక్తి అనుగ్రహించి, కార్యోన్ముఖులను చేసి కర్మసాఫల్యానికి తోడ్పడుతాడని ప్రతీతి.

*ఆంధ్రభూమి, 06.04.2011*

# మనసు పెట్టి చేసే సాధన ఫలిస్తుంది

**ప్రతి** పనికీ ఓ ప్రణాళిక అవసరం. ఆ ప్రణాళికను అనుసరించి అనుకున్న పని సాధించడం లక్ష్యసాధన అవుతుంది. లక్ష్యం లేకుండా గమ్యం, గమనం ఉండవు. లక్ష్యసాధన దిశలో సాధకుడు ప్రయోజనం సాధించవలసిన అవసరం ప్రయోజనసిద్ధికి మార్గం సుగమం చేస్తుంది.

గుర్రంలా పరుగెత్తే మనసుకు కళ్ళెం వేసి, పాంచభౌతికమైన దేహాన్ని సుఖలాలస నుంచి మార్గం మళ్ళించి, క్రమవైరాగ్య పద్ధతిలో సాధనకు ఉపక్రమించడం ద్వారా లక్ష్యశుద్ధి సంప్రాప్తిస్తుంది. 'రామాచారి ఓ గుళ్ళో పూజారి. రోజూ భగవంతునికి అభిషేకాదులు నిర్వహించి, అర్చించి భక్తులు సమర్పించిన కానుకలతో భారంగా కటుంబ పోషణ చేసుకుంటూ ఉండేవాడు. ఒక బాధ్యతగా భగవత్ పూజలు చేసిన ఆచారి వైఖరిలో కొంతకాలానికి మార్పు చోటు చేసుకుంది. తను చేస్తున్న కైంకర్యాలు యాంత్రికంగా కాకుండా మనసుపెట్టి చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన కలిగింది. యాంత్రికంగా పూజలు చేసే రోజుల్లో భక్తులు రామాచారిని ఒక సాధారణ పూజారిగానే చూశారు. ఆయనలో హృదయ నైర్మల్యం చోటుచేసుకున్నాక ఆయన వాక్కే ఒక మంత్రంలా భాసించింది. భగవత్క్రతు నిర్వహణలో భక్తుల హృదయాలు పులకాంకితం కాజొచ్చాయి. వీనుల విందుగా అష్టోత్తర శతాలు, సహస్రనామాలు చదివే పూజారికి ఆత్మదర్శన భాగ్యం లక్ష్యంగా మారింది. విధి నిర్వహణను మనసుపెట్టి చేయడం వల్ల ఆయన ముఖంలో తేజస్సు విస్తరిల్లింది. అదలా ఉంటే భక్తుల ద్వారా సమకూరే ఆయన ఆదాయం కూడా పెరిగి కుటుంబపోషణ నల్లేరు మీద శకటంలా మారింది. ప్రశాంత చిత్తం ఏర్పడి మరింత సుప్రియంగా, ప్రభావవంతంగా ఆచారి తన విధులు నిర్వహించడం ప్రారంభించాక ఆయనను అనుసరించిన భక్తకోటి కూడ ప్రశాంత చిత్తంతో ఆత్మదర్శన సాధన చేయడం ప్రారంభించారు. ఇక చెప్పేదేముంది. తమ జీవిత లక్ష్యం కోసం సుమనస్కంగా సాధన చేయడం ద్వారా ఆత్మాన్వేషణ ఫలిస్తుందని గ్రహించిన పూజారి, ఆయన అనుయాయులు సాధనతో పరిశ్రమించారు. ఇహమైనా, పరమైనా మనసు పెట్టి పని చేయడం అత్యంత కీలకమని గ్రహించిన ఆ మహనీయులు త్వరలోనే ఆత్మ సాక్షాత్కార భాగ్యాన్ని పొందగలిగారు.

*సాక్షి, 15.04.2011*

# హృదయపు లోతులే ఆనందానికి చిరునామా!

**మనిషి** ఇహ సంబంధమైన సమస్యలతో భేటీ పడుతూ తరచు చిత్త వ్యాకులతకు లోనవుతూ వుంటాడు. ఒక సమస్యకు పరిష్కారం లభించిందనుకొనే లోపే మరో సమస్య 'నేనున్నాను' అంటూ తన ఉనికిని చాటుతుంది. జీవితం సమస్యల వలయం, బాధల నిలయం అనిపిస్తుందేమో గానీ నిజానికి మనిషి... ఆనందం నుంచే ఉద్భవిస్తాడు. ఆత్మ అనేది పరమాత్మ అంశ కాబట్టి పరమాత్మను ఆనందోబ్రహ్మగా చెబుతారు కాబట్టి మానవుడు ఆనందస్వరూపాన్ని పుణికి పుచ్చుకొని ఉద్భవించాడు.

ఎవరయినా తటస్థపడినప్పుడు, 'కుశలమే కదా?' అని పలకరించటం లోకం తీరు. కుశలానికి భిన్నంగా ఉన్నప్పుడే ఆ స్థితిని అసహజమయినదని చెప్తారు పెద్దలు. సౌఖ్యంగా జీవించాలనుకోవడం మనిషి సహజ స్వభావం. ఫలానా పని పూర్తయితే 'నేను ఆనందంగా ఉంటాను' అనుకోవడం అవివేకం. ఆ ఫలానా పని పూర్తయినా, కాకపోయినా సౌఖ్యం, ఆనందం మనోజనితం కాబట్టి ఆనందంగా ఉండగలిగేలా మనస్సును దిట్టపరచుకోవడం మనిషి చేతిలో పని. లాటరీలో కోట్లు వస్తాయి. అప్పుడు మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కుతుంది. లాటరీ తగల్లేదన్నప్పుడు మనసు రోదిస్తుంది. ఆ ఫలానా లాటరీ తగిలిన వార్త గానీ, తగలలేదన్న వార్త కానీ ఉన్నపళంగా వింటారు. అంటే నిలువెత్తు సంపదను కుమ్మరించడం గానీ కుమ్మరించకపోవడం కానీ జరుగదు. అంటే... ఆ వార్త శ్రవణం మాత్రమే మనిషి సంతోషానికి, నిరాశకు కారణభూతమవుతుంది. ఆనందానికి, నిస్పృహకు మధ్య ఉండే వారధి నామమాత్రమే.

ఆహ్లాదకరమైన ప్రకృతి, వాతావరణం మనిషికి ఉత్తేజాన్నిస్తాయి. మనసు సంతోషభరిత మవుతుంది. ఎవరయినా మనిషిని పొగడ్తలకు గురి చేసినప్పుడు చిత్తం సంతోష ప్లావితమవుతుంది. అయితే సంతోషం తాత్కాలికం, ఆనందం శాశ్వతం. ఆత్మ, పరమాత్మ ఎంత శాశ్వతమో, ఆనందం కూడ అంతే శాశ్వతమైనది. పరమాత్మ చిరునామా ఆనందమే కాబట్టి ఆనందాన్ని ఒడిసి పట్టుకుంటే పరమాత్మ దొరికినట్లే. 'ఒకానొక పని పూర్తయితే ఆనందంగా ఉండగలుగుతాను' అనుకోవడం చిత్తభ్రమే. నిర్దేశిత లక్ష్యాలతో నిమిత్తం లేకుండా ఆనందంగా ఉండగలగటం అనేది ఓ వరం! ఆనందం మానసికమైనది. హృదయపు లోతుల్లోంచి పెల్లుబికేది. బయటి నుంచి ప్రవేశించేది కాదు. ఆనందపు చిరునామా మన హృదయపు లోతులే. కాబట్టి మనలోకి మనం తొంగి చూద్దాం. ప్రస్థానం చేద్దాం! ఆనందాన్ని ఒడిసి పట్టుకుందాం! అందులో మునిగితేలుతూ పరమపావనమైన జీవన మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం! అనుభవిద్దాం!

*సాక్షి, 3.05.2011*

# మనిషి - ప్రపంచం

**భగవంతుడు** ఈ ప్రపంచంలో మేలయిన వస్తువులెన్నో సృజించాడు. మల్లెల సుగంధం, గులాబీల సౌరభం, మణిమాణిక్యాలు, పసిడి వంటి ప్రియమైన అరుదైన వస్తువులను అందుకొనేందుకు ప్రతి మనిషి ప్రయత్నించవచ్చు. తప్పులేదు. కానీ దుర్నీతికరమైన పద్ధతిలో వాటిని సేకరించే యత్నం తగదు. ఏదయినా ఋజుమార్గంలో ధర్మబద్ధంగా పొందవలసి ఉంటుంది. అలా కాక ఏ రీతిలో వాటిని అనుభవించేందుకు ప్రయత్నించినప్పటికీ ఇహంలో భౌతిక చట్టాలు, పరంలో దైవ నిర్దేశిత శాసనాలు మనిషిని శిక్షిస్తాయని తెలుసుకోవాలి.

భౌతికమైన ఎన్నో వస్తువులు సౌఖ్యాన్నిస్తాయి. అలౌకికమైన వస్తువు కూడా ఆనందాన్నిస్తుంది. అదే ఆధ్యాత్మిక సౌరభం. డబ్బుతో సుఖాన్నిచ్చే సమస్త సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అక్రమార్జన ద్వారా సంపద ప్రోగు చేసుకున్నవారికి మనశ్శాంతి ఉండదు. విలవయిన వస్తువులు, ఆభరణాలు, ఆలయాలకు, ఆలయాల్లోని దేవతలకు సమకూర్చవచ్చు. పాపప్రక్షాళన జరుగుతుందని సంభావించినప్పటికీ, ఖర్చు చేసినది కుధనమైతే పాపం పరిహారం కాదు. హుండీలలో కోట్లాది ధనం గుప్తంగా కుమ్మరించి ఆ పాప పంకిల సంపదలో పరమాత్మను భాగస్వామి చేసే యత్నం జరిగితే అది అపచారమే కాగలదు.

తనకున్న ఏపాటి సంపద కూడా భగవంతుడు దయతో తన అర్హతానుసారం అనుగ్రహించినదే అని మనిషి నమ్మవలసి వుంటుంది. అప్పుడు లేని దాని కోసం ఆరాటం ఉండదు. ఆరాటం లేని జీవితం మనఃశాంతికి ఆటపట్టవుతుంది. మానసిక ప్రశాంతత చేకూరిన వ్యక్తి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలుగుతాడు. నిస్వార్థంగా జీవిస్తూ పరహితం కోసం చేసే ప్రార్థనలో స్వహితాన్ని పరమాత్మ అడగకుండానే అనుగ్రహిస్తాడు.

కనిపించిన ప్రతి అందమయిన, మేలయిన వస్తువునూ మనస్సు కోరవచ్చు. అది మానవ సహజం! జంతు - పక్షి జాలానికి ఆహారం కోసం ఆరాటమే గానీ మరేదీ అక్కరలేదు. కామభావన కూడా వాటికి ఋతు బద్ధంగానే ఉంటుంది. మనిషికి కోరికలే గుర్రాలవుతాయి. కానీ 'బుద్ధి' అనే కొలబద్ధను ఉపయోగించి, స్వప్రాప్తికి సంబంధించి యోగ్యతా యోగ్యతలను మానవుడు నిర్ణయించుకోవలసి వుంటుంది.

పశుపక్షులకు ప్రేమకూడా పరిమితమే! జన్మనిచ్చిన బిడ్డలు స్వయం పోషకాలయ్యాక అవి వాటిని వాటి గతికి వదిలివేస్తాయి. మనిషి అలా కాదు. కన్న బిడ్డలకు మాతృ, పితృ

ప్రేమను అందించడమే కాక లోకులుకన్న అనాథలను కూడా అక్కున చేర్చుకోగలుగుతాడు. స్వతఃసిద్ధంగా ప్రకృతిలోని సర్వప్రాణికోటినీ ప్రేమించగల విశాల హృదయుడుగా మానవుడు సృజింపబడ్డాడు. ఆ పవిత్ర లక్షణాన్ని జాగృతం చేసుకొనే దిశగా వ్యక్తి సాధన చేయాలి! "సర్వేజనాః సుఖినోభవంతు! లోకాస్సమస్తాస్సుఖినోభవంతు!" అనే పవిత్ర ప్రార్థన, ఆకాంక్ష మన సంస్కృతి, జాతికి అనుగ్రహించిన మహాప్రసాదం! లోక హితం కోరే మన జాతినైజం భారతీయతను ప్రపంచంలో ఉదాత్త చరితగా ప్రవృద్ధం చేసింది. లేకుంటే మనిషికి మృగానికి ఏం తేడా వుండదు. అందుకనే మనుజుడు తనకున్న విచక్షణా జ్ఞానంతో ఆలోచించి ఏది మంచో దానినే చేయాలి. అందులో దానానికి, త్యాగానికే పెద్ద పీట వేయాలి. ఈ దానం అనేది మరల తిరిగి తనకు సంక్రమించేలాగున ఉండేది చేయకూడదు. అంటే ప్రత్యుపకారాన్ని ఆశించి చేసేది దానం అనిపించుకోదు. త్యాగం కూడా తన వారికోసమో తనకు వేరే ఏదైనా ప్రయోజనం కలుగుతుందనో అనుకొని త్యాగం చేస్తే భగవంతుని దృష్టి దాటి వెళ్ళదు. మనలను ఎవరూ చూడలేదు. అనుకొంటాం కాని సర్వసాక్షికి అన్నీ కనబడడం కాదు. మన మనసులో ఏది ఎందుకు ఉందో కూడా తెలుస్తుంది. కనుక మనం చేసేది ఏదైనా అందులో రవ్వంత కూడా స్వార్థం పాలు లేకుండా చేయాలి. మనం నలుగురికి సాయం చేస్తే భగవంతుని దృష్టిలో ఎలాగు ఉంటాం కనుక మనం నిశ్చింతగా ఉండవచ్చు. మనలను కాపాడే వాడు మన పక్షాన్నే ఎల్లప్పుడూ ఉంటాడు కదా. అందుకే మనం ఎప్పుడూ లోకాసమస్తా సుఖినోభవన్తు అని పనులు చేయాలి. చేయించాలి. లోకులంతా బాగుంటే మనమూ బాగుంటాము అనే విషయం తెలిసిందే కదా.

# పరమార్థ సాధన కోరిక తప్పుకాదు

**కోరికలు** గుర్రాలయితే మనస్సుకు పట్టపగ్గాలుండవు. కోరికలు తగ్గించుకొని లౌకిక విషయాలు నుంచి మనసును వీలయినంత దూరం చేసి నిరాడంబర జీవితం గడపటం ఆధ్యాత్మిక చింతనకు అవసరం. కోరికలను విసర్జించాలని చెప్పినప్పటికీ సంపూర్ణ వైరాగ్యం కూడ దానికి ప్రత్యామ్నాయం కాబోదు. సంసారిగా ఉంటూ, ధర్మబద్ధమైన వైవాహిక జీవితాన్ని గడుపుతూ దైవచింతన చేసి తరించిన మహానుభావులు ఎందరో మన స్మృతిపథంలో మెదులుతారు. కంచర్ల గోపన్న, తుకారం, కబీరుదాసు... ఇంకా చెప్పవలసి వస్తే మనమెరిగిన గాంధీమహాత్ముడు... ఇత్యాది మహనీయులు వివాహబంధంలో ఉంటూనే ఆధ్యాత్మిక సాధనకు సంకెల పడకుండా తమను తాము కాపాడుకుంటూ దైవచింతన నెరపి ధన్యజీవులయ్యారు.

కోరికల సంకెల వదిలించుకోవాలన్నప్పుడు – ముముక్షువు అంటే మోక్షగామి కావాలి కదా? అదీ కోరికే కదా? అలాంటప్పుడు ముముక్షుత్వం కోరతగనిదవుతుందా? అనే అనుమానం వస్తుంది. మోక్షం పొందాలనుకోవడం కోరికే అయినా, దైవాన్ని పొందాలనే మనోరథం ఆక్షేపణీయం ఎలా అవుతుంది? సమాజంలో మనిషి కొన్ని సందర్భాల్లోని కొన్నిప్రత్యేక స్థితిగతుల్లో జీవనం సాగించవలసి ఉంటుంది. శారీరక సమస్యలు కొన్ని అయితే, మనిషిని దారుణంగా కుంగదీసే మానసిక సమస్యలు కొన్ని ఎదురవుతుంటాయి. తాత్కాలికంగా దైవధ్యాస గాడి తప్పవచ్చు. దుర్భర జీవనగతి నుంచి బయటపడేందుకు మనిషి పడే ఆరాటం కూడ ఒక కోరికే అయినప్పటికీ మోక్షకామన ఆక్షేపణీయం కాదు. ఆనందజీవనం పరమావధి అయినప్పుడు సాంఘిక, నైతిక, మతపరమైన ప్రక్రియలు మనిషికి అవసరమవుతాయి. ఇవన్నీ కోరికలే. జ్ఞానం పొందాలనుకోవటం కూడా ఒకకోరికే కదా. గౌతమ బుద్ధుడు ఇలా అంటాడు. "ఏదైనా కోరిక తీర్చుకోవడం కోసం అర్రులు చాచటం వల్లనే అనేక కష్టాలు దాపురిస్తాయి. అలా అర్రులు చాచడం వెనుక ఉన్న అదృశ్యనకారాత్మక శక్తి అజ్ఞానమే. అజ్ఞానిగా వున్నప్పుడే వాంఛలు చెలరేగుతాయి. దానివల్లనే మనస్తాపం కలిగి దుఃఖం సంప్రాప్తిస్తుంది. బుద్ధభగవానుని మాటలను బట్టి దుఃఖానికి మూలం కోరికలే అని స్పష్టమవుతుంది.అయినప్పటికీ ప్రధాన కోరిక భగవంతుని పొందడమే కాబట్టి ఆ ప్రయత్నంలో భాగంగా ఎన్నో లౌకికమయిన కోరికలు కూడ తీర్చుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో సాత్విక భావయుతమైన కోరికలు వాంఛనీయమే అవుతాయి. పరమార్థ సాధన ప్రస్థానంలో కూడ లౌకికమయిన కోరికల ప్రమేయం తొలగించడానికి వీలులేకుండా ఉండడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

*సాక్షి, 23.5.2011*

# కరుణాంతరంగుడు
# ఔలియా హజరత్ తాజుద్దీన్ బాబా

**భారతీయ** సంస్కృతి విభిన్నమైనది. ఇక్కడ ఆర్ష సంస్కృతి వెలుగొందుతోంది. ఋషులు సామాన్య జనానికి అవసరమైన తత్వబోధ చేసి ఆధ్యాత్మికంగా వారు ఎదిగేందుకు జ్ఞాన వితరణ చేసారు. దత్తపరంపరలో ఎందరో మహాపురుషులు అవతరించి జ్ఞానవీచికలు వెలయించారు. మనకు స్వ-పరమతాలనే భేదం లేదు. శ్రీ షిర్డీసాయిబాబా ముస్లింగా భావింపబడినప్పటికీ అటు హిందువులు, ఇటు ముస్లింలు సమభావంతో ఆయన బోధలు స్వీకరించి భక్తులుగా నేటికీ తరిస్తున్నారు.

ఆకోవలోకే వస్తారు ఔలియా హజరత్ తాజుద్దీన్ బాబా! క్రీ.శ. 1861లో మహారాష్ట్రలోని నాగపూర్ జల్లాకిమ్తీ గ్రామంలో ఆయన జన్మించారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన తాజుద్దీన్ తన మాతామహి, తాతగారైన అబ్దుల్ రహమాన్ వద్ద పెరిగారు. ఒకసారి కిమ్తీలోని మదార్సాను తన చిన్న వయసులో సందర్శించినపుడు అక్కడి గురువైన హజ్రత్ అబ్దుల్లాషా, తాజుద్దీన్‌కు ఆధ్యాత్మిక తత్వం బోధచేసి వారిలో అంతర్గతంగా ఉన్న ఆధ్యాత్మిక చింతనా జ్వాలకు ఆజ్యం పోశారు.

గురువైన అబ్దుల్లాషా, తాజుద్దీన్‌కు ఓ ఎండు ఫలం ఇస్తూ, "తక్కువ తిను! తక్కువ నిద్రించు! తక్కువ మాట్లాడు! విడవకుండా ఖురాన్ చదువు!" అని హితబోధ చేస్తారు. ఆ బోధలో ఏ మహత్తు వుందో ఏమోగానీ తాజుద్దీన్‌లో ఒక అనిర్వచనీయ ఆనందానుభూతి కలిగింది. తనను తాను మరిచిపోయాడు. కొంత తడవు ఇంద్రియ జ్ఞానం కోల్పోయిన ఆయన అద్వైతానందానుభూతి పొందడం జరిగింది.

జీవ కారుణ్యాన్ని ప్రజలకు బోధిస్తూ నగ్నంగా గ్రామ వీధుల్లో తిరుగాడే ఆయనను పిచ్చివాడుగా భావించి ప్రజలు మానసిక వైద్యశాలలో చేర్పించారు. అయితే మల్లెపూల సుగంధం దాచిపెడితే దాగని విధంగా తాజుద్దీన్ మహత్యం లోకానికి వెల్లడి కాజొచ్చింది. ప్రజలు తండోపతండాలుగా ఆయనను చూడడానికి ఆస్పత్రికి రావడం ప్రారంభించారు. ఆయన పిచ్చివాడు కాదని నిగ్గుతేల్చుకున్న ఆస్పత్రి అధికారి ఆయనను విడుదల చేసేందుకు నిర్ణయించి ఆయనకు అభ్యంతరం లేకపోతే తన స్వగృహంలో ఆతిథ్యం స్వీకరిస్తూ ఉండిపోవాల్సిందిగా ప్రార్థించాడు. అయితే తాజుద్దీన్ ఆ అధికారి ఇంట్లో ఎక్కువ రోజులు ఉండలేదు.

'తాజ్' సూఫీ సాం(ప్రదాయంలో తాజుద్దీన్ 'ఔలియా' (మహాగురువు)గా వెలుగొందారు. తాజుద్దీన్ పుట్టుక సమయంలోనే కొన్ని విశేషాలు జరిగాయి. పుట్టగానే ఆయన అందరు శిశువుల్లా ఏడవలేదట! ఆయన తల్లిదం(డులు ఆయనను ఏడిపించేందుకు భీతిగొల్పేలా గిల్లి బాధించారట. ఔలియా హజరత్ తాజుద్దీన్ బాబా బోధలు ఆధ్యాత్మిక చింతన ఆకట్టుకునేవే అయినప్పటికీ ఆయన నగ్నచారణ (ప్రజలకు అభ్యంతరంగా ఉండేది. కాని ఆయన ఆస్ప(త్రిలో వున్న సమయంలోనే, నాగపూర్‌ను పరిపాలించే మహారాజా వారు బాబాకు శిష్యులయ్యారు. అస్ప(త్రి నుండి విడుదలయ్యాక ఆస్ప(త్రి అధికారి గృహం నుంచి బాబా మహారాజా ప్యాలెస్‌కు ఆహ్వానింపబడ్డారు.

'బాబా బోధల్లో సాటి (ప్రాణుల పట్ల కరుణ కలిగి వుండడం (ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలతో బాధపడుతూ బాబాను ఆ(శయించిన వారికి స్వస్థత, ఆనందం చేకూరి సంతుష్టులవుతూ వుండేవారు.

శారీరక ఆరోగ్యం క్షీణించిన బాబా భక్తులు ఎన్ని వైద్య సేవలందించినప్పటికీ లాభం చేకూరక 1925లో తన 65వ ఏట శరీరం త్యాగం చేయడం జరిగింది. ఆయనను నమ్మిన భక్తుల కామితార్థాలు ఈనాటికీ నెరవేరుతూ వారికి ఆనందానుభవం కలుగుతూనే ఉండడం ఉల్లేఖనీయం! తాజుద్దీన్ బాబా వారి ఆధ్యాత్మిక కరదీపిక భక్తుల హృదయాల్లోని అజ్ఞాన తిమిరాన్ని నిర్వీర్యం చేస్తుండగా భక్తులు నేటికీ ఆయన చూపిన ఆధ్యాత్మిక బాటలో నడుస్తూ ఇహపర సౌఖ్యాలు పొందుతూనే వుండడం విశేషం.

*ఆం(ధభూమి, 22.05.2011*

# భగవదనుగ్రహం

**భగ** వంతునికి ఎవరిమీదా ప్రత్యేకమయిన అభిమానంగాని, ద్వేషం గాని ఉండదు. త్రికరణశుద్ధితో కూడిన చింతన వలన సాధనకు పరిపక్వత సిద్ధించినప్పుడు పరమాత్మ నుంచి అనుగ్రహలహరి భక్తునివైపు ప్రసరించి పర్యవసానంగా అతనికి సర్వలౌకికా లౌకిక అభీష్టాలు నెరవేరుతాయి. దైవకృప వలన వాక్శుద్ధి, లోకానుకూలత చేకూరుతాయి. అతని తేజోవలయం లోకులను అలౌకిక ఆకర్షణకు గురి చేయటం వలన సాధకుని పట్ల సంఘవ్యతిరేకత ఏమయినా మిగిలి వుంటే అది నశించి లోకానుకూలత కలుగుతుంది. పరమాత్మతో ఏకీభావం వలన సాధకుడు అమందానందం పొందగలుగుతాడు.

మానవజీవితంలో మార్పు అతి సహజం. శైశవ, బాల్య, కౌమార, యవ్వన, వార్ధక్య దశలు తనకు తెలియకుండానే కాలగమనంలో కదలిపోతాయే గాని వాటి కదలిక ఏ మాత్రం ద్యోతకం కాకపోవటం విశేషం! ఏ మహాభిపరివర్తన క్రమంలో మానవ ఉపాధిలో భౌతిక మార్పులు కలుగుతూ ఉంటాయో ఆ క్రమానికి సాధకుడు తలవంచి రాజీపడక తప్పని పరిస్థితి ఉంటుంది. కొందరు మహా పురుషులు యోగమార్గంలో చరించి జీవితదశాక్రమాన్ని వాయిదా వేయగల శక్తి సంతరించుకున్న దాఖలా మన పురాణేతిహాసాలలో కనిపిస్తుంది. ఆ మార్గంలో అపూర్వ అనుభవాలను పొందిన యోగులకు ఉదాహరణగా పరమహంస యోగానంద ఉల్లేఖనీయులు. లోకంలో ప్రతి వ్యక్తికి తన ప్రారబ్ధం ద్వారా తగిన విజ్ఞత, వివేకం చేకూరుతుంది. అయితే భౌతిక ప్రపంచంలో వ్యక్తి ప్రవర్తన నియంత్రించగల శక్తి చట్టానికి ఉంటుంది. కాగా అతని పాప పుణ్యాల ఫలానికి తనకుతానే బాధ్యుడౌతాడు. ఏ భౌతిక శక్తి కూడా వ్యష్టి ఆలోచనలను నిరోధించి, నియంత్రించగల సామర్థ్యం కలిగి ఉండే అవకాశం ఉండదు.

ప్రపంచంలో ఎందరో, ఆధ్యాత్మిక గురువులు ఉద్భవించి తమ దివ్య బోధనల చేత మానవుల ప్రవర్తన ప్రభావితం చేస్తున్నప్పటికీ దేశంలో వివిధ సాంప్రదాయాల కనుగుణంగా దేవాలయాలలో అర్చనాది క్రతువులు నిర్వహింపబడుతున్నప్పటికీ, పుణ్యచరితులతో పాటు పాపాచరణ చేస్తున్నవారు కూడా సమాజంలో ఉండటం వలన భగవంతుడు వారివారి ఇచ్ఛానుసారం ప్రవర్తించగల స్వేచ్ఛను ప్రసాదించాడని గ్రహించవలసి

ఉంటుంది. అందుకే జగతిలో మేధావులు, భాగ్యవంతులతో పాటు అజ్ఞులు, దుర్మార్గులు , భిక్షుకులు కూడా ఉన్నారు. అనాదిగా వారి ఉనికి కొనసాగుతూనే ఉండడం లోకరీతి. మనిషి తన ప్రవర్తనతో ఉన్నతి సాధించినా, అదోగతి పొందినా దైవం సాక్షీ భూతంగా ఉంటాడే గానీ, ఆయన ప్రత్యక్ష ప్రమేయం ఉండదు. సాధకుడు వివేకం సంతరించుకొని సత్కర్మలపట్ల ఆసక్తుడై మయాపొరను అధిగమించాలని పరిశ్రమించినప్పుడు కరుణామయుని సంపూర్ణ అనుగ్రహం అతనికి తప్పక లభిస్తుంది. అలాగే దుష్కర్మాచరణులకు వారి కర్మానుసారం దుష్ఫలితాలు పొందటం అనివార్యం. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు ప్రవర్ధిల్లే మార్గంలో జీవిక నడిపించినప్పుడు ఆ మార్గం దైవానికి ప్రీతిపాత్రమవుతుంది. పారలౌకిక సాధన మానసిక పరిశ్రమతో జాగృతమవుతుంది. సత్కర్మాచరణలో భాగంగా స్వప్రయోజనంతో పాటు సంఘ ప్రయోజనం కూడా సాధకుడు ఆశించడం అతని ఆధ్యాత్మిక ఉన్నతికి ఎంతో ఉపకరిస్తుంది.

సూర్యభగవానుడు లోకానికి వెలుగులు పంచే నిమిత్తం తన ఉదయాస్తమయ మహాపరియజ్ఞం సాగించడం వలన భగవదాదేశమనే స్వకీయకర్తవ్యపాలనతో పాటు లోకహితం చేకూర్చడం అనే అంశం నుంచి సాధకుడు స్ఫూర్తి పొందవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది. భగవదనుగ్రహమనే దివ్యఫలం అందరికీ అందుబాటులో ఉన్నపుడు సాధనతో ఆ దివ్య అనుగ్రహ ఫలాన్ని సాధకుడు స్వకీయం చేసుకొనవలసి ఉంటుందని ముముక్షువు గ్రహించాలి.

*ఆంధ్రభూమి, 02.06.2011*

# శరీరానికీ మరణం ఉండదు...!

'మరణం' మాట వినగానే భయం ఆవహిస్తుంది. పరమ యోగులు మరణాన్ని అంత తీవ్రంగా పరిగణించవద్దనీ, జననం ఎంత సహజమో, మరణం కూడా అంతే సహజమనీ వచిస్తారు. రామకృష్ణ పరమహంస వంటి అవతార పురుషులు కూడా కాలం సమీపించాక దేహత్యాగం చేయక తప్పలేదు.

శరీరానికి మాత్రమే చావు అంటారు. కానీ, ఆ మాటకొస్తే శరీరానికి మాత్రం చావెక్కడిది? శరీరంలోని పంచభూతాలు విడిపోయి, పంచభూతాల్లో కలసినా పంచభూతాలు శాశ్వతమైనవే కదా?

"సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృఞ్కరణే"

వ్యాకరణ శాస్త్రం వల్లె వేయడం వల్ల అంత్యకాలం సమీపించినపుడు నిన్ను అది రక్షించలేదు. అంటారు ఆదిశంకరాచార్య. మరుక్షణం లేనిదే మరణం. జీవించి వుండి ముక్తులయిన మహానుభావులు జీవన్ముక్తులు. అందుకు విరుద్ధంగా ఇంకొందరు మృతజీవులు ఉన్నారు.

శరీరం కణజాలంతో ఏర్పడింది. పంచభూతాలు ఒకే చోట చేరినపుడు దేహము ఏర్పడగా, అవి 'లయం' జరిగి ప్రకృతిలో గుప్తం కావటాన్ని మరణం అన్నారు. అందరికీ ప్రాణం తీపికాగా మహాపురుషులకు అది తృణప్రాయం. ప్రజాహితం కోసం ప్రాణాలర్పించిన వారున్నారు. దాన్ని బలిదానం అంటాం. బిడ్డ పుట్టగానే పండుగ చేసుకొనే బంధువర్గం మరణిస్తే కృంగిపోతారు.

హిందూధర్మం ప్రకారం మరణానంతరం జీవనం ఉంది. అదే పునర్జన్మ. ఈ విశ్వంలో 84 లక్షల యోనుల్లో ఉద్భవించిన జీవరాశి వున్నట్లు చెప్పబడింది. మనిషి బుద్ధిజీవియే కాక కర్మజీవి కూడా! ప్రతి కర్మకు ఒక ఫలితం ఉండగా కొన్ని ఫలితాలు తక్షణం వచ్చేవి. మరికొన్ని మరుజన్మల్లో వచ్చేవిగా ఉంటాయి.

చిత్త 'లయం'ను మరణంగా చెప్పబడవలసి ఉన్నప్పటికీ, సిద్ధులకు ప్రాప్తించే ఆ మహోన్నతస్థితి పరమోత్కృష్టంగా చెప్పబడింది. అలనాటి మహర్షులు మరణ సదృశస్థితికి చేరుకొని పునఃచైతన్యంలోనికి వచ్చినవారే! ప్రలోభాలకు అటువంటి వారు లొంగరు. నిద్ర తాత్కాలిక మరణం కాగా అలాంటి శాశ్వతస్థితి నిజ మరణం.

మృత్యుభయం ప్రతి ప్రాణినీ వెంటాడుతూనే ఉంటుంది. కళ్ళఎదుట ఎన్నో మరణాలను చూస్తున్నప్పటికీ మనిషి తను శాశ్వతుడన్న భ్రాంతిలో ఉండటం వింత.

శాశ్వతం కాని సుఖం కోసం చేసే ఆగడాలకు అంతులేదు. అరిషడ్వర్గాలకు లొంగకుండా జీవితాన్ని గడపాలని హెచ్చరించడానికే బహుశ మరణం సృజింపబడి ఉండవచ్చు. మరణం భయానకం కాకూడదని ప్రతివారూ కోరుకుంటారు. ఒక వ్యక్తి మంచివాడా లేక దుర్మార్గుడా అనే విషయం అతని మరణంలో తెలుస్తుందని లోక భావన.

అనాయాసేన మరణం, వినాదైన్యేన జీవితం

దేహాంతే తవసాయుజ్యం దేహి మే పార్వతీ పతే!

అనేది ముముక్షువు చేసే ప్రార్థన. చిత్తశుద్ధితో చేసే ఈశ్వర పూజ వలన మనిషి నిర్భీతిగా జీవించగలడు.

సాక్షి, *04.06.2011*

# సత్య దీక్ష

ఆడిన మాట నిలుపుకొనేందుకు తన రాజ్యాన్ని, భార్యా బిడ్డలను, తన సర్వస్వాన్ని వదలుకొని రాజ్య భోగాలలో తుల తూగగల సర్వ అర్హతలు, అవకాశాలు ఉన్నప్పటికీ, ఒక యజమాని కడ సేవకునిగా మారి, తుదకు కాటకాపరిగా జీవితాన్ని ఎంచుకున్న త్యాగధనుడు, ధీరోదాత్తుడు హరిశ్చంద్ర మహారాజు. ఆయనలోని సుగుణాలు – ఒకటి ఇచ్చిన మాట నిలబెట్టుకొనడం, రెండు – ఎన్నడూ అసత్యం పలకకపోవడం!

ఓ విచిత్ర సంఘటన హరిశ్చంద్రుని జీవితంలో అనుకోని విధంగా జరిగి, ఊహింపరాని మార్పులు, కడగండ్లకు కారణమయింది. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని సమకాలికుడు. ఆ మహర్షి తన స్వప్నంలో హరిశ్చంద్ర మహారాజు తన రాజ్యసర్వస్వాన్ని తనకు ధారపోసినట్లు కలగంటాడు. హరిశ్చంద్రుని గొప్పతనం ఎంత ప్రతిష్ఠాత్మకమయినదంటే మహర్షికి వచ్చిన స్వప్న వృత్తాంతానికి అనుగుణంగా మహర్షికి తన యావత్ సామ్రాజ్యాన్ని ఇచ్చివేసి, కట్టుబట్టలతో కాశీ నగరానికి చేరుకుంటాడు. ప్రక్రియలో భాగంగా హరిశ్చంద్రుడు కొంత సొమ్ము దక్షిణగా సమర్పించవలసి ఉందనీ, సర్వమూ తనకు ధారపోసిన నేపథ్యంలో దక్షిణను రాజు స్వయంగా సంపాదించిన ధనం నుంచి ఇవ్వవలసి ఉంటుందనీ మహర్షి చెబుతాడు. దక్షిణ సొమ్ము కోసం హరిశ్చంద్రుడు తన రాణి చంద్రమతిని, యువరాజు లోహితాశునీ ఒక బ్రాహ్మణ కుటుంబానికి అమ్మివేస్తాడు.

ఆ వచ్చిన సొమ్ము దక్షిణకు సరిపోని కారణంగా తనకు తాను వీరబాహుడనే కాటికాపరికి అమ్ముడుపోతాడు. లోహితాశుడు వనంలో పువ్వులు కోస్తుండగా పాముకాటుకు గురై మరణిస్తాడు. రాణి చంద్రమతి కుమారుని మృతదేహాన్ని అంత్యక్రియల కోసం శ్మశానానికి కొనిపోగా, తాను చెల్లించవలసిన కాటి సుంకపు సొమ్ము తనవద్ద లేదని ఆమె చెప్పినపుడు కాటికాపరిగా విధులు నిర్వర్తిస్తున్న హరిశ్చంద్రుడు ఆమె మెడలోని మంగళసూత్రాన్ని అమ్మివేసి సుంకం చెల్లించమంటాడు. తన మెడలోని తాళిబొట్టు తన భర్తకు తప్ప వేరెవరికీ కనిపించదనే వరంగల చంద్రమతి కాటికాపరిని భర్తగా గుర్తించి నిర్విణ్ణురాలవుతుంది. శ్మశానానికి కొనితేబడిన శవం తన కుమారుడైన లోహితాసునిగా హరిశ్చంద్రుడు గుర్తించినప్పటికీ సత్యవ్రతానికి బద్ధుడై పుత్రవాత్సల్యాన్ని జయించగల్గుతాడు.

తాను ధరించి ఉన్న అంగవస్త్రంలో సగభాగం శవానికి అచ్ఛాదన చేయగా, మిగిలిన సగం లోని సగభాగాన్ని కాటిసుంకంగా ఇచ్చేందుకు చంద్రమతి సంసిద్ధ అవుతుంది.

హృదయాన్ని కలచివేసే ఈ సన్నివేశంలో బ్రహ్మాదిదేవతలు విశ్వామిత్ర మహర్షి సహా ప్రత్యక్షమై రాజు యొక్క సత్యనిష్ఠను, వ్రత దీక్షను కొనియాడతారు. లోహితుని పునర్జీవితుని చేస్తారు. స్వర్గ భోగాలను వరంగా అనుగ్రహిస్తారు. అయితే వాటిని స్వీకరించేందుకు హరిశ్చంద్రుడు నిరాకరిస్తాడు. తన యజమాని అయిన వీరబాహుని అనుజ్ఞ లేకుండా ఆ వరాలను స్వీకరింపలేనంటాడు. వీరబాహుడు మరెవరో కాదు. సాక్షాత్తు యమధర్మరాజని దేవతలు వివరిస్తారు. తనతోపాటు తన ప్రజలకు కూడా స్వర్గ భోగాలు ప్రసాదించమని వేడిన హరిశ్చంద్రునితో వారివారి కర్మానుసారం కర్మఫలం ఉండగలందు వల్ల అందరు ప్రజలకు స్వర్గప్రవేశం ఎలా కల్పించబడాలని ప్రశ్నిస్తారు! ప్రజలకు అనుకూలంగా తన సమస్త పుణ్య ఫలాన్ని ధారపోసి, హరిశ్చంద్రుడు వారికి స్వర్గ ప్రవేశం కల్పించిన ఉదంతంతో ఆయన ధర్మనిష్ఠకు ముగ్ధులయిన విశ్వామిత్రాది దేవతలు హరిశ్చంద్రుని శ్లాఘిస్తారు. యువరాజుగా లోహితుడు పట్టాభిషిక్తుడవుతాడు. సత్య, ధర్మముల ద్వారా లోకంలో శాంతి ప్రతిష్ఠిత మౌతుంది.

సత్యాన్ని, ధర్మాన్ని ఆచరించడంలో మొదట అవరోధాలు ఎదురయినప్పటికీ సత్యధర్మాలను అనుసరించేవారికి అంతిమ విజయం తథ్యమని హరిశ్చంద్ర చరిత్ర వివరిస్తుంది.

*ఆంధ్రభూమి, 08.06.2011*

# మనసు మరీ చెడ్డదేమీ కాదు

**పరమ** పవిత్రమైన హృదయపీఠాన్ని భగవంతుడు ఆశ్రయం చేసుకొని వెలుగొందుతుంటాడు. అంతటి పరమోత్కృష్టమైన ఆ పీఠాన్ని కామక్రోధలోభమోహాది అరిషడ్వర్గాలనే శునకాలకు అనువు చేయకూడదు. ఆ పవిత్ర నెలవు భగవంతునికే ప్రత్యేకమయినది. 'నా వయసు అరవై, మనసు ఇరవై' అనుకుంటూ, ఆ ఇరవైల నాటి మనసుతో ఆలోచన చేసి కామోద్దీపన చేసుకుంటే మనసు మలినం అవటం కన్నా ఒరిగేదేమీ ఉండదు. దేహపుష్టిని పదిలపరచుకునేందుకు అనువయిన ఆహారం తీసుకుంటూ, యోగసాధన చేస్తూ ఇప్పటి వయసుకు తగినట్లుగా ఆధ్యాత్మిక ప్రగతి కోసం ఆ బలాన్ని ఉపయోగపెట్టాలి. మనసు బహు చంచలమయినది. అయితేనేం? అభ్యాస వైరాగ్యాలతో వశమవుతుందని శ్రీకృష్ణ భగవానుడు గీతలో సెలవిచ్చాడు.

భగవంతుని ధ్యేయరూపంలో ఆరాధిస్తాం. ధ్యానంతో మనస్సును దైవంపై కేంద్రీకృతం చేస్తాం. మనస్సు ధ్యేయంపై నిలవకుండా అటు గతంలోకి చొచ్చుకుపోవచ్చు లేదా భవిష్యత్తు వైపు ఊహల్లో ప్రయాణం చేయవచ్చు. దానిని కట్టడి చేస్తూ వర్తమానంలోనే బంధించినప్పుడు ధ్యానంలో భగవంతునిపై ఏకాగ్రత కుదురుతుంది. పిల్లవాడి అల్లరి మితిమీరుతున్న సమయంలో చెప్పవలసిన తీరులో చెప్పి బుజ్జగిస్తే మాట విని అల్లరి మానతాడు. అలాగే మనస్సు కూడ అనునయిస్తే బుద్ధిగా వ్యవహరిస్తుంది. అనంత పరమాత్మను దర్శించే ప్రయత్నంలో సహకరిస్తుంది. మహాపురుషులందరూ అలా మనసును మచ్చిక చేసి, వశపరచుకొని తరించినవారే!

కృష్ణదాసు పరమకృష్ణభక్తుడు. ఇప్పటి విషయం అయితే అంతేకానీ ఆయన పూర్వాశ్రమం అంత గొప్పదేమీ కాదు. నారాయణగా పిలువబడే ఆ గృహస్తు స్త్రీ వ్యసనానికి బానిసయ్యాడు. ఒక అలవాటు దురలవాటుగా మారక ముందు మనిషి ప్రవర్తనలో దోషం ఎన్నదగినదిగా కనబడేదమో గానీ, ఒక నిషిద్ధ క్రియ పదేపదే చేస్తూ ఉన్నప్పుడు వ్యక్తి దురలవాటుకు బానిసయ్యాడని సమాజం గుర్తిస్తుంది. నారాయణ, కృష్ణతత్వంలోని స్త్రీ ఆకర్షణకు వక్రభాష్యం చెబుతూ కృష్ణ భగవానుణ్ని స్త్రీ లోలుడుగా చిత్రీకరిస్తూ ఆయన వలెనే తాను కూడా స్త్రీకి దగ్గరయ్యాడనీ, అది తప్పు కాదనీ చెబుతూ చెడు తిరుగుళ్ళు మరిగి మనిషిగా పిలవలేని దుస్థితికి చేరుకున్నాడు.

అయితే కృష్ణానుగ్రహం అలాంటి నారాయణని వరించింది. నారాయణకు తన

నైతిక దోషాలకు సంబంధించిన మేలుకొలుపు అతని ఆరోగ్యం పూర్తిగా శిథిలమయ్యాకే లభించడం విశేషం! దేహం రోగగ్రస్తమయిందే కాని మనస్సు స్ఫటికంలా శుద్ధమయింది. అతను అదే మనసుతో కృష్ణతత్త్వంలో గల పరమ పవిత్ర భావాన్ని గ్రహించాడు. దానిని లోకానికి వెల్లడించాడు. ఎవరూ తనలా చెడిపోకుండా తన జీవితాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవాలని మార్గనిర్దేశం చేశాడు. మనసుకు కళ్లెం వేయగలిగిన రోజున నారాయణ అనే ప్రబుద్ధుడు పరమభాగవతోత్తముడైన కృష్ణదాసుగా మారినట్లే, మనసు వశమయిననాడు సాధకునికి ఆధ్యాత్మిక ప్రగతి నల్లేరు మీద నడకే కాగలదు. మనస్సనేది మరీ అంత చెడ్డదేమీ కాదు. ఎటొచ్చీ దాన్ని విచ్చలవిడిగా లోకం మీదకు వదలకుండా కాస్తంత జాగ్రత్తపడాలి అంతే.

*సాక్షి, 17.06.2011*

# హెచ్చు తగ్గులు

జడ పదార్థాలకు భిన్నంగా, అంతఃస్థితంగా ఆత్మ ఉండటమనే ఏకైక లక్షణం కారణంగా ప్రాణికోటి చైతన్యమనే ఉత్తమ సంస్కారాన్ని సంతరించుకొని ఉండడం ఎంతో గొప్ప విషయం. ఆత్మచైతన్యంతో ప్రతీ ప్రాణీ  అలరారుతూ ఉండడం ఒక విశేషం కాగా, మానవ జన్మ పొందటానికి చేసుకున్న పుణ్యం ఏపాటి ఉండాలో మాటల్లో చెప్పలేం. అందునా విద్యావంతులు, ఐశ్వర్యవంతులయిన వారి అదృష్టం ప్రత్యేకించి చెప్పే పనిలేదు. అలాంటి వారు ఆత్మస్థితి కారణంగా తమ సోదరులుగా వెలుగొందుతూ పాపవశం చేత ఆరోగ్యపరంగా, ఆర్థికంగా, విద్యా విషయంగా అణగారిపోయి ఉన్న వారి విషయంలో కరుణ చూపాలి. ఏ వస్తువూ పనికిమాలినది కాదు. ఏ రూపమూ, ఏ ప్రాణీ వ్యర్థంగా జన్మించి ఉండలేదు.

వెంకటప్ప లోక వ్యవహారాలందు ప్రియం లేనివాడు. కొందరు అతణ్ణి అమామకుడనీ, మరికొందరు పనికిమాలిన వాడనీ చులకన చేసే వారు. ఎందుకంటే వెంకటప్పకు అబద్దాలాడటం తెలీదు. ఉన్నదున్నట్లుగా, మనసులోని మాటను అభి వ్యక్తం చేసేవాడు. ఆ పద్ధతి కొందరికి ఇబ్బంది కరంగానూ, మరికొందరికి కంటకప్రాయంగానూ ఉండేది. ఆ కారణంగా వెంకటప్పను వారు పనికిమాలిన వాడిగా కొట్టివేసి ఏ మాత్రం గౌరవం ఇచ్చే వారు కాదు. అయితే భగవంతుని దృష్టిలో వెంకటప్ప అలా కాదు. జనులతన్ని అమాయకుడనే వారు. అంటే మాయకు అతీతుడని అర్థం. ఆ శుభలక్షణం భగవంతునిది! భగవంతుడూ అమాయకుడే, అనాథుడే! లోకంలో ఏ ప్రాణి కూడా ఆయనచే వ్యర్థంగా సృజింపబడి ఉండలేదు. ఆ సృజన వెనుక ఓ పరమార్థం దాగి ఉంటుంది. రావణుడు, కంసుడు, దుర్యోధనుడు, ఒక్కొక్క దుర్గుణంతో లోక కంటకులుగా ఉండేవారు. దుర్మార్గులని లోకం చేత ఏ కారణం చేత ఈసడింప బడుతున్నారో ఆ రీతిలో ఎవరూ ప్రవర్తించకూడదనే మహా సత్యాన్ని లోకానికి విదితం చేయడం కోసం పరమాత్మ వారి సృజన చేశాడని మనం గ్రహించవచ్చు. సృష్టిలో ఏ వస్తువూ వ్యర్థం కాదనేది సత్యం.  సత్య శోధన కోసం శాస్త్రవేత్తలు అవిశ్రాంతంగా శ్రమిస్తూ ఉంటారు. వారి పరిశోధనల పర్యవసానంగా ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులు లభిస్తున్నాయి.

చైతన్య, జడపదార్థాలు రెండు కూడా విశేషమైనవే. చైతన్యం వెంటనే వెల్లడి

అవుతుంది. జడం అంత త్వరగా వెల్లడి కాదు. ఒక రకంగా జడం చైతన్యానికి ఆధారం! మట్టి నుంచి ఆవిర్భవించే వృక్ష సంతతిని ఈ సందర్భంగా ఉదహరించవచ్చు.

మహా ప్రళయంలో కూడా భూమితో సహా సహాగ్రహాలు ఉనికి కోల్పోవు. లయసమయంలో ప్రాణులు పరమాత్మయందు బీజ రూపంలో దాగి ఉండి సృష్టి ప్రారంభంలో ప్రాణులుగా వ్యక్తమవుతాయని పురాణాలు వివరిస్తున్నాయి. అందుకే జడాన్ని నిరసించకూడదు. జడ సదృశంగా ప్రవర్తించే ఏ మనిషిని కూడా నిరాదరణ చేయకూడదు. ఒక వ్యక్తి వ్యక్తరూపం లోకకల్యాణం కోసం కావచ్చు. లేదా, ఏ ఒక్క కుటుంబానికో, లేక వ్యక్తికో సంబంధించి పరిమితమై ఉన్నది కావచ్చు. కుటుంబానికి శ్రేయస్సు అందించే వ్యక్తి అందరికీ కాకపోయినా కుటుంబ సభ్యులకు ఆప్తుడే అవుతాడు. అందుకే ఏ వ్యక్తినీ ఏదో ఊహించుకున్న కారణం చేత పనికిమాలినవాడుగా వ్యవహరించడం భగవన్నిందే కాగలదు.

*ఆంధ్రభూమి, 26.06.2011*

# అరుంధతి

**అరుంధతి** సప్త ఋషులలో ఒకరయిన వశిష్ట మహర్షి ధర్మపత్ని. పాతివ్రత్యానికి సంబంధించి ఆమె ప్రథమ గణ్యురాలు. నేటి యువతీ యువకులు కూడా అరుంధతి పేరును గుర్తించగలిగేలా హిందూ వివాహ తంతులో ఓ ప్రకియ వుంది. సప్తపది ముగిసిన అనంతరం వరుడు, వధువుకు ఆకాశంలో వశిష్ఠ మహర్షితో కూడా ఉన్న అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తాడు. అరుంధతీ నక్షత్రపు కాంతి అతి బలహీనంగా వుండే కారణంగా ఆ నక్షత్రం చాలామంది చూడగలిగే అవకాశం లేదు. అయినప్పటికీ వధువు నక్షత్రం కనబడలేదని చెప్పటం అమంగళకరంగా భావిస్తారు. అలా కనబడని వారికి అపమృత్యువు సమీపిస్తుందని ఓ వింత నమ్మకం వ్యాప్తిలో ఉంది.

అరుంధతి, వశిష్ట మహర్షిని సేవించి, తరించి ఆయన్ను భర్తగా పొందిన కారణంగా భార్యాభర్తల అన్యోన్య దాంపత్య సిద్ధికి, భార్య సుమంగళీత్వానికి అరుంధతీ నక్షత్ర దర్శనం చేసుకుంటారు నవదంపతులు. చైత్రమాసంలో శుక్లపక్ష విదియనాడు సువాసినులయిన స్త్రీలు హిందూ సంప్రదాయంలో భాగంగా ఉపవాస దీక్ష కొనసాగిస్తారు. ఆ దీక్ష పూనటం వలన ఆ స్త్రీలు వైధవ్యాన్ని పొందరని, భర్తతో అనుకూల దాంపత్యం వారికి అనుగ్రహింపబడుతుందనీ విశ్వసిస్తారు.

అరుంధతిని గురించి ఓ వృత్తాంతం ఇలా వ్యాప్తిలో వుంది. ఆమె ఓ ఛండాల కన్య. వశిష్టుడు కొనసాగించిన వేయి సంవత్సరాల తపో దీక్షాకాలంలో ఆమెకు మహర్షికి సేవ చేసే భాగ్యం లభిస్తుంది. ఆమె అకుంఠిత సేవతో సంప్రీతుడయిన వశిష్టుడు ఏదైనా వరం కోరుకోమన్నప్పుడు ఆమె ఆయన్ను భర్తగా పొందువరాన్ని కోరింది. తను బ్రహ్మణకులమునకు చెంది ఉండగా అరుంధతి ఛండాల కన్యగాన ఎట్లు దాంపత్యము పొసగుతుందని ప్రశ్నించినప్పటికీ ఆమె తన కోరిక విడనాడలేదు. అప్పుడు మహర్షి తన తపోశక్తితో ఆమెను ఏడుసార్లు బూడిదగా మార్చి తిరిగి బ్రతికిస్తూ ఏడు జన్మల్లో ఛండాల దోషాన్ని పరిహారం చేశాడనీ, ఆ తర్వాత ఆమెకు బ్రాహ్మణత్వం సిద్ధించగా వివాహ మాడాడనీ కథ ప్రచారంలో ఉంది.

అరుంధతి కర్దమ ప్రజాపతి, దేవహూతిలకు జన్మించిన ఎనిమిదవ సంతానం. పరాశరునికి మాతామహిగా, వ్యాసభగవానునికి ముత్తవ్వగా అరుంధతి చెప్పబడింది. పూర్వజన్మలో ఆమెను బ్రహ్మ మానస పుత్రిక అయిన 'సంధ్య'గా చెబుతారు. ఆమె

సప్తఋషులకు తత్త్వబోధ చేస్తూ వేదశాస్త్ర పురాణేతిహాసాలను వివరిస్తూ వుండేదని ప్రతీతి. మరో పురాణం ప్రకారం ఆమె బ్రాహ్మమానస పుత్రుడైన నారదుని సహోదరి కాగా, నారదుడామెకు వశిష్ఠునితో వివాహం జరిపించాడని తెలుస్తుంది. శ్రీమద్రామాయణం ప్రకారం ఆమె యొక్క నూరుగురు కుమారులను విశ్వామిత్రుడు నిహతులయ్యే విధంగా శపించినప్పటికీ ఆమె సహనం చూపింది. సప్తర్షులు యాగం నిర్వహిస్తున్నప్పుడు అగ్నిదేవుడు వారి భార్యలను చూసి మోహించిన సందర్భంలో అగ్నిదేవుని భార్య అయిన స్వాహాదేవి సప్తరుషులలోని ఆరుగురి భార్యల రూపాలను తను ధరించి భర్తను సంతోషపెట్టిందనీ, కాని వశిష్ఠుని భార్య అయిన అరుంధతి రూపం మాత్రం ఆమె ధరించలేకపోయిందనీ పురాణ కథనం! ఒకసారి భయానకమయిన కరవు పన్నెండేళ్ళపాటు ప్రజలను బాధించిందట! సప్తరుషి బృందానికి అరణ్యంలో కందమూలాదులు కూడా దొరకని పరిస్థితిలో అరుంధతి తన పాతివ్రత్య మహిమచేత వారికి కందమూలాదులు సమృద్ధిగా లభించేలా సృజించి అందించిందని తెలుస్తుంది. విశ్వామిత్రుడు వశిష్టాశ్రమంలో ఉన్న కామధేనువుపై మోజుపడి స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేసినప్పుడు ఆ ధేనువు మహిమచేత అనంతంగా సైన్యం పుట్టుకొచ్చి విశ్వామిత్రుని సకల సేనలను మట్టికరిపిస్తుంది. ఆ సందర్భంగా పగబూనిన విశ్వామిత్రుడు అరుంధతీ వశిష్టుల నూరుగురు సంతానాన్ని శాపంతో వధిస్తాడు. అయినప్పటికీ ఆ దంపతులు విశ్వామిత్రుని క్షమిస్తారు. ఆ క్షమకు ఫలితంగా వారికి శక్తి అను కుమారుడు ఉద్భవిస్తాడు. ఆ శక్తిని కూడా విశ్వామిత్రుడు సంహరిస్తాడు.

వ్యాకులపడిన దంపతులు వానప్రస్థాశ్రమ స్వీకరణకు ఉద్యుక్తులయినప్పుడు బ్రహ్మ వలదనీ, శ్రీరామదర్శనం వారికి త్వరలో లభించనున్నదనీ చెబుతాడు. లక్ష్మీనారాయణ స్వరూపులయిన సీతారాముల అరణ్యవాస కాలంలో వారు వశిష్టాశ్రమాన్ని సందర్శించినప్పుడు సీతామాతకు అరుంధతి పతివ్రతా ధర్మాలు బోధ చేస్తుంది. అంతటి ప్రజ్ఞాశాలిగా, మహా పతివ్రతగా అరుంధతి ఎప్పటికీ మహిళాలోకానికి ఆదర్శప్రాయురాలు, పూజ్యురాలే! ఇప్పటికీ ఆమె సప్తర్షి నక్షత్రమండలంలో వశిష్ట నక్షత్రానికి అతి చేరువలో తన ఉనికిని చాటుకుంటూ ఓ తారగా ప్రకాశిస్తోంది.

*ఆంధ్రభూమి, 18.07.2011*

# సత్ సాంగత్యం

సుబ్బా వధాని శ్రోత్రియ కుటుంబంలో జన్మించాడు. వేద పండితుల కుటుంబంలో జన్మించినప్పటికీ అతనికి సంపూర్ణ స్థాయిలో విద్యాగంధం అబ్బలేదు. సంధ్యావందనాదికాలు చేస్తూ భగవన్నామ స్మరణలో కాలం గడుపుతూ తన, వృత్తి వ్యాపకమయిన పౌరోహిత్యాన్ని కొనసాగిస్తున్నాడు. అతడి స్నేహితుడు అనంతాచార్యులు వేదశాస్త్రాలు అభ్యసించి మంచి పాండిత్యం గడించాడు. ఇద్దరూ కూడ సంసార బాధ్యతల నడుమ వృత్తి వ్యాపకాలతో కాలక్షేపం చేస్తున్నారు. సుబ్బావధాని ఈ మధ్య తన వృత్తి పురోహితాన్ని ఏదోలా యాంత్రికంగా చేస్తూ దానికి పూర్తి న్యాయం చేయలేకపోతున్నాడు. పూజలు, జపాలు మానడం త వృత్తికి తగని పని అని తెలిసినా జీవిత గమనాన్ని సరిదిద్దుకోలేక పోయాడు. పర, అపర కర్మలు చేయిస్తూ సంపాదన చేస్తున్నప్పటికీ అతనికి యాంత్రిక జీవనశైలి అలవడింది. ఏదో తెలియని వెలితి అతడిని బాధించసాగింది. అంతలో వైకుంఠ ఏకాదశి, పర్వదినం వచ్చింది. దైవదర్శనార్థం ఆలయానికి వెళుతూ అనంతాచార్యులు సుబ్బావధానిని కూడ ఆహ్వానించాడు. తేజోవిహీనంగా కనపడుతున్న సుబ్బాధాని ముఖాన్ని పరిశీలించిన అనంతాచార్యులతో అవధాని, తాను పౌరోహిత్య విధులు యాంత్రికంగా నిర్వర్తిస్తున్నాననీ, ఆ వెలితి తనను ఎంతగానో బాధిస్తోందనీ చెబుతాడు. తనతో పాటు దైవ దర్శనం చేసుకున్న సుబ్బావధానితో అనంతాచార్యులు యిలా అన్నాడు. అవధానీ! భయం లేదు. నిరుత్సాహపడవలసిన అవసరం అంతకన్నా లేదు. వ్యక్తిగత జీవితంలో పటం ముందు కూర్చుని పూజ చేయగలిగే సంకల్పం నీకు కలగటం లేదు. సంధ్యావందనాన్ని ఏకాగ్రతతో చేయలేకపోతున్నందుకు విచారపడకు! గృహనిర్వహణ కోసం పురోహితం చేస్తున్నావు కదా? ఆ అవకాశం చాలు, నీ వ్యక్తిత్వం సరిదిద్దుకోవటానికి! విడవకుండా కొంతకాలం పాటు మానసిక పూజచేసుకో, మందులు తినగా తినగా రోగం నశిస్తుంది. పాడగా పాడగా రాగం అతిశయిల్లుతుందని ఆర్యవచనం! ఒకనాటికి శాస్త్రం మెచ్చేలా నీవు అనుష్ఠానం చేయగల్గుతావు. సుబ్బావధాని అనంతాచార్యుల సలహా తు.చ. తప్పకుండా ఆచరణలో పెట్టాడు. మానసిక పూజతో సంపూర్ణంగా మనస్సుకు తీపి కలగక పోవడంతో ఒకనాటికి విధ్యుక్తంగా భౌతికంగా పూజకు ఉద్యుక్తుడయిన అవధాని యిప్పుడు శాస్త్ర సమ్మతంగా అనుష్ఠానం చేస్తున్నాడు. అతని విజయానికి కారణం ఆప్తమిత్రుని హితవచనం!

భర్తృహరి తన నీతి శతకంలో మంచి స్నేహం వలన కలిగే లాభం గురించి యిలా అంటాడు.

“జాడ్యం ధియోహరతి సిచ్చతి వాచి సత్యం
మనోన్నతిం దిశతి పాపమపాకరోతి
చేతః ప్రసాదయతి దిక్షు తనోతికీర్తిం
సత్యంగతిః కథయ కింన కరోతి పుంసాం!”

“ఉన్నత వ్యక్తిత్వం గల మహాపురుషుల సాంగత్యం వల్ల ఒనగూరే ప్రయోజనం అపారం! సత్సాంగత్యం వలన మానసిక జాడ్యం దూరమవుతుంది. మాటలో సత్యం వెల్లివిరుస్తుంది. వ్యక్తి ఔన్నత్యం విప్పారుతుంది. పాపం పరిహార మవుతుంది. మంచి స్నేహం వల్ల కీర్తి యినుమడిస్తుంది” అని భావం.

అందువల్ల సత్సాంగత్యానికి మించిన ప్రత్యామ్నాయం లేదని మోక్షగామి తెలుసుకోవాలి.

*ఆంధ్రప్రభ, 29.07.2011*

# వ్యసన పరు(వు)లు

**కామ** క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను అరిషడ్వర్గాలంటారు. వీటిలో ఏ ఒక్కదాని బారిన పడిన మనిషి కూడా పతనం చెందిన దృష్టాంతాలు మన పురాణేతిహాలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కాగా ఏడు దుర్గుణాలుగా గర్వము, లోభము, కామము, క్రోధము, కుక్షింభరత్వము (తిండిపోతుతనము), అసూయ, సోమరితనము చెప్పటం జరిగింది.

వ్యసనాలు అనుభవించిన కొలదీ ఆసక్తికోరుతాయి. మానవుని బానిస చేసే వ్యసనాలు ఏడు వున్నప్పటికీ త్రాగుడు, వ్యభిచారము, జూదము పట్టి పీడించే వ్యసనత్రయంగా చెప్పుకోవచ్చు. వ్యసనాలు పదే పదే ఇంద్రియ అనుభవాన్ని, తద్వారా ఇంద్రియ సుఖాన్ని కోరడం వల్ల, వాటికి బానిసైన మానవుడు తిరిగి కోలుకోవడం అరుదు. పతనం అంచుకు వెళ్ళిన దాఖలాలే ఎక్కువ. ద్యూతక్రీడ, మృగయావినోదము (వేట), త్రాగుడు, జారత్వము, వాగాడంబరము, దండ పరుషత్వము (హింస), ధనమదం, ఇత్యాది విసప్త వ్యసనాలుగా చెప్పబడినప్పటికీ, మనిషిని పట్టి పీడించే వాటిలో అగ్ర గణ్యములుగా జూదము, వ్యభిచారము, త్రాగుడు చెప్పబడ్డాయి. కాగా భగవన్నామంలో రుచిమరిగిన సాధకునకు భగవదనుభవం ప్రీతిపాత్రమవుతుంది. శ్రీకృష్ణుని ఆకర్షణ సకారాత్మకము కాగా వ్యసన ఆకర్షణ నకారాత్మకము. భగవదాకర్షణ పరమాత్మ సన్నిధికి చేర్చేదికాగా దుర్వ్యసనాలు నరకప్రాప్తికి హేతువు. లోక ఆకర్షణలో, జీవుడు వ్యధ చెందుతాడు. భగవదాకర్షణలో వృద్ధి చెందుతాడు.

సారయ్య సారాకు బానిస కాక ముందు మంచివాడే! అతనికో కుటుంబం వుంది. తల్లి, తండ్రి, అతడు. ఒక్కడే కొడుకు కావడంతో గారాబంగా పెంచారు సారయ్యను. అతడు నంది అంటే నంది, పంది అంటే పందిగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యిచ్చారు తల్లితండ్రులు. చివరకు అదే కొంపతీసింది. అలాక్కాదు. యితనికి పెళ్ళి చేస్తే బాగుపడతాడను కున్నారు. ఒక గుణవతిని యిచ్చి పెళ్లి చేశారు. కొంతకాలం పాటు రోజులు బాగానే గడిచాయని తల్లి, తండ్రి, భార్య అనుకొనడానికి కారణం సారయ్య వారి యెదుట పడి మద్యపానం చేయకపోవడమే. మద్యానికి అతని బానిసత్వం ఎందాకా వెళ్ళిందంటే అతనికి భార్య కూడ అక్కరలేదు. సారా వుంటే చాలు! ఆ మాటే ఆమె ముందు అతగాడు అన్నప్పుడు ఆమె చలించిపోయింది. త్రాగుడు మానమని కాళ్లావ్రేళ్లా పడి బ్రతిమాలింది. కొత్త భార్య అనే మోజులో సారయ్య కొన్ని రోజులు మద్యం ముట్టలేదు. మద్య వ్యసనాన్ని మానటానికి ఓ ప్రత్యేక వైద్యుని చేత సద్బోధ చేయించింది అతని సతీమణి. భార్య కావాలా? లేక

మద్యం కావాలా? అని వైద్యుడడిగితే, తనకు మద్యమే కావాలని చెబుతాడని భావించిన గుణవతి తనకు భార్యే ముఖ్యమని సారయ్య చెప్పినపుడు ఆశ్చర్యంతో పాటు ఆనందం పొందింది. అయితే అది కొన్నాళ్ళ ముచ్చటే అయింది. అతను వ్యసనం నుంచి బయటపడలేక పోయాడు. కాలేయానికి సంబంధించిన తీవ్ర వ్యాధితో బాధపడుతూ, మంచం పట్టి అతగాడు ఒకనాటికి దేహం చాలించవలసిన పరిస్థితి తప్పలేదు. అందుకే నకారాత్మక అలవాట్లు చాలా ప్రమాదకరమయినవిగా చెప్పబడ్డాయి. వాటికి దూరంగా వుండవలసిందని వైద్యులు, ఆధ్యాత్మిక వేత్తలు చెప్పడమే కాక మన పురాణేతిహాసాలలో మద్యపాన విసర్జన గురించిన సద్బోధ వివరంగా కనిపిస్తుంది. మన యితిహాసాలలో కనిపించే దుష్ట రాక్షసపాలకులు అందరూ మద్యం సేవించి పాపాచరణకు ఒడిగట్టిన వారే! ద్వాపర యుగంలో గయుడను గంధర్వరాజు మద్యం సేవించి సంధ్యాకాలంలో శ్రీకృష్ణుడు సూర్య భగవానుడికి అర్ఘ్య ప్రదానం చేస్తున్న వేళ, ఆకాశగమనం చేస్తూ, మద్యం మత్తులో తాంబూల శేషాన్ని ఉ మిసిన సందర్భంలో తాను సాక్షాత్తు శ్రీకృష్ణుని భక్తుడై వుండి కూడా ఆ అపరాధానికి మరణశిక్షకు అర్హుడు కావింపబడిన వృత్తాంతం మద్యదాసులకు ఓ హెచ్చరిక. గుణపాఠం కావాలి.

వ్యభిచారము, జూదం వంటిదుర్వ్యసనాలు కూడా చాలా చెడ్డవనీ, వాటి ఆకర్షణకు గురి కారాదని మన యితిహాసాలు హెచ్చరిస్తున్నాయి. ధర్మరాజు జూదవ్యసన పర్యవసానంగా పాండవులు రాజ్యభోగాలను కోల్పోయి, అరణ్యాలలో కష్టాలు పడవలసిన దుస్థితి కలిగింది. స్త్రీలోలులుగా, రావణ కీచకాదులు శిక్షింపబడిన వృత్తాంతాలు శ్రీరామయణ శ్రీమద్భారతాలలో కనిపిస్తాయి.

ఈ మూడు వ్యసనాలు కూడా మిగిలిన వాటివలెనే ఆచరణలో పునరావృత్తి కోరుతాయి. అదే తప్పును చేసి, చేసి వ్యక్తి నశించవలసిన దుస్థితి ఎదురవుతుంది. విషయ లంపటాల పట్ల ఆకర్షణ ప్రలోభపరచి నశింప చేసేది కాగా, భగవదాకర్షణ బాగుపరచేదవుతుంది. పంచ భూతాత్మకమయిన దృశ్య జగత్తులోని మాయా శక్తి యొక్క ఆకర్షణకు లొంగకుండా సాధకుడు జాగ్రత్త పడాలి. ఒకరికి మంచి చేయకపోయినా, చెడు చేయనివాడు గొప్పవాడుగా పరిగణింపబడతాడు. ఇంద్రియ సుఖాలకు లొంగని సందర్భంలో సప్తవ్యసనాలకు దాసులయ్యే హీన పరిస్థితి సాధకులకు వుండదు. అలాంటి వారికి భగవదనుగ్రహం అయాచితంగా లభిస్తుందని పెద్దల మాటగా సాధకులు గ్రహించాలి.

*ఆంధ్రప్రభ, 14.08.2011*

# అగ్నిదేవుని అనుగ్రహం

అగ్ని పంచభూతాలలో ఒకరు. విష్ణు స్వరూపుడు. అగ్నిదేవునికి హిందూ పురాణేతిహాసాలలో విశేషమయిన స్థానం వుండటమే కాక, మానవుని జీవితక్రమంలో అగ్నిదేవునికి సముచిత ప్రాధాన్యత వుంది. అగ్నిప్రమేయం లేకుండా పొయ్యిలో పిల్లి లేచే అవకాశం వుండదు. ఆ మాటకొస్తే అగ్ని లేకుండా మనిషికి పక్వాహారం లభించే అవకాశం లేదు. యజ్ఞయాగాది క్రతువుల్లో అగ్నిదేవుని పాత్ర అమోఘమయినది. యజ్ఞ సారంగా అగ్నిదేవతలకు ఆహుతులను సమర్పిస్తాడు. ఈ జగత్తులో దశ అగ్నులు వున్నాయి. మన వేదశాస్త్రాల్లో దశాగ్నులు ఈ విధంగా వివరింపబడ్డాయి. 1. వంటకు ఉపయోగించే సాధారణ అగ్ని, 2. తటిల్లతల్లోని మెరుపు. 3. సూర్యభగవానుని తేజస్సు, 4. ప్రాణులలో జీర్ణక్రియకు దోహదం చేసే వైశ్వానర అగ్ని, 5. అరణ్యాలలో చెట్ల రాపిడికి ఉత్పన్నమై అటవీ సంపదను దహించివేసే దావాగ్ని, 6. హోమాగ్ని, 7. రెండు కర్రల రాపిడితో హోమ కార్యాల నిర్వహణ కోసం ఉత్పన్నం చేసే అగ్ని – అరణి. 8. ఉపనయన సంస్కారంలో హోమకుండంలో ప్రజ్వరిల్లే తేజాగ్ని, 9. కొన్ని కర్మకాండల్లో ప్రభవించే దక్షిణాగ్ని, 10. చితిమంటగా దేహాల్ని దహించివేసే చరమ అగ్ని.

అగ్నిదేవుడు యజ్ఞహవిస్సులను దేవతలకు అందించే మహోన్నత కార్యం నిర్వహిస్తాడు. ఆయన నిత్యయవ్వనుడు. జనన మరణాలు లేనివాడు. అగ్ని పవిత్రతకు చిహ్నం. ఏ పదార్థాన్నయినా అగ్నిలో ఆహుతి గావించినపుడు నశించి అంతిమ రూపమయిన బూది రూపొందవలసిందే! అగ్నిలో చేరటం ద్వారా ప్రాణుల దేహాలకు పునీతత్వం సిద్ధిస్తుంది. హిందూ మతానుసారంగా కొన్ని కులాల వారు మరణించినపుడు మృతదేహాలకు అంతిమంగా అగ్ని సంస్కారం జరిపించడం సాంప్రదాయం.

అగ్ని లేకుండా నివాసయోగ్యమయిన ఏ గృహం కూడ మనజాలదు. ఆహారం పచనం చేయటానికి నిప్పులేకుండా పని జరగదు. వాస్తు శాస్త్రంలో కూడ అగ్నికి విశిష్టమయిన స్థానం వుంది. వాస్తు పాటించే వారి గృహాల్లో ఆగ్నేయ దిక్కన వంటశాల నిర్మిస్తారు. ఆగ్నేయ దిశకు అగ్నిహోత్రుడు అధిష్ఠాన దేవత.

వేదాల్లో అగ్ని రెండు శిరస్సులు కలిగి వుంటాడని చెప్పబడింది. ఋగ్వేదంలో అగ్ని ప్రాశస్త్యాన్ని విశదీకరిస్తూ ఈ ప్రారంభశ్లోకంతో ఆయనను స్తుతించడం జరిగింది.

"ఓం అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవం ఋత్విజం హోతారం రత్నధాతమం"

నిత్యాగ్ని హోత్రులుగా ప్రాచీన శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబాలలోని మహనీయులు అలరారారు. కొందరు మహితాత్ములు నిత్యాగ్ని హోత్రం నిర్వహించకుండా మంచినీరు కూడా ముట్టేవారు కాదంటే ఆశ్చర్యం కలిగినా, అది నిజం! షిర్డీ సాయిబాబా తన జీవితకాల మంతా ధుని నిర్వహించి అగ్ని ఆరాధన చేశారు. అవధూత వెంకయ్యస్వామి, ధునీవాలాబాబా యిత్యాధి మహనీయులు నిత్యాగ్నిహోత్రులే.

గృహాలలో మానవులకు పక్వాహారం అందించే అగ్నిహోత్రుని మహాత్ములు 'ఇంటివంటవాడు'గా స్తుతించారు. అసలు అగ్ని పుట్టుక స్థానం 'నీరు'. సముద్రాల్లో ఉద్భవించే మంటలను 'బడబాగ్ని' అంటాం. మానవ (ఆమాటకొస్తే ఏ ప్రాణి) జీర్ణాశయంలో కూడ ప్రజ్వరిల్లే ఆకలి మంటను 'వైశ్వానర అగ్ని' అంటారు. అరణ్యాలను మండించే అగ్నిని దావానలము అంటారు.

అగ్ని ఇంద్రుని తర్వాత రెండవస్థానం అలంకరించి వుంటాడని వేదాలు కీర్తిస్తున్నాయి. పవిత్ర హోమాలు నిర్వహించే ముందు రెండు కర్రలను (అరణి) ఒరిపిడికి గురి చేసి, నిప్పురవ్వలు పుట్టించి అగ్ని రాజేస్తారు. అగ్ని సాధనాలయిన అరణిని అగ్నిహోత్రుని యిద్దరు తల్లులుగాను, కర్రలను రాపిడికి గురి చేసే రుత్విజుని రెండు చేతులకుండే పది వ్రేళ్ళను ఆయన పరిచారకులుగాను చెప్పబడింది. అగ్ని దేవుడు సాధకుని పట్ల ప్రసన్నుడయినపుడు, అందరు దేవతలూ ప్రసన్నులవుతారని చెబుతారు. అగ్ని ద్వారా ప్రసారమయ్యే వెలుగు జ్ఞానానికి ప్రతీక.

విష్ణు పురాణం ప్రకారం అగ్ని, బ్రహ్మదేవుని జ్యేష్ఠ పుత్రుడు. ఆయన భార్య స్వాహాదేవి. వాయుపురాణం ప్రకారం 'పావకము' అనునది మేఘాలలోని విద్యుల్లతల్లో వుండే అగ్ని 'పవమానము' అనునది కర్రల ఒరిపిడికి ఉత్పన్నమయ్యే (అరణి) అగ్ని, 'శుచి' అనునది సూర్యతేజములోని అగ్ని.

లంకలో సీతమ్మవారు అశోకవన వాటికలో శ్రీరామదర్శనం వాంఛిస్తూ వేయి కన్నులుగా నిరీక్షించింది. శ్రీరాముని చేత రావణుడు సంహరింపబడ్డాక, అమ్మస్వామిని చేరే సమయంలో ఆమె పాతివ్రత్య నిరూపణ అగ్నిప్రవేశం చేయడం ద్వారా చేయబడింది. అమ్మ అగ్నిలో ప్రవేశం చేసిన వేళ అగ్ని తనకు గల దహించే శక్తిని కోల్పోగా అగ్నిదేవుడు ప్రత్యక్షమై సీతామాత పాతివ్రత్యాన్ని శ్లాఘించడం అనే అంశం పరిశీలించినపుడు అగ్నిద్వారా సచ్ఛీలుర పవిత్రత లోకానికి వెల్లడి చేయబడిందని విశదమవుతుంది.

అగ్నికి స్వ – పర భేదాలు లేవు. తనను చేరిన ఏ వస్తువు, లేక ఉపాధిని కూడ నిలువునా దహించి వేసి విభూతిగా మార్చగల సమర్థత ఆయనకుంది.

దత్తాత్రేయుని షోడశ అవతారాలలో 'కాలాగ్ని శమనుడు' ఒక అవతారం.

అత్రిమహర్షి దత్త ప్రభువు జనకుడు. ధ్యానముద్రలో వున్న అత్రిమహాముని నుండి వెలువడిన యోగాగ్ని ఆయన్ను దహించబోయిన సమయంలో దత్తప్రభువు ఋషి శిరస్సును ఆవహించి ఆయన యోగాన్ని చల్లార్చి కోటి చంద్రుల చల్లదనం కలగించాడట. ఈ ఉదంతం ద్వారా త్రిమూర్త్యాత్మకుడయిన దత్తాత్రేయస్వామికి, అగ్నికి తేడాలేదని తెలుస్తుంది.

ఖాండవవనాన్ని అగ్నిదేవుడు 'భస్మం చేసిన గాధ మహాభారతంలో చెప్పబడింది. శ్వేతకి అనే ప్రభువు పండ్రెండు సంవత్సరాల పాటు అవిశ్రాంతంగా యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో హోమద్రవ్యమయిన నేయి త్రాగి త్రాగి అనలునికి అజీర్ణరోగం పట్టుకొంది. ఆ రోగాన్నుంచి విముక్తుడు కాగోరిన స్వామికి, బ్రహ్మదేవుడు ఖాండవవనంలో సమృద్ధిగా ఔషధమూలికా సంపద వున్నదనీ, ఆ వనాన్ని గనుక దహించి వేస్తే ఆయన్ను పట్టుకున్న అగ్నిమాంద్యం మాయమవుతుందనీ సలహాయిస్తాడు. అయితే 'దేవరాజు ఇంద్రుని సఖుడయిన తక్షకుడనే నాగరాజు సతీసమేతంగా ఆ వనంలో నివశిస్తూ వుంటాడు. అగ్నివన దహనం ప్రారంభించినప్పుడల్లా తక్షకుడు పారిపోయే ప్రయత్నం చేస్తూ, అది వీలుకాక పోవడంతో తన మిత్రుడైన దేవేంద్రుని సహాయం అర్థిస్తూ వచ్చాడు. అలాంటప్పుడు ఇంద్రుడు కుంభవృష్టి కురిపిస్తూ అగ్ని స్వేచ్ఛకు ఆటంకం కల్గిస్తూ వచ్చాడు. ఆ సందర్భంలో అగ్నిహోత్రుడు అర్జునుని సహాయం పొంది స్వేచ్ఛగా ఖాండవ దహనం చేసి సమస్త ఔషధ మూలికలను ఆరగించి రోగవిముక్తుడయిన ఉదంతం శ్రీ మద్ మహాభారతంలో ఉల్లేఖించబడింది.

అగ్నిసూర్య తేజస్సును పుణికి పుచ్చుకున్న దిక్పాలకుడు. ఎందరో మహానుభావులు అగ్ని ఆరాధన చేసి తరించిన ఉదంతాలు ఇతిహాస, పురాణాల్లో వున్నాయి. దీపారాధన అగ్ని అరాధనే! ఉదయ సాయం సంధ్యావేళల్లో మహిళలు దీపారాధనతో ఇష్టదేవతా పూజలు చేస్తూ ఇష్టదైవానుగ్రహంతో పాటు అగ్నిదేవుని అనుగ్రహం కూడా పొంది తద్వారా ఆయురారోగ్య సౌభాగ్యాలతో దీర్ఘ సుమంగళులుగా వర్ధిల్లుతున్నారు.

# ఆధ్యాత్మిక ప్రగతికి శాకాహారం

రక్త మాంసాలు కలిగివున్న మనిషి రక్తమాంసాలున్న మరో ప్రాణిని ఆరగించటం ఈరోజుల్లో మనకు విడ్డూరమేమి అనిపించదు. బ్రహ్మణ, వైశ్యాదులు, యింకా ఆధ్యాత్మిక సాధన చేస్తున్న యితరులు కూడ మాంసాన్ని ముట్టక, శాకాహారాన్ని స్వీకరిస్తూ సాత్వికసాధనా సంపత్తి సంతరించుకొని జీవనం చేస్తున్నారు. కొందరు ఆధ్యాత్మిక వేత్తలు, ధ్యానప్రియులు మనిషి యొక్క దంతాల అమరికలో మాంస భక్షణకు అనువయిన కోరలు లేని కారణంగా, మనిషి మాంస భక్షణ అలవాట్లు ఈ మధ్యకాలంలో ఏర్పరచుకున్నవే కానీ, ప్రకృతి నిర్దేశిత శాసనాల ప్రకారం కాదని చెప్పటం విశేషం!

ఈ సృష్టిలో ఏ కోణంలో చూసినా మనిషిదే పై చేయి. అతడే ప్రకృతిలో సర్వశ్రేష్ఠుడుగా సృజింపబడ్డాడు. బుద్ధి బలం కూడా విశేషంగా కలవాడు. ఏ ప్రాణికి కూడ మనసనేది లేదని మనకు తెలుసు. అందుకే మనస్సు, మేధస్సు కలిగివున్న మనిషి మాటే జగతిలో చెల్లు బాటవుతోంది. ఏనుగుల వంటి బలమయిన జంతువులు, పులులు, సింహాల వంటి క్రూర ప్రాణులు కూడ మనిషి వివేకం ముందు తల వంచవలసిందే! అందుకే జంతువులు, పక్షులు, జలచరాలు అతనికి ఆహారమవుతున్నాయి. భారతదేశంలో హిందూ, బౌద్ధ, జైన ఇత్యాది మతాల్లో మాంసాహారం స్వీకరించని వారు కనిపిస్తారు. హిందువుల్లో కూడా ఒకటి రెండు సామాజిక వర్గాల్లోని కొందరు, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే శాకాహారానికి పరిమితమయిన వారు కనిపిస్తారు. బ్రాహ్మణులు కూడా ఆదికాలంలో మాంసాహారం స్వీకరించే వారనటానకి ఎన్నో దృష్టాంతాలు వున్నాయని పురాణ గాథల పుటలు తిరగేస్తే తెలుస్తుంది. “జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం” అంటూ తల్లులు తమ బిడ్డలు పాలుత్రాగిన తర్వాత వారి కడుపు ప్రేమతో నిమరటం మనకు తెలుసు. నవతరం తల్లులకు ఈ ఆచారం తెలియక పోవచ్చుగానీ, ముందు తరాల్లో ఈ ఆచారం వుండేది. పూర్వం వాతాపి, ఇల్వలుడు అనే రాక్షస సోదర ద్వయం దండకారణ్యంలో జీవిస్తూ అక్కడ దొరకే జంతువులను, మానవులను అందివచ్చిన వారిని వధించి, భుజిస్తూ కాలక్షేపం చేస్తుండేవారు. అయితే ఆ సోదరులు అలా ఆహార సముపార్జన చేయటం కోసం కష్టపడటంలోని యిబ్బందిని గుర్తించి,

సులభంగా ఆహారం ముఖ్యంగా నరమాంసం దొరికే ఉపాయం ఆలోచించారు. అలా ఆలోచించిన మీదట వారికి ఒక ఉపాయం తట్టింది. ఆ సోదరుల్లో ఇల్వలుడనువాడు వాతాపికన్నా బుద్ధి కుశలత కలిగిన వాడు. అతడు రచించిన పథకం ప్రకారం ఆ అడవి గుండా ప్రయాణిస్తున్న బాటసారులను మారు వేషంలో, మాయమాటలతో మభ్యపెట్టి, తమ యింటికి ఆహ్వానించి, వారికి విందుభోజనం ఏర్పాటు చేయడం, అలా వండి వడ్డించే మాంసభోజనంలో ఇల్వలుడు వాడిసోదరుడయిన వాతాపిని వధించి వాడి మాంసం వడ్డించడం, తీరా అతిథులు భోజనం ముగించాక, "వాతాపీ! బయటికిరా!" అనడంతో వాడు అతిథుల పొట్ట చీల్చుకొని బయటకు వచ్చాక, పొట్టపగిలి చనిపోయిన అతిథులను చక్కగా వండుకొని ఆరగించడం అనవాయితీగా మారింది. ఆ పరిణామక్రమంలో ఒకనాడు అగస్త్యమహర్షి వారి కంటపడ్డాడు. మహర్షిని కూడా శ్రాద్ధ భోజనానికి ఆహ్వానించి, అదే రీతిన వాతాపిని వధించి, వండి వడ్డించాడు ఇల్వలుడు, "వాతాపీ! బయటకు రా!" అన్నప్పుడు అగస్త్యుల వారు, "ఇంకెక్కడి వాతాపి! నా కడుపులో జీర్ణమై పోయాడు. జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం!" అంటూ కడుపు నిమురుకుంటూ అన్నప్పుడు ఖంగుతినడం ఇల్వలుని వంతవుతుంది. ఆ రోజుల్లో సత్వగుణ శోభితులయిన మహర్షులు కూడా మాంస భక్షణం చేస్తుండేవారని ఈ ఉదంతం వల్ల తెలుస్తుంది.

అంతెందుకు, పురాణ యుగంలో బ్రాహ్మణ కుటుంబాలలో కూడా మాంసభక్షణం వుండేదన్న ఉదంతాన్ని స్వామి వివేకానంద తన సాహిత్యంలో ఒక చోట పొందుపర్చడం జరిగింది. సద్బ్రాహ్మణులు తమ గృహాలకు ఆప్తులయిన బంధువులు అతిథులుగా వచ్చినపుడు చక్కని కోడెలను వధించి, రుచిగా శుచిగా వండి వారికి అతిథ్యం యిచ్చేవారట! ఈ కారణంగా పొందికయిన కోడెలు నశించడం ఆరంభం కావడంతో, గో సంతతి నశిస్తూ, క్రమేణా అంతరించే దశకు చేరుకుంటున్న తరుణంలో బ్రాహ్మణ కుటుంబాలలో ఎద్దుమాంస భక్షణ చేయక పోవడం పరిపాటిగా మారి వుండవచ్చునని స్వామివారి సందేశం.

ఈ నేపథ్యంలో మాంసభక్షణ సరియైనదా? లేక శాకాహార స్వీకరణ ఉత్తమమా? అన్న మీ మాంసకు అంత ప్రాముఖ్యత లేదేమో అనిపిస్తుంది. భారతా వనిలో ఈ చర్చకు అవకాశం వుండవచ్చునేమో కానీ, ఖండాతర దేశాలలో ఈ ప్రశ్నకు ఉనికి లేదు. ఎందుకంటే మాంసాహారానికి సరయిన ప్రత్యామ్నాయం వారికి తెలియక పోవచ్చు. అలాంటప్పుడు ఏది మంచి ఆహారం, ఏది కాదు? అనే అంశం యొక్క చర్చకు అంత ప్రాధాన్యత లేదు.

ఏది ఏమయినా, ఆధ్యాత్మిక ప్రగతి కోరేవారు మాంసభక్షణం చేయకపోవడమే ఉత్తమం! శాకాహారం సత్వగుణ ప్రధానమయినది. మనిషితినే ఆహారంలో స్థూల అంశంతో రక్తమాంసాదులు నిర్మింపబడగా, సూక్ష్మాంశంతో మనస్సు రూపుదిద్దుకుంటుంది. ఆక్రమంలో

మనస్సు పరిపూర్ణత పొందిదైవంపై ఏకాగ్రత సిద్ధించాలంటే సత్వ ప్రధానమయిన శాకాహార స్వీకరణ ఉత్తమోత్తమంగా నిలుస్తుంది. కొవ్వుతో కూడివుండే మాంసం తమోగుణాన్ని ఆపాదించేది కాబట్టి, జపధ్యానాదులకు ఉపయుక్తమయిన సాత్విక మనోప్రవృత్తి దాని వలన సాధకునకు అందదు. అలా చూసినపుడు సాత్వికమయిన శాకాహారాన్ని ఆధ్యాత్మికాభిలాషి భుజించడం ఉత్తమం.

ఈనాడు వైద్యులు శాకాహారంతో రక్తపోటు, గుండెజబ్బులు, స్ట్రోక్ యిత్యాదివ్యాధులు దరిచేరవనీ, అందువల్ల శాకాహారం ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. ఇహలోక అవసరాలు తీర్చేందుకు, పరలోక ప్రాధాన్యతను అందిపుచ్చుకునేందుకు సత్వగుణ ప్రధానమయిన శాకాహారం నిలుస్తుంది. కాబట్టి, అటు ముముక్షువులు, ఇటు ఆరోగ్యాభిలాషులు మాంసాహార అలవాటు నుంచి శాకాహారానికి మారిపోవలసి వున్న సంకేతాన్ని అందిపుచ్చుకుంటే ఎంతో మేలు జరుగుతుందని గ్రహింపవలసి వుంది.

*ఆంధ్రప్రభ,*

# 'వర్తమానం'

చరిత్ర గతాన్ని నెమరువేయిస్తుంది. ఘనకీర్తి గల మహనీయుల జీవిత కథలెన్నో చరిత్రపుటల నుంచి జాలువారుతాయి. గతంలో లబ్ధ ప్రతిష్ఠ కలిగివుంటే ఇపుడూ ఆ మార్గం అనుసరించడం శ్రేయోదాయకం. గత వైఫల్యాలను కూడ గొప్పగా చెప్పుకొనే వారు కొందరు. 'గతంలో నేను కారాగారవాసం చేశా' నని ఓ నాయకుడు ఘనంగా చెప్పుకుంటే బాగానే ఉండవచ్చు గానీ కారాగారవాసం చేసిన రోజుల్లో శిక్ష ఆమోద యోగ్యం గా ఉండి ఉండదు. సంసారవృక్షానికి ఆద్యులైన తాతముత్తాతలకు ఘనచరిత్ర వున్నా లేకపోయినా వారి ఘనత గొప్పగా చెప్పుకోవడం వారసులకు లేకపోలేదు. గతాన్ని పాతచింతకాయగా కొట్టి పారేసేవారు కొందరు. కానీ గతం విలువ విస్మరించలేనిది. ప్రపంచ చరిత్రను పాఠ్యాంశంగా చదువుకుంటాం. మన పూర్వుల మంచి లక్షణాలను అనుసరించ గల్గితే వారి చరిత సార్థకమౌతుంది.

కాలానికి మరోపార్శ్వం ఆశావహమైన భవిష్యత్తు. దానిపై మనిషికి ఎన్నో ఆశలు అంచనాలు వుంటాయి. గతంలో సాధించలేని పని సాధించుకొనేందుకు ప్రణాళిక రూపొందించుకుంటాం. గ్రహగతుల ఆధారంగా భవిత తెలుసుకొనే ప్రయత్నం చేస్తాం. భవిత సూచన ఆమోదానికి కొందరికి హేతువు అవసరమైతే మరికొందరికి ఆ అవసరం ఉండదు. భూత భవిష్యత్ కాలాలకు ఓ పోలిక ఉంది. ఆరెండిటి ఉనికిలోకి మానవ మస్తిష్కం చొరబడలేదు. కాలచక్రాన్ని ముందు వెనుకలకు కదిలించడం సాధ్యంకానిపని. గతం ఓ జ్ఞాపకంకాగా భవిత ఆశల హరివిల్లు! వర్తమానంలోని కర్మఫలితం అందుకొనే భవ్యక్షేత్రం భవిష్యత్తే! కర్మల ఫలితం క్షణాల్లో వచ్చేదిగాను, కొన్ని రోజులు వారాలు నెలలు సంవత్సరాల అనంతరం వచ్చేదిగాను ఉండవచ్చు. మనిషి ఇచ్ఛాశక్తిని పెంచుకోవడంలో ఈ రెండు కాలాలూ తోడ్పడతాయి. గతంలోని తప్పులను తరచూ శోధించి స్మరించుకోవడం గానీ భవిష్యత్తులో ఏదో అనర్థం జరుగుతుందనే ఆందోళన గానీ సరికాదు. 'గతాన్ని సమాధి చెయ్యి. భవిష్యత్‌పై ఆశలు పెంచుకోకు. వర్తమానంలో హాయిగా జీవించడం నేర్చుకో!' అంటాడో సుకవి.

ఓ గృహస్థు పడక కుర్చీలో కూర్చుని ఆలోచనా ప్రపంచంలో విలీనమయ్యాడు. 'గతంలో చేసిన ఫలానా పనికి ఫలానా ఫలితం వచ్చింది. మరోలా చేసి ఉంటే ప్రస్తుత ఆందోళన ఉండివుండేదికాదు' అని మీ మాంస పడసాగాడు. శరీరం వర్తమానంలో ఉందిగానే

ఆలోచనలు ఆత్మకథ పుటలు తిరగేస్తున్నాయి. భార్య ఇంటిపనిలో నిమగ్నమై ఉంది. పిల్లవాడు ఉయ్యాల నుంచి జారిపడి గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. భార్య విషయం చెవిన వేసేదాకా అతడికి వర్తమాన స్పృహ కలగలేదు. అతడు వాస్తవంలో జీవించి ఉంటే బిడ్డ కింద పడటం జరిగి వుండేది కాదు.

మనిషి వర్తమానంలో జీవించాలి. వాస్తవంలో జీవించాలే తప్ప ఊహా లోకంలోకాదు. గత జలసేతు బంధనం వల్ల ప్రయోజనం ఉండదు. చేసే కర్మలపై నీకు అధికారం ఉండవచ్చు గానీ వాటి ఫలితాలపై కాదు' అన్న శ్రీకృష్ణుడి దివ్యబోధ వర్తమానంలో చేయవలసిన సత్కర్మ ప్రాశస్త్యం తెలిపేదే! భవిష్యత్‌లో ఫలితం పొందవలసిన ఏకర్మను కూడ మనిషి వర్తమానంలోనే చేయవలసి ఉంటుంది. మంచికర్మకు మంచిఫలితం, చెడుకర్మకు చెడుఫలితం సహజం! మంచి ఫలితం కోసం వర్తమానంలో మంచికర్మలు ఆచరిస్తే సాధన సార్థకమైనట్లే! మహనీయుడుగా, మనీషిగా ఎదిగే క్రమంలో సాధకుడికి తాను ఎంచుకొనే సాధనామార్గమే తోడ్పడుతుంది. మార్గం మంచిదైతే సత్ఫలితాలు తప్పక అందుతాయి. వేప విత్తునుంచి మధురఫలాలను అందించే మామిడి ఉద్భవించదు కదా! కర్మ ఫలితానికి బీజంపడేది వర్తమానంలోనే. అదే స్పృహ సాధకుడు సత్కర్మలు చేసేందుకు తోడ్పడుతుంది.

*09. 01. 2014*

# వెలుగురేఖ

ఈ సృష్టి ద్వంద్వమయమైనది. మంచి–చెడులు, వెలుగు–నీడలు, కలిమి–లేములు, ఆనంద–విషాదాలు, సుఖ–దుఃఖాలు ఇలా ఎన్నో! ఈ ద్వంద్వాలలో ఒక అంశం ఆనందాన్ని కల్గించేది కాగా, రెండవ అంశం బాధను మిగుల్చుతుంది. అయితే ఒక్క విషయంలో మాత్రం ఈ రెండిటి స్వభావమూ ఒక్కటే. అదేమంటే ఏదీ శాశ్వతంగా నిలిచేది కాదు. అది ఇబ్బందినీ, ఊరటను రెండూ కల్గించే అంశం కూడ. ఒక వ్యక్తి జబ్బుపడితే, జబ్బు ప్రాణాంతకం కాకపోతే, వైద్యచికిత్సతో అతడికి పూర్వ ఆరోగ్యం చేకూరుతుంది. అయితే తాత్కాలికంగానైనా అతడు కొంత యాతన అనుభవిస్తాడు. చికిత్స ముగిసి బాధ తొలిగాక అతడి మనసు సేదదీరుతుంది. వికసిత పరిమళభరిత పుష్పమౌతుంది. ఆ సమయాన ప్రకృతి అతడికి నవ్యశోభతో దర్శనమిస్తుంది. అందాకా చికాకుపరచిన అంశాలు ఓ లౌకికానుభవంగా మాత్రమే మిగిలిపోతాయి.

మానవుని ఇబ్బందికి గురిచేసే ప్రధాన ద్వంద్వం కలిమి – లేములు. దరిద్రం వల్ల సమస్త అవలక్షణాలూ చుట్టుముడతాయి. కొందరు చోరులౌతారు. కొందరు తీవ్రవాదులౌతారు. ఇంకొందరు హంతకులు కావచ్చు కూడ! దేశ కాలమాన పరిస్థితులను బట్టి దారిద్ర్య బాధితులు అలా మారిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ, విచక్షణ వల్ల అత్యధికులు సత్ప్రవర్తనతోనే జీవిస్తారు. ఇక్కడ 'మంచి – చెడు'లు అనే ద్వంద్వంలోని 'మంచి' మనిషిని రక్షణ కవచమై కాపాడుతుంది.

చరాచర సృష్టిలో వెలుగునీడలు సహజం. సృష్టి ఆవిర్భావానికి పూర్వం అంతా చీకటి ఆవరించి ఉండేదనీ, భగవంతుడు జ్యోతిస్వరూపుడై ఆవిర్భవించి సూర్య, చంద్ర, నక్షత్రాది గ్రహాల రూపంలో లోకాలను కాంతిమయం చేశాడనీ వేదాంతశాస్త్రాలు వివరిస్తాయి. సైన్సు కూడ కొంతవరకు ఈ సిద్ధాంతాన్ని సమర్థిస్తుంది. వెలుగు జ్ఞానానికి ప్రతీక. చీకటి అజ్ఞానాన్ని సూచిస్తుంది. జ్ఞానం ఆద్యంతాలు లేనిది. ఆది–అంతం కూడ ద్వంద్వమే. అలాగే జనన మరణాలు! మరణించినవాడు జన్మించక తప్పదనీ, జన్మించినవాడు మరణించక తప్పదనీ ప్రవచిస్తాడు శ్రీకృష్ణభగవానుడు. సిద్ధపురుషులు, అవతారమూర్తులు కూడ ఈ జనన మరణ సిద్ధాంతానికి అతీతం కాకపోవడంతో పుట్టిన ప్రతి ప్రాణీ భౌతిక నిష్క్రమణ చేయవలసిందే అన్న భగవత్ సూత్రానికి సాక్షాత్తు భగవంతుడు కూడ కట్టుబడి ఉండటం కనిపిస్తుంది.

ఆనంద–విషాదాల విషయంలో మనుష్యులు కొద్దిపాటి విజ్ఞత వల్ల, ఆశావహ దృక్పథం వల్ల విషాదం తెచ్చిపెట్టే సమస్యలను కొంత అధిగమించవచ్చు. సమస్య అనగానే క్లేశం, అసౌకర్యం, వ్యథ కొద్ది పరిమాణంలోనైనా కలిగి ఉండటం సహజం. జరుగుతున్న

ప్రతి సన్నివేశం సృష్టి సూత్రాలు, సిద్ధాంతాలకు అనుగుణంగానే జరుగుతుందన్న స్పృహ వల్ల మనిషికి మేలే జరుగుతుంది. సృష్టి ప్రధాన సూత్రం 'మార్పు'. జరుగుతున్న కాలంలో సంభవిస్తున్న కష్టాలు కూడ సృష్టి మౌలిక సూత్రాలకు అనుగుణంగానే జరుగుతున్నాయనీ, జరుగుతున్నది కష్టకాలమైతే రాబోయేది మంచికాలమని గుర్తించి, వర్తమానాన్ని అధిగమించేందుకు కొద్దిపాటి విజ్ఞత, ఓర్పు వహిస్తే దుఃఖం మనలను అంతగా బాధించదు.

రామకృష్ణపరమహంస కంఠ వ్రణంతో బాధపడేవారు. ఆయన దానికోసం అంతగా బాధపడిందీ లేదు. కేవలం భక్తులు, శిష్యుల ఆనందం కోసం ఆయన చికిత్సకు అంగీకరించి వారిని సంతృప్తిపరచారు.రామకృష్ణపరమహంస, రమణమహర్షి ఇద్దరూ కేన్సర్‌తో బాధపడినా వారికి ఆ జబ్బు వలన శారీరకంగా బాధ కలిగినా మనసులో ఆ బాధకు వీసమంతైనా చోటివ్వక, సామాన్య మానవులు కనీసం చిట్టి కష్టాలనైనా నిబ్బరంగా తట్టుకొని ఆత్మవిశ్వాసంతో జీవించాలనే మహత్తర సందేశమిచ్చి అనుగ్రహించినవారయ్యారు.

మరో ద్వంద్వం 'సుఖ–దుఃఖాలు' విషయానికి వస్తే సుఖం వల్ల ఆనందం కల్గుతుంది. దుఃఖం వల్ల బాధ కల్గుతుంది. అయితే ఏది సుఖమో మనిషి తేల్చుకోవలసి ఉంది. తాత్కాలికంగా ఓ సుఖం ఆనందం కల్గించినా, అదో భ్రాంతి మాత్రమే. వ్యభిచారి సుఖిస్తాడు. కానీ పర్యవసానంగా సుఖవ్యాధులు కలిగితే జీవితం నరకప్రాయమౌతుంది. సమాజంలో ఈసడింపుకు గురౌతాడు. అంతిమంగా అతడి విజ్ఞత మేల్కొని తను చేసినదెంత పాపమో గ్రహించాక అతడి మనసు నిలువునా దహించుకుపోతుంది.

కలిమి – లేముల ద్వంద్వం విషయంలో మనిషి జాగరూకుడై ఉండాలి. కలిమి ఆనందాన్నిచ్చినా అహంకారాన్ని తోడు తెచ్చుకుంటుంది. అహంకారం వల్ల మనిషి నైతికంగా పతనం చెందుతాడు. లేమిలో మనిషిని దైన్యం ఆవహిస్తుంది. అయితే నిష్కృతి దైవాన్ని నమ్ముకోవడమే. నిరుపేద అయిన కుచేలుడు తన చెలికాడైన శ్రీకృష్ణుని తన సాటివాడుగా, స్నేహితుడుగా ఎంచక, తన నుద్ధరించే ప్రభువుగా, దైవంగా నమ్మి తన జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు.

ఈ సృష్టిలోని సమస్త ద్వంద్వాల జంట పదాలలో మరో ద్వంద్వం దాగి ఉంది. అదే మంచి, చెడు. ఇతర ద్వంద్వాలలోని ప్రతి అంశం మరల ఓ ద్వంద్వ ప్రకృతిని సంతరించుకొని ఉండటం విశేషాంశం! 'సుఖం' విసుగు జనించాక రోత పుట్టిస్తుంది. 'దుఃఖం' తీసుకుంటే కష్టకాలంలోనే మనిషి అనేక జీవిత సత్యాలు తెలుసుకుంటాడు. జ్ఞాన సముపార్జన చేయగల్గుతాడు. భగవంతుడు జ్ఞానస్వరూపుడు గనుక మనిషి దైవాన్ని తెల్సుకోగల్గుతాడు. అందుకే దుఃఖం ఆవహించినపుడు మనిషి క్రుంగిపోక ఆశాపూర్ణుడై తన నుద్ధరించే వెలుగురేఖ కోసం నిరీక్షణ చేయాలంటారు పెద్దలు. అప్పుడే జీవితం చింతా దూరమౌతుంది. ఆనందప్రపూర్ణమూ అవుతుంది.

'తమసోమా జ్యోతిర్గమయా!' ఓం శాంతిః శాంతిః శాంతిః

*విశ్వధర్మవాణి తత్త్వజ్ఞాన కరదీపిక, జనవరి, 2015*

# 'శీలం - సమర్థత'

ప్రకృతి కొన్ని నియమాలకు లోబడి నడుస్తుంది. అందులో అంతర్భాగమైన మనిషికీ ఆనియమాలు వర్తిస్తాయి. ప్రకృతి తన ఒడిలో జీవిక నెరపే ప్రాణులపై కరుణ చూపిస్తుంది. అవినిశ్చింతగా జీవించేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తుంది. నీరు, ఆహారం అందిస్తుంది. ఈ సుగుణాలను మంచి మనిషి అనాదిగా అందిపుచ్చుకున్నాడు. నియమ బద్ధమైన జీవితం, శీలం, సమర్థత అలవరచుకున్నాడు. అలాంటి వాడే నాయకుడుగా ఎదిగాడు.

శీలం, సమర్థత రెండు విశిష్టమైన సుగుణాలు. స్వీయ ప్రయోజనాలు నెరపడంలోను, సమిష్టి ఆనందానికి నిర్వచనం చెప్పడంలోను ఈ రెండూ ప్రధాన పాత్ర పోషిస్తాయి. మనిషికి తన కుటుంబం పట్ల, సమాజం పట్ల వేర్వేరు బాధ్యతలున్నా శీలం, సమర్థతలను అనుసరించే లోక కళ్యాణం జరుగుతుంది. సమిష్టి సుఖసంతోషాలను స్వీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టే నాయకుడి స్వభావం పాలితులకు అనర్థం తెచ్చిపెడుతుంది. శీలం, సమర్థత లేని ప్రభువు పాలనలో పాలితులు సుఖంగా బ్రతకలేరు.

రావణాసురుడు గొప్ప ప్రభువే. వేదవేదాంగాలు అభ్యసనం చేసినవాడు. శివానుగ్రహాన్ని దండిగా పొందినవాడు. కైలాస పర్వతానే కదిలించే ప్రయత్నం చేసినవాడు. సౌశీల్యం అనే ఒకే ఒక్క సుగుణం లోపించిన కారణంగా అతడి దక్షత బూడిదలో పోసిన పన్నీరే అయింది. పరుల సంపద (స్త్రీని) స్వంతం చేసుకోవాలనుకొని ధర్మాగ్రహానికి గురైన కారణంగా రావణుడు ప్రజలకు కడగండ్లు తెచ్చిపెట్టాడు. అతడి దుశ్శీలత తన ప్రాభవంతోపాటు ప్రజల సౌభాగ్యాన్నీ (మారుతి లంకాదహన అనంతరం) మంట గలిపింది. ఈనాటి రావణాసురులు అధికార, ధన వ్యామోహాల్లో చిక్కుకొని ప్రజల అశాంతికి కారణమౌతున్నారు. శీలం, సమర్థత తక్కెడకుండే రెండు సిబ్బుల వంటివి. అవి రెండూ సమంగా ఉన్నపుడే పాలన ప్రజారంజకంగా సాగుతుంది. నీతిమంతుడు కాని ప్రభువు పాటించే రాజనీతి ప్రజామోద యోగ్యంగా ఉండదు. సత్యధర్మాల ఆచరణ సత్పరిపాలనకు మూలసూత్రం.

పూర్వం చోరదండన ప్రభువు బహుముఖీనమైన బాధ్యతలలో ఒకటిగా ఉండేది.

అనుభవశాలిగా, అధ్యయనశీలిగా, సహనశీలిగా ప్రభువు అర్హత సాధించి న్యాయమార్గంలో ప్రజా సంక్షేమానికి పాటు పడేవాడు. రాజుదొంగలను పట్టుకొనే విషయంలో ప్రధానపాత్ర పోషించాలనీ, అప్పుడే అతడి కీర్తి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలుస్తుందనీ అంటాడు మనువు. ప్రభువులే ప్రజాధన భక్షకులుగా మారిన వేళ ఈనియమావళి వర్తించే అవకాశం ఎంతమాత్రం ఉండదు.

పూర్వం ఆటవికన్యాయంగా ఎవరు బలవంతుడో అతడే నాయకుడుగా చలామణి అయ్యేవాడు. అతడి శీల, సమర్థతల ప్రసక్తి ఉండేది కాదు. ప్రజాస్వామ్య పాలనలో ఈ రెండు సుగుణాలు నాయకుడికి రెండు ఆభరణాలు! ధర్మం తప్పని వాడే ప్రభువంటుంది మనుధర్మ శాస్త్రం! ప్రజాసంక్షేమం చూసేవాడే నిజమైన నాయకుడంటుంది ఏ దేశ న్యాయశాస్త్రమైనా! ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకుడిని ఎన్నుకుంటారు. ఎన్నికల్లో జరిగే పొరపాట్లు, తప్పులకు ప్రజలే బాధ్యత వహించవలసి వుంటుంది. హిట్లర్, స్టాలిన్, ముస్సోలిని వంటి ఏ నియంత పాలన చూసినా ప్రజలు ఇక్కట్లు అనుభవించారు. జాతిని ప్రలోభపరిచే వ్యక్తి ఏనాటికీ నిజమైన నాయకుడు కాలేడు. నాయకుడికీ స్వంతలక్ష్యాలు ఉంటాయి. కాదనలేం! కాని మంచినాయకుడు జాతి ప్రయోజనాల ముందు స్వీయ ప్రయోజనాలను నిర్వీర్యం చేసుకొని ప్రజా సంక్షేమం కోసం పాటు పడతాడు. ప్రపంచదేశాల్లోనే అతి గొప్పదిగా భావించే సంస్కృతి గల భారతావని అభివృద్ధి పథంలో ఎంతో వెనకబడటానికి కారణం అసమర్థ, అవినీతిపాలనయే! అవినీతి జాడ్యం అంటని వ్యక్తులు ప్రజాప్రభుత్వ రథసారథులైతే భారతావనికూడ పురోగామిదేశాల్లో ఒకటిగా నిలిచి సూపర్ పవర్‌గా ఎదగగల దనటంలో సందేహంలేదు. సమర్థపాలకుడిని నిర్ణయించుకోవడంలో ప్రజల పాత్ర నిరుపమానమైనది. బాధ్యతతో కూడుకున్నదని కూడ మరువకూడదు.

*29. 04. 2014*

# ‘భావాన్ని అనుసరించి ఫలితం’

**కాశయ్య** ఓ రైతు. తను పండించే కూరగాయలు చౌకగా అమ్ముతూ బీదసాదలకు సహాయకారిగా వుండేవాడు. ఒకరోజు రాజు ఉద్యోగుల పనితీరు పరీక్షింప దలచి రహదారిపైకి ఓ పెద్ద బండరాయిని ఎత్తించి, సేవాభావంతో ఎవరైనా దాన్ని తొలగిస్తారా లేదా తెలుసుకోవాలనుకున్నాడు. చాలమంది ఆ రాతిని గమనిస్తూ ఆదారివెంట వెళ్ళారే గానీ ఎవరూ తొలగించే ప్రయత్నం చేయలేదు. సేవాదృక్పథంతో రైతు కాశయ్య తనశక్తినంతా కూడదీసుకొని రాయిని పక్కకు దొర్లించాడు. చిత్రంగా రాతికింద ఓ సంచి కనబడింది. అందులో కొన్ని బంగారునాణేలు, ఓ చీటీ కనిపించాయి. ‘మంచి మనసుతో రాతిని తొలగించినందుకు ఇదే మా బహుమానం!’ అని రాజుగారి సంతకంతో వున్న చీటీని చూసి రైతు కాశయ్య మహదానంద భరితుడయ్యాడు. ‘భావాన్ని అనుసరించి ఫలిత’ మన్నది ఓ హితోక్తి. మంచి నడవడి అలవర్చుకో. మంచినే ఆలోచించు. మంచినే ఆచరించు. ఇలా మంచినే ఆశ్రయించమని ప్రవచించాయి. అన్ని మతాలూ.

ఈ జగత్తు యావత్తూ జగదానందకారకుడైన పరమేష్ఠి నుంచి ఉద్భవించి, పరిపోషింపబడుతూ తుదకు ఆయనలోనే లయం చెందుతుంది. ఆయన అంశగల సకల మానవాళికి లభించవలసింది ఆనందం కాక మరేమి (?) టన్నది ఓ మహత్తర వివేక పూర్ణభావన.

సంపద ఉన్నవాడు మాత్రమే లేనివాడికి వితరణ చేయగల్గుతాడు. గురువు శిష్యులకు జ్ఞానబోధ చేస్తాడు. అధ్యాపకులు విద్యార్థులకు విద్యబోధిస్తారు. వైద్యులు ఆరోగ్య ప్రదానం చేస్తారు. సముద్రాలు మేఘాలకు జలాన్ని అందిస్తాయి. మేఘాలు వర్షిస్తాయి. రైతులు, శ్రామికులు శ్రమఝరి కురిపిస్తారు. సస్యాలు మానవులకు ఆహారాన్నందిస్తాయి. జననీ జనకులు తమ బిడ్డలకు దేహాల్ని ప్రాప్తింపజేస్తారు. సృష్టిలో అణువణువూ ఇవ్వడమనే క్రియ ద్వారా లోకశ్రేయస్సుకు కారణమౌతుంది.

అందరిపట్ల శ్రేయ : కామన మనిషి పురోగతికి దోహదం చేస్తుంది. జరిగే ప్రతి ఘటన చివరకు సమాజశ్రేయస్సుకు నేపథ్య మౌతుందని ఆశావహుల భావిస్తారు. భావాన్ని అనుసరించి బాహ్యమూ వుంటుందన్నది ఓ తార్కిక సత్యం. ఆ భావంలో అంతర్లీనంగా వ్యక్తిశ్రేయస్సూ వుంది. అందుకే యద్భావం తద్భవతి’ అన్న ప్రామాణిక సత్యం సర్వజనులకు మేలుకొలుపై సత్య పథగాములను చేయగల్గుతుంది.

*12.09.2012*

# ‘పరిశుద్ధాంత రంగం’

**ఆత్మ** అగ్ని చేత దహింపబడదు. నీటిచేత తడపబడదు. వాయువు చేత శోషింపబడదు. ఆత్మ ఆకాశం వలె అనంతమైనది. అనంతత్వంలో భాగమయినది. అమృత సమానమైనది. ఆత్మకు మరణం లేదు. అంటూ పరతత్వాన్ని శ్రీకృష్ణుడు తేటతెల్లంగా అర్జునుడికి బోధించాడు. మోహంలో కొట్టు మిట్టాడుతున్న అర్జునుడికి వివేక స్పృహ కల్గించి కురుక్షేత్ర మహాసంగ్రామానికి అతణ్ణి సంసిద్ధుణ్ని చేశాడు.

నారాయణుడు ‘పరమాత్మ’ కాగా నరుడిలో ‘జీవుడు’ గా ఆత్మ వెలుగొందుతోంది. విశ్వవ్యాపకాలు ఆత్మ ప్రకాశంతోనే ముందుకు సాగుతాయి. కనిపించే ప్రాణ, అప్రాణ వస్తుజాలం అంతటిలో ఆత్మనిగూఢంగా ఉంది. అప్రాణి సంచయం (సమూహం) లో కూడ వాటి వాటి విశిష్టతలు, స్వభావాలు, ప్రత్యేకతలకు ఆత్మ ఉనికే కారణం.

‘నేను’ అంటూ మనిషి తన ఉనికిని ఆత్మ పరంగానే తెలుపుకుంటాడు. మనిషి తన మనసులోని నిగూఢతను ఆత్మ పరిశీలన ద్వారా తెలుసుకోవచ్చు. తప్పొప్పులను బేరీజు వేసుకొని ప్రవర్తనను సరిచేసుకోవచ్చు. అనాహత చక్రంలో పన్నెండు దళాల హృదయ కమలంలో పరమాత్మ జ్యోతి స్వరూపుడుగా ఉన్నాడన్నాయి శాస్త్రాలు. తనలో ఉన్న పరమాత్మను మనిషి తెలుసుకోలేక పోవడాన్నే ‘మాయ’ అన్నారు. మాయను పరమాత్మ మరోపార్శ్వంగా తెలుసుకోవడమే ‘జ్ఞానం’ అన్నది విజ్ఞుల అభిప్రాయం. ఆత్మ (స్వకీయత) ను పంకిలమొనర్చుకున్న మనుషులు లోకంలో చెడినవారుగా చెప్పబడతారు.

ఆత్మను ఏ బాహ్యశక్తీ ప్రభావితం చేయజాలదు. ఆత్మను ఆవరించి వుండే మనోవ్యాపారాలు మలినమైనపుడు ఆత్మభ్రష్టతగా మనం చెప్పుకుంటాం. ఆత్మ ‘అవినాశి’ అని భగవద్గీత చెబుతుంది. కనిపించే ఉపాధుల రూప స్వభావాల్లో తేడాలు ఉన్నప్పటికీ సమస్త జీవరాశిలో ఆత్మ జ్యోతి స్వరూపంగా ప్రకాశిస్తుందని వేదాల సారాంశం. పరిశు ద్ధమైన మనసున్న వ్యక్తిని పరిశుద్ధాంత రంగుడుగా చెబుతారు.

మనిషి ప్రతి ఆలోచన, కదలిక, కర్మ ఆత్మ (నారాయణ) ప్రేరితమే అని మహర్షులు పరిశుద్ధాంతరంగంతో తెలుసుకున్నారు. నరుడికి నారాయణుడికి భేదం లేదు. నిజానికి నరుడి కర్మలన్నీ దైవ ప్రేరితాలే! అవి నారాయణుడికే చెందుతాయి. కర్మలు నారాయణార్పిత మయ్యాక నరుడు కర్మలు చేసీ చేయనివాడే అవుతాడన్నాయి శాస్త్రాలు.

ఒకసారి వ్యాసభగవానుడు యమునా నదిని దాటవలసి వచ్చింది. నదీతీరంలో

గోపికలు ఆయన కంటపడ్డారు. వారునదిని దాటి ఆవలితీరం చేరవలసివుంది. పడవ అందుబాటులో లేకపోవడంతో మహర్షి తన అలౌకిక శక్తి ప్రభావంతో నదిని దాటిస్తారేమోనని గోపికలు ప్రార్థించారు. నదిని దాటించేందుకు సాయపడతాననీ, ఆకలిగా వున్నందువల్ల మొదట తనకు తినడానికి ఏమైనా ఇవ్వమని కోరాడు వ్యాస భగవానుడు. గోపికలు ఇచ్చిన పాలు, మీగడ, వెన్న కడుపారా ఆరగించి 'నేను ఉపవాసం చేసివున్న వాడినైతే మమ్మందరినీ ఆవలి తీరం చేర్చు!' అంటూ నదిని ప్రార్థించాడు. యమున రెండు పాయలుగా విడిపోయింది. అందరూ ఆవలితీరం చేరుకున్నారు. గోపికలు తమను వేధిస్తున్న సందేహాన్ని వ్యాసమహర్షి ముందుంచారు. కడుపారా పాలు, మీగడ, వెన్న భుజించి కూడ 'ఉపవాసం' ఉన్నట్లు ఎలా ప్రకటించారని అడిగారు. 'పదార్థాలు, ఆకలితో హృదయగతుడై వున్న నారాయణుడికి సమర్పించానే తప్ప నేను భుజించ లేదు!' అన్నాడాయన గోపికలతో. వ్యాసుడి కర్మలన్నీ నారాయణార్పితమైన దివ్య ఉదంతంతో గోపికలకు జ్ఞానోదయం కావటం విశేషం!

శరీరం ఆత్మగా భ్రమించడం సహజంగా జరిగే విషయం. శరీరంతో పాటు హృదయం, అంతఃకరణ చతుష్టయంగా భావించే బుద్ధి మనసు చిత్తం అహంకారం కూడ ఆత్మలో భాగంగా వున్నవే అనీ, వాటిని నిర్మలంగా ఉంచుకున్నప్పుడే ఆత్మ పరిశుద్ధమౌతుందనీ పెద్దలమాట! శుద్ధాంతరంగం పరిశుద్ధ ఆత్మగా పరిగణింపబడుతుంది. పరిశుద్ధాత్మ సాధించాకే మోక్షం సంప్రాప్యమవుతుందని మహాత్ముల దివ్యచరితలు నివేదిస్తాయి.

*11.01.2014*

# 'నమ్మకాలు'

ఏయే అంశాలు సుఖానికి కారణమౌతాయో అవే కాలగతిన మన దుఃఖానికి కూడ కారణంగా మారవచ్చు. ఒక్కొక్కపుడు మనసులో ఏదో తెలియని గుబులు దోబూచులాడుతుంది. అప్పటి దాకా ప్రకాశించిన సూర్యుడు మబ్బుల మాటుకు వెళ్ళాక అంతటా నీడ పరచుకున్నట్లు మనసును నిర్వేదం ఆవరిస్తుంది. నీరులేని మబ్బుల్లాంటి శుష్క ఆలోచనలు క్రమ్మగా మనసునిస్తే జమవుతుంది. కానీ అమావాస్య చీకటిలోనూ నక్షత్ర కాంతి ఉంటుందని మరవకూడదు. దట్టంగా అలముకొని సూర్యుణ్ణి చాటు చేసిన కారుమేఘాలకూ 'వెండి అంచు' ఉంటుందన్నది కాదన లేని నిజం! భగవదనుగ్రహానికి అందరూ పాత్రులే అన్న నమ్మకం మనిషిని క్రాంతి పథంలో నడిపిస్తుంది.

ఓ సాధకుడి మనసులో ఆనందం ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. కోటి భావాల సంతోష తరంగాలు అతణ్ణి ఊహల్లో తేలియాడిస్తున్నాయి. భావజగత్తంతా పచ్చికతో కళకళలాడే ఉద్యానవనంలా భాసిస్తోంది. తెలియని హాయేదో కలుగుతోంది. అంతలోనే ఓ అలజడి! సుడిగాలిలో గడ్డిపోచలా ఓ భయవీచిక మెదడులో కదలాడింది. విదేశాల్లోని తనవారి గురించిన బెంగ, వారియోగ క్షేమాల గురించిన ఆందోళన అతణ్ణి ఉద్విగ్న భరితుణ్ణి చేశాయి. అందుకు కారణం ఆసమయంలో కొన్ని దుర్నిమిత్తాలు గోచరించడమే! శకునాలకు శాస్త్ర సమ్మతమైన రుజువులు లేకపోయినా ఏదో తెలియని భయం అతడి మనసును కలచివేసింది.

కొందరు మూఢనమ్మకాల, దుర్నిమిత్తాల సుడిగాలిలో విలవిలలాడుతారు. నిజానికి ఓ తుమ్ము, ఓ దుర్నిమిత్తం విలయం తెచ్చిపెట్టేవయితే కాలం వాటికి సరైన రుజువులు చూపకపోయేదికాదు. రుజువులు లేకపోయినా కొందరు నమ్మకాల విషవలయంలో చిక్కుకు పోవడం ఆశ్చర్యం గొలిపే అంశం! సకృత్తుగా జరిగే కష్టనష్టాలను శకునాలు, నమ్మకాలతో ముడిపెట్టడం తగదంటారు శాస్త్రజ్ఞులు. శకునాలు భవితను సూచిస్తాయనడంలో ఎలాంటి శాస్త్ర సమ్మతీ లేదు. దుశ్శకునాలు అనర్థం కల్గిస్తాయని నమ్మి జీవిత గమనాన్ని దుర్భరం చేసుకుంటే ఎవరుమాత్రం చేయగల్గేది ఏమీ ఉండదు. తెలియని కీడు ఊహించుకొని ఉన్న ఆనందాన్ని శూన్యం చేసుకొనడం అవివేకం. క్రీడలో భాగంగా అవరోధాలు కల్పించు కొని వాటిని అధిగమించిన వారిని విజేతలుగా ప్రకటించడం రివాజు. నిజానికి జీవితంలో ఎదురయ్యే అవరోధాలు తాత్కాలికంగా ఇబ్బంది కలిగించినా అవి చివరకు మేలు చేసేవే

కావడం జీవన స్రవంతిలో చాలా సార్లు చూస్తాం. అతివృష్టి వల్ల కొంత హాని జరిగినా జలాశయాలు నిండి అన్న దాతలకు సిరులు పండిస్తుంది. ప్రకృతిలోని ప్రతిమలుపూ లోక సంక్షేమానికి హేతువే అని భావించడం ఆనందదాయకం! ఆశావాదంతో కూడిన ఆమలుపు బ్రతుకును గెలుపుదారి పట్టించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం అనుభవం వల్ల సాధ్యమౌతుంది.

'నీవు మార్చలేని విషయాన్ని ఉన్నదున్నట్లు స్వీకరించు. మార్చగలిగే శక్తి ఉంటే ఆపనికి ఉపక్రమించు! – అంటాడో జనహితైషి.

కొందరు ఎల్లప్పుడూ సంతోషంగా కనిపిస్తారు. అలాంటి వారి సాన్నిహిత్యం మనసును ఉల్లాసభరితం చేస్తుంది. నిస్తేజమైన అంతరంగం వెనకా ఓ ఆనందతరంగం నిక్షిప్తమై వుంటుంది. ఆ మెరుపు తీగను వెలికి తీయడమే జీవనక్రమంలో కీలకం! కొన్ని నమ్మకాలు సృజించే కారుమేఘాన్ని నిర్వీర్యం చేసి జీవన స్రవంతిని ఉత్సాహభరితం చేసుకోవడంలో సాధకుడి ప్రజ్ఞదాగుంటుంది. అలాంటి ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించే సుపథగాముల మార్గదర్శకత్వం అవశ్యం వాంఛనీయం!

*27.01.2014*

## 'దైవ ప్రేరణలు'

సూర్యోదయమైంది. తమస్సులో మునిగిపోయిన జగత్తు సర్వం నవ్యకాంతుల పరిష్వంగ శోభలో సంలీనమై వేయి వెలుగులతో ప్రకాశిస్తోంది. చీకటి వల్ల అప్పటిదాకా చూడలేక పోయిన దృశ్యప్రపంచాన్ని ప్రాణికోటి తనివి తీరా ఆస్వాదిస్తోంది. ఎవరి వ్యాపకాలలో వారు నిమగ్నమయ్యారు. ఉరుకుల పరుగుల జీవితాల్లో మానవాళి తమతమ పరిధిలో లోక వ్యవహారాలకు ఉద్యుక్తమయింది.

ఎవరాదేశించారని భానుడు జీవకోటి సౌలభ్యం కోసం భూమండలాన్నంతా వెలుగుమయం చేస్తాడు? వాయువు మంద పవనాలు వీచి అలరిస్తుంది? ఎవరు కోరారని మేఘరాశి నెల మూడు వానలు కురిసేందుకు సన్నద్ధ మౌతుంది (పుణ్యభూముల్లో)? ఎవరు నేర్పారని (ఆదిగురువు భగవంతుడే కదా!) రకరకాల నైపుణ్యాలు సాధించి మానవులు స్వయం ప్రతిభతో రాణిస్తారు?

లోకాన్ని శాసించే సర్వవ్యాపకశక్తి దయాపూర్ణమైనది. నలుచెరగులా అపారజలరాశి వ్యాపించి ఉంటే లక్ష్మరేఖలు గీచి సాగరుడు చెలియలి కట్టలు దాటకుండా కట్టడి చేసి జీవకోటిని రక్షిస్తుంది ప్రకృతి! భూతదయ సృష్టిలో మన్నుతూ బలవంతులు బలహీనులను బాధించకుండా కాపాడుతుంది!

కనిపించని ఓ నిర్ణయాత్మక శక్తి ప్రేరణ మేరకు మనం స్వీయనిర్ణయాలు తీసుకుంటాం! మానవ అభీష్టం మేరకే ప్రతికార్యం జరుగుతుందని భావించడం పొరపాటు. లోకనాయకుడి సర్వశక్తి మత్వాన్ని గుర్తిస్తే మాయనుదాటే మహోన్నతమార్గం స్ఫురణకు రాకపోదు. బోళాశంకరుడై భక్తులకు వరాలు ప్రసాదిస్తాడు పరమేశ్వరుడు. కృతజ్ఞుడై భక్తి పూర్ణత చాటే ప్రియభక్తుడికి వేయికన్నులు, వేయి బాహువులతో అలరారే తన విశ్వరూపం ప్రాణికోటి అంగాలని అవగతం చేసి అనుగ్రహిస్తాడు పరమాత్మ.

అతడోవ్యాపారి. వ్యాపారంలో చాలపెట్టుబడి పెట్టాడు. రెట్టింపు లాభాలు సంపాదించాడు. సొంతనిర్ణయాలు ఫలిస్తూ పోవడంతో తననో నిర్ణయాత్మక శక్తిగా భావించుకున్నాడు. మానవ సమాజం అతడిపై ప్రశంసల జల్లు కురిపించింది. అయితే ఏ నోటితో, ఏ చేతితో నిర్ణయాలు తీసుకొని అమలు చేశాడో అప్రామాణికతతో వ్యాపార రణక్షేత్రంలో విజృంభించి ఒకనాటికి చతికిల పడ్డాడు. ఎందుకలా జరిగిందో అతడికి అంతుపట్టలేదు. బహుశ దైవకృప లోపించిందేమో ననుకున్నాడు మొదటిసారి. ప్రారబ్ధాన్నను

సరించే ఫలితముంటుందని గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు. జగన్నాటక రంగంపై తన పాత్ర ఏమిటో గుర్తించాడు. దైవం ప్రాపు కోసం అతడిలో తపన ప్రారంభమయింది.

మానవుడు దైవం చేతిలో ఉపకరణంగా మారితే విజయాలకు కొదవేం ఉంటుంది? విశ్వవిజేత కావడం కూడ కష్టం కాకపోవచ్చు. అహంకరిస్తే మరుక్షణంలో మానవ పరిమితులు అతడి మేధను పరిభ్రష్టం చేస్తాయి. దైవవిశ్వాసానికి ఆత్మవిశ్వాసం అదనపు హంగు, పొంగు అవుతుంది. వాస్తవానికి మన సమస్త నిర్ణయాలూ దైవప్రేరణలే అని గుర్తిస్తే చింతకు ఏ మాత్రం తావులేదు.

ఒకడు తెల్లగా, మరొకడు నల్లగా, ఒకడు బలవంతుడుగా, మరొకడు బలహీనుడుగా, ఒకడు అందగాడుగా, మరొకడు కురూపిగా, ఒకడు సంపన్నుడుగా, మరొకడు దరిద్రుడుగా; ఒకడు ఆరోగ్యవంతుడుగా, మరొకడు రోగిగా, ఇలా – ఇలాతలంపై జన్మిస్తారు మానవులు. తన పుట్టుకకు, నిష్క్రమణకు స్వేచ్ఛలేని మానవుడి సమస్త నిర్ణయాలు దైవ ప్రేరణలు కాక మరేమౌతాయి? దైవకృప ఉంటే తన సామర్థ్యాలు తనను ఉద్ధరించే ఉపకరణాలవుతాయని గ్రహించే సాధకుణ్ణి విజయలక్ష్మి చేయిపట్టుకు నడిపిస్తుంది. అణుమాత్రం సంశయం ఉండవలసిన అవసరం లేదు.

*21.03.2014*

# చీకటి ముచ్చట్లు

రాత్రికి ఒక ప్రత్యేకత వుంది. సూర్యభగవానుడు అస్తాద్రిని చేరాక ప్రకృతిలో వెలుగుక్షీణిస్తుంది. చికటి పొటమరిస్తుంది. శుక్లపక్షంలో చంద్రుడు కొంచెం కొంచెంగా ఎదుగుతూ పున్నమి నాటి రాత్రి పండు వెన్నెల కురిపిస్తాడు. అదే కృష్ణపక్షం అయితే చంద్రుని తరుగుదలతో కూడిన రాత్రులు కొనసాగి అమావాస్యనాడు లోకంలో కటిక చీకటి ఆవరిస్తుంది. కన్ను పొడుచుకున్నా కనబడని కాళరాత్రి అంటాం కానీ నక్షత్రాల ఉనికి వల్ల అవి ప్రసరించే మినుకు మినుకు కాంతివల్ల అమవాస్య చీకటి రాత్రిన కూడ అలవాటు పడ్డ కళ్ళకు పరిసరాలను చాలవరకు గుర్తించే శక్తి వుంటుంది. చీకటినే తిమిరం అంటారు. ఈతిమిరాన్ని అజ్ఞానానికి సంకేతంగా చెబుతారు. కొన్ని ప్రాణులకు చీకటిలోనే ఉనికి వుంటుంది. నేరగాళ్ళకు చీకటి రాత్రులు ఆనందాన్నిస్తాయి. వారి చీకటి అకృత్యాలకు నిశీధి సాక్షిగా వుంటుంది. మిణుగురు పురుగులు చీకటి రాత్రుల్లో వింతశోభ వెదజల్లుతాయి. గుడ్లగూబలు రాత్రివేళలో తప్పించి వెలుగులో చూడలేవు. పాములు, తేళ్ళు, జెర్రులు, మండ్రగబ్బలు వంటి విషపురుగులు చీకటి రాత్రులతో సహజీవనం చేస్తాయి. అవితమ ఆహారం కోసం చీకటి లోకాన్ని ఆశ్రయిస్తాయి. నేరగాళ్ళదీ చీకటి ప్రపంచమే! చీకటి ఆలంబనగా వారు చేసే నేరాలకు అంతువుండదు. దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యలు ఇత్యాది నేరాలు చేసే వారికి రాత్రివేళలో పని సులువుగా వుంటుంది.

రాత్రి అనగానే విపత్తుతో, భీతితో కూడివున్న సమయంగా సాధారణ గుర్తింపువుంది. ఏవో కొన్ని ప్రాణులకు తప్పించి నేత్రదృష్టికి వెలుతురు అవసరం వుండగా రాత్రివేళ చూపుసాధ్యం కాని కారణంగా ఏదో తెలియని వింత భీతి మనిషిని ఆవహిస్తుంది. కొన్ని వందల మిలియన్ల సంవత్సరాలుగా మనిషి దివాచరుడుగా బ్రతుకుతున్నాడు. సంస్కృతి, అవగాహనలకు సంబంధించి "అర్థరాత్రి" అనే పదం మానవ నాగరికతలో ఓ నకారాత్మక ఘడియగా చెలామణిలో వుంది. భూతప్రేతాలు రాత్రులందే సంచరిస్తాయని మనిషి నమ్ముతాడు. ప్రపంచంలోని అన్ని నాగరికతలు, సంస్కృతుల్లో రాత్రివేళ దెయ్యాలు తిరుగాడుతుంటాయనే నమ్మకం ఇప్పటికీ బలంగానే వుండటం చెప్పుకోదగ్గ విషయం.

చీకటి రాత్రులు నేపథ్యంగా ఎన్నో సినిమాలు వచ్చాయి. రాత్రులందు విద్యుద్దీపాల కాంతిలో నగరాల శోభ వింత అందాలనిస్తుంది. ఆకాశ హర్మ్యాల్లో నిర్వహించే సూపర్ మార్కెట్‌లలో రాత్రులందు షాపింగ్ మజాగా వుంటుంది. రాత్రిళ్ళు నడిచే పేకాట క్లబ్‌లు,

పబ్‌లు, బార్లు సంపన్నులకు ఓ టైంపాస్ కార్యక్రమం! అమవసనిశిలో ఊడలమర్రి గనుక వూరిపొలిమేరల్లో వుందంటే అక్కడికి వెళ్ళడానికి ఎవరికయినా గట్స్ వుండవలసి వుంటుంది.

పగలంతా ప్రపంచం ఆహార సముపార్జనలో భాగంగా ఉద్యోగాలు, వ్యాపకాలు చేయడంలో నిమగ్నంకాగా, రాత్రుళ్ళు విశ్రాంతికొరకు, తరిగిపోయిన శక్తిని నిద్రలో భర్తీ చేసుకొనేందుకు, బాడీక్లాక్ బ్యాటరీ పునర్నిర్మించుకొనేందుకు ప్రజలు చీకటితల్లి ఒడిలో సేదదీరుతారు. కొన్ని దశాబ్దాల క్రితం చీకటి పడిందంటే మట్టికుందుల్లో వెలిగించే మిణుకు మిణుకు మనే నూనె దీపాలే గతి! రాత్రుళ్ళు దొంగలు, క్రూరజంతువుల దాడి – ఇత్యాది భయాలు వుండే రోజుల్లో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తుండేవారు. విద్యుచ్ఛక్తి కనుగొన బడటంతో మనిషికి గల చాలభయాలకు చెల్లు చీటీ వ్రాయడం జరిగింది. యిప్పుడు అమావాస్య రాత్రుల గురించి భీతిల్లే రోజులు పోయాయి. ప్రపంచీకరణ, నగరీకరణల్లో భాగంగా రాత్రి పగలుకు తేడా తెలీని రోజులు వచ్చేశాయి.

సూర్యోదయ, సూర్యాస్తమయాలు రోజును రెండు భాగాలుగా విభజిస్తాయి. అవే రాత్రింబవళ్ళు. భూమి యొక్క దక్షిణార్ధ గోళంలో వున్న అంటార్కిటికాలో జూన్‌మాసంలో రాత్రులు ఎక్కువనిడివి కలిగి వుంటాయి. ఉత్తర, దక్షిణ ధృవప్రాంతాల్లో వేసవిలో ఆరునెలల పాటు పగలు, శీతాకాలంలో ఆరునెలలు రాత్రి వుండటం సాధారణం!

రాత్రికి తనదైన ఒక ప్రత్యేకత వుంది. పగటిపూట మనిషి ఉదయాన్నే బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ – ఇలా విడతలుగా ఆహారం తీసుకుంటాడు. వీటిల్లో ఏ ఒక్కటి మిస్ అయినా మనిషికి లోటే! పని చేసేవారికి, చెయ్యని వారికి కూడ ఈ షెడ్యూలు తప్పనిసరి! రాత్రివేళ తగ్గిన నిద్ర పగటి పూట తీర్చుకుందా మన్నప్పటికీ రాత్రి నిద్రకు ఉండే నాణ్యత పగటి నిద్రకు వుండదు. పగలు ప్రతీ రెండు – నాల్గు గంటల కొకసారి ఆహారపు అవసరం ఉండగా రాత్రి జాగరణ చేసేవారికి ఆ అవసరం వుండదు. మౌలికంగా సృష్టిలో రాత్రి సమయం నిద్రకు, తద్వారా శక్తి పునరుద్ధరణకు కేటాయింపబడి వుందని గ్రహిస్తాం.

నిద్రలో పగటికలలకు ప్రాధాన్యత వుండదు. నిర్దేశిత లక్ష్యాలు లేని కార్యాచరణులను పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేయడం మనకు తెలుసు. రాత్రి నిద్రలోని కొన్ని కలలు భీతావహంగా వుంటాయి. వాటిని 'నైట్‌మేర్స్' అని పిలుస్తారు. చిన్న పిల్లలు ఈ పీడకలల బారిన తరచూ పడుతూ, వారి ఏడుపుకు కారణం తెలియని తల్లుల గాభరాకు కారణమవుతూవుంటారు.

రాత్రి సమయానికి ప్రాణులను నిదుర పుచ్చే స్వభావం వుంది. చిమ్మట పురుగులు, కీచురాళ్ళు రాత్రి అయిందంటే బలం పుంజుకుంటాయి. రాత్రివేళ కీచురాళ్ళ రొద లేని

ఆరుబయలు ప్రదేశాలు వుండవు. ప్రపంచ పారిశ్రామికీకరణ ప్రారంభమయ్యాక రాత్రివేళల్లో విధులు నిర్వహించడం ఓ అవసరంగా మారింది. విద్యుదుత్పత్తి వంటి ఎన్నో పరిశ్రమల్లో మూడుషిఫ్టుల్లో 24 గంటలూ విధులు నిర్వహింపబడుతున్నాయి. ఈ భౌతిక ప్రపంచంలో అనేక ద్వంద్వాలు వున్నాయి. కలిమి – లేములు, మంచి – చెడులు, సుఖ – దుఃఖాలు, చీకటి – వెలుగులు యిలా. ఈ ద్వంద్వాలు ఒకటిలేక రెండవదానికి ఉనికిలేదని వాటికవే చెబుతాయి. చీకటి లేకుండా వెలుగుకు ప్రాధాన్యత లేదు. చీకటిని బాపుకొనే ప్రయత్నంలోనే థామస్ అల్వాఎడిసన్ ఇన్‌కాండిసెంట్ లైట్ బల్బును కనుగొన్నాడు. ఆమాటకొస్తే పగటివేళ కష్టపడి పనుల్లో మునిగిపోయే మనుష్యులు చల్లని రాత్రులందు ఆదమరచి హాయిగా నిద్రించి కోల్పోయిన శక్తిని పునః పొందగల్గుతారు. సంవత్సరమంతా కేవలం పగలు వుంటే మనిషి తట్టుకోగలడా? అంటే లేదనే సమాధానం వస్తుంది. ఈద్వంద్వాలన్నీ ప్రాణికోటి, ముఖ్యంగా మనిషి ప్రగతి కోసం ఉపయోగపడేవే అన్నది నిర్వివాదాంశం! అలాంటిదే చీకటికూడ! ప్రకృతి నియమమయిన చీకటిరాత్రులను కూడ మనిషి బాగానే ఆనందిస్తాడన్నది ముమ్మాటికీ నిజం!

*07.06.2011*

# ప్రార్థనలు

ఒక అధ్యాపకుడు తన శిష్యులైన పిల్లలను ఓ ఆలయానికి తీసుకువెళ్తూ ఓ తత్వవేత్త కంట పడ్డాడు. "పంతులు గారూ! పిల్లలను ఎక్కడికో తీసుకువెళ్తున్నారు.! ప్రశ్నించాడు తత్వవేత్త అధ్యాపకుని. "మీకు తెలియందేముంది? ఈ సంవత్సరం కరవు విలయతాండవం చేస్తోంది. తాగేందుకు నీటి చుక్క దొరకడం లేదు. ఇక పంటల సంగతి చెప్పనక్కరలేదు! పొలాలన్నీ బీళ్లయ్యాయి. చిన్నపిల్లలు దేవుడివంటివారు. వారి హృదయాలు నిర్మలంగా వుంటాయి. వారి చేత వర్షం కోసం భగవంతుని ప్రార్థనలు చేయిస్తే పరమేశ్వరుడు వారి ప్రార్థనల నాలకించి వర్షాలు కురిపిస్తాడని నా విశ్వాసం. అందుకే వారిని ఆలయానికి తీసుకువెళ్తున్నాను" మనసులో మాట చెప్పాడు అధ్యాపకుడు.

అందుకు తత్వవేత్త పకపకా నవ్వాడు. "ఎందుకు నవ్వుతున్నారు?" అడిగాడు ఉపాధ్యాయుడు. "మీ అభిప్రాయం సరికాదు. పిల్లల ప్రార్థన భగవంతుడు వింటాడనుకోవడం పొరపాటు. విజ్ఞులైన పరమ భక్తులు ప్రార్థనలు చేయడం సబబు" అన్నాడు తత్వవేత్త. "మీ మాటలు రుజువు చేస్తారా?" సవాలు విసిరాడు అధ్యాపకుడు.

"అవశ్యం" సెలవిచ్చాడు తత్వవేత్త!

"సామాన్యంగా చిన్నపిల్లలకు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని వుండదు. పిల్లలు ఆటపాటలను ఇష్టపడతారు. వారు పాఠశాలతో పాటు, తమను తరగతి గదికి పరిమితం చేసి విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పుతూ దండించే అధ్యాపకుని సైతం ఇష్టపడరు. వారి ప్రార్థనలు నిజమవ్వటం సత్యమే అయితే వారి అధ్యాపకుడుగా ప్రస్తుతం మీరున్న స్థితిలో మీరు కొనసాగివుండేవారు కాదు" మందహాసం చేశాడు తత్వవేత్త!

దైవాన్ని ప్రార్థించడానికి పెద్దలకయినా, పిల్లలకైనా నిర్మల హృదయం కావాలి! పిల్లలు నిర్మల హృదయులైనా తొలగిపోవలసిన సమస్యల తీవ్రత తెలియని వయసు వారిది. సమస్యల గురించి పూర్తి అవగాహన వుండే పెద్దలు ప్రార్థనలు చేయడానికి పిల్లల వలె నిర్మల హృదయం మొదట సంతరించుకోవాలి. ప్రార్థన శక్తివంతమైనది. మంచి మనసుతో చేసే ప్రార్థన భగవంతుని తప్పక చేరుతుంది. అది అక్షర సత్యం. నిజాయితీతో భక్తులు చేసే ప్రార్థనలు విన్న భగవంతుడు ప్రతి యుగంలోనూ మానవుడిగా అవతరించాడని పురాణగాథలు నివేదిస్తాయి. దృశ్యప్రపంచంలో మనిషికిఎన్నో అవసరాలుంటాయి. కొన్నిటిని ధనం వెచ్చించి తీర్చుకోగలడు గానీ ఎన్నో కోరికలు తీరకుండా వుండిపోతాయి. జగత్ప్రభువైన

దైవమే వాటిని తీర్చ సమర్థుడు. అడగందే అమ్మయినా పెట్టదన్నట్లు ప్రార్థన చేయకుండా దైవంసైతం కోరికలు తీర్చదన్నది అక్షర సత్యం. అర్హత వుంటే అయాచితంగా భగవంతుడు మనిషిని అనుగ్రహిస్తాడన్నదీ సత్యమే! పూర్వం మునులు, ఋషులు తీవ్ర తపమాచరించి ప్రపంచ ప్రజల బాగుకోరుకున్న ఉదంతాలు పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. స్వంత కోరికల సాఫల్యం కోసం విశ్వామిత్రుడు తీవ్ర తపమాచరించగా, గంగను భువికి తీసుకువచ్చిన భగీరథుడు లోకకల్యాణం కోసం పరమశివుని మెప్పించాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు తనను ఆశ్రయించే వారిని నాలుగు వర్గాలుగా గణించాడు. ఆర్తులు (కష్టాలలో ఉన్నవారు), జిజ్ఞాసులు (మోక్షగాములు) అర్థార్థులు (ధనం కోరేవారు), జ్ఞానులు తమ తమ మనోభీష్టాలు తీరడం కోసం ప్రార్థనలు చేస్తారంటారు. అసలు మనం చేసే ప్రార్థనలు ఫలిస్తాయా ? నిజంగా అవి దైవాన్ని చేరుతాయా ? అన్నది వేయి వరహాల ప్రశ్న. సామాన్య మానవుడు తనకోసం, తన కుటుంబం కోసం ప్రార్థించగా, జ్ఞానులు లోకకల్యాణం కోసం ప్రార్థనలు చేస్తారు. ప్రార్థన చేసే వ్యక్తి హోదాతో, సంపదతో దైవానికి నిమిత్తం లేదు. తనను ఎంత నిజాయితీగా ప్రార్థిస్తున్నాడన్నది ప్రాధాన్యత సంతరించుకున్న అంశం! ధృవుడు, ప్రహ్లాదుడు, మార్కండేయుడు వంటి బాలభక్తుల మనోరథాలను దైవం తీర్చిన గాథలు మనకు తెలుసు. కామంతో కళ్ళు మూసుకుపోయిన దశకంఠుడు పరమభక్తుడై నప్పటికీ సీతామాత అతడి సొంతం కావాలన్న దుస్సహమైన, దుశ్శీలమైన కోరిక తీరకపోవడం అటుంచి శ్రీరామ బాణాగ్నికి శలభంలా అతడు భస్మీపటలం అయిన ఉదంతం శ్రీమద్రామాయణం పాఠకుల కన్నులకు కడుతుంది.

ఒకసారి తమ శిష్యుడొకరు రామకృష్ణ పరమహంసమ ఇలా అడిగాడు. “కామాన్ని జయించడమెలా?” అందుకు పరమహంస ఇలా జవాబిచ్చారు. “నిజాయితీతో కూడిన దైవప్రార్థన ద్వారా కామాన్ని మనసునుంచి తరిమి వేయవచ్చు”.

కామ క్రోధాది అరిషడ్వర్గ ప్రేరితాలైన కోరికలు భగవంతుడికి నివేదించడం అసమంజసమే కాక మహా పాపం కూడా. ఆహార విహారాదులలో మార్పుద్వారా సాత్విక స్వభావాన్ని సంతరించు కోవచ్చు. సత్వగుణ శోభితులైన భక్తుల కోరికలు ప్రార్థన ద్వారా తీరి లోకహితం కోసం అలరారుతాయి. అలాంటి ప్రార్థన వల్ల వారు ఇహపరాలలో కూడా అనుగ్రహింపబడతారు.

*‘ధ్యానమాలిక’ మాసపత్రిక, ఫిబ్రవరి, 2015*

# శుభమస్తు

**శుభం** ఆనందాన్ని వెంట తెస్తుంది. ఆనందం శుభదాయకం. ఒక ఆశ రూపం సంతరించుకున్నప్పుడు మనిషి మోదానికి కారణమౌతుంది. తన ఇష్టా యిష్టాలన్నీ ఎదుటివారి ఆమోదం పొందుతూపోతే అతడికిక తిరుగుండదు. వాతావరణం అనుకూలంగా వుంటే ఓ మానవ మాత్రుడుగా తను ఊహించని విజయాలు సాకారమౌతుంటే అతడిలో కించిత్ గర్వమూ పొడసూపుతుంది. ఆత్మవిశ్వాసం అధికరిస్తుంది. అప్పుడు మనిషి దైవం గురించి ఆలోచన చేయడం మాని వేస్తాడు. తన కత్తికి ఎదురు లేదనిపించినప్పుడు మనిషి రాక్షసుడయ్యే ప్రమాదం పొంచి వుంటుంది. దేవతల నుంచి అసాధారణ వరాలు పొందిన రాక్షసులు రెచ్చిపోయి లోక కంటకులుగా మారిన ఉదంతాలు మన పురాణేతిహాసాలలో లెక్కకు మిక్కిలి కనిపిస్తాయి. సృష్టి మంచి చెడుల సమాహారం. ఒక్కొక్కప్పుడు చెడుకు ఆధిపత్యం లభిస్తుంది. అయినా అది తాత్కాలికమే. అంతిమంగా 'మంచి'దే పైచేయి అవుతుందని శాస్త్ర పురాణేతిహాసాలు నిరూపిస్తాయి.

పండుగలు శుభాన్ని ఆహ్వానిస్తూ, ఆస్వాదిస్తూ మనిషి దైవానికి చేసే భక్తి రసపూర్ణ నివేదికలు. పర్వదిన వాతావరణం ఆహ్లాద భరితంగా వుంటుంది. ప్రకృతి శోభాయమానంగా భాసిస్తుంది. భావనలోనే అయినా అదో ఆనంద రసార్ణవం. భక్తి నిండిన హృదయంతో మన ప్రార్థనలు దైవానికి నివేదించుకుంటాం. బీదసాదలకు దానధర్మాలు చేస్తాం. దైవార్పణ చేసి షడ్రసోపేత విందు ఆరగిస్తాం. పండుగరోజున కొత్త బట్టలు ధరించి లోకాన్ని కొత్త సొబగులతో దర్శిస్తాం. ఆనందం అంతటా పరచుకుంటుంది. పర్వదినాలు జాతి, కుల, మతాలకు అతీతంగా మానవాళి అనుభవం పొందే అలౌకిక రసానుభూతులు. ఆలోచిస్తే ఆ రసానుభవాన్ని మనిషి పండుగ రోజులకే ఎందుకు పరిమితం చేసుకోవాలి? ప్రతిరోజూ హాయిగా మనిషి ఎందుకు జీవనం చేయలేడు? అన్నది తార్కికమైన ప్రశ్న. రసానుభవానికి 'మనసు' సారథి, స్వీకర్త అయినప్పుడు ఆనందం పొందడానికి ప్రత్యేక సమయ సందర్భాలతో పనేముంది? అందుకే వెనుకటికి యోగీశ్వరులు, భక్తాగ్రేసరులు, ధ్యానులు ఎల్లప్పుడు ఆత్మానందంలో ఓలలాడుతూ జీవితాలను రసప్రపూర్ణం చేసుకొనేవారు. వారి దివ్యానుభవాలను వారసత్వ సంపదగా లేశమాత్రం సొంతం చేసుకున్నా ఆధునిక మానవుడి చింతలన్నీ సులభంగా తీరిపోతాయి.

ఎల్లప్పుడూ 'ఉన్న'దే ఆనందాన్నివ్వదు. లేనిది లభించబోతుందన్న ఆశ సైతం

మనసుకు ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. ఒక మంచిమాట సంతోషాన్ని కలగజేస్తుంది పని సాకారమైనంతగా, సాకారం కాబోతోందన్న సమాచారం కూడా ఆనందానుభూతి నిస్తుంది. ఓ మధురమైన పలుకు పెద్దల పెదవులు దాటి వీనులకు సోకితే ఆ రాణింపే వేరు. 'చిరంజీవ! సుఖీభవ!', 'సత్ సంతాన ప్రాప్తిరస్తు', 'ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి రస్తు!" వంటి ఆశీర్వచనాలు విన్నంతనే మనసుకు ఆహ్లాదం కల్గుతుంది. వేదపండితులు, మాతాపితరులు, గురుదేవులు ఆశీర్వదిస్తే ఆ ఫలితాలే వేరు!

మాటకుండే ప్రభావం చాలా గొప్పది. ఒక మంచి మాటకుండే ప్రభావం మరీ గొప్పది. కీడు జరగబోతోందన్న ఆలోచన క్రుంగదీసేదైతే, శుభం జరగబోతుందన్న సంకేతం హృదయాన్ని తట్టిలేపి ఆనంద డోలికల్లో తేలిస్తుంది. అందుకే ఎప్పుడూ మంచి భావన చేయాలి! మంచి మాట మాట్లాడాలి! మంచి కర్మచేయాలన్నారు పెద్దలు! మంచి ఆలోచనల వల్ల శరీరం ఆరోగ్యంగా వుండటానికి తోడ్పాటు లభిస్తుందంటారు వైజ్ఞానికులు! ఓ చెడ్డ భావన, పలుకు, కర్మల వలన కలిగే అనర్థాలు అనేకం వున్నప్పుడు వాటి ప్రమేయం మనకెందుకు? ఓ సత్సంకల్పంతో భగవంతుడి చేత సృజింపబడి, పరిపోషింపబడుతున్న యావత్ సృష్టిలో మహత్వపూర్ణ పాత్ర పోషిస్తున్న ఓ మనిషిగా వివేకం కల్గి జీవిస్తూ పరమాత్మ అనుగ్రహాన్ని పొందవలసి వుంది. మనిషిగా ఎదిగేందుకు గల అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ శుభకరమైన జీవితాన్ని మహత్వపూర్ణమైన సనాతన ధర్మ వారసత్వంగా అందిపుచ్చుకొని జీవితాన్ని ఫలప్రదం చేసుకుందాం!

*'ధ్యానమాలిక' మాసపత్రిక, జనవరి, 2015*

# కర్మకు నమస్కారం !

"కృషి ఉంటే మనుషులు ఋషులౌతా"రంటాడో కవి. 'కృషితోనాస్తిదుర్భిక్షమ్' అన్నది కార్యసాధనకు తోడ్పడే మహావాక్యం. కృషితో సాధించే విజయాలు అబ్బురపరుస్తాయి. మొక్కవోని పట్టుదల కలిగి వుంటే వామనుడుగా వుండే ప్రయత్నశీలుడు త్రివిక్రముడౌతాడు. అలా ఎదగడం లౌకిక జగత్తులో కృషి వల్లే సాధ్యం. కృషితో ఎన్ని విజయాలు సాధించినా మొదటి అడుగు, వ్యక్తి ఆచరించే ప్రథమ కర్మతోనే ప్రారంభమౌతుంది! తస్మై నమ:కర్మణే!' కర్మకు నమస్కరించి పని ప్రారంభించాలనేవారు భగవాన్ శ్రీసత్యసాయి బాబా! కర్మ ప్రాధాన్యత ఎంత గొప్పదంటే గీతా చార్యుడైన శ్రీ కృష్ణభగవానుడు తాను అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీతలో కర్మకు సంబంధించి ఓ యోగాన్నే (కర్మయోగం) బోధించాడు. కర్మద్వారా మొదట జ్ఞానం, అటుపై ముక్తి సాధించవచ్చున్నది అభిజ్ఞుల ఉవాచ.

సంకల్పిత, అసంకల్పిత క్రియలన్నీ కర్మలే! కర్మ చేయకుండా ప్రాణులు మనజాలవు. స్థావరాలైన వృక్షాలు కూడ కర్మాలు చేస్తాయి. పురాణ కాలంలో పర్వతాలు రెక్కలు కలిగి వుండి ఒక చోటునుంచి మరొక చోటుకు ఎగురుతూ (కర్మ) వుండేవట! ప్రజలు భయ భ్రాంతులు కావడంతో ఇంద్రుడు వాటి రెక్కలు వజ్రాయుధంతో తెగనరికాడు. ఆ క్రమంలో వజ్రఘాతం నుంచి తప్పించుకున్న పర్వతాలలో మైనాకుడు ప్రథముడు. చివరివాడు కూడ! సూర్యచంద్రులు, నక్షత్రగణాలు, గ్రహాలు కూడా కర్మసిద్ధాంతానికి అతీతం కావు. పంచభూతాలు కర్మచేస్తాయి. గ్రహాల గమన క్రియ, నక్షత్రాల ప్రకాశతత్వం వాటి వాటి కర్మలనే ప్రతిఫలిస్తాయి. భూమి, నీరు, అగ్ని వాయువు, ఆకాశం కర్మలు చేయడం వల్లనే సృష్టి ముందుకు సాగుతుంది. పంచభూతాలు కర్మలు ఆపితే జీవజాలం నశిస్తుంది. జంతువులు కూడా తమదైన శైలితో కర్మలు చేస్తాయి. జంతు పక్షి మృగాదుల కర్మలు ఆకలి, నిద్ర, మైథునాలకు పరిమితం అవుతాయి. కర్మ ఆచరించకుండా జీవ జగత్తులో ప్రాణికోటి మనుగడ క్షణకాలమైనా సాగదంటే అతిశయోక్తి కాదు.

మనిషి నిమిషానికి 16 నుంచి 18 సార్లు శ్వాసిస్తాడు. కుక్క 28 నుండి 30 సార్లు, తాబేలు 4 నుంచి 5 సార్లు శ్వాసిస్తాయి. వృక్షాలూ శ్వాసిస్తాయి. వేగంగా శ్వాసించే జీవుల ఆయుప్రమాణం తక్కువని చెబుతుంది యోగశాస్త్రం. శ్వాస అసంకల్పిత చర్య అయినా అది కర్మగానే పరిగణింపబడుతుంది. లోపలి అవయవాలు జీవుల ప్రమేయం లేకుండా పని చేయడమూ కర్మాచరణలో భాగమే! విచక్షణతో కర్మ చేయగల మనిషి కొంత వరకు తన విధిని తానే నిర్దేశించుకుంటాడు. అరచేతుల్లో రేఖలు బ్రహ్మగీసిన గీతలనీ, అవి మానవ

జీవిత గమనాన్ని, ప్రమాణాన్ని నిర్దేశిస్తాయనీ హస్త సాముద్రిక నిపుణులు అభిప్రాయపడతారు. మనిషి కర్మల వలన అతడి భవిష్యత్ నిర్ధారణ జరుగుతుందన్నది నిర్వివాదం. భవిష్యత్తులో స్థితిగతులకు అనుగుణంగా మానవ హస్తాల్లో కొన్ని రేఖలు కొత్తగా పుడుతూ, కొన్ని అదృశ్యమవుతుండటం సాముద్రిక నిపుణులు గుర్తించారు. కర్మలు విధి లిఖితానికి అనుగుణంగా ఆచరించడం జరిగినా ఆలోచనతో కర్మలాచరించి మనిషి తన అదృష్ట దురదృష్టాలకు తానే కారణమౌతాడు. సమాజంలో మానావమానాలు మనంచేసే కర్మల వల్లనే సంప్రాప్తిస్తుంటాయి. కర్మప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రయత్నశీలురు విశేష కృషితో కర్మలాచరించి ధన సంపన్నులు, విద్యావేత్తలు, భక్తాగ్రేసరులుగా ఎదిగిన ఉదంతాలు చరిత్రపుటల్లో, పురాణేతి హాసాలలో కనిపిస్తాయి. మాజీ రాష్ట్ర పతులు డాక్టర్సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ అబ్దుల్ కలాం సామాన్యకుంటుంబాల్లో జన్మించి ఉన్నత స్థితికి ఎదిగిన వారే!

ఓ విద్యార్థికి వ్యాకరణ శాస్త్రంలో ఎదగాలని అభిలాష ! కానీ తన గ్రహస్థితి తనకు అనుకూలంగా వుందో లేదో తెలియదు. ఎలాగైనా వ్యాకరణ శాస్త్ర పండితుడు కావాలన్న లక్ష్యం అతణ్ణి ఓ జ్యోతిష్యుడి వద్దకు నడిపించింది. విద్యార్థి సిద్ధాంతికి తన మనోరథం తెలిపి జ్యోతిష శాస్త్ర పరంగా తనకాయోగం వుందో లేదో పరిశీలించమని ప్రార్థించాడు. సిద్ధాంతి శాస్త్ర పరిశీలన చేసి అతడికి దివ్యమైన విద్యాయోగం వుందనీ మంచిగురువు వద్ద శిష్యరికం సాగించమని చెప్పాడు. కొన్నేళ్ళ పటుతర అధ్యయనం తర్వాత అతడా శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించాడు. తన జీవిత లక్ష్యం నెరవేరడంలో తనకు తోడ్పడిన సిద్ధాంతికి ధన్యవాదాలు చెప్పుకునేందుకు విద్యార్థి ఆయనను కలిశాడు. ఆయన ప్రోత్సహించడం వల్లనే తానీనాడు ఓ వైయాకరణుడనయ్యానని, విద్యార్థి చెప్పినప్పుడు సిద్ధాంతి పకపకా నవ్వి, అతడి జాతకంలో గ్రహానుకూలత ఏమాత్రం లేదనీ, గ్రహబలం ఉన్నట్లుగా అతడిని నమ్మించి ప్రోత్సహించా ననీ, స్వయంకృషితో ఇంతవాడైన విద్యార్థి మొక్కవోని అధ్యయన ఫలితంగానే (కర్మమూలంగానే) అతడి లక్ష్యం నెరవేరిందనీ చెప్పి విద్యార్థి అభివాదాలు స్వీకరించిఅతడిని సంతృప్తుణ్ణి చేశాడు. కృషి, అనితర సాధ్యమైన కర్మకు రూపాంతరమే. కృషి వల్ల లక్ష్యాలు నెరవేరుతాయి. 'కర్మ చేయడమే నీవంతు! ఫలితాన్ని ఆశించి కర్మ చేయకు. కర్మకు తగిన ఫలితాన్ని నేనే యిస్తాను' అన్న గీతాకారుడి దివ్య ప్రవచనం మరవకుండా మంచికర్మల పునాదిగా కృషి చేసి ఇహపరాలలో తరించే ప్రయత్నం సాధకులు చేయవలసి వుంది.

*'ధ్యానమాలిక' మాసపత్రిక, మార్చి, 2015*

# అంతా నాకే తెలుసు.....

కన్ఫ్యూషియస్ ప్రాచీన చైనా దేశపు తత్త్వవేత్త. 'కన్ఫ్యూషి యనిజం' మూల సిద్ధాంతానికి రూపమిచ్చిన మహనీయుడాయన. ఆ కాలపు అనేకమంది మేధావులు ఆయన శిష్యులుగా చెప్పుకోవటానికి ఉబలాటపడేవారు. అలాంటివారిలో నలుగురు శిష్యులు ముఖ్యులుగా వుండేవారు. పూషాంగ్ అనే మేధావికి కన్‌ఫ్యూషియస్ సిద్ధాంతాలు నచ్చేవికాదు. ఆయనను తరచూ విమర్శించడంలో పూషాంగ్ ఎప్పుడూ ముందుండేవాడు. అందులోనే ఆనందం పొందేవాడు. తన శిష్యుల సద్గుణాలను ఉటంకిస్తూ కన్‌ఫ్యూషియస్ ఒకసారి ఇలా అన్నాడు. 'నా మొదటి శిష్యుడు ముక్కుసూటిగా మాట్లాడటంలో దిట్ట. నా రెండవ శిష్యుడు సంక్లిష్టమైన విషయాన్ని సైతం సరళీకరించడంలో మేటి. నా మూడవ శిష్యుడు ధైర్యసాహసాలు ప్రదర్శించటంలో అతడికతడే సాటి. నా నాల్గవ శిష్యుడు హుందాతనానికి ప్రతీక!' కన్‌ఫ్యూషియస్ నోటినుండి తన శిష్యుల గురించిన ప్రశంసా వాక్యాలు వెలువడగానే విమర్శకుడు పుషాంగ్‌కు పట్టు దొరికి నట్లైంది. 'మీ శిష్యులు అందరూ మీకన్నా ప్రతిభావంతులే అనిపిస్తోంది. అయితే వాళ్ళకు గురువునని చెప్పుకోవటంలో మీకు గల విజ్ఞత ఏమిటో నాకు బోధపడటం లేదు!' అని చురక వేశాడు.

అతడి విమర్శనాస్త్రాన్ని కన్‌ఫ్యూషియస్ సమర్థంగా ఎదుర్కొన్నాడు. 'నామొదటి శిష్యుడు ముక్కుసూటిగా మాట్లాడటంలో ఆరితేరినవాడే అయినా సమయానికి తగువిధంగా మాట్లాడలేడు. నా రెండవ శిష్యుడు సంక్లిష్టమైన సమస్యను సైతం పరిష్కరించగల్గినా 'అవును' కాదు' అనే విషయాన్ని క్లుప్తంగా తేల్చలేడు. నా మూడవ శిష్యుడు ధైర్యశాలే అయినా తొందరపాటు గలవాడు. నా నాల్గవ శిష్యుడు హుందాతనానికి మారుపేరే అయినా అతడు వినయం నేర్చుకోవలసివుంది. తమ లోటుపాట్లను పరిష్కరించుకోవడం కోసం నలుగురూ నా వద్ద శిష్యరికం చేస్తున్నారు!'

పూషాంగ్ ఇక మాట్లాడలేకపోవడంతో మౌనంగా నిష్క్రమించాడు. ఈ సృష్టిలో అందరికీ అన్నీ వుండవు. రాజుకు సైతం లేని సద్గుణాలు నిరుపేదకు వుండవచ్చు. ఒక్కో అంశంలో ఒక్కో వ్యక్తి ఆరితేరి వుండవచ్చు... రాణించవచ్చు. కానీ అన్నీ 'నాకే' కావాలను కోవడం అత్యాశే అవుతుంది. ఐతే సకృత్తుగా సద్గుణాలన్నీ ఒకేవ్యక్తిలో పోగుపడతాయి. పరమహంసలు అలా వ్యక్తమైన మహనీయులే. అపార వేదరాశిని పరిష్కరించిన వేదవ్యాసుడు హిందూ సారస్వత జగత్తులో అలాంటి మేధాప్రపూర్ణుడే! అవతార పురుషులందరూ ఆ కోవకు చెందినవారే!

చాలామందికి చాలా విద్యలలో ప్రవేశముండవచ్చు. కానీ వారి ప్రతిభా పాటవాలు ఒకటి రెండు కళలకే పరిమితమౌతాయి. అన్నింటా మేటి అరుదుగా కనిపిస్తాడు. అన్ని అనుకూలాలు, అర్హతలూ ఒకేచోట రాశిపడటం సృష్టిలోనే లేదంటారు పెద్దలు. భక్తాగ్రేసరుడైన మార్కండేయుడి ఆయుఃప్రమాణం పదహారు సంవత్సరాలే! సనాతన ధర్మ రథసారథి అయిన ఆదిశంకరాచార్య 32 సంవత్సరాల లేతప్రాయంలోనే దేహం చాలించారు. హిందూ ధర్మానికి పట్టుకొమ్మగా దేశవిదేశాల్లో ఖ్యాతి కల్పించిన స్వామి వివేకానంద జీవించింది 39 సంవత్సరాలే! సాటిలేని విద్వత్తువున్నా పూర్ణాయుర్దాయం లేని లోటు ఈ మహనీయుల జీవితాల్లో కనిపిస్తుంది. అన్ని అనుకూలాంశాలు, అర్హతలు ఒకే ఉపాధిలో కేంద్రీకృతం కావడం ప్రకృతి ధర్మం కాదనిపిస్తుంది. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు 17 భాషల్లో దిట్ట. అయితే సుమారు ఏడువేల పైచిలుకు వున్న ప్రపంచ భాషలన్నింటిలో ప్రవేశం, పాండిత్యం ఒక్కరికే దక్కాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది కదా!

సంపద, హెూదా, అధికారం, అర్హతలను బట్టి దైవం మనుష్యులకు అనుగ్రహిస్తాడు. 'అన్నీ నాకే........ అంతా నాకే....' కావాలనుకోవడం అత్యాశే అవుతుంది. లోకంలో అన్ని స్థాయిలవారుంటారు. "అందరూ అందలాలెక్కితే ఇక మోసేదెవ"రన్న నానుడి ఊరకే పుట్టలేదేమో! తన స్థాయిని ప్రేమిస్తే, దానికి న్యాయం చేస్తూ అవకాశం వున్న మేర అభివృద్ధి పొందుతూ ప్రగతిపథంలో పయనించడం మానవ ధర్మం. అవకాశం లేని, ప్రకృతి ధర్మం కాని అసమంజసమైన కోరికలు గాలిమేడలే అవుతాయి.

అందుకే కేంద్రీకరణం కన్నా, వికేంద్రీకరణం చాలా గొప్పదంటారు. సంపదగానీ, విజ్ఞానంగానీ, ఒకే వ్యక్తి సొంతమైనప్పుడు అనేకమంది వారికి బానిసలౌతారు. బానిసత్వాన్ని ప్రకృతి ఎప్పుడూ ప్రోత్సహించదు. సమానత్వాన్నే ఆదరిస్తుంది. అందరి సంక్షేమాన్నే కోరుకుంటుంది.

*'ధ్యానమాలిక' మాసపత్రిక, నవంబర్, 2014*

# మత విశ్వాసం

మన కళ్ల ఎదుట ఎందరో మరణిస్తుంటారు. ఎందరో జన్మిస్తుంటారు. ఈ పరంపర ఒక మానవజాతికే పరిమితం కాదు. సమస్త జీవరాశిలోనూ ఈ జనన మరణాలు సంభవించడం మనం చూస్తాం. అవి యాంత్రికంగా కనిపించినా జనన మరణ చక్రభ్రమణంలో భాగంగా ఈమార్పులు సంభవిస్తున్నాయని గ్రహించలేం! కొందరు భగవంతుడు వున్నాడంటేనే నమ్మరు. అలాంటి వారు ఈ చక్రభ్రమణ సిద్ధాంతాన్ని తేలిగ్గా కొట్టి పారేస్తారు. జననం వుంది. మరణం వుంది. కానీ అవి తనకూ వర్తిస్తాయనీ, మరణానంతరం అనుభవం తనకూ వుంటుందనీ మనిషి నమ్మకపోవడం చిత్రమైన విషయమని యక్షుడి ప్రశ్నకు సమాధానంగా ధర్మరాజు జవాబివ్వడం పాండవుల అరణ్యవాస సమయంలో జరిగిన సంఘటనగా మహభారతం నివేదిస్తుంది. ఎంతో అదృష్టం వుంటే గాని దైవం వున్నాడన్న నమ్మకం వ్యక్తికి కలగదు. మనసు త్రికరణ శుద్ధిగా వున్న మానవుడు మొదట ఆ సద్గుణ భాగ్యానికి నోచుకోకపోయినా సాధన క్రమంలో నిశ్చయంగా అతడికా సద్గుణం పట్టుపడుతుంది. సత్యభాషణం, దానధర్మాలపట్ల ఆసక్తి, జీవులపై కరుణ, అహింసానురక్తి, తన వారితో సమానంగా పొరుగు వారిపై సమరసభావాన్ని ప్రకటించడం, ఆధ్యాత్మికతపట్ల అంకిత భావం – ఇత్యాది సుగుణాలు దైవం పట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటించిన తర్వాత సాధకుడికి చేరువయ్యే విశేషాంశాలు.

ఆధ్యాత్మిక అనురక్తి ఓ దివ్య సంపద్విశేషం. తాను అవలంబించే ధర్మంపట్ల విశ్వాసం, మౌఢ్యానికి అతీతంగా విషయాచరణ వల్ల వ్యక్తిత్వం వికసిస్తుంది. అరిషడ్వర్గాలైన కామ,క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులకు దూరంగా వుంటేనే దైవ విశ్వాసం సాధకుడిలో ఫలవంతమవుతుంది.

ఉన్న సత్యాన్ని లేదనడం వితండవాదం! ఎప్పటికీ వుండే దానిని సత్యమంటాం. అదే దైవం! అసత్యభాషణం, దానిని సమర్థించడం వితండవాదమని అనిపించుకుంటుంది. సత్యాచరణలో వ్యయ ప్రయాసలుంటాయి. సత్యం వినసొంపుగా ఉండకపోవచ్చు. వినడం వల్ల కొందరికి కష్టం కలగవచ్చు కూడా. అలా కష్టం కల్గిన వారు దానవ ప్రవృత్తిగల వారైతే వారి వల్ల సత్యభాషి భద్రతకు, భరోసాకు భంగం వాటిల్లవచ్చు. 'యథార్థ వాదిలోక విరోధి' అన్న సామెత జగద్విదితం!

అనాదిగా మానవుడికి మతం జీవన విధానాన్ని నిర్దేశించింది. అతడు సుఖసంతోషాలతో, ప్రశాంతితో, పవిత్రంగా ఎలా బ్రతకాలో తెలియజేసింది. ఆ

మార్గానుసరణకు ఆలంబనగా దైవాన్ని ఆరాధించడం నేర్పింది. సహజంగా స్వార్థపరుడైన మనిషి ఆధ్యాత్మిక క్షేత్రంలోనూ స్వార్థాన్ని చొప్పించి బ్రతుకును భారం చేసుకుంటాడు. చరిత్రలో మతం కారణంగా ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయి జనక్షయం జరిగింది. లౌకిక, పారలౌకిక విషయాల్లో తెలుసుకో వలసిన మంచి చెడులను తెలియజేసి బ్రతుకును అర్థవంతం చేసే విలక్షణమైన, శక్తివంతమైన ప్రక్రియగా మతాన్ని అవలంబించాలి. జీవన విధానాన్ని పుష్టివంతం చేసే మతాన్ని ఛాందస భావాలతో జుగుప్సాకరంగా మార్చి వేసుకుంటున్న మనిషి సంకుచితత్వాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించకుండా వుండలేం. వేదాలు, పురాణేతిహాసాలు మనిషికి కర్తవ్యాలను నిర్దేశించాయి. అవి మనిషి జీవన ప్రగతికి దోహదం చేసే ఉపకరణాలే! పునర్జన్మ సిద్ధాంతంలో నమ్మకం వున్న వ్యక్తి పాపాలు చేయడానికి జంకుతాడు. తాను చేసిన పాపాలకు నిజమైన పశ్చాత్తాపం కల్గిన వ్యక్తి మరలా ఆ పాపాలు చేయడు. చేసే పాపం వల్ల ఎవరో ఒకరికి తప్పక కీడు వాటిల్లుతుంది. దైవచింతన అలవడిన వ్యక్తి పాపం చేయకపోవడం వల్ల పొరుగువారికి కలిగే మనస్తాపాన్ని నివారించినవాడవుతాడు. మరణానంతరం జీవితాన్ని నమ్ముతూ అది ప్రపుల్లంగా వుండాలని విశ్వసించే వ్యక్తి వల్ల సమాజానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది. సాధారణంగా గుడులు – గోపురాలు, ఆసుపత్రులు, విద్యాలయాలు నిర్మించి ప్రజోపయోగ కార్యాలు నిర్వహించే వ్యక్తి దైవవిశ్వాసే అయి వుంటాడు. కానిపక్షంలో కనీసం మానవతావాది అయినా అయి వుంటాడు. మత విశ్వాసాలు మనిషి ప్రగతికి, ఆనందానికి ప్రాణం పోసేవిగా ఉండేందుకు వ్యక్తి ఛాందస భావాలు లేని ఆధ్యాత్మిక వ్యాపకం అలవర్చుకోవాలి. పరోపకారం, సేవ వెల్లివిరిసే మతావలంబన అటు వ్యక్తికి, ఇటు సమాజానికి ఎంతో అవసరం. అప్పుడే వ్యష్టి–సమష్టి పరిణతి తేజరిల్లి ప్రజాసంక్షేమం వెల్లివిరుస్తుంది.

*'ధ్యానమాలిక' మాసపత్రిక, ఏప్రియల్ 2015*

# కష్టేఫలి

**కష్టాలు** మనిషికి కాక మానుకువస్తాయా? అన్నది నానుడి. ప్రారబ్ధవశంగా కష్టాలు రావటం వేరు; అందుకు భిన్నంగా కోరికష్టాలను ఆహ్వానించి ఎంచుకున్న రంగంలో విశేషకృషి చేసి విజేతలు కావడం వేరు! కృషి అనంతరం విజయం సిద్ధించడం ప్రకృతి లక్షణం! ఆ ప్రకృతి సూత్రాన్ని ఒడిసిపట్టు కొని ఎవరైనా ప్రగతి పథంలో పురోగమించవచ్చు. ఎంతటి ఎత్తులకైనా ఎదగవచ్చు!

వెంకయ్య సుబ్బయ్య బాల్యమిత్రులు. వేర్వేరుగ్రామాల్లో ఇద్దరూ కమ్మరి వృత్తిలో జీవించేవారు. గ్రామస్థులు ఇద్దరితోనూ వ్యవసాయ ఉపకరణాలు చేయించుకొనేవారు. ప్రతిఫలంగా కొంతసొమ్ము ముట్టజెప్పేవారు. 'ఈపనికి ఇంత' అని వెంకయ్య ఏనాడూ అడిగేవాడు కాదు. సంపాదించే ధనం కుటుంబ పోషణకు చాలినా, చాలకపోయినా ఎల్లపుడూ ఆశావహంగా, ఆనందంగా కనిపించేవాడు. సుబ్బయ్యది అందుకు పూర్తి భిన్నమైన వ్యక్తిత్వం. ఫలానాపనికి ఫలానా రుసుమంటూ నిక్కచ్చిగా వసూలు చేసేవాడు. కానీ అతడి జీవితంలో ఏమాత్రం పురోగతి కనిపించేది కాదు.

ఒకరోజు సుబ్బయ్య, వెంకయ్య ఇంటికి అతిథిగా వచ్చాడు. వెంకయ్య నిత్యానందానికి కారణం తెలుసుకోవాలని భావించాడు. సమాధానంగా వెంకయ్య అతణ్ని తన కార్యక్షేత్రానికి తీసుకువెళ్ళాడు. తనకోసం అప్పటికే కొందరు రైతులు నిరీక్షిస్తున్నారు. విధి నిర్వహించాక ఇచ్చిన రైతును, ఇవ్వని రైతును వెంకయ్య ఒకేలా సమాదరించడం సుబ్బయ్యకు ఆశ్చర్యం కలిగించింది. పైగా అతి తక్కువ ప్రతిఫలం తీసుకోవడం అతడికి నచ్చలేదు. మనసులోని సందేహాన్ని వెంకయ్య ముందు బయటపెట్టాడు.

తనసంపాదన కుటుంబపోషణకు చక్కగా సరిపోతుందనీ, కష్టం చేసుకుంటూ ఆనందంగా జీవించేతనకు రోగాలు, రొప్పులూ తెలియవనీ, తనంటే అభిమానం చూపే పేదరైతాంగం కోసం తను కష్టపడుతున్నట్లు' ఏనాడూ భావించలేదనీ, ఆసంతృప్తే తన ఆనందానికి కారణం కావచ్చనీ తన ఆనందరహస్యం వెల్లడిచేశాడు వెంకయ్య!

కష్టానికి తగిన ఫలం భగవంతుడే ఇస్తాడని నమ్మేవారు కొందరు. ఆకోవకు చెందినవాడు వెంకయ్య ఆనమ్మకం కలవారి సంతృప్తికి లోటుండదు!

సుబ్బయ్యది ముక్కుపిండి రుసుము వసూలు చేసే స్వభావం కావడంతో అతడిపై రైతులకు కించిత్ అభిమానం ఉండేదికాదు. కష్టించి పనిచేయడం, న్యాయబద్ధంగా

వ్యవహరించడం వెంకయ్య నుంచి నేర్చుకొని ఆచరణలో పెట్టాక అతడిలా ఆనందంగా జీవించడ మెలాగో సుబ్బయ్యకు కొంచెం కొంచెం బోధపడసాగింది.

శ్రీకాళహస్తీశ్వర ఆలయ నిర్మాణ సమయంలో పనిచేసిన శిల్పులు, కూలీలు స్వర్ణముఖి నదీతీరంలో మంచినీటికోసం చలమలు తవ్వినపుడు వారిశ్రమకు తగ్గఫలం బంగారు నాణేల రూపంలో ఇసుకలో లభించేదని ఐతిహ్యం! షిర్డీసాయి బాబా పనికి ప్రతిఫలం దండిగా యిచ్చేవారట! ఒళ్ళొంచి కష్టించే శ్రమజీవికే కడుపారా తినే హక్కు ఉంటుందనే వారు సత్య సాయిబాబా! కష్టజీవులకే అన్న రుచి, విలువ తెలుస్తాయన్నది నిష్ఠురసత్యం. సోమరిపోతును అజీర్ణరోగం బాధిస్తుందనేది లోక విదితం. శరీర చైతన్యం కరవైతే గుండెజబ్బులు వస్తాయంటారు వైద్యులు. కష్టపడి చదివే విద్యార్థినే విజయం వరిస్తుంది. ధర్మబద్ధంగా వ్యాపారాలు నిర్వహించే కొందరు అత్యంతసంపన్నులు కావటం చూస్తాం. అలాంటి వారు తొలినాళ్ళలో కష్టాల పరంపరను ఎదుర్కొని అధిగమించిన వారే! వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నా కష్టించే స్వభావం ఆవశ్యకమన్నది కాదనలేని నిజం. ఆ సత్యాన్ని ఒంటబట్టించుకున్న సచ్ఛీలురు ఇహంలోను, పరంలోను విజేతలవుతారు. అటువంటి విజేతల జీవిత చిత్రణలు ఆశావహులకు మార్గదర్శకాలవుతాయి.

*11.06.2014*

## రచయిత గోపాలుని రఘుపతిరావు గురించి...



తల్లిదండ్రులు : స్వర్గీయ శ్రీమతి వెంకమ్మ (గృహిణి) స్వర్గీయ శ్రీ వెంకట శేషయ్య (బ్రాంచి పోస్టు మాస్టర్)

జన్మస్థలం : ప్రకాశం జిల్లా, దొనకొండ మండలం, పెద్ద గుడిపాడు గ్రామం.

పుట్టిన తేది : 29 జూన్ 1952

విద్య : బి.కాం. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల, గుంటూరులో

ఉద్యోగం : కెనరా బ్యాంకులో 1974 జూలై 9న ప్రవేశం; 2010 ఫిబ్రవరి 18న ఉద్యోగ విరమణ

స్థిర నివాసం : గుంటూరు జిల్లా బాపట్లలో.

వివాహం : 1976 నవంబరు 13న సీతాదేవి తో.


కుటుంబం : జ్యేష్ఠ కుమారుడు చి.మధుశ్రీనివాస్, కోడలు చి.ల.సౌ. రేణుక, మనుమరాలు చి. సహస్ర. రెండవ కుమారుడు చి.చంద్రశేఖర్, కోడలు చి.ల.సౌ. శాంతి, మనుమరాలు చి.కృతి. కనిష్ఠ కుమారుడు చి.సాయికుమార్, కోడలు చి.ల.సౌ. మాధవీలత, మనుమరాలు. చి.ఆద్య.

రచయితగా : 1990లో 'విముక్తుడు' కవిత (ఆంధ్రభూమి వీక్లీ) తో ప్రస్థానం ప్రారంభం. ఇప్పటిదాకా 300 దాకా వ్యాసాలు, 40 కవితలు, 45 దాకా కథలు, 80 దాకా ఆధ్యాత్మిక వ్యాసాలు వివిధ దిన, వార, మాసపత్రికలలో ప్రచురణ. ఆదరించిన పత్రికలు ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, రచన, ఆచూకి, ఆంధ్రజ్యోతి, చిత్ర, మయూరి. ప్రస్తుతం ఈనాడు దినపత్రికలో 'అంతర్యామి' శీర్షికన అప్పుడప్పుడూ ఆధ్యాత్మిక వ్యాసాలు.

పుస్తకాలు : తొలిముద్రణ "కృషితో నాస్తి దుర్భిక్షం"

పురస్కారాలు : 2003 జూన్‌లో SET, చీరాల వారి నుంచి 'సేవాభారతి' అవార్డు స్వీకరణ. 2013లో ఘంటసాల కళాపరిషత్, తెనాలి వారి ఆధ్వర్యంలో ప్రముఖ హాస్యనటులు స్వర్గీయ శ్రీ A.V.S. గారి చేతుల మీదుగా సన్మానం. అదో మరచిపోలేని మధుర జ్ఞాపకం.

ప్రచురింపబోవు రచనలు : ఓ సాధారణ వ్యాస సంకలనం, ఓ మినీ కవితా సంకలనం.



*రచయిత :* **గోపాలుని రఘుపతిరావు**

భారతీయ తత్వ చింతనకు దర్పణం పడుతుంది, ఈ 'ఆధ్యాత్మిక తోరణం'. గత 2 దశాబ్దాలుగా వివిధ దినపత్రికలలో వెలువడ్డ మణిపూసల్లాంటి అక్షర దీపాలు ఇందులోని వ్యాసాలు. తనదైన ప్రత్యేకత కల్గి వున్న ప్రతి వ్యాసం ఆధ్యాత్మిక దీప్తిని వెలయించి పాఠకుని చదివించడంలోను, అతడితో ఆధ్యాత్మిక విశేషాలను పంచుకోవడంలోనూ తన వంతుపాత్ర విజయవంతంగా పోషిస్తుంది.

**విచిత్రం - మస్తిష్కం**

**శనైశ్చర మహిమ**

**క్రోధాన్ని జయిద్దాం**

**చల్లని చూపు**

**కాల మహిమ**

**చిరంజీవి హనుమంతుడు**

**నమ్మకమే దివ్యౌషధం**

**శరీరానికీ మరణం పొందదు**

**మనసు మరీ చెడ్డదేమీ కాదు**

**వెలుగు రేఖ**

**చీకటి ముచ్చట్లు** వంటి ముత్యాల్లాంటి వ్యాసాలు ఎన్నో పాఠకుల హృదయపు లోతులను స్పర్శించి సౌగంధ దీప్తిని కల్గిస్తాయనటంలో సందేహం లేదు.